ఈనాడు

విజయవాడ 20-8-2025 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 11

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



ప్రపంచకప్ జట్టులో శ్రీచరణి, అరుంధతి

షెఫాలికి దక్కని అవకాశం • రేణుక పునరాగమనం

ముంబయి

మహిళల వన్డే ప్రపంచకప్ సందడి మొదలైంది. సొంతగడ్డపై జరిగే ఈ టోర్నీకి సెలక్టర్లు మంగళవారం భారత జట్టును ప్రకటించారు. సెప్టెంబర్ 30న ఆరంభమయ్యే ఈ కప్‌లో ఆడే బృందంలో తెలుగమ్మాయిలు శ్రీచరణి, అరుంధతి రెడ్డి చోటు దక్కించుకున్నారు. భారత్, శ్రీలంక ఉమ్మడిగా ఆతిథ్యం ఇస్తున్న ఈ టోర్నీలో పాల్గొనే 15 మంది సభ్యుల జట్టుకు హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్, స్మృతి మంధాన వైస్ కెప్టెన్లుగా వ్యవహరిస్తారు. గాయంతో ఈ మార్చి నుంచి జట్టుకు దూరంగా ఉన్న పేసర్ రేణుక సింగ్ పునరాగమనం చేసింది. స్టార్ ఓపెనర్ షెఫాలివర్మకు చుక్కెదురైంది. ఆమె జట్టులో లేని సమయంలో సత్తా చాటిన ప్రతీక రావల్‌పై సెలక్టర్లు నమ్మకముంచారు. ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో రాణించిన పేసర్ క్రాంతి గౌడ్ ప్రపంచకప్ జట్టులో స్థానం సంపాదించింది. శ్రీచరణి, దీప్తి శర్మ, రాధ యాదవ్, స్నేహ్‌రాణాలతో స్పిన్ విభాగం బలంగా ఉంది. వన్డే ప్రపంచకప్ జట్టుతో పాటు సెప్టెంబర్ 14న సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో ఆరంభమయ్యే మూడు వన్డేల సిరీస్‌లో బరిలో దిగే బృందాన్ని కూడా సెలక్టర్లు ప్రకటించారు. ఆ జట్టులోనూ షెఫాలికి చోటు దక్కలేదు. ప్రపంచకప్ జట్టులో పేస్ ఆల్‌రౌండర్ అమన్‌జ్యోత్‌కు అవకాశం లభించగా.. ఆస్ట్రేలియాతో సిరీస్‌కు సయాలి సత్ఘారె చోటు దక్కించుకుంది. ఈ ఒక్క మార్పు తప్ప ప్రపంచకప్‌నకు, ఆస్ట్రేలియా సిరీస్‌కు ఒకే జట్టు ఆడుతోంది. "షెఫాలి జట్టు ప్రణాళికల్లో ఉంది. ఆమె వీలైనన్ని ఎక్కువ మ్యాచ్‌లు ఆడి అనుభవం సంపాదించాలని అనుకుంటున్నాం. భవిష్యత్‌లో 50 ఓవర్ల ఫార్మాట్లో రాణించాలని కోరుకుంటున్నాం. షెఫాలికి సుదీర్ఘ కెరీర్ ఉండాలనేది మా ఆలోచన" అని హర్మన్‌ప్రీత్ తెలిపింది.


హర్మన్‌ప్రీత్ కౌర్


శ్రీచరణి

ప్రపంచకప్‌నకు భారత జట్టు

హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), స్మృతి మంధాన (వైస్ కెప్టెన్), శ్రీచరణి, అరుంధతి రెడ్డి, హర్లీన్ డియోల్, ప్రతీక రావల్, దీప్తిశర్మ, జెమీమా రోడ్రిగ్స్, రేణుక సింగ్, రిచా ఘోష్, క్రాంతి గౌడ్, అమన్‌జ్యోత్ కౌర్, రాధ యాదవ్, యాస్తిక భాటియా, స్నేహ్ రాణా.

భలే అవకాశం

ఈనాడు క్రీడావిభాగం

ప్రపంచకప్ అనగానే స్టార్ ప్లేయర్లు ఉండాలి.. అంతకు ముందు ఈ టోర్నీల్లో ఆడిన అనుభవం ఉన్న వాళ్లు కావాలి అనుకుంటారు. కానీ అయిదు నెలలు కూడా కాలేదు తెలుగమ్మాయి నల్లపు రెడ్డి శ్రీచరణి భారత జట్టులోకి వచ్చి అప్పుడే ప్రపంచకప్‌లో బరిలో దిగే అవకాశాన్ని అందుకుంది. భారత్ వేదికగా జరుగుతున్న ఈ మెగా టోర్నీలో ఆడేందుకు 21 ఏళ్ల ఈ స్పిన్నర్‌కి పిలుపొచ్చింది. ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో అద్భుత ప్రదర్శన చేయడం వల్లే ఆమెకు ఈ సువర్ణావకాశం దక్కింది. కడప జిల్లా వీరపునాయునిపలి మండలానికి చెందిన శ్రీచరణి మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చింది. సైనా, సింధూ స్ఫూర్తితో ఆరంభంలో బ్యాడ్మింటన్ ఆడింది. తర్వాత ఖోఖో, అథ్లెటిక్స్‌లోనూ ప్రయత్నించింది. ఏడో తరగతితో నాన్న ఒక బ్యాట్ బహుమతిగా ఇవ్వడంతో క్రికెట్లో శ్రీచరణి కథ మొదలైంది. తర్వాత మైదానమే ఆమె చిరునామా అయింది. స్పిన్నర్‌గా మారి ఆంధ్ర క్రికెట్ సంఘం తరఫున వయసు విభాగాల మ్యాచ్‌లు ఆడే స్థాయికి ఎదిగింది. ఈ ఏడాది మార్చిలో జరిగిన సీనియర్ మహిళల వన్డే టోర్నీలో 4 వికెట్లు పడగొట్టి సెలక్టర్ల దృష్టిలో పడింది. ఏప్రిల్‌లోనే ఆమె అంతర్జాతీయ అరంగేట్రం చేసింది. ఇంగ్లాండ్‌పై తొలి టీ20లోనే 12 పరుగులకే 4 వికెట్లు పడగొట్టి భారత్‌ను గెలిపించింది. చక్కని నియంత్రణతో బంతులు సంధిస్తూ బ్యాటర్లను బుట్టలో వేయడం ఈ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ స్టయిల్. ఒకవైపు పరుగులు కట్టడి చేస్తూనే కీలక సమయాల్లో బ్రేక్‌లు అందించడంలో ముందుంటుంది. బ్యాట్‌తోనూ రాణించగల సత్తా ఆమెకు ఉంది. ఈ ఏడాది డబ్ల్యూపీఎల్‌లోనూ దిల్లీ క్యాపిటల్స్ తరఫున శ్రీచరణి ఆకట్టుకుంది. ఇప్పటిదాకా 8 వన్డేలు, 5 టీ20లు ఆడింది. వన్డేల్లో 9.. టీ20ల్లో 10 వికెట్లు పడగొట్టింది. భారత్ చరిత్రాత్మక సిరీస్ విజయాలను అందుకున్న ఇంగ్లాండ్ పర్యటనలో 5 టీ20ల్లో శ్రీచరణి 10 వికెట్లు పడగొట్టింది. 3 వన్డేల్లో 3 వికెట్లు తీసింది. మరోవైపు హైదరాబాద్‌కు చెందిన 28 ఏళ్ల అరుంధతి ఇప్పటికే భారత జట్టులో రెగ్యులర్ సభ్యురాలు. 2018లో శ్రీలంకపై టీ20 మ్యాచ్ ద్వారా అరంగేట్రం చేసిన ఈ పేసర్.. జులన్ గోస్వామి స్థానంలో కుదురుకుంది. మరో పేసర్ రేణుక సింగ్‌కు తోడుగా జట్టు విజయాల్లో తన వంతు పాత్రను పోషిస్తోంది. ఇప్పటిదాకా అరుంధతి 38 టీ20లు, 9 వన్డేలు ఆడింది. టీ20ల్లో 34.. వన్డేల్లో 11 వికెట్లు తీసింది. సొంతగడ్డపై వన్డే ప్రపంచకప్ జరగబోతుండడంతో శ్రీచరణి, అరుంధతి ఎలా ఆడతారో చూడాలి. ముఖ్యంగా స్పిన్‌కు అనుకూలమైన భారత్, లంక పిచ్‌లపై శ్రీచరణి బౌలింగ్ ఎంతో కీలకం కానుంది.


అరుంధతి

ప్రపంచ టోర్నీకి వెన్నెల, భార్గవ రామ్


వెన్నెల


భార్గవ రామ్

దిల్లీ: బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ జూనియర్ (అండర్-19) బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టుకు తెలుగు క్రీడాకారులు వెన్నెల కలగొట్ల, జ్ఞాన దత్తు, భార్గవ రామ్ అరిగెల, విశ్వతేజ గొబ్బూరు, విష్ణు కేదార్ కోడె, కీర్తి మంచాల ఎంపికయ్యారు. అక్టోబరు 6 నుంచి 19 వరకు గువాహటిలో జరిగే ఈ టోర్నీ కోసం 25 మందితో కూడిన జట్టును భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) మంగళవారం ప్రకటించింది. అక్టోబరు 6 నుంచి 11 వరకు సుహందినాత కప్ (మిక్స్‌డ్ టీమ్ ఛాంపియన్‌షిప్) జరుగుతుంది. అక్టోబరు 13 నుంచి 19 వరకు వ్యక్తిగత విభాగాల్లో పోటీలు నిర్వహిస్తారు. భారత్‌లో చివరిసారి 2008లో ప్రపంచ జూనియర్ టోర్నీ జరిగింది. అప్పుడు సైనా నెహ్వాల్ స్వర్ణం, గురుసాయిదత్ కాంస్య పతకాలు గెలుచుకున్నారు. ప్రపంచ టోర్నీలో ఇప్పటి వరకు భారత్ ఒక స్వర్ణం, 4 రజతాలు, 6 కాంస్యాలు సహా మొత్తం 11 పతకాలు సాధించింది.

భారత జట్టు: **బాలుర సింగిల్స్:** రౌనక్ చౌహాన్, టి.టి.జ్ఞాన దత్తు, లాల్తాజౌలా, సూర్యాక్ష్ రావత్, **బాలికల సింగిల్స్:** తన్వి శర్మ, వెన్నెల కలగొట్ల, ఉన్నతి హుడా, రక్షితశ్రీ, **బాలుర డబుల్స్:** సుమిత్- భవ్య ఛాబ్రా, భార్గవ రామ్ అరిగెల- విశ్వతేజ గొబ్బూరు, విష్ణు కేదార్ కోడె- మిథిలీష్ కృష్ణన్, **బాలికల డబుల్స్:** వెన్నెల కలగొట్ల- రేషిక, గాయత్రి రావత్- మానస రావత్, అన్య బిస్త్- ఏంజెల్ పునెరా, **మిక్స్‌డ్ డబుల్స్:** భవ్య ఛాబ్రా- విశాఖ తోపో, లాల్రమ్‌సంగా- తారిణి సూరి, విష్ణు కేదార్ కోడె- కీర్తి మంచాల, వంష్ దేవ్- దియాంక వాల్దియా

సెమీస్‌లో స్వైటెక్ జోడీ

యుఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్


స్వైటెక్, రూడ్

న్యూయార్క్: ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్న యుఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ టోర్నమెంట్లో ఇగా స్వైటెక్ (పోలెండ్)- కాస్పర్ రూడ్ (నార్వే) జంట సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. మంగళవారం క్వార్టర్స్‌లో స్వైటెక్ జంట 4-1, 4-2తో ముసెటి (ఇటలీ)-మెక్‌నాలీ (అమెరికా) ద్వయంపై గెలిచింది. మరో క్వార్టర్స్‌లో వావసోరి, ఎరాని (ఇటలీ) జోడీ 4-1, 5-4 (7-4)తో ముచోవ (చెక్), రుబ్లెవ్ (రష్యా)పై విజయం సాధించింది. 45 ఏళ్ల వయసులో బరిలో నిలిచిన అమెరికా వెటరన్ స్టార్ వీనస్ విలియమ్స్‌కు నిరాశ ఎదురైంది. తొలి రౌండ్లో వీనస్-రిలీ ఒపెల్కా (అమెరికా) జంట 2-4, 4-5 (4-7)తో ముచోవా (చెక్)-రుబ్లెవ్ (రష్యా) జోడీ చేతిలో ఓడింది. ఈ టోర్నీలో 16 జోడీలే తలపడుతున్నాయి. సెట్‌కు 4 గేమ్‌లే జరుగుతాయి.

సినర్ ఔట్: ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినర్ (ఇటలీ) యుఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ నుంచి వైదొలిగాడు. షెడ్యూల్ ప్రకారం సినర్-సినియాకోవా జంట తొలి రౌండ్లో జ్వెరెవ్-బెన్సిచ్‌తో తలపడాలి. తాజాగా అల్కరాస్‌తో సిన్సినాటి ఫైనల్ సందర్భంగా సినర్ అనారోగ్యానికి గురయ్యాడు. తొలి సెట్లో 0-5తో వెనుకబడిన స్థితిలో అతడు తప్పుకున్నాడు. ఈ నేపథ్యంలో యుఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ నుంచి కూడా వైదొలిగాడు.

ప్రత్యామ్నాయ షటిల్స్‌పై దృష్టిసారించాలి


గోపీచంద్

దిల్లీ: బ్యాడ్మింటన్ ప్రపంచం ఎదుర్కొంటున్న షటిల్ సంక్షోభాన్ని అధిగమించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలని జాతీయ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ సూచించాడు. షటిల్ తయారీకి ఉపయోగించే చైనా గూస్ (ఓ రకమైన బాతు) ఈకల ఎగుమతి తగ్గిపోవడంతో బ్యాడ్మింటన్ భారంగా మారిపోతోంది. ఏడాది కాలంలోనే షటిల్స్ ధరలు రెట్టింపయ్యాయి. చైనా ప్రజలు పంది మాంసంపై ఆసక్తి చూపుతుండటంతో గూస్‌ల పెంపకం తగ్గిపోయింది. బర్డ్‌ఫ్లూ భయంతో పెద్ద ఎత్తున గూస్‌లను చంపేశారు. దీంతో ఈకల సరఫరా పడిపోయి షటిల్స్ తయారీ గణనీయంగా తగ్గిపోయింది. "ఇప్పుడైనా.. ఇకముందైనా ఈకల షటిల్స్‌కు దూరంగా జరగాలి. బ్యాడ్మింటన్ ఎంతగానో అభివృద్ధి చెందింది. ప్రపంచంలో అత్యధికంగా చైనా, ఇండోనేసియా, భారత్‌లలో షటిల్స్ ఎక్కువగా వినియోగిస్తున్నారు. గూస్‌లు, బాతులు తగ్గిపోవడం మాత్రమే షటిల్స్ కొరతకు కారణం కాదు. ఎక్కువ మంది బ్యాడ్మింటన్ ఆడుతుండటం కూడా. అది శుభ పరిణామం. అయితే ప్రయోగశాలలో తయారు చేసిన లేదా సింథటిక్ ప్రత్యామ్నాయాల వైపు వెళ్లకపోతే సమస్యలు తప్పవు. రానున్న అయిదేళ్లలో పురోగతి సాధిస్తామని నమ్ముతున్నా" అని గోపీచంద్ వివరించాడు.

శుభ్‌మన్ వచ్చేశాడు


సూర్యకుమార్

వైస్‌కెప్టెన్‌గా అవకాశం

- బుమ్రాకు చోటు
- శ్రేయస్‌కు నిరాశ
- ఆసియాకప్‌నకు భారత జట్టు ఎంపిక


శుభ్‌మన్ గిల్

ముంబయి

టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వచ్చే నెలలో జరిగే ఆసియాకప్‌లో పోటీపడే భారత జట్టు వైస్‌కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. సందేహాలకు తెరదించుతూ ప్రధాన పేస్ అస్త్రం జస్‌ప్రీత్ బుమ్రాను కూడా జట్టులో చేర్చారు. శ్రేయస్ అయ్యర్‌కు మాత్రం నిరాశ తప్పలేదు. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ ప్రకటించిన 15 మంది సభ్యుల జట్టులో అతడికి చోటు దక్కలేదు. ఇటీవల ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో నాలుగు సెంచరీలు బాదిన గిల్.. ఏడాది తర్వాత పొట్టి క్రికెట్లోకి పునరాగమనం చేశాడు. అక్షర్ పటేల్ స్థానంలో అతణ్ని ఉపసారథిగా నియమించారు. "ఇంగ్లాండ్‌లో గిల్ ఫామ్ మేం ఊహించిందే. కానీ అతడు మా అంచనాలను మించి రాణించాడు" అని మంగళవారం విలేకరుల సమావేశంలో చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ చెప్పాడు. గిల్‌ను జట్టుకైతే ఎంపిక చేశారు కానీ.. ఆసియా కప్ సందర్భంగా అతడికి తుది జట్టులో చోటు కల్పించడం భారత జట్టు మేనేజ్‌మెంట్‌కు సవాలే. ఎందుకంటే అభిషేక్ శర్మ, సంజు శాంసన్ ఓపెనర్లుగా ఇప్పటికే స్థిరపడ్డారు. అయితే శాంసన్‌ను మిడిల్ ఆర్డర్‌లో ఆడించే వీలు జట్టు మేనేజ్‌మెంట్‌కు ఉంది. అగార్కర్ ఈ విషయాన్ని సూచనప్రాయంగా చెప్పాడు. "అప్పుడు యశస్వి, శుభ్‌మన్ అందుబాటులో లేకపోవడం వల్లే సంజు ఓపెనర్‌గా వచ్చాడు. అలాగే అభిషేక్ కూడా. కానీ అద్భుత ప్రదర్శన చేసిన అభిషేక్‌ను పక్కన పెట్టడం కష్టం. శుభ్‌మన్ చివరిసారి టీ20 క్రికెట్ ఆడినప్పుడు కూడా వైస్‌కెప్టెనే. అప్పటి నుంచే అతడి విషయంలో స్పష్టతతో ఉన్నాం. ఇప్పుడు గిల్ అందుబాటులో ఉన్నాడు. ఇక బ్యాటింగ్ లైనప్‌ను ఎంచుకునే తలనొప్పి కెప్టెన్ సూర్యకుమార్‌దే" అని అగార్కర్ చెప్పాడు. సొంతగడ్డపై వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ ఉండడంతో బుమ్రా అందుబాటుపై సందేహాలు వ్యక్తమైనా.. సెలక్షన్ కమిటీ అతణ్ని ఆసియా కప్‌నకు ఎంపిక చేసింది. పనిభార నిర్వహణలో భాగంగా ఇంగ్లాండ్‌లో బుమ్రా మూడు టెస్టులు మాత్రమే ఆడిన సంగతి తెలిసిందే. బుమ్రా పనిభార నిర్వహణపై కఠినమైన నిబంధనేమీ లేదని, ఇంగ్లాండ్ పర్యటన తర్వాత అతడికి తగినంత విశ్రాంతి లభించిందని అగార్కర్ చెప్పాడు. ఎడమచేతి వాటం స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌కు కూడా జట్టులో చోటు దక్కింది. జితేశ్‌కు రెండో వికెట్‌కీపర్‌గా అవకాశం లభించింది. యశస్వి జైస్వాల్, వాషింగ్టన్ సుందర్, ధ్రువ్ జురెల్, ప్రసిద్ధ్ కృష్ణ, రియాన్ పరాగ్ స్టాండ్‌బైలుగా ఎంపికయ్యారు. ఆసియాకప్ సెప్టెంబరు 9న ప్రారంభమవుతుంది. పాకిస్థాన్, ఒమన్, యూఏఈతో పాటు టీమ్‌ఇండియా గ్రూప్-ఎలో ఉంది. సెప్టెంబరు 28న ఆసియాకప్ ఫైనల్ జరగనుండగా.. వెస్టిండీస్‌తో భారత్ తొలి టెస్టు అక్టోబరు 2న అహ్మదాబాద్‌లో మొదలవుతుంది.

భారత జట్టు ఇదే..

సూర్యకుమార్, గిల్, అభిషేక్, హార్దిక్, అక్షర్, బుమ్రా, జితేశ్ శర్మ, శివమ్ దూబె, అర్ష్‌దీప్, సంజు శాంసన్, హర్షిత్ రాణా, తిలక్ వర్మ, రింకు సింగ్, వరుణ్ చక్రవర్తి, కుల్‌దీప్ యాదవ్. **స్టాండ్‌బైలు:** ప్రసిద్ధ్ కృష్ణ, వాషింగ్టన్ సుందర్, రియాన్ పరాగ్, ధ్రువ్ జురెల్, యశస్వి.



"యశస్వికి అవకాశం దక్కకపోవడం దురదృష్టకరం. అభిషేక్ బాగా ఆడుతున్నాడు. బౌలింగ్ కూడా చేయగలడు. వాళ్లిద్దరిలో ఒకరికి మాత్రమే అవకాశం ఉంది. శ్రేయస్ విషయంలోనూ ఇలాంటి పరిస్థితే. ఎవరిని కాదని అతణ్ని తీసుకోవాలి? ఇది అతడి తప్పు కాదు, మా తప్పు కూడా కాదు"
– అజిత్ అగార్కర్

శ్రేయస్‌పై శీతకన్నేల?


శ్రేయస్

ఆసియా కప్‌లో ఆడబోయే భారత జట్టును ప్రకటించారు. కానీ అందులో ఉన్న పేర్లేవీ ఆశ్చర్యం కలిగించేవి కావు. శ్రేయస్ అనే పేరు లేకపోవడం మాత్రం భారత క్రికెట్ అభిమానులకు మింగుడు పడనిదే. వన్డేల్లో నిలకడగా ఆడుతున్నా, దేశవాళీల్లో సత్తా చాటుతున్నా, ఈ ఏడాది ఐపీఎల్‌లోనూ గొప్ప ప్రదర్శన చేసినా.. అతడికి భారత టెస్టు, టీ20 జట్లలో ఎందుకు చోటు లేదన్నది అంతుబట్టని విషయం. ఒక ఆటగాడు తనకు దక్కిన ప్రతి అవకాశాన్నీ ఉపయోగించుకుంటూ ఉత్తమ ప్రదర్శన చేయడం కన్నా, జట్టులోకి రావడానికి ఇంకేం చేయగలడు?

ఫోర్త్ అంపైర్

ఆసియా కప్ కోసం ఎంపిక చేసిన భారత జట్టులో శ్రేయస్ అయ్యర్ ఎందుకు లేడని విలేకరులు అడిగితే.. ప్రస్తుతం జట్టులో ఉన్న ఎవరిని తప్పించి శ్రేయస్‌కు చోటివ్వాలో చెప్పండి అంటూ ఎదురు ప్రశ్నించాడు చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్. కానీ శ్రేయస్.. ఎవరో ఒకరిని తప్పించి కానీ జట్టులో స్థానం ఇవ్వాల్సిన ఆటగాడా అన్నది ప్రశ్న. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సహా జట్టులోని ఏ ఆటగాడికీ తీసిపోని ఘనమైన రికార్డే ఉంది శ్రేయస్‌కు. అంతర్జాతీయ టీ20ల్లో 51 మ్యాచ్‌లాడి 31 సగటుతో 1100కు పైగా పరుగులు చేశాడు శ్రేయస్. ఐపీఎల్‌లో అయితే 133 మ్యాచ్‌ల్లో 34కు పైగా సగటుతో 3731 పరుగులు సాధించాడు. ఇక గత ఏడాదిగా అన్ని ఫార్మాట్లలోనూ తన ప్రదర్శన అమోఘం. రంజీల్లో 69 సగటుతో 480 పరుగులు, ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో 50 సగటుతో 345 పరుగులు, విజయ్ హజారే టోర్నీలో 325 సగటుతో 325 పరుగులు సాధించిన శ్రేయస్.. ఈ ఏడాది ఛాంపియన్స్ ట్రోఫీ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. భారత టీ20 జట్టు ఎంపికకు ప్రామాణికంగా భావించే ఐపీఎల్‌లో అయితే శ్రేయస్ ఈ ఏడాది చెలరేగిపోయాడు. 17 మ్యాచ్‌ల్లో అతను 50కి పైగా సగటుతో 604 పరుగులు చేయడం విశేషం. అంతర్జాతీయ కెరీర్ ఆరంభం నుంచి ఏ ఫార్మాట్లో అవకాశం దక్కినా.. మెరుగైన ప్రదర్శనే చేస్తున్నాడు శ్రేయస్. టెస్టుల్లో 37, వన్డేల్లో 48, టీ20ల్లో 30కి పైగా సగటు నమోదు చేశాడు. వన్డేల్లో అతను ప్రపంచ మేటి బ్యాటర్లలో ఒకడిగా కొనసాగుతున్నాడు. కోహ్లి, రోహిత్‌లను మించి నిలకడగా రాణిస్తున్నాడు. అయినా సరే.. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు జట్టులో తన స్థానం ప్రశ్నార్థకమే. కానీ ఆ టోర్నీలో గొప్పగా రాణించి వన్డేల్లో తన చోటును సుస్థిరం చేసుకున్నాడు. టెస్టుల్లో, టీ20ల్లో మాత్రం తనకు సెలక్టర్లు అవకాశమివ్వడం లేదు. దేశవాళీల్లో, ఐపీఎల్‌లో ఏ జట్టు పగ్గాలందుకున్నా గొప్పగా నడిపిస్తున్నాడు శ్రేయస్. బ్యాటర్‌గా సత్తా చాటుతూనే నాయకత్వంతోనూ మెప్పిస్తున్నాడు. శ్రేయస్‌ను గమనిస్తే అతను సహజ నాయకుడిలా కనిపిస్తాడు. సచిన్ సహా ఎంతోమంది పేరున్న ఆటగాళ్లు విజయవంతం కాని కెప్టెన్సీని అతను అలవోకగా నిర్వర్తిస్తాడు. ఎన్నో ఏళ్ల తర్వాత శ్రేయస్ నాయకత్వంలో కప్పు గెలిచిన కోల్‌కతా తర్వాతి సీజన్లో అతడు లేకుండా చతికిలపడడం.. అదే సమయంలో అయ్యర్ పగ్గాలందుకోగానే పంజాబ్ ప్రదర్శన ఒక్కసారిగా మారిపోవడాన్ని బట్టే తనెంత గొప్ప కెప్టెనో అర్థమవుతుంది. ఇంత నైపుణ్యమున్న ఆటగాడు నిజానికి టీమ్‌ఇండియాకు కెప్టెన్ కావాలి. కానీ అతడికి కనీసం జట్టులో స్థానం లేకపోవడం ఎంతవరకు సమంజసం? ఇక ఎవరిని తప్పించి శ్రేయస్‌కు చోటివ్వాలనే అగార్కర్ ప్రశ్నకు సమాధానం వెతకడం కష్టమేమీ కాదు. శివమ్ దూబె, రింకు సింగ్ లాంటి ఆటగాళ్లు శ్రేయస్ కంటే మేటి ఆటగాళ్లా అన్నది ప్రశ్న. శ్రేయస్ చివరగా 2023 చివర్లో టీ20లు ఆడాడు. గాయంతో అప్పుడు జట్టుకు దూరమైన అతను... తర్వాత ఫిట్‌నెస్ సాధించినా, ఫామ్ చాటుకున్నా తిరిగి జట్టులోకి రాలేకపోయాడు. శ్రేయస్‌ను పక్కన పెట్టడానికి ఆటకు మించిన కారణాలేవో ఉన్నాయన్న చర్చ భారత క్రికెట్లో నడుస్తోంది. గత ఏడాది ఆరంభంలో ఇంగ్లాండ్‌తో సిరీస్ మధ్యలో గాయం వల్ల జట్టుకు దూరమయ్యాడు. కోలుకున్నాక, భారత జట్టుకు అందుబాటులో లేని సమయంలో దేశవాళీ క్రికెట్ ఆడలేదన్న కారణంతో శ్రేయస్‌తో పాటు ఇషాన్ కిషన్‌ను కూడా బీసీసీఐ కాంట్రాక్టు నుంచి తప్పించారు. ఒక ఏడాది విరామం తర్వాత మళ్లీ శ్రేయస్ కాంట్రాక్టు దక్కించుకున్నాడు కానీ.. టెస్టుల్లో, టీ20ల్లో భారత జట్టులో చోటు సంపాదించలేకపోతున్నాడు. జట్టు యాజమాన్యానికి, సెలక్టర్లకు శ్రేయస్ ప్రవర్తన విషయంలో అభ్యంతరాలున్నాయని, వారితో అతడికి చెడిందనే చర్చ జరిగింది ఓ సమయంలో. అయితే గతంలో ఏం జరిగినా.. ఆ కారణంతో గొప్ప ఫామ్‌లో ఉన్న ఆటగాడిని పక్కన పెట్టడం ఎంత వరకు సబబు?

దేశవాళీల్లో, ఐపీఎల్‌లో రాణించారని సాయి సుదర్శన్, కరుణ్ నాయర్‌లను ఇంగ్లాండ్ పర్యటనకు ఎంపిక చేశారు సెలక్టర్లు. కానీ శ్రేయస్ మీద మాత్రం శీతకన్నేశారు. కనీసం ఇంగ్లాండ్ లయన్స్‌తో తలపడ్డ ఇండియా-ఎ జట్టులో చోటుకు కూడా అతను నోచుకోలేకపోయాడు.

మను కంచు గురి


మను బాకర్

షెమ్‌కెంట్ (కజకిస్థాన్): ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ మను బాకర్ కాంస్యంతో మెరిసింది. మంగళవారం మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో ఆమె 219.7 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. మా కియాంకె (243.2, చైనా) స్వర్ణం.. యంగ్ జి ఇన్ (241.6, కొరియా) రజతం సొంతం చేసుకున్నారు. టీమ్ విభాగంలోనూ మను (583), పలక్ (573), సురుచి (574)లతో కూడిన భారత బృందం మూడో స్థానాన్ని దక్కించుకుంది. జూనియర్ మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో రష్మిక పసిడి 'డబుల్' సాధించింది. ఫైనల్లో ఆమె 241.9 స్కోరుతో అగ్రస్థానం సాధించింది. రష్మిక (582), వన్షిక చౌదరి (573), మోహిని సింగ్ (565)లతో కూడిన భారత జట్టు టీమ్ స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. యూత్ మహిళల 10 మీటర్ల పిస్టల్‌లో స్వర్ణ, రజతాలు భారత్‌కే సొంతమయ్యాయి. కనక్ (238.2), అగమ్ గ్రెవాల్ (236) తొలి రెండు స్థానాల్లో నిలిచారు. టీమ్ విభాగంలో భారత్ (అగమ్, కనక్, గంభీర్య) పసిడి గెలుచుకుంది.

క్రీడా బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

దిల్లీ: ప్రతిష్ఠాత్మక జాతీయ క్రీడా బిల్లు చట్టంగా మారింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ బిల్లుకు ఆమోద ముద్ర వేశారు. క్రీడా బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించినట్లు గెజిట్ నోటిఫికేషన్‌లో కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఉభయ సభల్లో ప్రవేశపెట్టిన బిల్లును రెండు ప్రధాన సవరణలతో పార్లమెంటు ఆమోదించింది. సమాచార హక్కు (ఆర్‌టీఐ) పరిధిని తగ్గించడం అందులో ముఖ్యమైనది. ప్రభుత్వ నిధులు, సహకారంపై ఆధారపడే క్రీడా సంస్థలను మాత్రమే ఆర్‌టీఐ పరిధిలో ఉంచారు. ఫలితంగా ఆర్‌టీఐ పరిధిలోకి రాకుండా బీసీసీఐకి వెసులుబాటు లభించింది. ప్రభుత్వ నిధులపై ఆధారపడనందున ఆర్‌టీఐ కిందకి రావడాన్ని బీసీసీఐ వ్యతిరేకిస్తూ వచ్చింది.

• పాక్, ఒమన్ స్థానాల్లో బంగ్లా, కజకిస్థాన్

రాజ్‌గిర్: ఆసియా కప్ హాకీ టోర్నీలో పాకిస్థాన్, ఒమన్ బదులుగా బంగ్లాదేశ్, కజకిస్థాన్ బరిలో దిగనున్నాయి. మంగళవారం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం పాక్, ఒమన్ స్థానాలను బంగ్లా, కజకిస్థాన్ భర్తీ చేయనున్నాయి. దాయాది ఆటగాళ్లకు వీసాలు ఇస్తామని కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసినా.. భద్రత కారణాలతో భారత్‌లో పర్యటించేందుకు పాకిస్థాన్ హాకీ సమాఖ్య (పీహెచ్‌ఎఫ్) నిరాకరించింది. ఈనెల 29 నుంచి సెప్టెంబరు 7 వరకు బిహార్‌లోని రాజ్‌గిర్‌లో ఈ టోర్నీ జరుగనుంది.

విజృంభించిన కేశవ్

తొలి వన్డేలో ఆసీస్‌పై దక్షిణాఫ్రికా గెలుపు


కేశవ్

కెయిన్స్: ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌లో దక్షిణాఫ్రికా బోణీ కొట్టింది. మంగళవారం తొలి మ్యాచ్‌లో 98 పరుగుల తేడాతో ఆతిథ్య జట్టును చిత్తు చేసింది. మొదట దక్షిణాఫ్రికా 8 వికెట్లకు 296 పరుగులు చేసింది. మార్‌క్రమ్ (82; 81 బంతుల్లో 9×4) టాప్ స్కోరర్. కెప్టెన్ బవుమా (65), బ్రీజ్‌కే (57), ముల్డర్ (31 నాటౌట్) రాణించారు. ట్రావిస్ హెడ్ (4/57) ప్రత్యర్థిని కట్టడి చేశాడు. కేశవ్ (5/33) ధాటికి ఛేదనలో ఆసీస్ 40.5 ఓవర్లలో 198 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ మిచెల్ మార్ష్ (88; 96 బంతుల్లో 10×4), హెడ్ (27) దూకుడుగా ఆడడంతో ఆస్ట్రేలియా గట్టి పునాది వేసుకుంది. కానీ కేశవ్ రాకతో మ్యాచ్ గమనం మారిపోయింది. 29 పరుగుల తేడాతో 6 వికెట్లు పడిపోయాయి. కేశవ్‌తో పాటు ఎంగిడి (2/28), బర్గర్ (2/54) ఆసీస్ పతనంలో కీలకపాత్ర పోషించారు.

• గుకేశ్‌పై ప్రజ్ఞానంద పైచేయి

సెయింట్ లూయిస్ (అమెరికా): సింక్వెఫీల్డ్ చెస్ టోర్నమెంట్లో ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్‌కు శుభారంభం దక్కలేదు. మంగళవారం తొలి రౌండ్లో మరో భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద చేతిలో గుకేశ్ 36 ఎత్తుల్లో ఓడిపోయాడు. గుకేశ్‌పై నెగ్గడంతో ప్రజ్ఞానంద (2784) ఫిడే లైవ్ రేటింగ్‌లో మూడో స్థానానికి చేరాడు. కార్ల్‌సన్ (2839), నకమురా (2807) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.



ఈనాడు



విజయవాడ 20-8-2025 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 11
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 14
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



ఆత్మవిశ్వాసం.. విశ్వమంత!

'అందాల పోటీలంటే సౌందర్య ప్రదర్శన కాదు, అడుగడుగునా ప్రతిఫలించే ఆత్మవిశ్వాసం, మహిళా సాధికారత, సామాజిక సేవ దిశగా సాగే అడుగులు' అంటోంది రాజస్థానీ సుందరి మణికా విశ్వకర్మ. ఈ ఏడాదికి మిస్ యూనివర్స్ ఇండియాగా నిలిచిన ఈమె గురించిన పూర్తి కథనం

వసుంధరలో



అమెరికాలో 6,000 మంది విద్యార్థుల వీసాల రద్దు

నిబంధనల ఉల్లంఘనే కారణం

ఇంటర్నెట్‌డెస్క్: అమెరికాలో నిబంధనలు ఉల్లంఘించిన విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. తాజాగా 6,000 మంది అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను రద్దు చేసింది. విదేశాంగశాఖ ఈ విషయాన్ని వెల్లడించినట్లు బీబీసీ కథనం తెలిపింది. వీరిలో 4,000 మంది దేశ చట్టాలను ఉల్లంఘించడం, దాడులకు పాల్పడటం, మత్తులో వాహనాలు నడపడం, దోపిడీలకు పాల్పడటం వంటివి చేసినట్లు (మిగతా 2లో)



యువ ఆవిష్కరణల వేదిక

అమరావతిలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌కు నేడు శ్రీకారం

ఈనాడు, అమరావతి: యువ ఆవిష్కరణల వేదికగా.. రాష్ట్ర ఆర్థికవృద్ధిలో ప్రతి కుటుంబానికీ భాగస్వామ్యం కల్పించడమే లక్ష్యంగా రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌కు కూటమి ప్రభుత్వం బుధవారం శ్రీకారం చుడుతోంది. ఇది దేశానికే కాదు.. ప్రపంచ అవసరాలు తీర్చే స్టార్టప్‌ల కేంద్రంగా విలసిల్లేలా కార్యాచరణ సిద్ధం చేసింది. కుటుంబానికో పారిశ్రామికవేత్త (మిగతా 2లో)

మనసున్న వారి కోసమే

పీ4

- అమలును 3 నెలలకోసారి మదింపు చేస్తాం
- ఆడబిడ్డల ఆర్థిక అభివృద్ధికే పథకాలు
- పీ4 ప్రారంభ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు



పీ4 కింద హెచ్‌సీఎల్ తనను దత్తత తీసుకుని, శిక్షణ ఇచ్చి... ఉద్యోగం ఇప్పించిందని గద్గద స్వరంతో చంద్రబాబుకు వివరిస్తున్న షేక్ పావని. చిత్రంలో వేమూరి రవి, పీయూష్ కుమార్, బంగారు కుటుంబ సభ్యులు

ఈనాడు - అమరావతి

పేదరిక నిర్మూలన కోసం చేపట్టిన పీ4 కార్యక్రమంలో భాగస్వాములయ్యేందుకు ఎవరినీ బలవంతం చేయడం లేదని.. ఇది మనసున్న వారి కోసం ఏర్పాటుచేసిన పథకమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 'పీ4పై ఉగాది రోజున సంకల్పం తీసుకున్నాం. ఇప్పుడు పూర్తిస్థాయిలో అమలు ప్రారంభించాం. పీ4 అమలుపై ఇకపై రోజూ సమీక్షిస్తాం. మూడు నెలలకోసారి మదింపు చేస్తాం. ఎవరెలా పనిచేశారో తెలుసుకుంటాం' అని చంద్రబాబు వివరించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 13,40,697 బంగారు కుటుంబాలు ఎంపికయ్యాయని.. 1,41,977 మంది మార్గదర్శులుగా నమోదు చేసుకున్నారని తెలిపారు. మంగళగిరిలోని కన్వెన్షన్ కేంద్రంలో మంగళవారం ఆయన పీ4 కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "కూటమి ప్రభుత్వం అమలుచేసే సంక్షేమ పథకాలన్నీ ఆడబిడ్డల ఆర్థికాభివృద్ధి కోసమే. ఎన్నికల్లో హామీ ఇచ్చామని కాదు.. ఓట్లేయడం కోసమూ కాదు. బంగారు కుటుంబాల్లో ఆశలు, ఆకాంక్షలెన్నో ఉన్నాయి. అయితే ఎలా నెరవేర్చుకోవాలో తెలియట్లేదు. ఏం చేస్తే మీ జీవితాలు బాగుంటాయో ప్రతి కుటుంబమూ ఆలోచించాలి. శక్తి ఉండే ప్రతి ఒక్కరూ అవసరాలున్న కుటుంబాలకు అండగా నిలవాలి. తెదేపా జాతీయాధ్యక్షుడు, ముఖ్యమంత్రిగా తీరిక లేకున్నా నేనూ 250 కుటుంబాలను దత్తత తీసుకున్నా. ఈరోజు మార్గదర్శులుగా ఉన్నవారంతా మొన్నటివరకు బంగారు కుటుంబాలే. అంతా అక్కడి నుంచి ఎదిగినవాళ్లమే. అందుకే బంగారు కుటుంబాలంటే తక్కువేం కాదు. చరిత్రలో ఎన్నడూలేనంత సంక్షేమం అందిస్తున్నాం. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పైలట్ ప్రాజెక్టు అమలుచేస్తున్నాం. ప్రపంచంలో ఉండే వైద్య విజ్ఞానమంతా ఆంధ్రప్రదేశ్‌కు తెచ్చేలా సంజీవని పథకం ప్రారంభిస్తాం. రాష్ట్రంలో మళ్లీ వైకుంఠపాళి ఆడకపోతే.. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో ఉంటుంది' అని చెప్పారు. చంద్రబాబు ప్రసంగంలోని మరికొన్ని అంశాలు..

ఆలయాలు, మసీదులు, చర్చిలే లేకుంటే..

దేవాలయాలు, మసీదులు, చర్చిలే లేకుంటే సమాజంలో పిచ్చి పడుతుంది. అక్కడకు వెళ్లి మీ బాధ అంతా భగవంతుడిపై (మిగతా 2లో)

మానవత్వంతో పనిచేద్దాం

అంతా ఏదో ఒకరోజు చనిపోయేవాళ్లమే. ఎవరూ శాశ్వతం కాదు. అలా ఉంటామనుకుంటే భ్రమలో ఉన్నట్లే. కొందరు జీవితాన్ని సద్వినియోగం చేసుకుంటారు. మరికొందరు దుర్వినియోగం చేసుకుంటారు. మనకేమీ పాస్‌పోర్టు లేదు. ఎంత సంపాదించినా దాన్ని ఇక్కడ వదిలిపెట్టి పోవాల్సిందే. అందుకే చనిపోయాక కూడా పదిమంది గుర్తుంచుకునేలా పనిచేయాలి. దాని కోసమే మానవజన్మ. అదే శాశ్వతం.. మానవత్వంతో పనిచేద్దాం.

- చంద్రబాబు

పీ4.. మా జీవితాల్లో గొప్ప మార్పు తెచ్చింది

బంగారు కుటుంబాల్లో నమ్మకం 2లో

నేరం చేస్తే ప్రధానికైనా ఉద్వాసనే!

నేడు పార్లమెంటులో బిల్లు

జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణ!



శ్రీనగర్: తీవ్రమైన నేరారోపణలతో అరెస్టయి వరసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉంటే ప్రధానమంత్రినైనా, కేంద్ర మంత్రినైనా పదవి నుంచి తొలగించేందుకు వీలు కల్పించే బిల్లును బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. తీవ్ర నేరారోపణకు గురై అరెస్టయినప్పుడు కేంద్ర మంత్రిని, రాష్ట్ర లేదా కేంద్ర పాలిత ప్రాంత ముఖ్యమంత్రిని; రాష్ట్ర మంత్రిని పదవి నుంచి తొలగించేందుకు కొత్త బిల్లు అనుమతిస్తుందని వెల్లడించాయి. కనీసం ఐదేళ్ల శిక్ష పడే నేరానికి పాల్పడి, అరెస్టయి, నెలరోజులు నిర్బంధంలో ఉంటే 31వ రోజున వారి పదవి పోయేలా నిబంధనను ఈ బిల్లులో చేర్చారు. వారంతట వారు రాజీనామా చేయకపోయినా కొత్త నిబంధన ప్రకారం పదవిని కోల్పోతారు. తీవ్ర అభియోగాలు ఎదుర్కొంటున్న మంత్రుల్ని తొలగించడానికి రాజ్యాంగంలో ఇంతవరకు నిబంధనలు లేవని బిల్లు ముసాయిదా పేర్కొంటోంది. దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, తమిళనాడు మాజీ మంత్రి వి.సెంథిల్ బాలాజీలు గతంలో అరెస్టైనా తమ పదవులకు రాజీనామా చేయని విషయం తెలిసిందే.

ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల్ని అరెస్టు చేయించి, అస్థిరపరచడానికే కేంద్రం ఈ బిల్లును తీసుకువస్తోందని కాంగ్రెస్ మండిపడుతోంది. కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో మొత్తం నాలుగు కొత్త బిల్లులను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తారన్న ఊహాగానాలు కూడా ఊపందుకున్నాయి. 130వ రాజ్యాంగ సవరణ బిల్లు-2025, కేంద్రపాలిత ప్రాంత ప్రభుత్వ (సవరణ) బిల్లు-2025, జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు-2025, ఆన్‌లైన్ గేమింగ్ ప్రోత్సాహం.. నియంత్రణ బిల్లు-2025లను లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారని అభిజ్ఞవర్గాలు తెలిపాయి. కొన్ని బిల్లుల్ని సంయుక్త పార్లమెంటరీ సంఘాలకు నివేదించనున్నట్టు లోక్‌సభ ఎజెండా చెబుతోంది. కొత్తగా ప్రవేశపెట్టనున్న జమ్మూకశ్మీర్ బిల్లు ఆ ప్రాంతానికి రాష్ట్ర హోదా కల్పిస్తుందా అనే ఊహాగానాలకు ఊతమిచ్చింది. (మిగతా 2లో)



ఉప రాష్ట్రపతి ఎన్నికలో ప్రతిపక్షాల అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి

- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వెల్లడి
- వెంకయ్యనాయుడు తర్వాత పోటీ పడుతున్న రెండో తెలుగు వ్యక్తి

ఈనాడు, దిల్లీ, హైదరాబాద్: ఉప రాష్ట్రపతి ఎన్నికలో ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం మధ్యాహ్నం ఇక్కడ ఈ విషయాన్ని ప్రకటించారు. ఆయన తన నివాసంలో ప్రతిపక్ష పార్టీలవారితో చర్చించిన తర్వాత ఎన్సీపీ (ఎస్పీ) అధ్యక్షుడు శరద్‌పవార్, సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, టీఎంసీ రాజ్యసభాపక్ష నేత డెరెక్ ఒబ్రెయిన్, డీఎంకే ఎంపీ కనిమొళిలతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. "అన్ని ప్రతిపక్ష పార్టీలూ ఒక్కటై ఒక్క పేరుపై పోటీ చేయడానికి నిర్ణయించడం ప్రజాస్వామ్యంలో పెద్ద విజయం. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ప్రమాదంలో పడినప్పుడు ప్రతిపక్షాలు ఒక్కటై అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడతాయి. అందుకే ఈ ఎన్నికల్లో ఒక మంచి అభ్యర్థిని నిలబెడుతున్నాం. జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి దేశంలో పేరొందిన ప్రగతిశీల న్యాయకోవిదుడు. ఆయన సుదీర్ఘ కాలం న్యాయ వ్యవస్థలో ఎన్నో హోదాల్లో పనిచేశారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం నిరంతరం ధైర్యంగా పోరాడారు. పేదల పక్షపాతి. ఆయన రాసిన తీర్పులను చదివితే పేదలకు అనుకూలంగా ఎలా (మిగతా 3లో)

సునీత దంపతులకు సుప్రీంకోర్టులో ఊరట

- వారితోపాటు సీబీఐ అధికారి రాంసింగ్‌పై కేసులు కొట్టివేత
- వివేకా మాజీ పీఏ కృష్ణారెడ్డి ఫిర్యాదుతో విచారణకు ఆదేశించారు
- ఇది చట్టాన్ని దుర్వినియోగం చేయడమే
- అందుకే ఈ కేసులను కొట్టేస్తున్నామన్న ధర్మాసనం
- వివేకా హత్యకేసులో తదుపరి దర్యాప్తు అవసరమా? కాదా?
- తేల్చిచెప్పాలని సీబీఐకి ఆదేశం



ఈనాడు, దిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత నర్రెడ్డి, ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డి, సీబీఐ దర్యాప్తు అధికారి రాంసింగ్‌లపై వివేకా మాజీ పీఏ ఎంవీ కృష్ణారెడ్డి పెట్టిన కేసులను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఆయన ఫిర్యాదు ఆధారంగా వారిపై సీఆర్‌పీసీ సెక్షన్ 156(3) కింద మేజిస్ట్రేట్ విచారణకు ఆదేశించడం చట్టాన్ని దుర్వినియోగం చేయడమేనని అభిప్రాయపడింది. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తు జరిపి క్లోజర్ రిపోర్టు దాఖలు చేసినందున దాన్ని మళ్లీ పరిశీలించాలని మేజిస్ట్రేట్‌ను ఆదేశించాల్సిన అవసరం లేకుండానే వారిపై చేపట్టిన మొత్తం విచారణ ప్రక్రియను కొట్టేస్తున్నామని స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ ఎన్‌కే సింగ్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. 'పిటిషనర్ల (సునీత, రాజశేఖర్‌రెడ్డి)పై చేపట్టిన విచారణ ప్రక్రియను రద్దు చేయడానికి ఇది సరైన కేసు. సునీత నర్రెడ్డి, ఆమె భర్త రాజశేఖర్‌రెడ్డితోపాటు, దర్యాప్తు అధికారిని ఇందులో చేర్చేందుకు మాకు చిన్న ఆధారం కూడా కనిపించలేదు. సీఆర్‌పీసీ సెక్షన్ 156(3) కింద ఉన్న న్యాయాధికారాన్ని ఉపయోగించేటప్పుడు చాలా స్పృహతో వ్యవహరించాలి. ముఖ్యంగా దర్యాప్తు అధికారిపైన ఆరోపణలు చేసినప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాలి. సునీత, రాజశేఖర్‌రెడ్డిలకు సీబీఐ అధికారితో సంబంధం ఉన్నట్లు చెప్పడానికి ఎలాంటి సాక్ష్యాధారాలు లేవు. ఇలాంటి పరిస్థితుల్లో వారిపై విచారణకు అనుమతించడం చట్టాన్ని దుర్వినియోగం చేయడమే. అందుకే (మిగతా 3లో)



సునీత, రాజశేఖర్‌రెడ్డి

భారత్-చైనా సంబంధాలు ప్రపంచ శాంతికి కీలకం

వాంగ్ యీతో భేటీ తర్వాత మోదీ వ్యాఖ్య

మనం శత్రువులం కాదు.. భాగస్వాములమన్న చైనా మంత్రి


అరుదైన ఖనిజాల ఎగుమతికి బీజింగ్ అంగీకారం!

ఇరు దేశాల సంబంధాలు మెరుగయ్యాయి: డోభాల్

దిల్లీ: ప్రాంతీయ సుస్థిరతకే కాదు.. ప్రపంచ శాంతి, సౌభాగ్యాలకు భారత్, చైనా సంబంధాలు కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. రెండు రోజుల భారత పర్యటనకు వచ్చిన చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ.. మంగళవారం ప్రధానితో భేటీ అయ్యారు. సరిహద్దులో శాంతిని ఉమ్మడిగా కాపాడుకోవడం, వాణిజ్యానికి సరిహద్దుల్ని మళ్లీ తెరవడం, వివిధ రకాల వీసాలకు వెసులుబాటు కల్పించడం, పెట్టుబడుల వెల్లువను ప్రోత్సహించడం, నేరుగా విమాన సర్వీసులను సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించడం, నదీ జలాల పంపకంలో సహకరించుకోవడంపై ఉభయపక్షాలు సుముఖత వ్యక్తం చేశాయి. భారత్‌పై వాణిజ్య సుంకాలను అమెరికా ఎడాపెడా పెంచేస్తున్న తరుణంలో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. (మిగతా 2లో)

ఉపరాష్ట్రపతిని ఏకగ్రీవంగా ఎన్నుకుందాం

అధికార, విపక్షాలకు ప్రధాని మోదీ పిలుపు ● రాధాకృష్ణన్‌ను సన్మానించిన ఎన్డీయే



పార్లమెంటులోని బాలయోగి ఆడిటోరియంలో జరిగిన ఎన్డీయే ఎంపీల సమావేశంలో ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌ను సన్మానిస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్, జేపీ నడ్డా 10లో

ఇదీ సంగతి!



కొత్తగా అప్పు చేయాల్సినప్పుడల్లా ఈ వార్త చూస్తే ధైర్యం వస్తుంది... ఇక్కడ అతికిస్తా!!

తిరుమల కొండపైకీ ఉచిత ప్రయాణం

స్త్రీ శక్తి పథకానికి అపూర్వ స్పందన

ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ



అవనిగడ్డలో బస్సులో మహిళ ఆధార్ కార్డును పరిశీలిస్తున్న కొనకళ్ల నారాయణరావు. చిత్రంలో మండలి బుద్ధప్రసాద్ తదితరులు

అవనిగడ్డ, న్యూస్‌టుడే: మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యం తిరుమల కొండపై వరకు పొడిగించినట్లు ఏపీఎస్‌ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు చెప్పారు. అయితే ఘాట్ రోడ్డు కావడం వల్ల సిటింగ్ వరకే అనుమతి ఇస్తున్నామన్నారు. మంగళవారం కృష్ణా జిల్లా అవనిగడ్డ ఆర్టీసీ బస్సు డిపోను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆర్టీసీ ఆర్‌ఎం కె.వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. స్త్రీ శక్తి - మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకానికి అపూర్వ స్పందన లభిస్తోందన్నారు. రాష్ట్రంలో ఈ నెల 16న 10 లక్షల మంది, 17న 15 లక్షల మంది, 18న 18 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారని వివరించారు. ఈ పథకం ద్వారా మహిళలకు రోజుకు రూ.6.30 కోట్లు లబ్ధి చేకూరుతోందన్నారు. ముఖ్యంగా ఆసుపత్రులకు, పుణ్యక్షేత్రాలకు వెళ్లేవారు, చిరుద్యోగాలు చేసే మహిళలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని నారాయణ చెప్పారు. అంతకు ముందు ఆయన పలువురు మహిళా ప్రయాణికులతో మాట్లాడారు. ఆధార్ కార్డులు పరిశీలించి, వారికి ఉచిత ప్రయాణ టికెట్లు అందించారు.

గోదారి ఉప్పొంగె.. కృష్ణమ్మ ఉరకలెత్తె

ఈనాడు, అమరావతి - పి.గన్నవరం, ధవళేశ్వరం, న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో రాష్ట్రంలో ప్రధాన నదులు గోదావరి, కృష్ణా ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. గోదావరిపై ధవళేశ్వరం బ్యారేజీ నుంచి మంగళవారం ఏడు గంటలకు 8,23,083 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ఈ సీజన్‌లో ఇదే అధికం. బ్యారేజీ వద్ద నీటిమట్టం ఉదయం 6.30కు 10.50 అడుగులు ఉండగా, సాయంత్రం ఆరింటికి 9.90 అడుగులుగా నమోదైంది. ఎగువన భద్రాచలం వద్ద వరద సాయంత్రానికి స్వల్పంగా పెరుగుతూ 36.30 అడుగులకు చేరింది. ఈ ప్రభావంతో బుధవారం రాత్రి నుంచి కాటన్ బ్యారేజీ వద్ద వరద ఉద్ధృతి పెరగవచ్చని అధికారుల అంచనా. బ్యారేజీకి దిగువన వశిష్ఠ, వైనతేయ, గౌతమి, వృద్ధగౌతమి నదీపాయలు పోటెత్తి ప్రవహిస్తున్నాయి. పి.గన్నవరం మండలం చాకలిపాలెం సమీపంలో.. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం కనకాయలంక లోతట్టు కాజ్‌వే మునిగిపోయింది. గ్రామస్థులు మోకాలిలోతు నీటిలో నడిచి వెళ్తున్నారు. పి.గన్నవరం మండలంలో నాలుగు, పశ్చిమ గోదావరి జిల్లాలో ఐదు లంక గ్రామాల ప్రజలు మర పడవల్లో రాకపోకలు సాగిస్తున్నారు. రెవెన్యూ అధికారులు పునరావాస కేంద్రాల్లో ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రకాశం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

కృష్ణానదిపై ప్రకాశం బ్యారేజీ నుంచి సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు 2,52,287 క్యూసెక్కుల నీటిని దిగువకు వదలగా, మంగళవారం ఉదయం మరో లక్ష క్యూసెక్కుల వరద తోడైంది. అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రాత్రి ఎనిమిదింటికి బ్యారేజీకి ఇన్‌ఫ్లో 4,85,539 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 4,81,194 క్యూసెక్కులుగా ఉంది. శుక్రవారానికి వరద మరింత పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. 5.67 లక్షల క్యూసెక్కులకు చేరితే రెండో ప్రమాద (మిగతా 2లో)

ఉద్ధృతంగా ప్రవహిస్తున్న నదులు



ప్రకాశం బ్యారేజీ గేట్లు ఎత్తడంతో కృష్ణమ్మ పరవళ్లు (డ్రోన్ చిత్రం)

చేతులు జోడించి అడుగుతున్నా..

- ఈ ప్రభుత్వాన్నే నాలుగైదు సార్లు కొనసాగించండి
- ఏపీ ఇక వెనక్కి తిరిగి చూడాల్సిన అవసరమే రాదు
- విదేశీవిద్యతో చదువుకుని 2 కంపెనీలు పెట్టిన ప్రవాసాంధ్రుడు కార్తికేయ


మాట్లాడుతున్న కార్తికేయ

ఈనాడు, అమరావతి: 'కూటమి ప్రభుత్వం నాలుగైదు దఫాలు అధికారంలో ఉంటే.. అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరమే ఉండదు. చేతులు జోడించి అందరినీ అడుగుతున్నా.. గందరగోళం వద్దు. ఈ ప్రభుత్వాన్నే కొనసాగనివ్వండి' అని ప్రవాసాంధ్రుడు కార్తికేయ రాష్ట్ర ప్రజల్ని కోరారు. పీ4 కార్యక్రమం ప్రారంభ సందర్భంగా కార్తికేయ మాట్లాడుతూ '2016లో చంద్రబాబు ప్రారంభించిన విదేశీవిద్య ద్వారా రూ.10లక్షల సాయం పొందాను. ఐర్లండ్‌లో మాస్టర్స్ చేశాను. కంపెనీలు పెట్టాను. ఇప్పుడు నా వంతుగా ఏడాదికి 10మందికి విదేశీవిద్య అందించేలా చేస్తాం. బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తాం. చంద్రబాబు చేతులమీదుగా కార్యక్రమం ప్రారంభిస్తాం' అని చెప్పారు.

ప్రజలు ఉచితంగా ఏదీ అడగడం లేదు.. నైపుణ్యం అందిస్తున్నాం

– మేఘా ఇంజినీరింగ్ ఎండీ కృష్ణారెడ్డి

"బంగారు కుటుంబాలను గుర్తించి వారిని పైకి తెచ్చేందుకు బృందం ద్వారా సర్వే చేయించాం. అయితే ప్రజలు ఉచితంగా ఏదీ అడగడం లేదు. గుడ్లవల్లేరు, రామకుప్పం మండలాల్లో నైపుణ్య కేంద్రాలు ప్రారంభిస్తున్నాం. నచ్చిన రంగంలో నైపుణ్యం అందిస్తాం. బంగారు మండలాలుగా తీర్చిదిద్దుతాం. కుటుంబాలతో పాటు సామాజిక అభివృద్ధిలో భాగంగా పాఠశాలలు, మరుగుదొడ్లు నిర్మిస్తాం. డోకిపర్రు వచ్చి, పీ4 ఆలోచన చెప్పినప్పుడు ఎంతో బాగుందని సీఎం చంద్రబాబును అభినందించా. ఆయనకు మేమంతా అండగా ఉంటాం."

మండవ ఫౌండేషన్ ద్వారా 245 కుటుంబాలకు అండ

– నూజివీడు సీడ్స్ డైరెక్టర్ ఆశాప్రియ

"మండవ ఫౌండేషన్ ద్వారా ఆగిరిపల్లి, నూజివీడు మండలాల్లో 245 కుటుంబాలను దత్తత తీసుకున్నాం. ఇప్పటికే కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. వ్యవసాయం, వైద్యం, పశుసంవర్ధకం తదితర రంగాల్లో పనిచేస్తున్నాం."

కుప్పంలో 7,916 బంగారు కుటుంబాలు

– కాడా ప్రాజెక్టు డైరెక్టర్ వికాస్

"కుప్పం నియోజకవర్గంలో 80,000 కుటుంబాలు ఉండగా.. 7,916 బంగారు కుటుంబాలను గుర్తించాం. వారి అవసరాలు తెలుసుకున్నాం. ఒక్కో కుటుంబంపై నాలుగైదు పేజీలతో నివేదిక తయారుచేశాం. 14 పరిశ్రమల ద్వారా 20వేల మందికి ఉద్యోగాలు ఇచ్చేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం."

- చంద్రబాబు 250 కుటుంబాలను దత్తత తీసుకోగా.. అందులో 12 కుటుంబాలు మంగళవారం మంగళగిరిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నాయి. వారితో చంద్రబాబు మాట్లాడి ఫొటోలు దిగారు.

పేదల దత్తతకు మేము సైతం

పేదలను ఆదుకునేందుకు పీ4 ఒక వేదిక అవుతుందని అమెరికాలో ఉండే ప్రవాసాంధ్రుడు అబ్బూరి శ్రీనివాస్ చెప్పారు. 15 ఏళ్లుగా తాము సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. 5 కుటుంబాలను దత్తత తీసుకుంటామని హామీ ఇచ్చారు. పీ4 ఎంతో మంచి కార్యక్రమమని సౌదీలో ఉండే ఖాలిద్ సైఫుల్లా పేర్కొన్నారు. 14 కుటుంబాలను దత్తత తీసుకుంటామన్నారు.

పీ4.. మా జీవితాల్లో గొప్ప మార్పు తెచ్చింది

- **బంగారు కుటుంబాల్లో నమ్మకం**

ఈనాడు, అమరావతి: విశ్వావసు నామ సంవత్సర ఉగాది రోజున సంకల్పించిన పీ4 కార్యక్రమం.. లాంఛనంగా ప్రారంభం కావడానికి ముందే విజయవంతంగా ముందుకు సాగుతోంది. ఇప్పటివరకు 13,40,697 బంగారు కుటుంబాలు ఎంపిక కాగా.. 1,41,977 మంది మార్గదర్శులుగా నమోదు చేసుకున్నారు. పేదరిక నిర్మూలన అనే బృహత్ లక్ష్యంతో పురుడుపోసుకున్న ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు బంగారు కుటుంబాల లబ్ధిదారులు, వారిని ఆదుకుంటున్న మార్గదర్శులు అక్కడకు విచ్చేసి తమ అనుభవాలను పంచుకున్నారు.

జీవితంపై నమ్మకం కల్పించిన పీ4 పథకం

– షేక్ పావని, వీరవనేనిగూడెం, కృష్ణా జిల్లా

అమ్మా, నాన్న చిన్నప్పుడే విడిపోయారు. అమ్మ కష్టపడి ఇంటర్ చదివించి పెళ్లిచేసింది. ఏడాదికే భర్త చనిపోయారు. ఆరు నెలల బిడ్డతో పాటు నా బాధ్యత కూడా అమ్మపైనే పడింది. ఉద్యోగం దొరకలేదు. అప్పుడే పీ4 పథకం కింద హెచ్‌సీఎల్ నన్ను దత్తత తీసుకుని కమ్యూనికేషన్, సాఫ్ట్, సిస్టమ్ స్కిల్స్, డెసిషన్ మేకింగ్, టైమ్ మేనేజ్‌మెంట్‌లో రెండు నెలల ఉచిత శిక్షణ ఇచ్చింది. ఊరు దగ్గరలోనే నెలకు రూ.15వేల జీతంతో ఉద్యోగం ఇప్పించింది. పీ4 నా జీవితంలో గొప్ప మార్పు తెచ్చింది.

వెయ్యి కుటుంబాల దత్తత

– శ్రీనివాస్, మార్గదర్శి, హెచ్‌సీఎల్ ఫౌండేషన్ ప్రతినిధి, గన్నవరం

గన్నవరంలోని హెచ్‌సీఎల్ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నాం. అవసరం ఉన్నవారిని గుర్తించేందుకు పీ4 తోడ్పడుతోంది. శిక్షణతోపాటు ఉద్యోగం కూడా ఇప్పిస్తాం. గన్నవరంలో 1,000 కుటుంబాలను దత్తత తీసుకుంటున్నాం.

చంద్రబాబు: అవకాశాలు కల్పిస్తే ఇలాంటి కుటుంబాలు అద్భుతం చేస్తాయి. శివనాడార్‌తో మాట్లాడి హెచ్‌సీఎల్‌ను గన్నవరం తీసుకొచ్చా. భవిష్యత్తులో సంస్థ మరింత విస్తరిస్తుంది.

కుట్టు శిక్షణ ఇప్పించి.. మిషన్ ఇచ్చారు: భవాని, గన్నవరం


సీఎం చంద్రబాబుతో భవాని, మార్గదర్శి చెన్నుపాటి కీర్తి

ఆటో నడిపే భర్త, ఇద్దరు పిల్లల కుటుంబం.. సొంత ఇల్లు లేదు. వచ్చే ఆదాయం ఖర్చులకే సరిపోతోంది. పీ4 పథకం కింద వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో 3 నెలల కుట్టుశిక్షణ ఇచ్చారు. విద్యుత్తు మోటారు ఉన్న మిషన్ ఇస్తున్నారు. కుటుంబానికి ఆసరా లభించింది.

రోడ్‌మ్యాప్ అవసరం: డాక్టర్ కీర్తి, వాసవ్య మహిళా మండలి

విజ్ఞానం, నైపుణ్యం మాత్రమే చాలదు. కమ్యూనికేషన్ ఎంతో అవసరం. స్త్రీలకు ఆర్థిక స్వావలంబన ఇస్తే.. కుటుంబంలో విలువ పెరుగుతుంది. ఎలా ఎదగాలో వారు రోడ్‌మ్యాప్ తయారుచేసుకుంటే.. సాయం అందిస్తాం. మహిళలను సోలార్ పీవీ టెక్నీషియన్లుగా తీర్చిదిద్దుతున్నాం.

చంద్రబాబు: సామాజిక బాధ్యత కలిగిన కుటుంబం నుంచి వచ్చిన డాక్టర్ కీర్తి అందరికీ స్ఫూర్తి. భర్త, పాప దూరమైనా ప్రజలకు తన జీవితాన్ని అంకితం చేశారు.

కుటుంబ పరిస్థితి బాగాలేదు, ఆదుకోండి: మహిళ, కొండపల్లి


కొండపల్లికి చెందిన మహిళతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. వేదికపై వేమూరి రవి, పీయూష్ కుమార్, బంగారు కుటుంబ సభ్యులు

మా ఆరోగ్యం బాగాలేదు. బాధల్లో ఉన్నాం.. కుమార్తెకు భర్త చనిపోయారు. ఆమె ఇంటర్ చదివింది. వితంతు పింఛను వస్తోంది. ఏదైనా ఉద్యోగం ఇప్పించాలి. ఆధార్ కార్డులో వయసు తప్పుగా పడడంతో నా భర్తకు పింఛను రావడం లేదు. (సమస్యను పరిష్కరించాలని సీఎం కలెక్టర్‌కు సూచించారు)

నెలకు రూ.48వేలు వచ్చేలా చేస్తాం: మేడసాని కిశోర్, మార్గదర్శి, మైలవరం

వీరికి కిరాణా దుకాణం పెట్టుకోవడానికి ఆర్థికసాయం చేస్తాం. ఇంటర్ చదివిన కుమార్తెకు శిక్షణ, ఉద్యోగం ఇప్పిస్తాం. కుటుంబానికి నెలకు రూ.48వేల ఆదాయం అందేలా చూస్తాం.

చంద్రబాబు: దత్తత బలవంతంగా తీసుకున్నారా?

మేడసాని కిశోర్: ఇష్టపడే తీసుకున్నాం. 15 ఏళ్లుగా లయన్స్‌లో పనిచేస్తున్నాం. మా అబ్బాయి ప్రతి పుట్టినరోజుకు సేవా కార్యక్రమాలు చేస్తుంటాం. బంగారం వ్యాపారుల సంఘం తరపున 11 మందిని దత్తత తీసుకుంటున్నాం.

బంగారు కుటుంబాలకు.. భరోసా


మార్గదర్శులు రమణయ్య, హేమలత, బంగారు కుటుంబ లబ్ధిదారు జ్ఞానమ్మలను సన్మానిస్తున్న చంద్రబాబు

పీ4 ద్వారా సాయం పొందిన కుటుంబాలు, తోడ్పాటుగా నిలిచిన కొందరు మార్గదర్శులను చంద్రబాబు సత్కరించారు. ఈ సందర్భంగా వారి కేస్‌స్టడీస్‌తో వీడియో ప్రదర్శించారు.

- రోజుకూలీ అయిన జ్ఞానమ్మకు నాగేశ్వరరావు అనే మార్గదర్శి 12 మేకలు, ఇంటిస్థలం, నిర్మాణానికి సాయం అందించారు. 'మేకలతో మాకు ఆదాయం వస్తోంది. ఇల్లు కట్టుకుంటున్నాం. పిల్లలకు మంచి భవిష్యత్తు లభిస్తుందనే నమ్మకం కలిగింది. పేద కుటుంబాలకు పీ4 వరం.. మార్గదర్శి నాగేశ్వరరావుకు ధన్యవాదాలు' అని జ్ఞానమ్మ దంపతులు తెలిపారు.
- ఎంపీపీ పాఠశాలలో పారిశుద్ధ్య కార్మికురాలైన పల్లికొండ హేమలత.. 'పీ4 పథకాన్ని ఫోనులో చూసి తెలుసుకున్నా. 84 ఏళ్ల కనికరం ఒంటరిగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో దత్తత తీసుకుని వైద్యసాయం, నెలకు 25 కిలోల బియ్యం ఇస్తున్నాం. ఇప్పుడు కనికరం మా అమ్మలాంటిది' అని వివరించారు.
- 'మార్గదర్శి రమణయ్య రూ.50వేల విద్యాసాయం చేశారు. కుటుంబానికి ఉపాధి హామీ జాబ్‌కార్డు లభించింది. ఇప్పుడు నా చదువు ఆగదు.. నా కల నెరవేరుతుంది. పీ4 నాకెంతో మేలుచేసింది' అని పడమటనాయుడుపల్లికి చెందిన 13 ఏళ్ల పాగాల సుమ వివరించారు.
- 'పీ4 ద్వారా మార్గదర్శి హరీశ్‌కుమార్ సాయం అందిస్తున్నారు. తల్లికి వందనం, దీపం, వితంతు పింఛను, వైద్యసాయం అందుతున్నాయి. మార్గదర్శికి, మాలాంటి ఎంతోమంది జీవితాలు మారుస్తున్న చంద్రబాబుకు కృతజ్ఞతలు' అని మహిమలూరుకు చెందిన రిజ్వానా పేర్కొన్నారు. భర్త మరణం తర్వాత ముగ్గురు పిల్లలతో చాలీచాలని ఆదాయంతో జీవిస్తున్నామన్నారు.

గోదారి ఉప్పొంగె.. కృష్ణమ్మ ఉరకలెత్తె

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరిక జారీ చేస్తారు. ఈ సీజన్‌లో.. ఈ నెల 13న తొలిసారి మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేశారు.

ముందస్తు చర్యలకు జిల్లాకు రూ.కోటి

భారీవర్షాల నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.16 కోట్లు విడుదల చేసింది. జిల్లాకు రూ.కోటి చొప్పున పల్నాడు, బాపట్ల, గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అనకాపల్లి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు ఈ నిధులు కేటాయించింది. బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించడం, రక్షిత నీరు, ఆహారం, పాలు సరఫరా, ఆరోగ్య శిబిరాలు, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆదేశిస్తూ రెవెన్యూ (విపత్తుల నిర్వహణ) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి ఈ ఉత్తర్వులిచ్చారు.

శ్రీశైలం నుంచి 10 గేట్ల ద్వారా నీటి విడుదల

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతాలైన జూరాల, సుంకేసుల, హంద్రీల నుంచి 3,99,423 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి వస్తోంది. దీంతో 10 గేట్లను 14 అడుగుల మేర పైకి ఎత్తి స్పిల్ వే ద్వారా 3,44,750 క్యూసెక్కులు, శ్రీశైలం కుడి, ఎడమగట్టు జలవిద్యుత్తు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 65,436 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడుకు 30 వేల క్యూసెక్కులు, హెచ్ఎన్ఎస్ఎస్‌కు 2,818 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మంగళవారం సాయంత్రం 6 గంటల సమయానికి శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 881.90 అడుగులు, నీటి నిల్వ 198.3623 టీఎంసీలుగా నమోదయ్యాయి.


గోదావరిలో వరద కారణంగా వై.వి.పాలెం వైపు విద్యార్థులను తీసుకెళ్తున్న పడవ

తీరం దాటిన వాయుగుండం

వివిధ జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలకు అవకాశం

ఈనాడు, విశాఖపట్నం: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం మంగళవారం ఉదయం దక్షిణ ఒడిశా-ఉత్తరాంధ్ర మధ్యలో గోపాల్‌పుర్ (ఒడిశా) సమీపంలో తీరం దాటింది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మీదుగా కదులుతూ తీవ్ర అల్పపీడనంగా బలహీనపడుతుందని భారత వాతావరణ విభాగం అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో తెలంగాణ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలో భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. రాబోయే నాలుగు రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలకు అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. కృష్ణపట్నం, నిజాంపట్నం, వాడరేవు, మచిలీపట్నం, కాకినాడ, విశాఖపట్నం, కళింగపట్నం తీరాల్లో మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగిస్తున్నారు. మత్స్యకారులు బుధవారం వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో బుధవారం తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి వానలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు శ్రీకాకుళం జిల్లా పాతపట్నంలో 8 సెం.మీ., టెక్కలిలో 6 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

మనసున్న వారి కోసమే పీ4

(మొదటి పేజీ తరువాయి)

పెడుతున్నారు. దీనివల్ల ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నాం. ఒత్తిడి నుంచి బయటపడతాం. మార్గదర్శులు బంగారు కుటుంబాలకు ఆర్థికసాయం చేయడం, పైకి తేవడమే కాకుండా.. అవసరమైనప్పుడు మానసిక ఇబ్బందులనూ తొలగించాలి. అప్పుడే చాలా సమస్యలు పరిష్కారం అవుతాయి.

అమెరికాలో 6,000 మంది విద్యార్థుల వీసాల రద్దు

(మొదటి పేజీ తరువాయి)

తెలుస్తోంది. ఉగ్రవాదానికి పాల్పడిన దాదాపు 300 మంది ఈ జాబితాలో ఉన్నారు. కొత్త విద్యాసంవత్సరం ప్రారంభంలో ఈ వీసాల రద్దు వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ట్రంప్ రెండోసారి దేశాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించాక అమెరికాలో ఉన్నత విద్యావ్యవస్థను పునర్వ్యవస్థీకరించే పనిలో పడ్డారు. ప్రధాన విశ్వవిద్యాలయాలను లక్ష్యంగా చేసుకుని తీవ్రస్థాయిలో విధానాల మార్పులు చేపట్టారు. ఇవి అంతర్జాతీయ విద్యార్థులపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి.

25న మిథున్‌రెడ్డితో మాజీ సీఎం జగన్ ములాఖత్

మాజీ మంత్రి బొత్స వెల్లడి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: మద్యం కేసులో అరెస్టై రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉన్న వైకాపా ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని ఈ నెల 25న మాజీ ముఖ్యమంత్రి జగన్ కలుస్తారని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. మిథున్‌రెడ్డితో మంగళవారం మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, దాడిశెట్టి రాజా, మాజీ ఎంపీ వంగా గీత ములాఖత్ అయ్యారు. అనంతరం బొత్స విలేకరులతో మాట్లాడారు.

రాధాకృష్ణన్ నామినేషన్ పత్రాలపై కూటమి ఎంపీల సంతకం

ఈనాడు, దిల్లీ: ఉపరాష్ట్రపతి ఎన్నికలో ఎన్డీయే అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న సీపీ రాధాకృష్ణన్ నామినేషన్ పత్రాలపై తెదేపా ఎంపీలు మంగళవారం సంతకాలు చేశారు. కేంద్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, తెదేపా పార్లమెంటరీ పార్టీనాయకుడు, ఎంపీ లావుశ్రీకృష్ణదేవరాయలు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, జనసేన తరపున ఆ పార్టీ ఎంపీ వల్లభనేని బాలశౌరి సంతకాలు చేశారు.

5 వేల గ్రామాల్లో హెచ్ఐవీ అవగాహన కార్యక్రమాలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని 5 వేల గ్రామాల్లో హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. 50 రోజులపాటు రాష్ట్రంలోని 1,012 పాఠశాలలు, 923 కళాశాలల్లో ఈ కార్యక్రమాలు సాగుతున్నట్లు వెల్లడించింది.

భారత్-చైనా సంబంధాలు ప్రపంచ శాంతికి కీలకం

(మొదటి పేజీ తరువాయి)

భారత్-చైనా సంబంధాలు స్థిరంగా పురోగతి సాధిస్తున్నాయని ఈ సమావేశానంతరం మోదీ వ్యాఖ్యానించారు. షాంఘై సహకార సదస్సు (ఎస్‌సీవో)లో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ను కలిసేందుకు తాను ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని చెప్పారు.

సరిహద్దులో శాంతి ముఖ్యం

సరిహద్దులో శాంతి నెలకొనడం కీలకమని వాంగ్ యీతో భేటీలో మోదీ స్పష్టం చేసినట్లు పీఎంవో ఒక ప్రకటనలో తెలిపింది. సరిహద్దు వివాదానికి అంగీకారయోగ్యమైన పరిష్కారం కనుగొనేందుకు నిబద్ధతతో ఉన్న విషయాన్ని ప్రధాని పునరుద్ఘాటించినట్లు పేర్కొంది. సరిహద్దుపై 24వ ప్రత్యేక ప్రతినిధుల స్థాయి చర్చల్లో భాగంగా వాంగ్ యీ.. జాతీయ భద్రతా సలహాదారు అజీత్ డోభాల్‌తో అంతకుముందు సమావేశమయ్యారు. భారత్-చైనాలు శత్రువులు కాదని, భాగస్వాములని చైనా మంత్రి పేర్కొన్నారు. సంబంధాలను మెరుగుపరచుకోవడానికి ఇదే సరైన తరుణమని వ్యాఖ్యానించారు. భారత్-చైనా సంబంధాలు గత 9 నెలల్లో మెరుగుపడ్డాయని, సరిహద్దులో శాంతి నెలకొందని పేర్కొన్నారు.


దిల్లీలో ప్రధాని మోదీతో భేటీ అయిన చైనా విదేశాంగ శాఖ మంత్రి వాంగ్ యీ

భారత్‌కు ఎగుమతులపై ఆంక్షల తొలగింపు!

వాంగ్ యీ పర్యటనలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. కొన్ని నెలలుగా భారత్‌కు అరుదైన ఖనిజాలు, ఎరువుల ఎగుమతులను నిలిపివేసిన చైనా.. వాటిని పునరుద్ధరించడానికి అంగీకారం తెలిపినట్లు తెలుస్తోంది. విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్‌తో సోమవారం జరిగిన సమావేశంలో వాంగ్ యీ హామీ ఇచ్చినట్లు సమాచారం. ఇది కార్యరూపం దాలిస్తే గత కొన్నాళ్లుగా ఈ దిగుమతులు నిలిచిపోవడంతో ఇబ్బందిపడుతున్న ఆటోమొబైల్, ఇతర పరిశ్రమలకు భారీ ఊరట లభించినట్లే.

- చైనాలో తైవాన్ భాగమని వాంగ్‌యీ, జైశంకర్ మధ్య సోమవారం జరిగిన చర్చల్లో భారత్ పేర్కొన్నట్లు వచ్చిన కథనాలను భారత ప్రభుత్వ వర్గాలు ఖండించాయి. జైశంకర్ మంగళవారం మాస్కోకు బయల్దేరి వెళ్లారు. ఈ పర్యటనలో ఆయన రష్యా విదేశాంగ శాఖ మంత్రి సెర్గీ లవ్రోవ్ సహా కొందరు ప్రముఖులను కలవనున్నారు.

యువ ఆవిష్కరణల వేదిక

(మొదటి పేజీ తరువాయి)

అనే నినాదాన్ని సాకారం చేయడంలో భాగంగా రాష్ట్ర వ్యాప్త గ్రిడ్ ప్రారంభించనుంది. అమరావతి కేంద్రంగా హబ్.. తిరుపతి, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ, అనంతపురంలో స్పోక్‌లు ఏర్పాటు కానున్నాయి. ప్రతి స్పోక్ స్వతంత్ర నాయకత్వ బృందాన్ని ఏర్పాటుచేసుకుని బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల ద్వారా నిర్వహిస్తారు. ఒక స్పోక్‌లోని స్టార్టప్‌లు మరో స్పోక్ నుంచి నైపుణ్యం, వనరులు, పెట్టుబడి ప్రయోజనాలు పొందే వీలుంటుంది. ప్రపంచస్థాయి ఉత్తమ విధానాలను అందిపుచ్చుకోవడం, టాటా గ్రూప్‌తో పాటు ఇతర భాగస్వాముల సహకారం తీసుకోనున్నారు. 'రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ మీ వేదిక.. నిర్మించండి.. ప్రయోగం చేయండి.. లాంచ్ చేయండి.. ఆంధ్రప్రదేశ్ మీకు మద్దతు ఇస్తుంది' అని ఆవిష్కర్తలకు ఆహ్వానం పలకనున్నారు.

అమరావతి కేంద్రంగా.. ఐదు స్పోక్‌లతో

అమరావతి కేంద్రంగా ఏర్పాటయ్యే రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్.. డీప్‌టెక్, కృత్రిమ మేధ, సుస్థిర, సమ్మిళిత ఆవిష్కరణలకు వేదికగా నిలుస్తుంది. దీనిలో భాగంగా అమరావతిని క్వాంటమ్ వ్యాలీ కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు ఆవిష్కరణ ఆధారిత ఆర్థిక వ్యవస్థలకు ప్రామాణికంగా రూపొందిస్తారు. ప్రపంచ మేధను ఆకర్షించి.. పెట్టుబడులు, ఇన్నోవేషన్ ఆధారిత విధానాలకు అధిక ప్రాధాన్యం ఇస్తారు.

స్పోక్‌ల వారీ ప్రాధాన్యాలు ఇలా..

అనంతపురం: ఉత్పత్తి, ఆటోమోటివ్
విశాఖపట్నం: సాఫ్ట్‌వేర్ సేవలు, ఫార్మా, మారిటైమ్
విజయవాడ: మొబిలిటీ, పబ్లిక్ సెక్టార్, ఉత్పత్తి రంగం
రాజమహేంద్రవరం: వ్యవసాయం, ఆక్వా
తిరుపతి: ఆగ్రో ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్

కళకు గౌరవం.. నగరానికి అందం!

- **స్మార్ట్ స్టార్టప్‌తో పేద చిత్రకారులకు ఉపాధి**


యోగాంధ్ర నేపథ్యంలో వంతెన పిల్లర్‌పై వేసిన చిత్రాలు


విశాఖ కలెక్టర్ హరేంధిరప్రసాద్‌కు ఆర్ట్ నమూనాలను అందిస్తున్న నాగేంద్రబాబు

ఈనాడు, విశాఖపట్నం: చిత్ర కళకు సాంకేతికత జోడించి నలుగురికి ఉపాధి చూపిస్తున్నారు విశాఖ నగరానికి చెందిన ఎస్.నాగేంద్రబాబు. స్ట్రీట్ మాస్టర్స్ ఆర్ట్ (స్మార్ట్) అనే స్టార్టప్‌ను ఏర్పాటు చేసి.. నిరుద్యోగ చిత్రకారులను ఒక్కతాటిపైకి తెచ్చారు. వారిని బృందాలుగా చేసి రాష్ట్రంలో నగరాలన్నీ అందంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ఈ స్టార్టప్‌ను ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. 'యోగాంధ్ర' కార్యక్రమం కోసం రూ.25 లక్షల ప్రాజెక్టును అప్పగించింది. దీంతో 71 మంది పేద చిత్రకారులకు ఉపాధి దొరికినట్లయింది. ఈ సంస్థ యోగాంధ్ర కార్యక్రమం కోసం 'మ్యూరల్ ఆర్ట్'తో విశాఖ వీధులను సుందరంగా మార్చింది. ఏఐ టెక్నాలజీతో నగర గోడలకు అందాలు తీసుకొచ్చింది. తొలుత చిత్రకారులు ప్రొజెక్టర్లతో అనుకున్న చిత్రాన్ని గోడపై వేశారు. 'మిక్స్‌డ్ రియాలిటీస్'ను ఉపయోగించి ఇతరత్రా రంగులు వేసే పని పూర్తి చేశారు.

నేరం చేస్తే ప్రధానికైనా ఉద్వాసనే!

(మొదటి పేజీ తరువాయి)

ఆన్‌లైన్ గేమింగ్ నిర్వహణను నేరంగా పరిగణిస్తూ రూపొందించిన 'ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు'ను కేంద్ర మంత్రివర్గం మంగళవారం ఆమోదించింది. దీనిని బుధవారం పార్లమెంటులో ప్రవేశపెడతారు. ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన మంగళవారం సమావేశమైన కేంద్ర క్యాబినెట్ పలు ప్రతిపాదనలకు సమ్మతి తెలిపింది. ఆన్‌లైన్ గేమ్స్, ఈ-స్పోర్ట్స్ (ఆన్‌లైన్ సోషల్ గేమ్స్) మధ్య విభజన చూపించేలా బిల్లును రూపొందించారు. నిబంధనల్ని ఉల్లంఘించి ఆన్‌లైన్ గేమ్స్ అందిస్తున్నవారికి మూడేళ్ల వరకు జైలుశిక్ష, లేదా రూ.కోటి వరకు జరిమానా, లేదా ఆ రెండూ విధించాలని ప్రతిపాదించారు. సంబంధిత అడ్వర్టయిజ్‌మెంట్లలో భాగం పంచుకున్నవారికి గరిష్ఠంగా రెండేళ్ల జైలుశిక్ష, రూ.50 లక్షల వరకు జరిమానా విధిస్తారు. వీటి ఆర్థిక లావాదేవీల్లో ప్రమేయం ఉన్నవారికీ గరిష్ఠంగా మూడేళ్ల శిక్ష, రూ.కోటి వరకు జరిమానా వేస్తారు. నేరాలు పునరావృతం చేసేవారికి శిక్షాకాలం, జరిమానా మరింత పెరుగుతాయి. ఆన్‌లైన్ గేములు ఆడేవారికి శిక్షల్ని ప్రతిపాదించలేదు. వీరిని నేరంలో పాలుపంచుకున్నవారిగా కాకుండా బాధితులుగా చూడటమే దీనికి కారణం.

గ్రహం అనుగ్రహం

20–8–2025 బుధవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; వర్ష రుతువు, శ్రావణ మాసం, బహుళపక్షం
ద్వాదశి: మ. 2-22 తదుపరి త్రయోదశి
పునర్వసు: రా. 1-48 తదుపరి పుష్యమి
వర్జ్యం: మ. 2-14 నుంచి 3-47 వరకు
అమృత ఘడియలు: రా. 11-29 నుంచి 1-01 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-38 నుంచి 12-28 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.5.47; సూర్యాస్తమయం: సా.6.20

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
విజయనగరం	33.0	26.0
రాజమహేంద్రవరం	33.0	24.0
తిరుపతి	32.2	24.6
శ్రీకాకుళం	32.0	27.0
విశాఖపట్నం	32.0	25.0
నెల్లూరు	31.0	25.6
కడప	31.0	25.0
విజయవాడ	30.6	24.6
ఒంగోలు	30.4	25.0
గుంటూరు	30.0	26.0
నరసాపురం	30.0	26.0
ఖమ్మం	29.2	23.0
అనంతపురం	29.1	24.0
కర్నూలు	29.0	23.4
తాడేపల్లిగూడెం	27.8	25.6
నిజామాబాద్	27.1	22.6
హైదరాబాద్	26.4	20.8
కరీంనగర్	26.0	22.0
మహబూబ్‌నగర్	23.9	22.1



మడకశిర ఆర్టీసీ డిపోను పరిశీలిస్తున్న ఎండీ ద్వారకా తిరుమలరావు

ఉచిత ప్రయాణానికి మహిళలకు స్మార్ట్‌కార్డులు

ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు

మడకశిర, న్యూస్‌టుడే: స్త్రీ శక్తి పథకంలో భాగంగా మహిళలకు అతి త్వరలోనే క్యూఆర్ కోడ్‌తో కూడిన స్మార్ట్ కార్డులు అందిస్తామని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలోని ఆర్టీసీ డిపోను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఇప్పటికే రోజుకు 18 లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని, ఈ సంఖ్య రాబోయే రోజుల్లో 26 లక్షలకు పెరుగుతుందని అంచనా వేశారు. ఉచిత బస్సు పథకం కారణంగా ఆర్టీసీ ఆదాయానికి గండి పడకుండా ప్రభుత్వం భరిస్తుందని ఎండీ తెలిపారు. అంతర్రాష్ట్ర బస్సు సర్వీసుల్లో రాష్ట్రంలోని ప్రాంతాల వరకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేసేందుకు త్వరలో మరో సమీక్ష నిర్వహించి నిర్ణయం తీసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఐదు రూపాయల డాక్టర్ వేణి మృతి



చెన్నై(ఆర్కేనగర్), న్యూస్‌టుడే: అతి తక్కువ రుసుముకే వైద్యసేవలు అందించిన వైద్యురాలు వేణి(71) గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. చెన్నై వన్నారపేటలో రూ.5కే వైద్యం అందించే ఆమె వేల సంఖ్యలో ప్రసవాలు కూడా చేశారు. వేణి భర్త జయచంద్రన్ కూడా వైద్యుడు. 1972లో క్లినిక్ ప్రారంభించిన ఆయన తొలుత రెండు రూపాయలు మాత్రమే తీసుకునేవారు. అనంతరం ఐదు రూపాయలు చేశారు. 2018లో డిసెంబరులో గుండెపోటుతో జయచంద్రన్ మరణించారు. అనంతరం వేణి రూ.5కే వైద్య సేవలు కొనసాగిస్తూ వచ్చారు.

పార్టీలకు అతీతంగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతివ్వాలి

కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల



ఈనాడు, అమరావతి: ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి పార్టీలకు అతీతంగా చంద్రబాబు, జగన్, పవన్‌కల్యాణ్, కేసీఆర్ మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల విజ్ఞప్తి చేశారు. ఇండియా కూటమి అభ్యర్థిగా న్యాయ నిపుణుడికి అవకాశం కల్పించడం హర్షణీయమని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అమరావతిపై దుష్ప్రచారం తగదు

• మంత్రి పి.నారాయణ

మంగళగిరి(ఎ.ఎన్.యు) న్యూస్‌టుడే: 'భారీ వర్షాలు కురిసినప్పుడు నిర్మాణాల కోసం తీసిన గుంతల్లోకి నీరు చేరదా? గుంతల్లోకి నీరు వస్తే భవనాలు మునిగిపోతాయంటూ వైకాపా నాయకులు విషప్రచారం చేస్తున్నారు. అమరావతిపై విషం చిమ్మే నాయకులు రాజధానిలో ఒక్కసారి పర్యటిస్తే వాస్తవాలు తెలుస్తాయి' అని మంత్రి పి.నారాయణ అన్నారు. అమరావతిపై దుష్ప్రచారం తగదని మండిపడ్డారు. అమరావతి ప్రాంతంలో కొండవీటి వాగు నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడిన ప్రాంతాలలో మంత్రి నారాయణ, ఏడీసీ ఛైర్మన్ లక్ష్మీపార్థసారథి మంగళవారం పర్యటించారు. అమృత విశ్వవిద్యాలయం సమీపంలో పశ్చిమ బైపాస్ రహదారిలో ఈ-11 రోడ్డు వద్ద బ్రిడ్జి నిర్మాణంలో వేసిన మట్టిని అధికారులు తొలగించకపోవడంతో కొండవీటి నీరు నిలిచింది. వరదనీరు దిగువకు వెళ్లకపోవడంతో కొండవీటి వాగులోని నీరు వెనక్కి వస్తోంది. విషయం తెలుసుకున్న మంత్రి నారాయణ నిర్లక్ష్యంగా పనిచేసిన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మట్టి తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు వెంటనే పొక్లెయినర్లు తెప్పించి మట్టిని తొలగించే ప్రక్రియ చేపట్టారు. నీరు త్వరగా దిగువకు వెళ్లేందుకు జాతీయ రహదారిపై సర్వీసు రోడ్డుకు గండి కొట్టారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రాబోయే 24 గంటల్లో వరదనీరు దిగువకు పోయేలా చర్యలు తీసుకున్నామన్నారు. 'వైకాపా నేతలు ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే ఈసారి ఎన్నికల్లో 11 సీట్లు కూడా రావు. అసత్యాలు వ్యాప్తిచేస్తే ప్రజలే బుద్ధి చెబుతారు' అని వ్యాఖ్యానించారు.



బ్రిడ్జి వద్ద నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

అసత్య ప్రచారాలు నమ్మొద్దు: ఎస్‌ఈ

గుంటూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కొండవీటి వాగు వరదనీటిని గుంటూరు ఛానల్‌లోకి మళ్లించారని కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దని జలవనరుల శాఖ ఎస్‌ఈ పి.వెంకటరత్నం పేర్కొన్నారు. ఆగస్టు 12-14 మధ్య అధిక వర్షాలతో పెద్ద ఎత్తున వర్షపునీరు కాలువలోకి వచ్చిందన్నారు. దీంతో గుంటూరు ఛానల్ నుంచి నీటి విడుదల నిలిపివేశామని తెలిపారు. నీటిని 9 పంపులతో కృష్ణానదిలోకి ఎత్తిపోసినట్లు తెలిపారు.

సాక్షి ఛానల్, అంబటి మురళీకృష్ణపై కేసు

చేబ్రోలు, న్యూస్‌టుడే: అసత్యాలు ప్రసారం చేస్తూ రైతులను ఆందోళనకు గురిచేసిన సాక్షి టీవీ ఛానల్, అవాస్తవాలు మాట్లాడిన పొన్నూరు నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త అంబటి మురళీకృష్ణపై గుంటూరు జిల్లా చేబ్రోలు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. కొండవీటి వాగు వరదను అప్పాపురం కాల్వకు మళ్లించడంతో చేబ్రోలు మండలంలో పలు గ్రామాల్లో వరిచేలు నీట మునిగాయని ఆయన చేసిన వ్యాఖ్యలను ఈ నెల 16న సాక్షి ఛానల్ ప్రసారం చేసింది. రైతులను భయాందోళనలకు గురిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఏఈ వెంకటరమణ ఫిర్యాదు చేశారు.

ఆర్మీ నియామక ర్యాలీలో విషాదం

పరుగు పందెంలో అస్వస్థతకు గురై అభ్యర్థి మృతి

కాకినాడ(మసీదు సెంటర్), న్యూస్‌టుడే: కాకినాడలో నిర్వహిస్తున్న ఆర్మీ నియామక ర్యాలీలో పాల్గొన్న ఓ యువకుడు అస్వస్థతకు గురై మృతిచెందారు. విజయనగరం జిల్లా సంతకవిటి మండలం శ్రీహరినాయుడుపేటకు చెందిన గండ్రేటి సాయికిరణ్(20) మంగళవారం తెల్లవారుజామున 5.30 గంటలకు నిర్వహించిన 1600 మీటర్ల పరుగు పందెంలో పాల్గొన్నారు. గమ్యానికి 100 మీటర్ల దూరంలో ఉండగా ఆయాసం, నొప్పి రావడంతో ఆగిపోయారు. అస్వస్థతకు గురైన అతడిని సిబ్బంది అంబులెన్స్‌లో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. మధ్యాహ్నం వరకు బాగానే మాట్లాడిన సాయికిరణ్.. సాయంత్రం 5 గంటల సమయంలో ఐసీయూలోకి మార్చిన కొద్దిసేపటికే మరణించారు. గుండెపోటుతో చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించగా.. సరైన వైద్యం అందించలేదని కుటుంబసభ్యులు ఆరోపించారు.

వివేకా హత్యకేసులో గంగిరెడ్డికి మధ్యంతర బెయిల్

ఈనాడు, దిల్లీ: వైఎస్ వివేకా హత్య కేసులో ఏ-1 గంగిరెడ్డికి మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ జస్టిస్ ఎంఎం సుందరేష్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసులో చాలామంది నిందితులకు బెయిల్ మంజూరైందని.. గంగిరెడ్డి ఒక్కర్నే లోపల ఉంచడం సమంజసం కాదని ఆయన తరఫు సీనియర్ న్యాయవాది దామా శేషాద్రినాయుడు వాదనలు వినిపించారు. వీటిని పరిగణనలోకితీసుకున్న న్యాయమూర్తి మధ్యంతరబెయిల్ మంజూరుచేస్తున్నట్లు చెప్పారు.

సునీత దంపతులకు సుప్రీంకోర్టులో ఊరట

(మొదటి పేజీ తరువాయి)

సునీత, రాజశేఖరరెడ్డి, రాంసింగ్‌లకు వ్యతిరేకంగా కొనసాగుతున్న అన్ని విచారణ ప్రక్రియలను కొట్టేస్తున్నాం' అని జస్టిస్ ఎంఎం సుందరేష్ స్పష్టం చేశారు. సునీత తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది హుజేఫా అహమ్మది, కృష్ణారెడ్డి తరఫున మరో సీనియర్ న్యాయవాది అంజనా ప్రకాశ్‌ల వాదనలు విన్న తర్వాత న్యాయమూర్తి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల విషయంలో అభ్యంతరాలు వ్యక్తం చేయడానికి అవకాశం ఇవ్వలేదని కృష్ణారెడ్డి తరఫు న్యాయవాది పేర్కొనడంతో జస్టిస్ సుందరేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఇప్పటికే మీ వాదనలన్నీ విన్నాం. మీ మీదున్న గౌరవంతో మీ క్లయింట్‌పై ఎలాంటి జరిమానా విధించకుండా వదిలేస్తున్నాం' అని హెచ్చరించారు. అంతకు ముందు ఈ కేసులో నిందితులుగా ఉన్న వారి బెయిళ్లు రద్దు చేయాలని సునీత, సీబీఐ దాఖలు చేసిన వివిధ పిటిషన్లపై విచారణ జరిపిన జస్టిస్ సుందరేష్ ఈ కేసులో తదుపరి దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందా? లేదా? అన్నదానిపై సీబీఐ రెండు వారాల్లోపు అభిప్రాయం చెప్పాలని అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజును ఆదేశించారు. దాని ఆధారంగా తదుపరి ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు.

ఇలాంటి కేసుల్లో బెయిళ్లు ఇవ్వరాదు: ఏఎస్‌జీ

సీబీఐ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్.వి.రాజు వాదనలు వినిపిస్తూ .. 'వివేకా హత్య జరిగిన తీరు, తర్వాత సాక్ష్యాల చెరిపివేతకు జరిగిన ప్రయత్నాలను చూస్తే ఇది అరుదైన కేసని స్పష్టమవుతోంది. వయోవృద్ధుణ్ని కుట్రపన్ని దారుణంగా హత్య చేసినట్లు నిరూపణయింది. ఆ హత్యను కప్పిపుచ్చడానికి రకరకాల ప్రయత్నాలు చేశారు. హత్య కేసుల్లో ముందస్తు బెయిల్ ఇవ్వకూడదు. అవినాష్‌రెడ్డి ఇందులో ప్రధాన కుట్రదారని అప్రూవర్ దస్తగిరి చెప్పారు. అందుకు బలం చేకూర్చే ఇతర సాక్ష్యాలూ ఉన్నాయి. హత్య జరిగిన క్షణం నుంచే సాక్ష్యాల తారుమారుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఆ తర్వాత అప్రూవర్‌ను జైల్లో బెదిరించే స్థాయి వరకు వెళ్లారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకొని నిందితుల బెయిల్ రద్దు చేయాలి. ఈకేసులో కోర్టు మరణశిక్ష విధించేందుకు కూడా అవకాశం ఉన్నందున నిందితులు రెండున్నరేళ్లు జైల్లో ఉండటం పెద్ద విషయంగా పరిగణించకూడదు. అభియోగాలు నమోదు చేసే వరకూ నిందితులకు బెయిల్ రద్దు చేసి అభియోగాల ఖరారు ప్రక్రియ పూర్తి చేసేందుకు అవకాశంఇవ్వాలి' అని కోర్టును అభ్యర్థించారు.

అవినాష్‌రెడ్డి అరెస్టును పోలీసులే అడ్డుకున్నారు: సిద్ధార్థ లూథ్రా

సునీత తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ 'మేం ఈ కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగించాలని కోరుతున్నాం. ఇందులో ఏ5గా ఉన్న శివశంకర్‌రెడ్డి కుమారుడు చైతన్యరెడ్డి వైద్యశిబిరం నిర్వహణ పేరుతో జైలుకెళ్లి అప్రూవర్‌ను బెదిరించినందున అతని బెయిల్‌నూ రద్దు చేయాలి. ఇదివరకు ఈ కేసు సుప్రీంకోర్టు ముందుకొచ్చినప్పుడు దర్యాప్తును 2023 జూన్ 30కల్లా పూర్తి చేయాలని ఆదేశించింది. దాంతో సీబీఐ వేగంగా విచారణ జరిపి ఛార్జిషీట్ వేసింది. అయితే హంతకులు హత్యకు ముందు, తర్వాత అవినాష్‌రెడ్డి ఇంట్లో ఉన్నట్లు గూగుల్ టేకౌట్ ఆధారాలు చెబుతున్నందున ఆయన పాత్రపై లోతుగా దర్యాప్తు జరపాలి. అందుకు ట్రయల్ కోర్టుకు ఆదేశాలివ్వాలి. సీబీఐ అవినాష్‌ను అరెస్ట్ చేయదలచుకోలేదు కాబట్టి ముందస్తు బెయిల్ ఇస్తున్నట్లు హైకోర్టు చెప్పింది. ఆయన్ను సీబీఐ అరెస్ట్ చేయడానికి వెళ్తే అప్పట్లో రాష్ట్ర పోలీసులు అనుమతివ్వలేదు. అవినాష్‌రెడ్డి ఇతరులతో కుట్రపన్ని వివేకానందరెడ్డిని దారుణంగా హత్య చేయించారు. ఆయనపై ఐపీసీ 120బి, 302, 301 సెక్షన్ల కింద కేసులు నమోదయినా ఏనాడూ దర్యాప్తునకు సహకరించలేదు. కాబట్టి అతని ముందస్తు బెయిల్ రద్దు చేయాలి' అని కోరారు.

చైతన్యరెడ్డి అప్రూవర్‌ను బెదిరించారు

వివేకా హత్య కేసులో ఏ-5గా ఉన్న శివశంకర్‌రెడ్డి కుమారుడు డాక్టర్ చైతన్యరెడ్డి వైద్యశిబిరం నిర్వహణ పేరుతో ఈ కేసులో అప్రూవర్‌గా ఉన్న ఏ-4 బ్యారక్‌లోకి వెళ్లి అతనిపై ఒత్తిడి చేసిన మాట వాస్తవమేనని ఏపీ ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది హుజేఫా అహ్మది ధర్మాసనానికి తెలిపారు. దీనిపై ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలతో అఫిడవిట్ వేశామన్నారు.

'లక్షల ఫైళ్ల వల్లే విచారణ సాగట్లేదు'

శివశంకర్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది నాగముత్తు వాదనలు వినిపిస్తూ ట్రయల్ కోర్టులో అభియోగాల నమోదును తాము అడ్డుకుంటున్నామన్నది నిజం కాదన్నారు. 'సీఆర్‌పీసీ సెక్షన్ 207 కింద 13 లక్షల డిజిటల్ ఫైళ్లు ఇచ్చారు. మేం వాటిని కనీసం తెరవలేకపోతున్నాం. సీబీఐ కూడా అదే చెప్పింది. అభియోగాల నమోదుకు కోర్టు 47.7 లక్షల పేపర్లు చదవాల్సి ఉంది. ఇది సంచలన కేసు కావచ్చు కానీ, ఇన్ని లక్షల కాగితాలా?' అని ప్రశ్నించారు. జస్టిస్ సుందరేష్ స్పందిస్తూ 'మీకు బెయిల్ మంజూరు చేస్తే విచారణ జరగనివ్వరు. బెయిల్ ఇవ్వకపోతే దరఖాస్తులు దాఖలు చేస్తూనే ఉంటారు. అందువల్ల ఏదీ ముందుకు సాగదు. అందువల్ల అభియోగాల నమోదు వరకు ట్రయల్ కోర్టు వ్యవహారాలు సున్నితంగా జరిగేలా చర్యలు తీసుకుంటాం' అంటూ విచారణను సెప్టెంబరు 9కి వాయిదా వేశారు.

కేసు పూర్వాపరాలివీ..

ఈనాడు, కడప: వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు ముందుకు సాగరాదనే గత వైకాపా ప్రభుత్వ పెద్దలు కుట్రపన్నినట్లు తీవ్ర ఆరోపణలున్నాయి. ఈ కేసులో బాధితులు, దర్యాప్తు సంస్థలపైనే కేసులు పెట్టించడం వాటికి బలం చేకూర్చింది. వైకాపా నేతల ఒత్తిళ్లకు లొంగిన వివేకా పీఏ కృష్ణారెడ్డి 2022లో ఎస్పీ అన్బురాజన్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ పేరుతో సీబీఐ ఎస్పీ రాంసింగ్ వేధిస్తున్నారని, వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి సైతం తమకుసహకరించాలంటూ బెదిరిస్తున్నారని అందులో పేర్కొన్నారు. దీంతో 2023 డిసెంబరు 15న సునీత, రాజశేఖర్‌రెడ్డి, రాంసింగ్‌లపై పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి.

ఉప రాష్ట్రపతి ఎన్నికలో ప్రతిపక్షాల అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

వ్యవహరించారు, రాజ్యాంగాన్ని, ప్రాథమిక హక్కులను ఎలా రక్షించారన్నది తెలుస్తుంది. ఉప రాష్ట్రపతి ఎన్నిక సైద్ధాంతిక యుద్ధం. అందుకే అన్ని ప్రతిపక్షాలూ ఆయన అభ్యర్థిత్వానికి మద్దతు పలికాయి. మన స్వాతంత్ర్యోద్యమం, రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలకు ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇప్పుడు ఆ విలువలన్నీ దాడికి గురవుతున్నాయి. అందుకే అందరం ఈ ఎన్నికలో కలిసికట్టుగా పోరాడాలని నిర్ణయించాం" అని ఖర్గే వివరించారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో వెంకయ్యనాయుడు తర్వాత పోటీ చేస్తున్న రెండో తెలుగు వ్యక్తిగా జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి నిలవనున్నారు.





విలేకరుల సమావేశంలో సంఘీభావం ప్రకటిస్తున్న డీఎంకే ఎంపీ తిరుచ్చి శివ, సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, టీఎంసీ ఎంపీ డెరెక్ ఓబ్రియన్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎన్సీపీ(ఎస్పీ)అధ్యక్షుడు శరద్ పవార్, కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్, ఎస్పీ ఎంపీ ధర్మేంద్ర యాదవ్, డీఎంకే ఎంపీ కనిమొళి, శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ ★ దిల్లీ విమానాశ్రయంలో మాట్లాడుతున్న ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి

ఎన్నో కీలక తీర్పులు...

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మానవ హక్కుల పరిరక్షణకు పెద్ద పీట వేశారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో పలు కీలక తీర్పులు వెలువరించారు. ఛత్తీస్‌గఢ్‌లో తీవ్రవాదులను ఎదుర్కొవడానికి ఏర్పడిన సల్వాజుడుంను నిషేధిస్తూ తీర్పు ఇచ్చారు. మానవ హక్కుల పరిరక్షణ, చట్టబద్ధ పాలన లక్ష్యంగా ఈ తీర్పు వెలువరించారు. ఆర్మీ వైద్య కళాశాలలో పదవీ విరమణ పొందిన సైనికులు, సైనిక సిబ్బంది వితంతువుల పిల్లలకు అడ్మిషన్లు నిరాకరించడం చెల్లదని, దీనివల్ల అణగారిన వర్గాలకు న్యాయం జరగదన్నారు. న్యాయవ్యవస్థ స్వతంత్రతను పరిరక్షించడంలో భాగంగా... న్యాయమూర్తులపై ఆరోపణలతో వచ్చే ప్రజాప్రయోజన పిటిషన్లను అనుమతించరాదని పేర్కొన్నారు. హైకోర్టు న్యాయమూర్తిగా ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనానికి నేతృత్వం వహిస్తూ ఎసైన్డ్ భూసేకరణపై కీలకమైన తీర్పు వెలువరించారు. ఎసైన్డ్ భూములకు భూసేకరణ చట్టం కింద చట్టబద్ధమైన పరిహారం చెల్లించాలని తీర్పు వెలువరించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు.

వ్యవసాయ కుటుంబం నుంచి...

- ★ 1946 జులై 8న రంగారెడ్డి జిల్లా ఆకుల మైలారంలో వ్యవసాయ కుటుంబంలో జన్మించారు.
- ★ 1971లో ఉస్మానియా యూనివర్సిటీలో న్యాయశాస్త్రంలో పట్టా పొంది అదే సంవత్సరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. సీనియర్ న్యాయవాది కె.ప్రతాప్‌రెడ్డి వద్ద జూనియర్‌గా చేరారు. హైదరాబాద్ సిటీ సివిల్‌కోర్టు, హైకోర్టుల్లో న్యాయవాదిగా వృత్తి జీవితం ప్రారంభించారు.
- ★ 1988-90 మధ్య హైకోర్టులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ న్యాయవాదిగా సేవలందించారు.
- ★ 1990లో సుమారు ఆరు నెలలపాటు కేంద్ర ప్రభుత్వం తరఫున అదనపు స్టాండింగ్ కౌన్సెల్‌గానూ పనిచేశారు. ఉస్మానియా యూనివర్సిటీకి న్యాయ సలహాదారుగా, స్టాండింగ్ కౌన్సెల్‌గా సేవలందించారు.
- ★ 1993లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.
- ★ 1995 మే 2న ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.
- ★ 2005 డిసెంబరు 5న గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు.
- ★ 2007 జనవరి 12 నుంచి 2011 జులై 7 వరకు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సేవలందించారు.
- ★ 2013 మార్చిలో గోవా తొలి లోకాయుక్తగా నియమితులయ్యారు. అదే ఏడాది అక్టోబరులో రాజీనామా చేశారు.
- ★ ప్రస్తుతం ఐఏఎంసీ శాశ్వత ట్రస్టీగా, బీసీ కులగణన అధ్యయన కమిటీ ఛైర్మన్‌గా కొనసాగుతున్నారు.

ఏకగ్రీవంగా ఎన్నికైంది నలుగురే

ఇప్పటివరకు 16 ఉప రాష్ట్రపతి ఎన్నికలు జరిగాయి. సర్వేపల్లి రాధాకృష్ణన్, గోపాల్ స్వరూప్ పాఠక్, జస్టిస్ మహమ్మద్ హిదయతుల్లా, శంకర్‌దయాళ్‌శర్మలు మాత్రమే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన అన్ని ఎన్నికల్లో ప్రతిపక్షాలు అభ్యర్థిని నిలబెట్టాయి. ప్రధానమంత్రిగా మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత 2017లో తొలిసారి జరిగిన ఎన్నికలో అధికారపార్టీ అభ్యర్థి ఎం.వెంకయ్యనాయుడుపైన ప్రతిపక్షాలు గోపాలకృష్ణ గాంధీని నిలబెట్టాయి. 2022లో జరిగిన ఎన్నికలో జగదీప్‌ధన్‌ఖడ్‌పై కర్ణాటకకు చెందిన మార్గరెట్ అల్వాను రంగంలోకి దింపాయి. ఇప్పుడు తెలంగాణకు చెందిన జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డిని ఎంపిక చేశాయి. ఈ మూడు ఎన్నికల్లో ప్రతిపక్షాల నుంచి దక్షిణాదివారే అభ్యర్థులు కావడం విశేషం.

పాఠశాలలు, గ్రామ సచివాలయాల్లో పిల్లల ఆధార్ నవీకరణకు మంగళవారం నుంచి 23 వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ, వార్డు సచివాలయాల విభాగం తెలిపింది. రెండో విడత ఈ నెల 28 నుంచి 30 వరకు నిర్వహిస్తామంది.

నలభై అంతస్తుల ఎత్తుండే రాకెట్‌ను నిర్మిస్తున్నాం

అంతరిక్ష పరిశోధనల్లో అద్భుత ప్రగతి సాధించాం • ఓయూ స్నాతకోత్సవంలో ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్

ఈనాడు, హైదరాబాద్: "అంతరిక్ష పరిశోధనల్లో ప్రపంచ దేశాలు అబ్బురపడేలా అద్భుత ప్రగతి సాధించాం. హైదరాబాద్ నగరంలోని 40 అంతస్తుల భవనమంత ఎత్తుండే రాకెట్‌ను నిర్మిస్తున్నాం. భవిష్యత్తులో నౌకాదళాల కోసం ప్రత్యేక ఉపగ్రహం ప్రయోగించనున్నాం" అని ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి.నారాయణన్ అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన 84వ స్నాతకోత్సవంలో ఆయన తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ 'డాక్టర్ ఆఫ్ సైన్స్' అందుకున్నారు. అనంతరం స్నాతకోత్సవ ఉపన్యాసం చేశారు. "రష్యా, అమెరికాలకు దీటుగా ఉపగ్రహాలు ప్రయోగిస్తున్నాం. అమెరికాకు చెందిన 6,500 కిలోల కమ్యూనికేషన్ ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నాం. వచ్చే పదేళ్లలో భారత్ సొంతంగా అంతరిక్ష కేంద్రం నిర్మించనుంది. శుక్రగ్రహంపై తొలిసారిగా ప్రయోగాలు చేస్తున్నది మనమే. కర్షకులు, కార్మికులు... ఇలా ప్రజలందరి దైనందిన జీవితాల్లో వెలుగు నింపడమే ఇస్రో పరిశోధనల లక్ష్యం" అని వి.నారాయణన్ పేర్కొన్నారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ... మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జై జవాన్, జై కిసాన్ నినాదంతో దేశాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లారని, వాజ్‌పేయీ జై విజ్ఞాన్‌ను జోడించారని అన్నారు. భారత్‌ను అగ్రదేశాల సరసన నిలబెట్టేందుకు ప్రధాని మోదీ జై అనుసంధాన్‌ను చేర్చి దేశాన్ని ప్రగతి దిశగా తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. సమాజానికి ఉపయోగపడే మరిన్ని పరిశోధనలు నిర్వహించి జాతీయస్థాయిలో ఉత్తమ వర్సిటీగా తీర్చిదిద్దుతామని ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్ మొలుగరం తెలిపారు. రిజిస్ట్రార్ జి.నరేష్‌రెడ్డి, డీన్‌లు, ఆచార్యులు పాల్గొన్నారు. స్నాతకోత్సవంలో 121 మంది విద్యార్థులకు బంగారు పతకాలు... 1261 మందికి పీహెచ్‌డీ పట్టాలను గవర్నర్ అందజేశారు.



వి.నారాయణన్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ. చిత్రంలో ఓయూ వీసీ కుమార్ మొలుగరం

అంతా భారతీయులమే...

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి వ్యాఖ్య

ఈనాడు, దిల్లీ: దేశంలో అందరికీ భారతీయ పౌరసత్వం ఒక్కటే ఉంటుందని... అందువల్ల తాను, ఎన్డీయే అభ్యర్థి రాధాకృష్ణన్ ఇద్దరమూ భారతీయులమేనని ఉప రాష్ట్రపతి ఎన్నికలో ప్రతిపక్షాల అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన మంగళవారం దిల్లీ చేరుకున్న సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఈసారి ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో రంగంలో ఇద్దరు అభ్యర్థులూ దక్షిణ భారతీయులే కావడంపై ఆయనను స్పందన కోరినప్పుడు పైవిధంగా స్పందించారు. విజయంపై విశ్వాసంతో ఉన్నారా? అని పాత్రికేయులు అడగగా... 'ఎందుకు ఉండకూడదు? నేనేమీ అలా కనిపించడం లేదా?' అని నవ్వుతూ వ్యాఖ్యానించారు. అభ్యర్థులను రాజకీయ పార్టీలు ప్రతిపాదిస్తున్నా... ఈ ఎన్నికల్లో ఎంపీలు మాత్రమే ఓటు వేయాల్సి ఉన్నందున తనకు ఓటేయాలని ఎంపీలందర్నీ కోరుతున్నట్లు ఆయన తెలిపారు.


ఈనాడు

పుతిన్ తరఫున ట్రంప్ వకాల్తా!

దండిగా కండబలం కలిగిన దుండగుడు ఒకడు దుర్బలుణ్ని పట్టుకుని కొడుతున్నాడు. ఒంట్లో సత్తువ మొత్తాన్ని కూడగట్టుకుని బాధితుడు పోరాడుతున్నాడు కానీ, తనవల్ల కావట్లేదు. తగువు తీరుస్తానంటూ వచ్చిన 'పెద్దమనిషి- 'ఎదురుతిరగడం మానేయ్... నోరు కట్టేసుకుని చేతులు కట్టేసుకుని అతనికి కావాల్సింది ఇచ్చేయ్... ఇక ఏ గొడవా ఉండదు' అని ఆ బక్కజీవిపైనే గుస్సాయిస్తే ఎలా ఉంటుంది? రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకంటూ అగ్రరాజ్యాధిపతి చేస్తున్న దౌత్యమూ ఇలాగే అఘోరిస్తోంది! తనే గనుక 2022లో అధికారంలో ఉండి ఉంటే కీవ్‌పై మాస్కో దండెత్తేదే కాదని డంబాలు పలికిన డొనాల్డ్ ట్రంప్- యుద్ధాన్ని ఒక్కరోజులో ఆపించేయగలనని అమెరికా అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో కనీసం 53సార్లు గొప్పలకు పోయారు. ఉక్రెయిన్‌తో కాల్పుల విరమణ ఒప్పందానికి ఒప్పుకోకపోతే ఊరుకోనని పదవిలోకి వచ్చాక రష్యాపై పదేపదే కేకలేశారు. కానీ, అలాస్కాలో పుతిన్‌తో మాటామంతీ జరిపాకనే ట్రంప్ స్వరం మారిపోయింది. కాల్పుల విరమణ అంశాన్ని పక్కకు నెట్టేసిన ఆయన- శాంతి కావాలంటే రష్యా గుప్పిట్లోని క్రిమియా గురించి ఉక్రెయిన్ ఇక మర్చిపోవాలని, నాటోలో చేరాలన్న ఆలోచనను మనసులోంచి చెరిపేయాలని తీర్మానించేశారు. యుద్ధాన్ని మొదలుపెట్టిన రష్యాను వదిలేసి ఉక్రెయిన్ మెడపై షరతుల కత్తి పెడుతున్న ట్రంప్ వైఖరి గర్హనీయమైనది!

మాట తప్పడం, నోటికొచ్చిన అబద్ధాలు చెప్పడం, ఆధిపత్య బలప్రదర్శనకు వెంపర్లాడటం, సహజ న్యాయసూత్రాలను బేఖాతరు చేయడం ట్రంప్ సహజ గుణాలు. అయినప్పటికీ నిలువెల్లా గాయాలైన ఉక్రెయిన్‌కు ఆయన సాంత్వన కల్పిస్తారేమోనని, యుద్ధ విరమణ దిశగా పుతిన్‌ను నచ్చజెప్పుతారేమోనని ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూసింది. కానీ, కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా రష్యా అధినేతతో భేటీని ముగించిన ట్రంప్... జెలెన్‌స్కీకి సుద్దులు చెప్పడమే విస్మయకరం. రష్యాతో శాంతి ఒప్పందానికి అంగీకరిస్తే ఉక్రెయిన్ భద్రతకు పూచీపడతామన్న ట్రంప్ వాగ్దానమూ అస్పష్టమైనదే. నిజానికి ఆయన అమెరికా అధ్యక్ష పీఠాన్ని అధిరోహించిన తరవాతే ఉక్రెయిన్‌పై రష్యా దాడులు తీవ్రతరమయ్యాయి. బైడెన్ ఏలుబడిలోని చివరి అర్ధ సంవత్సరంలో మాస్కో కీవ్‌పై 11,614 సార్లు క్షిపణులు బాంబులను ప్రయోగించింది. అమెరికా పగ్గాలు ట్రంప్ చేతుల్లోకి వచ్చిన తరవాత ఆర్నెల్లలో 27వేల సార్లకు పైగా అలాంటి జనహనన ఆయుధాలను పనిచెప్పింది. మారణహోమాన్ని ఆపని పుతిన్ దురహంకార ధోరణికి తోడు ట్రంప్ నిలకడలేమితనం ఇప్పుడు ఐరోపా దేశాలనూ భయాందోళనలకు గురిచేస్తోంది!

రష్యా యుద్ధోన్మాదం దాటికి నిరుడు డిసెంబరు నాటికి ఉక్రెయిన్ 17600 కోట్ల డాలర్లు నష్టపోయింది అక్కడ పాతిక లక్షల ఇళ్లు నేలమట్టమయ్యాయి. విద్య, విద్యుత్తు, వ్యవసాయం, వాణిజ్యం, రవాణా రంగాలు బాగా దెబ్బతిన్నాయి. ఆ దేశానికి తిరిగి ప్రాణం పోయాలంటే 52400 కోట్ల డాలర్లు అవసరమని ప్రపంచ బ్యాంక్, ఐరాస లెక్కగట్టాయి. దీనికితోడు 1.14 లక్షల చదరపు కిలోమీటర్లకుపైగా ఉక్రెయిన్ భూభాగంలో పుతిన్ సేనలు తిష్ఠవేశాయి. ఇవేమీ పట్టని ట్రంప్- ఉక్రెయిన్ భూగర్భంలోని అరుదైన లోహాలను తవ్వుకుపోవడానికి ఇటీవలే ఒప్పందం కుదుర్చుకున్నారు. తాము దురాక్రమించుకున్న ప్రాంతాలను తమకే విడిచిపెట్టాలని భీష్మిస్తున్న పుతిన్ తరఫున ఆయన వకాల్తా పుచ్చుకోవడమైతే మరీ అన్యాయం! సార్వభౌమాధికారాన్ని పణంగా పెట్టమని ఉక్రెయిన్‌పై ఒత్తిడి తేవడం పూర్తిగా అవాంఛనీయం. దాంతో సాధించదలచిన శాంతి శాశ్వతం కాబోదన్నది వాస్తవం!



సైన్స్ అంటే అదేదో అర్థం కాని విషయంలా భావిస్తారు కొందరు. నిజానికి మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని తెలుసుకోవడమే సైన్స్. మనకెంతో నచ్చే ప్రకృతి అందాల లోతుపాతులను విడమరచి చెప్పే విజ్ఞానం అది.

– సుబ్రహ్మణ్యం చంద్రశేఖర్
నోబెల్ పురస్కార గ్రహీత

పతనానికి మొదటి మెట్టు

ఈర్ష్య నుంచి ద్వేషం జన్మిస్తుంది; ద్వేషం నుంచి కలహాలు పుట్టుకొస్తాయి. కలహాల వల్ల మనసు భ్రమపడుతుంది. చివరికి మనిషే పతనమవుతాడు.

మనిషి జీవితంలో ఉన్నతికి, లేదా పతనానికి ప్రధాన కారణం అతడి గుణాలే అని పురాణకాలం నుంచి ఎన్నో కథనాలు రుజువు చేస్తున్నాయి. కొన్ని చెడు ప్రవృత్తులు ముఖ్యంగా ఈర్ష్య, అసూయ మన ప్రగతికి అతిపెద్ద శత్రువులు. ఇవి నిప్పులా హృదయాన్ని కాల్చేస్తాయి. ప్రశాంతతను హరిస్తాయి. చివరికి చరిత్రహీనుల్ని చేస్తాయి.

ఎన్ని దానధర్మాలు చేసినా, పూజలూ వ్రతాలూ ఆచరించినా, ఇతరుల విజయానికి ఈర్ష్య పెంచుకుంటే, ఇతరుల శ్రేయస్సును చూసి అసూయపడితే అది మనల్నే దహించి వేస్తుంది. ఏ దానాలు, పూజలు దానినుంచి రక్షించవు. దీనికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. రాముడిపై ఎంతో ప్రేమ కలిగిన కైకేయి కూడా, తన కొడుకు భరతుడు అన్నకి అనుయాయిగానే మిగిలిపోతాడన్న విషయాన్ని తట్టుకోలేక ఈర్ష్యాద్వేషాలతో రగిలిపోయింది. తానెప్పుడో గతంలో దశరథ మహారాజు దగ్గర పొందిన వరాలను ప్రయోగించి రాముణ్ని అడవికి పంపించింది. ఇంత చేసినా భరతుణ్ని రాజుగా చూసుకోలేకపోయింది. తన కొడుకును ఎలాగైతే చూడకూడదని అనుకుందో అలాగే చూడక తప్పలేదు ఆ తల్లికి. అసూయతో అన్యాయంగా ప్రవర్తించినా తాను కోరుకున్న ఫలితాన్ని పొందలేకపోయింది. చివరికి ఎవరి కోసమైతే తాను అంత దారుణానికి ఒడిగట్టిందో ఆ కన్న కొడుక్కే మానసికంగా దూరమై బాధపడింది.



అంతర్యామి


అందుకే 'ఈర్ష్యా వ్యాధిః శరీరస్యం, ధర్మనాశస్య కారిణీ' అన్నారు పెద్దలు. మహాభారతంలో పాండవ పుత్రులను చూసి పసిప్రాయం నుంచి కళ్లలో నిప్పులు పోసుకున్నారు కౌరవులు. యుధిష్ఠిరుడు రాజసూయ యజ్ఞం నిర్వహించినప్పుడు, పాండవుల వైభవాన్ని కళ్లారా చూసిన దుర్యోధనుడు తీవ్రంగా అసూయ చెందాడు. పాండవుల ప్రతిభను, ధర్మాచరణను, విజయాన్ని తట్టుకోలేక వంచనకు పాల్పడ్డాడు. అతడు చేసిన కుట్రలు, కుతంత్రాలు కురుక్షేత్ర యుద్ధానికి దారితీశాయి. చివరికి దుర్యోధనుడి అసూయ అతణ్నే కాదు, అతడి వంశం మొత్తాన్ని నాశనం చేసింది. శిశుపాలుడు తన జీవితమంతా కృష్ణుణ్ని ద్వేషిస్తూ గడిపాడు. ఆయన గొప్పదనాన్ని సహించలేకపోయాడు. రాజసూయ యజ్ఞంలో ఉన్నతమైన గౌరవాన్ని పొందుతున్న కృష్ణుణ్ని దూషించి సుదర్శన చక్రానికి బలయ్యాడు. అసూయ ఎంత పెరిగితే, అది అంతటి ముప్పు తెస్తుంది.

'అసూయా పాపస్య మూలం' అన్నది రుషి వాక్యం. అసూయ అన్నిరకాల పాపాలకు మూలమని దానర్థం. అందుకే ఇతరుల విజయాలను చూసి ఆనందించాలి. మన స్ఫూర్తిగా వారిని అభినందించాలి. చేతనైతే వారినుంచి స్ఫూర్తి పొంది విజయపథంలో ముందుకు సాగాలి.

– మాపూరు విజయలక్ష్మి

కాంతిని గడ్డ కట్టించారు!

మన చుట్టూ నిరంతరం వెలుతురు ప్రవహిస్తూ ఉంటుంది- చీకటిని తరిమి కొడుతుంటుంది. విశ్వంలో స్వేచ్ఛగా తిరిగే శక్తి... కాంతి మాత్రమే. ఆ కాంతిని చూడగలం, తాకలేం. మన చేతుల్లోకి తీసుకోలేం. అలాంటిదాన్ని ఒక్కచోట నిలపడం, గడ్డకట్టించడం... గతంలో అయితే సైన్స్ ఫిక్షన్ కథలకే పరిమితం. ఇప్పుడది నిజమైంది! ఇటలీకి చెందిన 'నేషనల్ రీసెర్చ్ కౌన్సిల్' భౌతిక శాస్త్రవేత్తల బృందం, కాంతిని 'సూపర్‌సాలిడ్' అనే ప్రత్యేక పదార్థస్థితిలోకి మార్చినట్టు ఇటీవల ప్రకటించింది. ఇదొక అద్భుతమైన పరిణామం. ఎందుకంటే ఇది కాంతిని ఒకే సమయంలో ఘన, ద్రవ పదార్థాల్లా ప్రవర్తించే విచిత్రమైన స్థితిలోకి మార్చే ప్రక్రియ. 'కాంతిని గడ్డకట్టించగలమా?' అనే ప్రశ్నకు సమాధానం!



రెండు విరుద్ధ లక్షణాలైన ఘన, ద్రవత్వాలను కలిగి ఉండే ప్రత్యేక పదార్థస్థితిని 'సూపర్‌సాలిడ్' అంటారు. ఒకవైపు ఇది స్ఫటికం లాంటి అణు నిర్మాణాన్ని కలిగి ఉంటుంది; మరోవైపు సూపర్‌ఫ్లూయిడ్‌లా ఘర్షణ లేకుండా నిరంతరంగా ప్రవహించగలదు. ఈ చరిత్రాత్మక విజయాన్ని సాధించేందుకు శాస్త్రవేత్తలు గాలియం ఆర్సనైడ్ అనే సెమీకండక్టర్ పదార్థంపై లేజర్ కాంతిని ప్రసరింపజేశారు. ఈ ప్రక్రియలో కాంతి కణాలు (ఫోటాన్‌లు) పదార్థాలను ఏర్పరిచే ద్రవ్యరాశి కలిగిన మూలకణాలైన ఎలక్ట్రాన్లతో అనుసంధానమై 'పోలారిటాన్‌లు' అనే హైబ్రిడ్ కణాలను ఏర్పరిచాయి. సాధారణంగా కాంతి నిలవదు, బరువూ ఉండదు; కానీ పదార్థానికి నిర్మాణం ఉంటుంది. శాస్త్రవేత్తలు ఈ రెండింటి లక్షణాలను కలిపి, ఫోటాన్‌లకు కొంత 'భౌతికత'ను ఇస్తూ, ఒక క్రమబద్ధ నిర్మాణంలో అమరేలా చేయగలిగారు. ఇది కాంతిని నిలిపేయడమే కాదు, దాని ప్రవాహ గుణాన్ని కూడా కోల్పోకుండా నిలబెట్టి, క్రమబద్ధ నిర్మాణాన్ని కలిగిన ఘన పదార్థంలా ప్రవర్తించేలా చేసిన ఘట్టం. ఒక నమూనాలో ఒదిగినప్పటికీ ఫోటాన్‌లు స్వేచ్ఛగా కదలగలగడం విశేషం.

సెకనుకు మూడు లక్షల కిలోమీటర్ల వేగంతో పరుగు తీసే కాంతిని శాస్త్రవేత్తలు 'సూపర్‌సాలిడ్' అనే ప్రత్యేక స్థితిలో నిలిపారు. ఒకే సమయంలో ఘన పదార్థంలా క్రమబద్ధంగా ఉండగలగడం, ద్రవంలా స్వేచ్ఛగా ప్రవహించగలగడం ఈ అద్భుత స్థితి లక్షణాలు! ఇది కేవలం శాస్త్ర ప్రయోగం కాదు- రేపటి సాంకేతిక విప్లవానికి తొలి అడుగు!

పునాది... మన బోస్

భౌతికశాస్త్రంలో అత్యంత ప్రభావశీలమైన సిద్ధాంతాలలో ఒకటైన 'బోస్-ఐన్‌స్టీన్ కండెన్సేషన్'కు ప్రయోగాత్మక రూపమే- ఈ సూపర్‌సాలిడ్ కాంతి. ఈ భావనకు పునాది వేసింది భారతీయ శాస్త్రవేత్త సత్యేంద్రనాథ్ బోస్. ఆయన 1920లలో కాంతి కణాలైన ఫోటాన్‌ల ప్రవర్తనపై చేసిన గణిత విశ్లేషణలు ఐన్‌స్టీన్‌ను ఆకట్టుకున్నాయి. ఫలితమే 'బోస్-ఐన్‌స్టీన్ కండెన్సేషన్' సిద్ధాంతం. దీని ప్రకారం- కొన్నిరకాల కణాలు (ఫోటాన్‌లు) అతి తక్కువ ఉష్ణోగ్రతల దగ్గర (మైనస్ 273 డిగ్రీల సెంటీగ్రేడు) ఒకే క్వాంటం స్థితిలో విలీనమై ఒకేలా ప్రవర్తిస్తాయి. కానీ, పదార్థాల తయారీకి కీలకమైన ఎలక్ట్రాన్లకు ఈ సిద్ధాంతం వర్తించదు. అన్ని ఎలక్ట్రాన్లు ఒకే క్వాంటం స్థితిని పొందలేవు. కానీ, జంటగా ఏర్పడి సూపర్ కండక్టివిటీకి సహకరించగలవు.

గతంలో సూపర్‌సాలిడిటీ అనే ప్రత్యేక పదార్థ స్థితిని ఈ బోస్-ఐన్‌స్టీన్ కండెన్సేట్ల రూపంలోనే చూశాం. ఇదే సూత్రాన్ని ఆధారంగా తీసుకుని శాస్త్రవేత్తలు ఇప్పుడు సూపర్‌సాలిడ్ కాంతిని సృష్టించారు. దీనికోసం వారు ఉపయోగించినవి 'పోలారిటాన్‌లు' అనే హైబ్రిడ్ కణాలు. వీటికీ బోస్-ఐన్‌స్టీన్ కండెన్సేషన్‌కు లోబడి ఒకే క్వాంటం స్థితిలోకి వెళ్లే సామర్థ్యం ఉంది. ఈ పోలారిటాన్‌లు పరస్పరం ఆకర్షించుకుంటూ, సరిగ్గా బోస్-ఐన్‌స్టీన్ కండెన్సేట్‌లా సమరూపంగా ప్రవర్తించాయి. అవి తక్కువ ఉష్ణోగ్రతల్లో కాక సెమీకండక్టర్ వాతావరణంలో ఉత్పత్తయినప్పటికీ, ఘన పదార్థంలా క్రమబద్ధమైన స్ఫటిక నిర్మాణాన్ని ఏర్పరచాయి. అదే సమయంలో ప్రవహించే స్వేచ్ఛను కోల్పోకుండా సూపర్‌ఫ్లూయిడ్‌లా ప్రవర్తించాయి. కాంతి-పదార్థ మిశ్రమ కణాలైన పోలారిటాన్‌లు తక్కువ జీవితకాలం కలిగిన, ప్రవాహ స్థితిలోనే పోయే కణాలు. వీటిని బోస్-ఐన్‌స్టీన్ కండెన్సేషన్ స్థితిలోకి తీసుకురావాలంటే, నానోస్థాయిలో నిర్మించిన నాణ్యమైన మైక్రో కేవిటీలు, సెమీ కండక్టర్ పదార్థాలు, అతి తక్కువ ఉష్ణోగ్రతలు, కచ్చితమైన లేజర్ నియంత్రణ- ఇలా అనేక అంశాల్లో అసాధారణ నైపుణ్యం అవసరం. అంతేకాక, ఈ స్థితి ఏర్పడిందని నిర్ధారించడానికి అత్యంత సున్నితమైన స్పెక్ట్రోస్కోపి, ఇంటర్‌ఫెరోమీట్రీ, ద్రవ్యవేగం-స్పేస్ మ్యాపింగ్ వంటి అత్యాధునిక పద్ధతులు అవసరమయ్యాయి. అందుకే ఈ ప్రయోగం ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలందుకుంది.

ఏమిటీ ఉపయోగాలు?

ఈ సూపర్‌సాలిడ్ కాంతి ప్రయోగానికి భవిష్యత్తులో విప్లవాత్మక మార్పులను సృష్టించగలిగిన సత్తా ఉంది. భౌతిక శాస్త్ర పరిధులను విస్తరించే ఈ ప్రయోగం అనేక హైటెక్ రంగాల్లో వినూత్న అన్వయాలను చూపగలదు. క్వాంటం కంప్యూటింగ్ రంగంలో అనూహ్య పురోగతి సాధ్యమవుతుంది. సూపర్‌సాలిడ్ దశలోని ఫోటాన్‌లు ఒకే క్వాంటం స్థితిలో ఉండటం వల్ల, తక్కువ శక్తినష్టంతో వేగవంతమైన సమాచార నిర్వహణకు ఇది దోహదం చేస్తుంది. దీనివల్ల, భవిష్యత్తులో మరింత స్థిరత్వం గల, తక్కువ శక్తితోనే వేగంగా పనిచేసే క్వాంటం కంప్యూటర్‌లు రూపుదిద్దుకోగలవు. కాంతిని నియంత్రించగలిగిన సామర్థ్యం వల్ల ఫోటోనిక్ పరికరాల రూపకల్పన కొత్తపుంతలు తొక్కగలదు. సూపర్‌సాలిడ్ కాంతి ఆధారంగా తయారయ్యే సర్క్యూట్లు, సంప్రదాయ ఎలక్ట్రానిక్ సర్క్యూట్లకన్నా వేగంగా, అధిక స్థాయిలో డేటా నిర్వహణకు వీలు కల్పించగలవు. ఇంకా, ఈ ప్రయోగం ఆధారంగా కమ్యూనికేషన్ వ్యవస్థల్లోనూ కొత్త మార్గాలు తెరుచుకుంటాయి. డేటా నష్టం లేకుండా వేగంగా సంకేతాలను ప్రసారం చేయగల సాంకేతికత అభివృద్ధి చెందుతుంది. ఇది అంతరిక్ష, సముద్ర గర్భంలో కమ్యూనికేషన్ వంటి సవాళ్లతో కూడిన విభాగాల్లో ఉపయోగపడుతుంది. ఈ కాంతి తరంగాలను వినియోగించి, పరిసరాలను సునిశితంగా గుర్తించగల సెన్సింగ్ పరికరాలను తయారుచేయవచ్చు. ఇవి బయోమెడికల్, భద్రతా వ్యవస్థలు, శాస్త్రీయ పరిశోధనల్లో కీలకం కావచ్చు. ఈ సూపర్‌సాలిడ్ కాంతి ఆధారంగా తయారయ్యే ప్రత్యేక పదార్థాలు- హోలోగ్రాఫిక్ డిస్‌ప్లేలు, ఎన్‌క్రిప్టెడ్ లైటింగ్ వ్యవస్థలు వంటి నూతన సాంకేతికతలకు కూడా బీజం వేయగలవు. ఇప్పటిదాకా శాస్త్ర ప్రయోగంగా కనిపించినా, రేపటి ప్రపంచాన్ని మలచే శక్తిగా మారగలదన్న నమ్మకం ఉంది.



డాక్టర్ మంగళంపల్లి కిరణ్
అసోసియేట్ ప్రొఫెసర్, నానో శాస్త్ర పరిశోధకులు
ఎస్.ఆర్.ఎం. యూనివర్సిటీ, అమరావతి



నీ ఆనందం నీలోనే...

మనలో చాలామందికి ఒక అలవాటు ఉంటుంది. సమస్య రాకముందే వస్తుందేమోనని భయపడతారు. సమస్య వచ్చేసినట్లు దాంట్లో ఇరుక్కుపోయి దిక్కుతోచని స్థితిలో ఉన్నట్లు ఫీలైపోతుంటారు. పనులు చేయడం మాని ఊహల్లో తేలిపోవడం ఎంత తప్పో, రాని సమస్యలను ఊహించుకుని బాధపడటమూ అంతే తప్పు.

ఒక వృద్ధురాలికి ఇద్దరు కూతుళ్లు. ఇద్దరికీ పెళ్లిళ్లై వేర్వేరు నగరాల్లో స్థిరపడ్డారు. తాను ఒక్కతే ఒంటరిగా ఊళ్లో ఉండేది. ఎప్పుడూ బిడ్డల గురించి ఆలోచిస్తూ, విచారంగా కాలం గడిపేది. పెద్ద కూతురి కుటుంబం గొడుగుల వ్యాపారం చేస్తుండగా, చిన్నమ్మాయి కుటుంబం అప్పడాల తయారీతో జీవనం సాగించేది. దాంతో ఎండగా ఉంటే 'అయ్యో.. ఈ ఎండల్లో గొడుగుల వ్యాపారం సాగదు. పిల్ల కుటుంబం పూట గడవక ఇబ్బంది పడుతోందేమో' అని బాధపడేది. అదే వానాకాలం రాగానే 'అయ్యో... ఈ వానల్లో అప్పడాలు ఎండవు. వాటిని అమ్మకపోతే చిన్నబిడ్డ సంసారం ఎలా గడుస్తుంది...' అని ఏడుస్తూ కూర్చునేది. ఇలా ఎప్పుడూ ఏదో ఒక సాకు చెప్పి ఏడ్చే ఆమెను ఓదార్చి ఓదార్చి గ్రామస్థులంతా విసిగిపోయారు. చివరికి పట్టించుకోవడమే మానేశారు.

ఇలా ఉండగా ఆ గ్రామానికి ఓ సాధువు వచ్చాడు. ఊరి వాళ్లంతా వెళ్తుంటే ఆ వృద్ధురాలు కూడా ఆయన దగ్గరకి వెళ్లి, తన బాధలు చెప్పుకొంది. సాధువు చిరునవ్వు నవ్వి.. 'తల్లీ! నీ బాధను నేను పరిష్కరిస్తా' అన్నాడు. ఆమె ఎంతో సంతోషంగా 'చెప్పండి స్వామీ. మీరేం చెబితే అదే చేస్తాను..' అంది. అప్పుడాయన 'నువ్వు వేసవిలో పెద్ద కూతురి గురించి అస్సలు ఆలోచించవద్దు. నీ చిన్న కూతురు అప్పడాలు ఆరబెడుతున్నట్లు, తయారైనవి అయినట్లు బాగా అమ్ముడు పోయి లాభాలు సంపాదిస్తున్నట్లు తలచుకో. అలాగే వర్షాకాలంలో చిన్న కుమార్తె ఊసెత్తవద్దు. పెద్దమ్మాయి గురించి మాత్రమే ఆలోచించు. 'వానలు బాగా పడుతున్నాయి. అందరూ గొడుగులు కొంటారు. మంచి లాభాలొస్తాయి. నా బిడ్డలిద్దరూ సంతోషంగా ఉన్నారు అనుకుని నువ్వు సంతోషంగా ఉండు' అని చెప్పాడు. సాధువు చెప్పిన సలహాను ఆ వృద్ధురాలు ఆచరణలో పెట్టింది. సంతోషాన్ని తిరిగి తెచ్చుకుంది. ఏ వ్యాపారమైనా ఒడుదొడుకులు లేకుండా ఉండదు. పైగా ఊళ్లో ఎక్కడో ఉండి ఆమె వారికి చేయగల సాయమూ లేదు. అటువంటప్పుడు ఆ వృద్ధురాలు బాధపడి ప్రయోజనమేంటి?

ఆమెలాగే నిత్యం ఏదో ఒక సమస్యకు సంబంధించిన ఆలోచనల్లో మునిగి తేలుతుంటారు చాలామంది. మన నియంత్రణలో లేని విషయాల గురించి ఆలోచించడం సమయాన్నీ శక్తినీ వృథా చేసుకోవడమే.

పీత కష్టాలు పీతవన్నట్లు ఎవరి కష్టాలు వారికి ఉంటాయి. అందుకే బుద్ధుడు.. 'నీ ఆనందం మరెవరిమీదో ఆధారపడి లేదు. ఎవరికి వారు ఆనందంగా ఉండటం తప్ప మరో మార్గమూ లేదు' అని అంటాడు.

– మధు

అగ్రరాజ్యంలోనే ఎక్కువ

మెరుగైన జీవనం, ఉద్యోగాల కోసం చాలా మంది విదేశాలకు వలసవెళ్తుంటారు. ముఖ్యంగా అమెరికా, ఇతర ఐరోపా దేశాలకు పెద్దసంఖ్యలో అలా తరలిపోతుంటారు. అయితే, మొత్తం వలసదారులతో పోలిస్తే ఒక్క అమెరికా మినహా ఆయా దేశాల్లోకి చట్ట విరుద్ధంగా ప్రవేశించిన వారు తక్కువగానే కనిపిస్తారు. మొత్తం ఇమిగ్రెంట్లలో అమెరికాలో అక్రమ వలసదారులు అత్యధికంగా 22శాతం ఉన్నారు. ఇటలీ, ఫ్రాన్స్‌లలో అలాంటి వారు మూడు శాతం. నెదర్లాండ్స్, పోలాండ్‌లలో వారు రెండు శాతమైతే- యూకేలో ఏడుశాతం. ఆయా దేశాల్లో అలాంటి వారి సంఖ్య... (లక్షల్లో)

దేశం	మొత్తం వలస దారులు	అక్రమంగా ఉంటున్న వారు
కెనడా	80	2.60
ఫ్రాన్స్	85	2.50
జర్మనీ	158	6.50
ఇటలీ	64	4.58
నెదర్లాండ్స్	24	0.40
పోలాండ్	8.17	0.19
స్పెయిన్	68	4.30
యూకే	94	6.74
అమెరికా	506	113

(ఆధారం: కీరన్స్, వర్గాస్-సిల్వ అధ్యయన నివేదిక-2024)

వీధికుక్కల బెడదకు

శాశ్వత పరిష్కారమేది?

వీధికుక్కల బెడద అంతకంతకూ పెరిగిపోతోంది. దేశవ్యాప్తంగా నిరుడు 37.17 లక్షలకుపైగా కుక్కకాటు కేసులు నమోదయ్యాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా ప్రకారం, మన దేశంలో రేబిస్ వల్ల ఏటా 20 వేల మంది వరకూ చనిపోతున్నారు. ఈ నేపథ్యంలోనే దిల్లీలోని వీధికుక్కలను సంరక్షణ కేంద్రాలకు తరలించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. కుక్కకాట్ల నివారణ, రేబిస్ నియంత్రణ విషయంలో ఇదో సానుకూల చర్యగా కనిపిస్తున్నా, ఆచరణలో ఎంతమేర సాధ్యమనేది ప్రశ్నార్థకం!

దేశ రాజధాని ప్రాంతంలో దాదాపు 10 లక్షలదాకా వీధికుక్కలు ఉన్నట్లు అంచనా. ప్రస్తుతమున్న వీధికుక్కల సంరక్షణ కేంద్రాలు, జంతు జనన నియంత్రణ (ఏబీసీ) కేంద్రాలు సుమారు నాలుగు వేలదాకా శునకాలకు మాత్రమే ఆశ్రయం కల్పించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అది కూడా కేవలం సంతానోత్పత్తి జరగకుండా శస్త్రచికిత్స (స్టెరిలైజేషన్) చేసేందుకు తాత్కాలిక ఆశ్రయం మాత్రమే. దేశంలో వీధి కుక్కలకు ఆశ్రయం కల్పించాలంటే, వందల ఎకరాల భూమి, వాటిలో నిర్మాణాలు అవసరమవుతాయి. మౌలిక సదుపాయాల కోసం వేల కోట్ల రూపాయల వ్యయం అవుతుంది. ఈ కేంద్రాల్లో సేవలు అందించేందుకు పశువైద్యులు, సిబ్బంది, సహాయకులు అవసరం. వీటిలో ఆశ్రయం కల్పించే శునకాలకు ఆహారం సమకూర్చాలి. వైద్య సేవలు అందించాలి. ఇందుకోసం ప్రతి నెలా కోట్లాది రూపాయలు వెచ్చించాల్సి వస్తుంది. ఈ క్రమంలో వీధికుక్కల సంరక్షణ కోసం సామూహిక కేంద్రాల ఏర్పాటు అనేది తాత్కాలిక పరిష్కారమే తప్ప, దీర్ఘకాలిక పరిష్కారమైతే కాబోదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

జనన నియంత్రణపై దృష్టి

మనదేశంలో 'జంతు జనన నియంత్రణ (ఏబీసీ) నిబంధనలు-2023' ప్రకారం సంతానోత్పత్తి జరగకుండా శస్త్రచికిత్స చేసిన శునకాలను తిరిగి వాటి పాత ఆవాస ప్రాంతాల్లోనే వదిలిపెట్టాలి. ఇది చట్టపరమైన నియమం మాత్రమే కాకుండా, ప్రజారోగ్య పరిరక్షణ పరంగానూ సరైన పద్ధతి. ఎందుకంటే, స్టెరిలైజేషన్ కోసం ఒక ప్రాంతంలోని కుక్కలను మరోచోటికి తరలిస్తే, అక్కడికి పొరుగు ప్రాంతాల నుంచి టీకాలు వేయని, స్టెరిలైజేషన్ చేయని, దూకుడుగా వ్యవహరించే కొత్త శునకాలు వచ్చి చేరతాయి. ఇది మరింత సమస్యాత్మకంగా మారుతుంది. పెద్ద సంఖ్యలో వీధి కుక్కలను తొలగించడం వల్ల టీకాలు వేసిన, స్టెరిలైజేషన్ చేసిన కుక్కల ద్వారా కలిగే రక్షణ కవచం తొలగిపోతుంది. దీంతో కొత్తగా రేబిస్ వ్యాపింపజేసే ప్రమాదమున్న కుక్కలు ఆ ప్రాంతంలోకి ప్రవేశించవచ్చు. ప్రజారోగ్యపరంగా ఇది మరింత విపత్తుకు దారితీయవచ్చు.



జంతువుల జనన నియంత్రణ ప్రక్రియను ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం సిఫార్సు చేసింది. ఇది అంతర్జాతీయంగా ఆమోదం పొందిన విధానం. అయితే, మనదేశంలో ఏబీసీ కార్యక్రమం సక్రమంగా అమలవ్వడంలేదన్న విమర్శలున్నాయి. ఆచరణ సాధ్యం కాని నిబంధనలు, అధికార యంత్రాంగం నిర్లక్ష్యం తదితర కారణాలతో సక్రమంగా ముందుకు సాగడం లేదు. ఈ కార్యక్రమానికి నోడల్ అథారిటీగా ఉన్న భారత జంతు సంక్షేమ బోర్డు (ఏడబ్ల్యూబీఐ) క్షేత్రస్థాయిలో కార్యాచరణను విస్మరించి, నోటీసులూ నిబంధనల జారీకే పరిమితమవుతోందనే ఆరోపణలున్నాయి. స్టెరిలైజేషన్, వ్యాక్సినేషన్ కార్యక్రమాలకు ఏడబ్ల్యూబీఐ నుంచి తగిన ప్రోత్సాహం దక్కడం లేదు. దీంతో చాలా నగరాల్లో ఏబీసీ సేవలు నిలిచిపోతున్నాయి. నిధుల కొరత వేధిస్తోంది. స్థానిక సంస్థల నుంచీ నిధుల విడుదల ఆలస్యమవుతోంది. కుక్కలను పట్టుకునే వ్యక్తులు, పశువైద్యులు, సహాయక సిబ్బంది వంటి మానవ వనరుల కల్పనలో ఉదాసీనత కనిపిస్తోంది. మరోవైపు, ఈ రంగంలో అనుభవం కలిగిన జంతు సంక్షేమ సంస్థల గుర్తింపును తరచూ రద్దు చేస్తుండటమూ సమస్యే. ఇటీవలి కాలంలో దేశవ్యాప్తంగా ఇలా మూడువేలకు పైగా సంస్థలు గుర్తింపు కోల్పోయాయి.

భాగస్వామ్యమే కీలకం

వీధి కుక్కల సామూహిక సంరక్షణ కేంద్రాల ఏర్పాటు అనేది నిర్వహణ, మానవ వనరులు, మౌలిక సౌకర్యాల కల్పన, ఆర్థికపరంగా భారంగా మారే అవకాశాలే అధికం. కాబట్టి, శునకాల సమస్యపై ఏడబ్ల్యూబీఐ క్షేత్రస్థాయిలో కార్యాచరణ దిశగా కదలాలి. నిర్ణయాత్మకంగా కృషి చేయాలి. జంతు సంక్షేమ రంగంలో సమర్థమైన, ఆసక్తి కలిగిన సంస్థలను గుర్తించి వాటి సేవలను పొందాలి. వీధికుక్కల సమస్యను పరిష్కరించే ప్రక్రియలో పౌర భాగస్వామ్యాన్నీ పెంపొందించాలి. శునకాల సంక్షేమం కోసం పోరాటమో, వీధికుక్కలను వ్యతిరేకించడమో అన్నట్లుగా కాకుండా... సమస్య పరిష్కారం దిశగా అడుగులు పడాలి. జంతువులపై క్రూరత్వాన్ని నిరోధించడంతోపాటు, ప్రజల ప్రాణరక్షణ, ప్రజారోగ్య పరిరక్షణ కూడా ముఖ్యమేనన్న సంగతిని గుర్తించాలి. అవసరమైన నిధులు, సిబ్బందిని సమకూర్చడం ద్వారా ఏబీసీ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. ఆచరణలో లోపాలను సరిదిద్దుతూ, సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో నిర్మాణాత్మకంగా కృషి చేయాలి. ప్రభుత్వ అధికార యంత్రాంగం, పౌర భాగస్వామ్యంతోనే ఇది విజయం సాధిస్తుంది.

– డాక్టర్ కర్నాటి శ్రీనివాసులు
వ్యవస్థాపకులు, యానిమల్ వెల్ఫేర్ సొసైటీ, హైదరాబాద్

నాన్నే కోచ్..!





హాయ్ ఫ్రెండ్స్..! చెస్‌లో అనేక రికార్డులు సాధించిన వాళ్లను ఇప్పటి వరకు చాలామందిని చూసే ఉంటాం కదా! మనం చెప్పుకోబోయే నేస్తం కూడా అలాంటి ప్రతిభావంతురాలే. ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ ప్రత్యర్థులను ఓడిస్తున్న.. తనెవరో తెలుసుకుందామా మరి!

దిల్లీకి చెందిన ఆరిణి లహోటీకి అయిదున్నరేళ్లు. నాన్న సురేందర్ స్పోర్ట్స్ కోచ్. ఆరిణికి చిన్నప్పటి నుంచే వాళ్ల నాన్న ఆన్‌లైన్‌లో చెస్ తరగతులు చెబుతుంటే వినడం అలవాటు. దాంతో తనకూ చదరంగం మీద ఆసక్తి కలిగిందట. రెండేళ్ల వయసులో ఉన్నప్పుడే దిగ్గజ ఆటగాడు మాగ్నస్ కార్ల్‌సన్ ఆటను టీవీలో చూసి చెస్ నేర్చుకోవాలనుకుందట. అమ్మానాన్నలను గుర్తుపట్టడం తప్ప.. పెద్దగా ఏమీ తెలియని వయసులో ఆట మీద ఇష్టాన్ని పెంచుకుందంటే ఆశ్చర్యంగా ఉంది కదూ! కానీ ఇది నిజమే. తన ఆసక్తిని చూసి తల్లిదండ్రులూ ప్రోత్సహించారు. అలా వాళ్ల నాన్న దగ్గరే మెల్లగా శిక్షణ తీసుకోవడం మొదలుపెట్టింది. ప్రస్తుతం తను భారతదేశంలోనే చిన్న వయసులో 1551 ఫిడే రేటింగ్ సాధించిన చెస్ క్రీడాకారిణిగా నిలిచింది. అంతే కాకుండా అండర్-7, 9, 11 విభాగాలలో పోటీపడి చాలా అవార్డులూ అందుకుంది. 'నాకు చెస్ ఆటగాళ్లలో మా నాన్న అంటేనే ఇష్టం. చెస్ ఆడేటప్పుడు తెలుపు రంగు పావులతో ఆడటానికే ఎక్కువ ఇష్టపడతాను. ఎందుకంటే.. ఫస్ట్ మూవ్ ఆ పావులతోనే మొదలవుతుంది కదా!' అంటూ నవ్వేస్తుంది ఆరిణి. తనకు చెస్‌తో పాటు స్విమ్మింగ్, పజిల్స్ సాల్వ్ చేయడం అంటే కూడా చాలా ఇష్టమట. భవిష్యత్తులో యంగెస్ట్ ఇంటర్నేషనల్ మాస్టర్, గ్రాండ్ మాస్టర్ అవ్వడమే తన లక్ష్యమట. ★

హాయ్! బుజ్జీ!!

పదాలేవి?

ఇక్కడ కొన్ని పదాలు అసంపూర్తిగా ఉన్నాయి. మొదటిపదం చివరి అక్షరాలతోనే రెండోది ప్రారంభమవుతుంది. ఆ పదాలేంటో రాయండి చూద్దాం.

1. SQUA ☐☐ PORT
2. SO ☐☐☐ ER
3. CLO ☐☐ ARCH
4. LO ☐☐ ORE
5. PROB ☐☐☐ ON
6. EQU ☐☐ MOST

జవాబు: 1.SQUARE, REPORT 2.SOUND, UNDER 3.CLOSE, SEARCH 4.LOST, STORE 5.PROBLEM, LEMON 6.EQUAL, ALMOST



గట్టు జారుతోంది.. పట్టించుకోండి..

ప్రకాశం బ్యారేజీ నుంచి తాగు, సాగు నీరు విడుదలయ్యే తూర్పు ప్రధాన కాలువ ప్రవహించే మార్గంలో కెనాల్ రోడ్డు నుంచి కాళేశ్వరరావు మార్కెట్ వరకు కాలువగట్టు అంచుల వద్ద రిటైనింగ్ వాల్ బలహీనపడి చాలాచోట్ల కూలిపోయింది. కొన్నిచోట్ల తాత్కాలిక మరమ్మతులు చేపట్టి వదిలేశారు. గత నెల రోజుల నుంచి హోల్‌సేల్ పూలమార్కెట్ వంతెన పక్కన ఉన్న రిటైనింగ్ వాల్ కొద్దికొద్దిగా కుంగిపోయి నదిలో కొట్టుకుపోతోంది. గోడ అంచులు బీటలు వారి పెచ్చులు వేలాడుతున్నాయి. ప్రమాదం పొంచి ఉన్నా అధికారులెవరూ గత నెల రోజుల నుంచి గుర్తించకపోవడం గమనార్హం. అసలే వర్షాకాలం, కాలువలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఏమాత్రం గట్లు జారి కాల్వ వైపు ఒరిగినా కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. అధికారులు వెంటనే చర్యలు తీసుకోకపోతే ప్రాణాపాయం పొంచి ఉంటుంది. -ఈనాడు, అమరావతి



గుడ్లవల్లేరు: ప్రతి మహిళా తప్పనిసరిగా క్యాన్సర్ స్క్రీనింగ్ చేయించుకుని తొలి దశలోనే గుర్తించి చికిత్స పొందితే విజయం సాధించవచ్చని మిస్‌వరల్డ్ 2025 ఓపల్ సుచాత పేర్కొన్నారు. మెయిల్ ఫౌండేషన్, సుధారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్, తొలిదశ గుర్తింపు సేవలను ఆమె ప్రారంభించారు.

పోటెత్తిన కృష్ణమ్మ



కృష్ణా కెనాల్ రైలు వంతెన వద్ద మంగళవారం రాత్రి 11.45 గంటలకు వరద

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కృష్ణా నది మరోసారి ఉగ్రరూపం దాల్చింది. ఇప్పటికే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయడం.. ప్రవాహం 4.92లక్షల క్యూసెక్కులకు చేరడంతో జలవనరుల శాఖ అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ముందస్తు సమాచారంతో సిద్ధంగా ఉంటూ.. 69 గేట్లను ఎత్తివేసి నీటిని విడుదల చేస్తున్నారు. పులిచింతల (వజినేపల్లి) నుంచి 3,86,770, పాలేరు నుంచి 5,625, కీసర (మునేరు) నుంచి 17,590 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. కొండవీటి వాగు నుంచి 1,400 క్యూసెక్కుల వరకు వస్తోంది. బుడమేరు నుంచి ప్రవాహం లేదు. కృష్ణా డెల్టాలోని పంట కాల్వలకు 4,245 క్యూసెక్కులు ఇస్తున్నారు. తూర్పు ప్రధాన కాలువకు (కేఈ) 3,829, కృష్ణా పశ్చిమ కాలువకు(కేడబ్ల్యూ) 516 క్యూసెక్కులు విడుదల చేశారు.

మంగళవారం వరద ప్రవాహం (క్యూసెక్కుల్లో)

సమయం	రాక	పోక
ఉదయం 6	3,25,837	3,22,000
ఉదయం 11	4,01,087	3,97,250
మధ్యాహ్నం 3	4,36,876	4,32,837
సాయంత్రం 6	4,66,805	4,62,560
రాత్రి 8	4,85,539	4,81,194
రాత్రి 11 గంటలు	4,92,357	4,87,508

ఈ సీజన్‌లో 281.59 టీఎంసీలు

కృష్ణా నది ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరడంతో.. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 281.59 టీఎంసీల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. ఈ నెల 13వ తేదీ రాత్రి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసిన విషయం తెలిసిందే. తర్వాత క్రమేణ తగ్గడంతో 15వ తేదీ హెచ్చరికను ఉపసంహరించారు. ఆరు రోజుల వ్యవధిలోనే వరద మళ్లీ పోటెత్తడంతో మరోసారి మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేయాల్సి వచ్చింది. సముద్రంలోకి వెళ్లే ప్రవాహం 5.69 లక్షల క్యూసెక్కులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తున్న క్రమంలో.. రానున్న రోజుల్లో కృష్ణా నదిలో వరద మరింత పెరిగే ప్రమాదం ఉందని అంచనా వేస్తున్నారు.

ముందు జాగ్రత్తగా బోట్లు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: బుడమేరు పొంగుతుందని వదంతులు నమ్మవద్దని, ఆ ప్రచారంలో నిజం లేదని, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగానే అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతంలో ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు, బోట్లు సిద్ధం చేసి ఉంచామని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. అక్కడ బోట్లు చూసి బుడమేరు పొంగుతోందంటూ కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వాస్తవానికి బుడమేరులో ప్రవాహం సాధారణ స్థితిలోనే ఉందని, ఎటువంటి ప్రమాదం లేదన్న విషయాన్ని ప్రజలు గ్రహించాలని కోరారు. రానున్న రెండు, మూడు రోజుల్లో భారీ, అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలతో పడవలు సిద్ధం చేశామని తెలిపారు. బుడమేరులో వెలగలేరు వద్ద నీటిమట్టం మంగళవారం రాత్రి కూడా సాధారణ స్థితిలోనే ఉందని, నీటిని దిగువకు విడుదల చేయడం లేదని వెల్లడించారు. ప్రజలు ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు.

ప్రజారోగ్యానికి.. నిల్వపాతర!

★ నాసి, నిల్వ ఆహార పదార్థాల విక్రయాలు
★ బేకరీలు, హోటళ్ల నిర్వాహకుల అడ్డగోలు

ఈనాడు, అమరావతి

☛ సత్యనారాయణపురంలో యూఎస్ బేకరీలో పదార్థాల తయారీకి ఇష్టారీతిన రంగులు వాడుతున్నారు. చాలా కాలం కిందట చేసిన.. తేదీ లేని బ్రెడ్లు, ఇతర పదార్థాలు శీతల యంత్రాల్లో పెట్టి అమ్ముతున్నారు. పాడైన పదార్థాలనూ అందులోనే ఉంచారు. బేకరీలో మాంసాహార పదార్థాలకు అనుమతి లేకున్నా.. వారం కిందటి చికెన్ దొరికింది. అసలు అనుమతులే లేని ఇక్కడ ప్రజల ఆరోగ్యానికి నిలువునా పాతరేస్తున్నారు.

☛ గురునానక్ నగర్‌లో ఆంజనేయ రెస్టారెంట్‌లో మూడు రోజుల కిందట చికెన్, మటన్ తదితర మాంసాహార వంటకాలు నిల్వ చేశారు. వాటినే విక్రయిస్తున్నారు. శీతల యంత్రంలో మూడు రోజుల కిందట వండిన అన్నం కూడా భద్రపరిచారు.

☛ చాలా దుకాణాల్లో ఎలక్ట్రానిక్ కాటాలతో మాయచేసి కిలోకు 50-100 గ్రాములు దోచేస్తున్నారు. శీతల పానీయాలు, ఐస్‌క్రీములు, తాగునీటి సీసాలపై ఎమ్మార్పీ కంటే రూ.5 అదనంగా బాదేస్తున్నారు. తూకాల్లో తేడాలు, ప్యాకెట్ల మీద వినియోగదారుల సంరక్షణ నంబర్లు లేవు. అధిక ధరలకు అమ్మకం, అనధికారిక కాటాల వాడకం గుర్తించిన అధికారులు మొత్తం 26 కేసులు నమోదు చేశారు.



కుళ్లిన మాంసం, బ్రెడ్



శీతల యంత్రాల్లో రోజులుగా నిల్వ ఉంచిన మాంసాహారం

ఆహారం కల్తీ అయినట్లు ఎవరైనా సమాచారం ఇవ్వాలనుకుంటే..
రాష్ట్రస్థాయి సహాయ కేంద్రం ఫోన్ నంబరు: 08645-297245

పది రోజుల కిందట వండి.. శీతల యంత్రాల్లో నిల్వ చేసిన ఆహారం అమ్మడం.. తేదీలు, ధరలు లేకుండా అడ్డగోలు వ్యవహారాలు.. నిబంధనలు గాలికొదిలి రంగులు వేసి వండిన వంటకాలు.. వెరసి ఉమ్మడి జిల్లాలో ఆహార అమ్మకందారులు ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఎమ్మార్పీలతో ప్రమేయం లేకుండా అక్రమ తూకాలతో దుకాణదారులూ వినియోగదారులను అడ్డగోలుగా దోచేస్తున్నారు. ఆహార భద్రత, తూనికలు కొలతల శాఖ అధికారుల సంయుక్త తనిఖీలు చేయగా విస్తుపోయే దారుణాలు వెలుగు చూస్తున్నాయి.

అడుగడుగునా ఉల్లంఘనులే...

ఆహార భద్రత, తూనికల కొలతల అధికారులు సంయుక్తంగా 40 బృందాలుగా ఏర్పడి... హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, స్వీట్ దుకాణాలు తదితర 40 ఆహార విక్రయ కేంద్రాల్లో తనిఖీలు చేశారు. పదుల సంఖ్యలో దుకాణాల్లోనూ సోదాలు చేశారు. దాదాపు ఏ దుకాణమూ నిబంధనలు పాటించడం లేదు. అపరిశుభ్రత నడుమ పదార్థాల తయారీ, నిల్వ చేసిన ఆహార విక్రయాలు, విపరీతంగా రంగుల వినియోగం, కాటాలు రెన్యువల్ చేయించకుండా వాడకం, అధిక ధరల విక్రయాలు, గడువు తేదీలు ముద్రించకుండా అమ్మకాలు... ఇలా ఉల్లంఘనలే దర్శనమిచ్చాయి. ఆహార భద్రత అధికారులు తనిఖీ చేసిన 40 దుకాణాల్లో 39 నమూనాలు సేకరించి పరీక్షలకు పంపారు. 26 మందికి నోటీసులు ఇచ్చారు. 100 కిలోల నిల్వ ఉన్న మాంసం, ఇతర బేకరీ పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు.

మొక్కుబడి తనిఖీలతోనే ఇదంతా..

ఆహార భద్రత, తూనికల కొలతల శాఖల్లో సిబ్బంది లేమితో తనిఖీలు పడకేశాయి. ఉన్నవారితో అరకొర తనిఖీలు, వినియోగదారులు స్పందన, ఇతర మార్గాల్లో ఫిర్యాదు చేస్తేగానీ కదలడం లేదు. దీంతో దుకాణదారులు, అమ్మకందారులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. నగరం మొదలు ఉమ్మడి జిల్లాలో అనుమతుల్లేని దుకాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. తోపుడుబండ్ల నుంచి పెద్ద రెస్టారెంట్ల వరకు అన్నింటా అడ్డగోలే. నిత్యం తనిఖీలు, కఠిన చర్యలతోనే పరిస్థితి మెరుగయ్యేది.

కట్లేరు వద్ద రాకపోకలు బంద్

గంపలగూడెం, న్యూస్‌టుడే: కట్లేరులో వరద ప్రవాహం మళ్లీ పెరిగింది. సోమవారం రాత్రి తిరువూరు, గంపలగూడెం మండలాలతో పాటు ఎగువున ఖమ్మం జిల్లా గ్రామాల పరిధిలో కురిసిన వర్షాలకు వరద నీరు చేరింది. మంగళవారం ఉదయం నుంచి వినగడప వంతెన వద్ద ప్రవాహం ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. భారీ వర్షాలతో కట్లేరు వంతెనపై ఇప్పటికే ఆరు రోజులుగా రాకపోకలు నిలిచిపోయాయి. కట్లేరులో మళ్లీ వరద చేరడం, మల్లింపు రోడ్డుపై ప్రవాహం పెరగడంతో మరో నాలుగైదు రోజుల వరకు రాకపోకలపై ఆశలు సన్నగిల్లాయి. మల్లింపు రహదారి వద్ద బండ రాళ్లతో పాటు నీటి పారుదలకు వేసిన సిమెంట్ పైపులు కూడా వరదలో కొట్టుకుపోయాయి. మండల కేంద్రమైన గంపలగూడేనికి ఏటి అవతలి గ్రామాలకు చెందిన కొత్తపల్లి, వినగడప, తండా, నారికింపాడు, అనుమ్ముల్లంక, కనుమూరు గ్రామాల ప్రజలు అత్యవసర పనుల కోసం రావాలంటే 50 కి.మీ వరకు ప్రయాణించాల్సి వస్తోంది. కొత్తపల్లి, వినగడప నుంచి కాలినడకన 15 నిమిషాల వ్యవధిలో చేరుకునే తోటమూలకు ద్విచక్ర వాహనంపై గంటన్నరకు చేరుకుంటున్నారు.



వంతెన వద్ద రహదారిపై ప్రవహిస్తున్న వరద

మద్యం కేసులో పిటిషన్లపై విచారణ వాయిదా

ఈనాడు - అమరావతి: వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డికి కారాగారంలో కల్పించిన ప్రత్యేక వసతులపై జైలు అధికారులు వేసిన రివిజన్ పిటిషన్‌పై విచారణ ఈనెల 26వ తేదీకి వాయిదా పడింది. గతంలో కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవరించాలనీ, తాము జైలు నిబంధనల మేరకే సౌకర్యాలు కల్పిస్తామని రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం అధికారులు విజయవాడ ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఇది మంగళవారం విచారణకు వచ్చింది. కౌంటర్ దాఖలు చేయాలని నిందితుడి తరఫు న్యాయవాదులను ఆదేశిస్తూ ఈనెల 26వ తేదీకి వాయిదా వేశారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌పై తదుపరి వాదనల నిమిత్తం 21వ తేదీకి వాయిదా పడింది. మరో నిందితుడు పైలా దిలీప్ బెయిల్ పిటిషన్‌పై విచారణ బుధవారానికి వాయిదా వేశారు. బయట నుంచి ప్రస్తుతం అనుమతించిన విధంగా ఒక పూట కాకుండా రెండు పూటలా భోజనం ఇచ్చేలా ఉత్తర్వులు జారీ చేయాలని మిథున్‌రెడ్డి పిటిషన్‌ను సాంకేతిక కారణాలతో న్యాయాధికారి తిరస్కరించారు. తిరిగి బుధవారం దాఖలు చేసే అవకాశం ఉంది.

అడ్డంగా తవ్వేసి.. ఆపై వదిలేసి..!

నగరపాలిక నిర్లక్ష్యంతో దుర్గా ఘాట్‌లో ప్రమాదకరం

ఈనాడు, అమరావతి

'కుమ్మరిపాలెం సమీపంలో కృష్ణా నది పక్కన ఉన్న హెడ్‌వాటర్ వర్క్స్ వద్ద నుంచి కృష్ణలంక ప్రాంతానికి రెండు నెలల కిందట విజయవాడ నగరపాలిక ఆధ్వర్యంలో 5 ఎంజీడీ పైప్ లైన్ పనులు ఆరంభించారు. పైప్‌లైన్ వేసేందుకు లోతుగా గుంతలు తవ్వారు. నెల కిందట దుర్గాఘాట్ వద్ద పెద్దపెద్ద యంత్రాలతో తవ్వకాలు చేపట్టారు. అప్పటినుంచి ఆ గుంతలు వదిలేశారు. నిత్యం వేల మంది భక్తులొచ్చే ఘాట్‌లో గుంతలు, ఇనుప చువ్వలు పైకి తేలి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది.'

అమ్మవారి దర్శనానికి వచ్చే వేల మంది భక్తులు స్నానాలు ఆచరించే దుర్గాఘాట్ వంటి ప్రాంతాల్లో.. కేవలం రోజుల వ్యవధిలో ఇలాంటి తవ్వకాలు, పనులు చకచకా పూర్తిచేయాలి. ఈ ఘాట్ ప్రదేశం మొత్తం వంద మీటర్లు కూడా ఉండదు. అలాంటిది.. నెల రోజులుగా అలాగే తవ్వి వదిలేయడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. తాజాగా వీటి చుట్టూ బారికేడ్లు పెట్టి.. వాటి మధ్యలోని ఖాళీల్లో టేపు చుట్టి వదిలేశారు. రాత్రుళ్లు భక్తులు చూసుకోకుండా ఇటుగా వస్తే.. ప్రమాదాలకు గురవుతారు.



భక్తులు స్నానాలకు వెళ్లే మార్గంలో తవ్వేశారిలా..

కిలోమీటర్ పనులకు సాగదీత..

ప్రకాశం బ్యారేజీ దిగువన సీతమ్మవారి పాదాలు ప్రాంతంలో గతంలో ఉండే 4 ఎంజీడీ నీటిని సరఫరా చేసే పంపింగ్ మెయిన్ ఉండేది. నదిలో నుంచి నీటిని బోర్ల ద్వారా తీసి.. అక్కడి నుంచి నీటిని దిగువన ఉన్న కృష్ణలంక ప్రాంతానికి సరఫరా చేసేవాళ్లు. దానిని చాలాకాలం కిందట మూసేశారు. దీంతో నగరపాలిక ఆధ్వర్యంలో కొంతవరకూ ట్యాంకర్లు, బోర్లతో నీటిని సరఫరా చేస్తున్నా.. అవి చాలడం లేదు. దీంతో కృష్ణలంక, భ్రమరాంబపురం సహా చాలా ప్రాంతాలకు నీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీని పరిష్కారం కోసమే.. 5 ఎంజీడీ పైప్‌లైన్‌ను వేస్తున్నారు. హెడ్‌వాటర్ వర్క్స్ నుంచి సీతమ్మవారి పాదాల వద్దకు ఒక కిలోమీటర్ దూరం ఉంటుంది. ఈ దూరానికే నెలలుగా పైప్‌లైన్ పనులను సాగదీయడమేంటో అధికారులకే తెలియాలి.

దసరా వస్తున్న వేళ త్వరపడాలి..

దుర్గగుడి దసరా వేడుకలు సమీపిస్తున్నాయి. దుర్గాఘాట్‌లో దేవస్థానం ఆధ్వర్యంలోని మరుగుదొడ్లు, మూత్రశాలలు.. ప్రస్తుతం తవ్వేసిన పైప్‌లైన్ గుంతలకు సమీపంలోనే ఉన్నాయి. క్లోక్‌రూం, సమాచార కేంద్రం, చెప్పుల స్టాండు, దుస్తులు మార్చుకునే గదులకు కూడా షెడ్లు వేశారు. పైప్‌లైన్ పనులు ఎంత త్వరగా పూర్తిచేస్తే.. ఘాట్‌లో ఆలయం ఆధ్వర్యంలో సౌకర్యాల కల్పనకు అంత వీలుంటుంది. దుర్గాఘాట్ నుంచి కె.ఎల్.రావు విగ్రహం వరకూ పైప్‌లైన్ పనులు త్వరగా పూర్తిచేస్తేనే.. దసరా ఏర్పాట్లకు ఆటంకం ఉండదు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తు చేసుకోండి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : వచ్చే నెల 5న జరిగే గురు పూజోత్సవం నాడు అందించే జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు అర్హులైన అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కనీసం పదేళ్ల సర్వీస్ ఉన్న వారే అర్హులని, నేరారోపణలు, అభియోగాలు ఉన్న వారు అనర్హులని పేర్కొన్నారు. సివిల్, క్రిమినల్ కేసులు లేవని తనిఖీ అధికారుల ధ్రువీకరణ పత్రాన్ని దరఖాస్తుకు జత చేయాలని సూచించారు. గతంలో జిల్లా స్థాయి ఉత్తమ అవార్డులు పొందని వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మండల, ఉప విద్యాశాఖ, ఉప తనిఖీ, ఉర్దూ రేంజ్ అధికారుల కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని, వాటిని ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు విజయవాడలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి పంపించాలని కోరారు.

అన్న క్యాంటీన్ వల్లే ఆకలి తీరుతోంది

మంత్రి సవిత వద్ద నిరుపేదల హర్షం



భోజనం నాణ్యత గురించి తెలుసుకుంటున్న మంత్రి

కృష్ణలంక, న్యూస్‌టుడే: 'అన్న క్యాంటీన్‌లో భోజనం ఇంట్లో వండుకున్నట్లు రుచిగా ఉంటోంది. కూలి పనులు చేసుకునే మాలాంటి వాళ్లకి ఎంతో ప్రయోజనం కలుగుతోంది. రూ.5కే కడుపు నిండా భోజనం చేస్తున్నాం' అంటూ వినియోగదారులు కొందరు మంత్రి సవితకు వివరించారు. మంత్రి మంగళవారం కృష్ణలంక బాలాజీనగర్‌లోని అన్న క్యాంటీన్‌ని సందర్శించారు. వరుసలో నిల్చొని టోకెన్ కొని భోజనం చేశారు. తనతో పాటు భోజనం చేస్తున్న వారితో మాట్లాడి ఆహార పదార్థాల నాణ్యతపై ఆరా తీశారు. అన్న క్యాంటీన్ వల్లే తమ ఆకలి తీరుతోందని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రి లోకేశ్‌లకు ధన్యవాదాలు తెలియజేశారు. తల్లికి వందనం, ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం తదితర పథకాల గురించి అడిగారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల డబ్బులు మిగులుతున్నాయని, వాటితో కుటుంబ అవసరాలు తీరుతాయని మహిళలు మంత్రికి వివరించారు. కూటమి ప్రభుత్వ పాలన పట్ల ప్రజల నుంచి వచ్చిన సానుకూల స్పందనపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. క్యాంటీన్ పరిసరాలను, పాత్రలు శుభ్రం చేసే గదిని పరిశీలించారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



వినరంతే.. మారరింతే!

విచ్చలవిడిగా బ్లాక్ ఫిల్మ్‌లు, సైరన్ల వినియోగం

ఈనాడు, అమరావతి

'నిబంధనలకు విరుద్ధంగా నల్ల ఫిల్మ్‌లు అంటించిన గ్లాస్‌లతో నగరంలో వాహనాలు తిరుగుతున్నాయి. అడపాదడపా మాత్రమే పోలీసులు తనిఖీలు చేపట్టి చేతులు దులుపుకొంటున్నారు. కళ్ల ముందే తిరుగుతున్నా వాటిని ఆపడం లేదు. అసలు కారులో ఎవరు ఉన్నారో కూడా కనిపించనంతగా ఫిల్మ్‌లను అతికిస్తున్నారు. దీంతో నేరాలు చేసి, సులువుగా తప్పించుకునే ప్రమాదం ఉంది. సైరన్లు కూడా విచ్చలవిడిగా వాడుతున్నారు. నగర దారులపై విచ్చలవిడిగా సైరన్లు మోగిస్తూ కార్లు తిరుగుతున్నా ట్రాఫిక్ పోలీసులు కనీసం నిలువరించడం లేదు. ఈ సంస్కృతి ఇటీవల బాగా పెచ్చుమీరింది.'

అరకొర తనిఖీలతోనే సరి: ఇటీవల కొన్నాళ్లు ట్రాఫిక్ పోలీసులు నల్ల ఫిల్మ్‌ల పై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఆ తర్వాత తనిఖీలను వదిలేశారు. దీంతో బ్లాక్ ఫిల్మ్‌ల గ్లాస్‌లతో వాహనాలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి జులై వరకు 3,217 కేసులు నమోదు చేశారు. ఉల్లంఘనులకు రూ.1.04 లక్షల జరిమానా విధించారు. ఒక్కొక్కరికి రూ.500-1,000 వరకు విధిస్తున్నారు. తిరిగి ఇదే ఉల్లంఘనకు పాల్పడితే వాహనాన్ని సీజ్ చేయొచ్చు. వాహనాల లోపల భాగం కనిపించకుండా ఉండేందుకు ఉపయోగిస్తున్న అన్ని రకాల ఫిల్మ్‌లపై నిషేధం ఉంది. వాహనాల తయారీ సమయంలో వాడిన గ్లాస్‌నే వినియోగించాల్సి ఉంది.



విజయవాడలో నల్లఫిల్మ్ గ్లాస్‌తో కారు

వీఐపీలకే మినహాయింపు ఉన్నా...

కేంద్ర మోటారు వాహన నిబంధనల ప్రకారం ముందు గ్లాస్ 70 శాతం విజిబిలిటీ ఉండాలి. సైడు గ్లాసులు 50 శాతం విజిబిలిటీ ఉండాలి. ముఖ్యంగా సైడు గ్లాసులు పూర్తిగా నల్ల ఫిల్మ్‌లను అతికిస్తున్నారు. వెరసి మహిళలపై దాడులు, అపహరణలు, పలు చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉంది. వీటి వినియోగంపై కొందరికే అనుమతి ఉంది. జడ్, జడ్ ప్లస్, ప్రముఖులు, భద్రతా కారణాల దృష్ట్యా వీఐపీలకు మాత్రమే అనుమతిస్తారు.

రద్దీ దారులపై సైరన్లతో హడావుడి: ప్రధాన కూడళ్లలో రద్దీ వేళల్లో వాహనాలు బారులు తీరినా.. కొందరు వాహనాల్లో సైరన్లు మోగిస్తూ హడావుడి చేస్తున్నారు. ట్రాఫిక్ క్లియరెన్స్ కోసం, తమ దర్పాన్ని ప్రదర్శిస్తున్నారు. అక్కడ విధుల్లోని ట్రాఫిక్ పోలీసులు.. కనీసం ఆపే ప్రయత్నం చేయడం లేదు. వెరసి మరింతగా ఈ సంస్కృతి విస్తరిస్తోంది. ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ల ఛైర్మన్లు, చోటా నాయకులూ నిబంధనలకు విరుద్ధంగా వీటిని వాడుతున్నారు. అత్యంత వేగంతో సైరన్ మోగిస్తూ వెళ్తున్నారు. సైరన్లను కేవలం అత్యవసర విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్లు మాత్రమే వాడేందుకు అనుమతి ఉంటుంది. నిబంధనల ప్రకారం ఇతరులు వాడకూడదు. అయినా ఇష్టానుసారం వాడేస్తున్నారు.

నైపుణ్యాల మెరుగుకు ప్రత్యేక శిక్షణ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : విద్యార్థుల్లో నైపుణ్యాలు మెరుగు పరుచుకోవడానికి, సరికొత్త సృజనాత్మక ఆలోచనలతో ప్రాజెక్టుల రూపకల్పనకు హెచ్.సి.ఎల్. సంస్థ చేపట్టిన 'రైజ్ ఫర్ యూ' కార్యక్రమం దోహదపడుతుందని కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంస్థ నిర్వహించే 40 రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇంజినీరింగ్, డిగ్రీ, పీజీ ఆఖరి సంవత్సర విద్యార్థులు అర్హులన్నారు. రిజిస్ట్రేషన్ కోసం కలెక్టరేట్ ఆవరణలోని ఎన్టీఆర్ వికాస కార్యాలయం (ఫోన్ : 98494 65427)లో సంప్రదించాలని సూచించారు. హెచ్.సి.ఎల్. సంస్థ రీజనల్ హెడ్ డి.వినోద్ (చెన్నై) నగరంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మంగళవారం కలిశారు. ఈ నెల 12న కలెక్టరేట్‌లో వికాస నేతృత్వంలో నిర్వహించిన ఉద్యోగ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను కలెక్టర్ అందజేశారు. వికాస పీడీ కె.లచ్చారావు, మేనేజర్ వంశీ తదితరులు పాల్గొన్నారు.



యువతకు నియామక పత్రాలు అందజేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, వికాస పీడీ లచ్చారావు తదితరులు



చక్కదిద్దుకుంటేనే నందనవనం

వరుస వానలతో నగరంలోని పలు పాత భవన సముదాయాల్లో ప్రహరీలు కూలిపోతున్నాయి. స్లాబుల పెచ్చులూ డుతున్నాయి. భవన సముదాయం చుట్టూ పైపుల మధ్యలో రావి, మర్రి చెట్లు పెరగడం, గోడలన్నీ నాచుతో పరుచుకోవడం, బీటలు వారడం వంటి అనేక సమస్యలు తలెత్తుతుంటాయి. 30ఏళ్లకు పైబడిన అపార్ట్‌మెంట్లలో ఈ సమస్యలు అధికంగా కనిపిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఐదేళ్లకోసారి నిర్వహణ చేసుకుంటేనే ఆ సముదాయం నందనవనంగా ఉంటుందని సూచిస్తున్నారు.

ఈనాడు, హైదరాబాద్


ఐదేళ్లకోసారి అపార్ట్‌మెంట్ల నిర్వహణ తప్పనిసరి

సర్వేలతో వెలుగులోకి..

నగరంలో 1975-1980 నుంచి అపార్ట్‌మెంట్ల సంస్కృతి మొదలైంది. దేశంలోని పలు నిర్మాణ సంస్థలు, మొబైల్ యాప్‌లు, బిల్డింగ్ రీసర్చ్ ఎస్టాబ్లిష్‌మెంట్ (యూకే), హెచ్‌యూడీ అమెరికన్ హౌసింగ్ సర్వే (యూఎస్), నేషనల్ అసోసియేషన్ ఆఫ్ హోమ్ బిల్డర్స్ (ఎన్ఏహెచ్‌బీ) వంటి సంస్థల సర్వేల్లో 30, 40 ఏళ్ల నాటి అపార్ట్‌మెంట్లలోని పరిస్థితులు, ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి.

వైరింగ్ విషయంలో..

ప్రస్తుత అవసరాలకు ఏమాత్రం సరిపోని అల్యూమినియం, ఇతరత్రా వైరింగ్‌లను పూర్తిగా తొలగించాల్సిందే. అపార్ట్‌మెంట్ మొత్తానికి నూతన వైరింగ్ వ్యవస్థను, ప్యానెల్‌బోర్డులను ఏర్పాటు చేసుకోవాలి. ఈ ప్రక్రియను ప్రతి 10-15ఏళ్లకోసారి పునరావృతం చేస్తే ఇళ్లలో విద్యుదాఘాతం వంటి సమస్యలు తగ్గుతాయి.



లీకేజీలను సహించొద్దు..

ఓ అధ్యయనం ప్రకారం.. 20ఏళ్లకు మించిన 35-60 శాతం అపార్ట్‌మెంట్లలో లీకేజీలు సాధారణం. పైకప్పుపై వాలు సరిగా లేకపోవడం, లీకేజీలు సరి చేయకుండా మిద్దెపై తోటలు పెంచడం, ట్యాంకులకు సున్నం వేయక పోవడం, గోడలపై పగుళ్ల వంటి సమస్యలతో స్లాబులు, గోడల్లో నీటి లీకేజీలు తలెత్తుతున్నాయి.

లిఫ్టులనూ మార్చాల్సిందే

కొంతకాలంగా నగరంలో లిఫ్టు ప్రమాదాలు పెరుగుతున్నాయి. ఇవన్నీ దాదాపు పాత కాలానివే. రోడ్డుపై ప్రవహించే వరద సెల్లారులోకి వస్తున్నట్లయితే.. లిఫ్టు, ప్యానెల్‌బోర్డులు, నీటి మోటారుకు ప్రత్యేక ఏర్పాట్లు తప్పనిసరి.

కీటకాలు..

కొత్త అపార్ట్‌మెంట్లతో పోలిస్తే.. బొద్దింకలు, పురుగులు, చెదలు వంటి సమస్యలు పాత అపార్ట్‌మెంట్లలో రెండింతలు అధికంగా ఉంటాయి.

పైపులైన్లు ఆధునికీకరించాలి

పాత కాలం అపార్ట్‌మెంట్లలో బంకమట్టి, సిమెంటు పైపులతో మురుగునీటి వ్యవస్థలు ఉన్నాయి. వాటి జీవితకాలం 20-30ఏళ్లు. అంతకుమించితే.. పైపుల్లోని వ్యర్థాలు క్రమంగా మురుగు ప్రవాహానికి అడ్డుపడుతాయి. తాగునీటి పైపులైన్లలోనూ అదే పరిస్థితి. ప్రతి 20ఏళ్లకోసారి పైపులైను పూర్తిగా మార్చాలి.

1980లో మారిన ట్రెండ్..: హిమాయత్‌నగర్, నారాయణగూడ, సికింద్రాబాద్, అబిడ్స్, గన్‌ఫౌండ్రీ, రెడ్‌హిల్స్ ప్రాంతాల్లో మొదట అపార్ట్‌మెంట్ల నిర్మాణాలు జరిగాయి. నగరంలో 2.5లక్షల నుంచి 3లక్షలు ఉన్నాయి. 30ఏళ్లకు మించినవి 20 శాతం ఉంటాయని అంచనా.

పాత భవనాల్లోని సమస్యలు ఇలా..

సమస్య	శాతం
ప్లంబింగ్	60
ఎలక్ట్రికల్	50
నిర్మాణ పగుళ్లు	40
గోడలకు చెమ్మ	30
కీటకాలు	25
అగ్నిప్రమాదాలు	20

జాగ్రత్తలు తీసుకుంటే మరింత కాలం మన్నిక

15ఏళ్లలోపు వయసున్న భవనాల నిర్వహణతో పోలిస్తే.. 20-30ఏళ్ల వయసున్న అపార్ట్‌మెంట్ల నిర్వహణ వ్యయం 30శాతం వరకు అదనంగా ఉంటుంది. పాత, కొత్త అనే తేడా లేకుండా.. అన్ని అపార్ట్‌మెంట్లకు క్రమం తప్పకుండా నిర్వహణ పనులు చేస్తే.. 70-100ఏళ్లపాటు అపార్ట్‌మెంట్లు బలంగా ఉంటాయి.

- కె.శ్రీనివాస్, నగర ముఖ్య ప్రణాళికాధికారి

హోటళ్లలో తనిఖీలు

13 వ్యాపార సంస్థలపై కేసులు



బేకరీలో నిల్వ ఉంచిన బ్రెడ్ పరిశీలిస్తున్న పూర్ణచంద్రరావు తదితరులు

విజయవాడ వన్‌టౌన్, గాంధీనగర్ : నగరంలోని వివిధ హోటల్స్, బేకరీలు, రెస్టారెంట్లలో ఆహార భద్రతా తనిఖీ అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులు మంగళవారం 20 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. వాటిలో నిల్వ ఉన్న ఆహార పదార్థాలు, బేకరీల్లో బ్రెడ్ ప్యాకెట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర జాయింట్ ఫుడ్ కంట్రోలర్ ఎన్.పూర్ణచంద్రరావు మాట్లాడుతూ...రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ వీరపాండియన్ ఆదేశాలతో లీగల్ మెట్రాలజీ అధికారుల సహకారంతో 39 వ్యాపార సంస్థల్లో తనిఖీలు చేసి.. నిబంధనలు పాటించని 13 సంస్థలపై కేసులు నమోదు చేశామన్నారు. మరో 13కి నోటీసులు ఇచ్చామని వెల్లడించారు. సుమారు 100 కిలోల పాడైన మాంసాహారాన్ని గుర్తించి పారేసినట్లు తెలిపారు. ఆహార నమూనాలు ప్రయోగశాలకు పంపామని, ఫలితాలొచ్చాక బాధ్యులపై చర్య లుంటాయని చెప్పారు. తనిఖీల్లో జిల్లా సహాయ ఆహార నియంత్రణాధికారులు బి.శ్రీనివాస్, జి.వెంకటేశ్వరరావు, మందాజీ, ఈశ్వరీ, వెంకటరత్నం, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో/జీ రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -119 రిటైల్ ధర 141 చికెన్ విత్ స్కిన్ - 204, చికెన్ స్కిన్‌లెస్ - 233. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 125, 134, 145 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.99/-.

మహిళా చట్టాలు... శక్తిమంతమైన ఆయుధాలు



మాట్లాడుతున్న ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ శైలజ, వేదికపై రుఖ్సానా సుల్తానా బేగం తదితరులు

చిట్టినగర్, న్యూస్‌టుడే : మహిళా చట్టాలు శక్తిమంతమైన ఆయుధాలని, ప్రతి మహిళకు గౌరవంగా, భద్రంగా జీవించే హక్కు ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. విజయవాడ, కొత్తపేట కేబీఎన్ కళాశాలలో కళాశాల యూజీసీ విభాగం, జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ సాధికారత సంస్థ ఆధ్వర్యంలో మహిళల సంక్షేమం, భద్రత, హక్కులపై జిల్లా స్థాయి అవగాహన సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు గృహహింస, దౌర్జన్యాలు, వివక్ష, వేధింపుల నుంచి రక్షించడంతో పాటు సురక్షితమైన కుటుంబ వాతావరణం కల్పించాలని ఈ చట్టం చెబుతోందన్నారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు పాల్పడినా, అసభ్య వ్యాఖ్యలు చేసినా, చూసే విధానంలో తేడా కనిపించినా వెంటనే ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ (ఐసీసీ)కి ఫిర్యాదు చేయాలని చెప్పారు. సామాజిక మాధ్యమాలను వాడేటప్పుడు వ్యక్తిగత చిత్రాలు, ఇతర వివరాలపై జాగ్రత్తలు పాటించాలని మహిళలకు సూచించారు. భద్రత విషయంలో శక్తి యాప్ కవచంలా ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరు డౌన్‌లోడ్ చేసుకోవాలని అన్నారు. రిసోర్స్ పర్సన్స్ యోగిత, విజయలక్ష్మి, సీడబ్ల్యూసీ మాజీ సభ్యురాలు చంద్రగిరి రాధాకుమారి పలు చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా మహిళా శిశు సంక్షేమ, సాధికారత అధికారి షేక్ రుఖ్సానా సుల్తాన్ బేగం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ కార్యదర్శి అనురాధ, కేబీఎన్ కళాశాల ప్రిన్సిపల్ జి.కృష్ణవేణి, సెక్రటరీ, కరస్పాండెంట్ టి.శ్రీనివాస్, ఎంఈవోలు, సీడీపీవోలు, ఐసీసీ కమిటీ ఛైర్మన్లు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు సింగిల్ విండో అనుమతులు ఇవ్వండి



డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాకు వినతిపత్రం ఇస్తున్న గంగరాజు, ఆంజనేయులు తదితరులు

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే : ఈ నెల 27 నుంచి నిర్వహించే గణేష్ ఉత్సవాలకు సింగిల్ విండో పద్ధతి ద్వారా అన్ని రకాల అనుమతులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి.. డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాకు విజ్ఞప్తి చేసింది. ఉత్సవ సమితి గౌరవాధ్యక్షుడు గోకరాజు గంగరాజు, అధ్యక్షుడు చలసాని ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి పాకాల త్రినాథ్, ఉపాధ్యక్షుడు బి.వి.రమణకుమార్, కార్యదర్శి దుర్గాప్రసాద్ రాజు తదితరులు మంగళవారం డీజీపీని ఆయన కార్యాలయంలో కలిసి, వినతిపత్రం సమర్పించారు. అర్జీ ఆధారంగా.. ఎలాంటి రుసుములు లేకుండా అన్ని రకాల అనుమతులు సింగిల్ విండోలో ఇవ్వాలని డీజీపీకి విజ్ఞప్తి చేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని.. ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా యాప్ తయారు చేయించి, రుసుములు లేకుండా.. సింగిల్ విండోలో అనుమతులు ఇస్తామని హామీ ఇచ్చారని సమితి సభ్యులు తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి వంగలపూడి అనిత తదితరులకు ఏపీ గణేష్ ఉత్సవ సమితి కృతజ్ఞతలు తెలిపింది.

వైద్య కళాశాలల్లో పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్ కోర్సులు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలో మంగళవారం ఉప కులపతి డాక్టర్ చంద్రశేఖర్ అధ్యక్షతన రీసెర్చ్ కమిటీ సమావేశమైంది. ప్రస్తుతం వైద్య కళాశాలల్లో పరిశోధనలు చేస్తున్నా.. నాణ్యత లేని కారణంగా గుర్తింపు రావడం లేదని గుర్తించారు. అందులో భాగంగా విశ్వవిద్యాలయంలో 'రీసెర్చ్ ఫండ్' ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉన్న పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్ (పి.డి.ఎఫ్.) కోర్సులను ప్రైవేటు వైద్య కళాశాలల్లోనూ అందుబాటులోకి తీసుకురావాలని తీర్మానించారు. ఇప్పటికే విశ్వవిద్యాలయ పాలక మండలి అనుమతి కోరగా, ఆ కోర్సులు ఎలా నిర్వహించాలా అనే అంశంపై చర్చించారు. పీడీఎఫ్ కమిటీ సభ్యులు రిజిస్ట్రార్ రాధికారెడ్డితో పాటుగా వైద్యులు సుధ, అనిల్ కుమార్, శ్రీకాంత్, ప్రశాంతి, ఆరిఫ్ పాషా, రఘునందన్ పాల్గొన్నారు.

కత్తితో బెదిరించి దాడి



చికిత్స పొందుతున్న మహేష్

పటమట, న్యూస్‌టుడే: తనకు రావాల్సిన నగదు అడిగినందుకు కత్తితో బెదిరించి, దాడి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం... హైదరాబాద్‌కు చెందిన పాలడుగు మహేష్ భవన నిర్మాణ వ్యాపారి. అతను నున్నలో గిడ్డంగి నిర్మించేందుకు గత ఏడాది విజయవాడ పటమటకు చెందిన గొట్టిపుల్ల ప్రదీప్‌తో రూ.1.30 కోట్లకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఏడాది మార్చిలో నిర్మాణం పూర్తి చేసి ఇచ్చారు. అందుకు ప్రదీప్ రూ.80 లక్షలు మహేష్‌కు చెల్లించారు. మిగిలిన రూ.50 లక్షలు ఇవ్వడం లేదు. చివరికి రూ.32.5 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకొని 6 చెక్కులు ప్రదీప్ ఇచ్చారు. గత నెలలో ఆ చెక్కులు డిపాజిట్ చేయగా... స్టాప్ పేమెంట్ అని వచ్చింది. దాంతో మహేష్... ప్రదీప్‌కు లీగల్ నోటీసు పంపారు. మాట్లాడుకొని సమస్య పరిష్కరించుకుందామని మహేష్‌కు ప్రదీప్ ఫోన్ చేశారు. మహేష్ ఈ నెల 14న విజయవాడకు వచ్చి ఓ హోటల్ దిగారు. అదే రోజు మహేష్‌తో మాట్లాడేందుకు ప్రదీప్ మరో ముగ్గురితో కలిసి హోటల్ గదికి వచ్చారు. వారి మధ్య వాగ్వాదం జరిగింది. కత్తితో మహేష్‌ను బెదిరించారు. తోపులాటలో మహేష్ కిటికీ మీద పడగా.. గాజు గ్లాసు చేతికి తగిలి గాయాలయ్యాయి. నరాలు తెగాయి. దాంతో ప్రదీప్ పరారయ్యారు. మహేష్‌ను హోటల్ సిబ్బంది ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతున్నారు. బాధితుడు ఈ నెల 17న ఫిర్యాదు చేయగా... పటమట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎయిడ్స్‌పై అవగాహనకు 5కె మారథాన్



పరుగు పోటీలో అథ్లెట్లు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే : యువతలో హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన పెంపొందించేందుకు మారథాన్ రెడ్ రన్ పోటీలు నిర్వహించామని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్-టీబీ నియంత్రణాధికారి, జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి బి.భానూనాయక్ తెలిపారు. మంగళవారం నగరంలోని బీఆర్టీఎస్ రోడ్డులో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణా విభాగం, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ 5కె మారథాన్ పరుగు పోటీలు నిర్వహించారు. క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ శ్యాంసన్‌తో కలిసి ఆయన మారథాన్‌ను ప్రారంభించారు. భానూనాయక్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ ఎయిడ్స్ పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు దాని బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. హెచ్ఐవీ సోకిన వారిని ఆదరించాలని, ఏఆర్టీ చికిత్సతో వారి జీవన ప్రమాణం పెంచవచ్చన్నారు. పురుషులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్ విభాగాల వారీగా 5కె మారథాన్ పోటీలు నిర్వహించారు. పలు కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పురుషుల విభాగంలో పి.వినయ్ (పీబీ సిద్ధార్థ), వై.లక్ష్మీ తిరుమలరావు (ఆంధ్రా లయోలా), మహిళల విభాగంలో నిషా షా (ఎస్‌డీఎం సిద్ధార్థ)ప్రథమ, వి.హన్నా (ఎస్సారార్), ట్రాన్స్‌జెండర్ విభాగంలో ఎం.రాజి, బి.మాయ తొలి రెండు స్థానాల్లో గెలుపొందారు. ఎస్సారార్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వ్యాయామ విద్యా విభాగాధిపతి డి.యుగంధర్ సమన్వయం చేశారు. విజేతలకు రూ.10 వేలు, రూ.7వేల నగదు చొప్పున త్వరలో కలెక్టర్ చేతుల మీదుగా అందజేస్తామని భానూనాయక్ తెలిపారు.

సరిహద్దు మండలాల్లో వర్షాల జోరు

గంపలగూడెంలో 42.8 మి.మీ.

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఏపీ-తెలంగాణ సరిహద్దులో ఉన్న ఎన్టీఆర్ జిల్లాలోని మండలాల్లో జోరుగా వర్షాలు కురిశాయి. విజయవాడ నగరం వైపు వర్ష ప్రభావం తక్కువగా ఉంది. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. గంపలగూడెం 42.8 మి.మీ., ఎ.కొండూరు 33.4, విస్సన్నపేట 32.6, తిరువూరు 28.8, వత్సవాయి 22.2, రెడ్డిగూడెం 18.2, వీరులపాడు 16.8, పెనుగంచిప్రోలు, జి.కొండూరు 12.8, జగ్గయ్యపేట 11.8, ఇబ్రహీంపట్నం 10.6, కంచికచర్ల 7, మైలవరం 4.8, నందిగామ 3.6, చందర్లపాడు 2.8, విజయవాడ గ్రామీణ 6, నగరంలోని పటమట 5.8, అజిత్‌సింగ్‌నగర్ 5.6, గాంధీనగర్, భవానీపురం ప్రాంతాల్లో 5.4 మిల్లీ మీటర్ల మేర వర్షం పడింది.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న శాస్త్రి. వేదికపై సంఘ నాయకులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సానుభూతితో పరిష్కరించాలని ఏపీ ఐకాస అమరావతి అనుబంధ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం విజ్ఞప్తి చేసింది. విజయవాడలోని సమరయోధుల భవనంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం మంగళవారం నిర్వహించారు. కుటుంబ పింఛనుదారులకు పుట్టిన తేదీ నమోదు సౌకర్యాన్ని ఖజానా కార్యాలయాల్లో కల్పించాలని, ఆరోగ్య కార్డుల పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని, రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయం ఇవ్వాలని, మెడికల్ రీఎంబర్స్‌మెంట్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు, ఐ.ఆర్.ను ప్రకటించాలని, డీఏ బకాయిల చెల్లింపు, ఇతర ఆర్థిక సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తామని తీర్మానించారు. ప్రభుత్వం నూతన జిల్లాల ప్రతిపాదన చేసిన క్రమంలో సంఘం వివిధ జిల్లాల యూనిట్లకు నిర్వహించాల్సి ఉన్న ఎన్నికలను వాయిదా వేయాలని నిర్ణయించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పి.ఎస్.ఎస్.ఎన్.పి.శాస్త్రి అధ్యక్షత వహించారు. సహాధ్యక్షులు కె.ఎస్.హనుమంతరావు, రౌతు రామ్మూర్తి, గురు రాజారావు, గాతల జేమ్స్, కోశాధికారి పి.నాగరాజు, రాష్ట్రంలోని వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విశ్రాంత సైనికులకు న్యాయ సహాయక క్లినిక్



మాట్లాడుతున్న జడ్జి గుట్టల గోపి. పక్కన బాషా, కల్యాణ వీణ, సత్యానంద్, రామకృష్ణయ్య

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : విశ్రాంత సైనికులు, వారి కుటుంబ సభ్యుల న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి వీర పరివార్ సహాయక యోజన పేరుతో న్యాయ సహాయక క్లినిక్‌ను ఏర్పాటు చేసినట్లు కృష్ణాజిల్లా ప్రిన్సిపల్ జడ్జి గుట్టల గోపీ పేర్కొన్నారు. మంగళవారం ఇందిరా గాంధీ స్టేడియంలోని విశ్రాంత సైనిక కార్యాలయంలో న్యాయ సహాయక క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. . సుప్రీం కోర్టు న్యాయమూర్తి సూర్యకాంత్ ఆదేశాల మేరకు నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, స్టేట్ లీగల్ సర్వీసెస్, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ఈ క్లినిక్ పని చేస్తుందని తెలిపారు. దీని ద్వారా విశ్రాంత సైనికులు, వారి కుటుంబ సభ్యుల సమస్యలను పరిష్కరిస్తారు. రెండో అదనపు జిల్లా జడ్జి ఎ.సత్యానంద్ మాట్లాడుతూ.. దేశాన్ని కాపాడుతున్న సైనికుల సమస్యలను పరిష్కరించి, దేశ జవానుల ఆత్మస్థైర్యాన్ని కాపాడుకునే సదవకాశం మనకు వచ్చిందని కొనియాడారు. ఈ అవకాశం అందించిన ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్‌ను అభినందించారు. కృష్ణాజిల్లా సైనిక సంక్షేమ అధికారి లెఫ్టినెంట్ కర్నల్ డాక్టర్ కె.కల్యాణ వీణ మాట్లాడుతూ.. మాజీ సైనికోద్యోగులు ప్రతి శనివారం ఈ న్యాయ సహాయక క్లినిక్‌కు వచ్చి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. బీబీఏ అధ్యక్షుడు ఎ.కె.బాషా మాట్లాడుతూ.. న్యాయవాది బి.శేఖర్‌బాబు న్యాయ వాలంటీర్‌గా సేవలు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి కె.వి.రామకృష్ణయ్య, న్యాయమూర్తులు ఎస్.సునీల్, భూపాల్‌రెడ్డి, వేల్పుల భవానీ, ఎ.అనిత, శేషయ్యతో పలువురు న్యాయమూర్తులు పాల్గొన్నారు.

నీట్ పీజీలో ప్రతిభ



సబ్బినేని కిరణ్మయి

గొల్లపూడి, న్యూస్‌టుడే: నీట్ పీజీ-2025 ఫలితాల్లో గొల్లపూడికి చెందిన ఎస్.వి.చౌదరి, లక్ష్మీ దంపతుల కుమార్తె సబ్బినేని కిరణ్మయి ప్రతిభ కనబరిచారు. ఆలిండియా స్థాయిలో జనరల్ కేటగిరిలో 379 ర్యాంకు సాధించారు. ప్రస్తుతం ఆమె గుంటూరు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. సొంతంగా ఇంటి వద్ద పరీక్షలకు సిద్ధమయ్యారు. 2018 ఎంబీబీఎస్ ప్రవేశ పరీక్షలో 330 ర్యాంకు సాధించారు. గైనకాలజిస్టు కావడమే తన లక్ష్యమని ఆమె తెలిపారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

పైపులైన్‌కు మరమ్మతులు



★ వెల్లటూరు డొంక రోడ్డులో పంచాయతీ నీటి పైపులైన్ లీకై నీరు వృథాగా పోతున్నాయని స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా పంచాయతీ కార్యదర్శి మురళికి తెలపగా.. ఆయన స్పందించారు. సిబ్బందితో పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా పునరుద్ధరించారు. - **న్యూస్‌టుడే, జి.కొండూరు**

★ మండలంలోని నరసాపురం గ్రామ పంచాయతీలో గ్రామ సచివాలయం నుంచి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వరకు రహదారికి రెండు వైపులా చెత్త పేరుకుపోయింది. ఈ సమస్యపై స్థానికులు మేమున్నాం మీకు తోడుగా ద్వారా సంబంధిత అధికారులకు, సిబ్బందికి ఫిర్యాదు చేశారు. స్పందించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.స్వాతి క్లాప్ మిత్రలు, పారిశుద్ధ్య సిబ్బందిని పంపి శుభ్రం చేయించి చెత్తను డంపింగ్ యార్డుకు తరలించారు. - **న్యూస్‌టుడే, విస్సన్నపేట**



★ స్థానిక పంచాయతీలోని రామాపురంలో ప్రధాన రహదారి వెంట ఉన్న డ్రైనేజీ గడ్డి, పూడిక పేరుకుపోయి మురుగు నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిందని స్థానికులు మేమున్నాం... మీకు తోడుగాకు తెలిపారు. ఈ సమస్యను పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావు దృష్టికి తీసుకెళ్లగా.. సిబ్బందితో డ్రైనేజీలోని గడ్డి, పూడిక మంగళవారం తొలగించారు. - **న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**



? కట్టుబడు గ్రామంలో బాబూ జగ్జీవన్‌రామ్ వీధిలో మురుగు కాలువలో పూడిక పేరుకుపోయింది. పిచ్చి మొక్కలు పెరిగి అధ్వానంగా తయారైంది. - **శ్రీహరి గ్రామస్థుడు.**
✔ సమస్య మా దృష్టికి వచ్చింది. సిబ్బందిని పంపి పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. - **సరోజా బాయి, పంచాయతీ కార్యదర్శి** - **న్యూస్‌టుడే, జి.కొండూరు**

పరిసరాలు శుభ్రంగా ఉంచండి

కోమటికుంట(ఎ.కొండూరు): మండలంలోని రామచంద్రాపురం శివారు కోమటికుంటలో మంగళవారం ఆరోగ్యశాఖ ఉద్యోగులు ఇంటింటా సర్వే నిర్వహించారు. పలు వీధుల్లో ఇళ్లలో తొట్టెలు, డబ్బాలు, జాడీల్లో రోజుల తరబడి నీరు నిల్వ ఉన్నట్లు గుర్తించి సిబ్బందితో పారబోశారు. వినియోగించిన తొట్టెలు, డబ్బాల్లో రోజుల తరబడి నీరు నిల్వ ఉంటే దోమల లార్వాలు వృద్ధి చెందిన ప్రజలు రోగాలబారిన పడే ప్రమాదం ఉందని వివరించారు. వర్షాకాలంలో ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రజలు తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మంగళవారం నిర్వహించిన సర్వేలో గ్రామంలో జ్వర బాధితులు లేరని గుర్తించినట్లు హెచ్‌వీ దీపా, ఏఎన్‌ఎం నందిని తెలిపారు.

హుండీ లెక్కింపు నేడు

మైలవరం: మండలంలోని బొర్రగూడెంలోని తిరుపతమ్మ, గోపయ్య స్వామి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపును బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.తేజ మంగళవారం తెలిపారు. ఆలయ ధర్మకర్త సత్యవరప్రసాద్, పోలీసు అధికారులు, గ్రామస్థుల సమక్షంలో లెక్కింపు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

దేవినేని ఉమను కలిసిన బాలకోటయ్య

గొల్లపూడి, న్యూస్‌టుడే: మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావును సామాజిక సంక్షేమ మండలి ఛైర్మన్ బాలకోటయ్య మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. గొల్లపూడిలోని ఉమామహేశ్వరరావు కార్యాలయంలో కలిసి పలు అంశాలపై చర్చించారు.

సొసైటీ ఛైర్మన్ల ప్రమాణస్వీకరణ

రెడ్డిగూడెం: కూటమి ప్రభుత్వం లక్ష్యం మేరకు రైతులకు విశేషమైన సేవలు అందించాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం శ్రీరాంపురం పీఏసీఎస్ (సొసైటీ) ఛైర్మన్‌గా నాదెళ్ల చెన్నకేశవరావు, సభ్యులుగా గోదా మహేశ్వరరావు, విస్సంపల్లి రజని, రుద్రవరం పీఏసీఎస్ ఛైర్మన్‌గా మాదల సాంబశివరావు, సభ్యులుగా మోదుగపరపు రామారావు, పాటిబండ్ల సత్యనారాయణ ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు.

ప్రతిభావంతులకు పురస్కారాల అందజేత



జిల్లా కలెక్టర్ లక్ష్మీశ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఆరోగ్య శాఖ అధికారి శ్రీనివాసరావు, తిరువూరు ఆర్టీసీ డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యం, విస్సన్నపేట మండల వైద్యాధికారి డా శ్రీనివాసరావు (కుడి నుంచి ఎడమకు)

గంపలగూడెం, తిరువూరు, విస్సన్నపేట: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గంపలగూడెం, తిరువూరు మండలాల్లోని పలువురు అధికారులకు సోమవారం రాత్రి విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ ప్రతిభా పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

సాహస యాత్ర కారాదు శిక్షార్హం..

కేసులు, జరిమానాలు తప్పవంటున్న అధికారులు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: ఇటీవల యువతకు సాహస యాత్రలపై ఆసక్తి పెరుగుతోంది. స్వచ్ఛమైన ప్రకృతి రమణీయతను ఆస్వాదించడంతో పాటు ట్రెక్కింగ్ చేయడానికి సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో విజయవాడ నగర సమీపంలోని మూలపాడు రిజర్వు ఫారెస్టు బాట పడుతున్నారు. సెలవు దినాలతో పాటు వారాంతపు సెలవుల్లో యువతీ యువకులు మూలపాడు, కొండపల్లి, గంగినేని ప్రాంతంలోని అటవీ ప్రాంతాలకు వందల సంఖ్యలో వస్తున్నారు. సాధారణంగా ప్రజలను రిజర్వు అటవీ ప్రాంతంలోకి అటవీశాఖ అనుమతిలేకుండా ప్రవేశించే అవకాశం ఉండదు. నిబంధనలను అతిక్రమించి అనుమతిలేని అటవీ ప్రదేశాల్లోకి ప్రవేశిస్తే శిక్షార్హులవుతారు. ఎలాంటి హెచ్చరికలు లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకునే అధికారం అటవీశాఖకు ఉంటుంది.



మూలపాడు అటవీ ప్రాంతంలో ట్రెక్కింగ్ చేస్తున్న యువకులు

★ రిజర్వు ఫారెస్టుగా ప్రకటించిన మూలపాడు, కొండపల్లి చుట్టుపక్కల అటవీశాఖ సంరక్షణలో ఉన్న అడవుల్లోకి నిబంధనలను ఉల్లంఘించి ప్రవేశించడమంటే కోరి కష్టాలు కొని తెచ్చుకుంటారని అధికారులు చెబుతున్నారు.

★ అటవీశాఖ అధికారుల అనుమతులు తీసుకోకుండా ట్రెక్కింగ్‌లకు ప్రయత్నిస్తే మాత్రం ఆ శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. గుర్తింపులేని ట్రెక్కింగ్ నిర్వాహకులను నమ్మి చిక్కుల్లో పడవద్దని సూచిస్తున్నారు. అలాకాకుండా అడవుల్లోకి ప్రవేశిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆపద తెచ్చుకున్నట్లే..

మూలపాడు, కొండపల్లి పరిసరాల్లోని అడవుల్లో ట్రెక్కింగ్ నిర్వాహకుల పేరుతో కొన్ని గుర్తింపులేని సంస్థల ప్రతినిధులు అనుభవం లేని అవగాహన లేని కారణంగా ఔత్సాహికులను ప్రమాదాల్లోకి నెడుతున్నారు. తమకు అన్నీ తెలుసని, అటవీశాఖ అనుమతులు అవసరం లేదని ట్రెక్కింగులు నిర్వహిస్తున్నారు.

ఎవరినీ అనుసరించొద్దు

తాము ప్రకృతి ప్రియులం.. వన్యప్రాణి ప్రేమికులం.. వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్లమని ప్రకటించుకొని మిత్రులు, సన్నిహితుల బృందాలను వెంటబెట్టుకుని మూలపాడు, కొండపల్లి అడవుల్లో సాహసయాత్రలు చేపడుతున్నారు. అలా నమ్మి వెళ్లే వారితోపాటు వెళ్లే వారు కూడా అటవీ చట్టాల ప్రకారం శిక్షార్హులవుతారు. కొందరు అడవి ఆంజనేయస్వామి ప్రాంతంలోని జలపాతాల వద్దకు వెళ్లి అక్కడి నీటి మడుగులో ఈత కొడుతున్నారు. మునిగిపోయే అవకాశాలు ఉంటాయని చెబుతున్నారు.

అనుమతుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

మూలపాడు నగర వనం వద్ద ప్రత్యేకంగా సిబ్బంది సందర్శకులు ఔత్సాహికుల కోసం అనుమతులు ఇస్తున్నారు. ఒక్కొక్కరు రూ.100 చెల్లించి వీటిని పొందవచ్చు. ఈ అనుమతి అడవి ఆంజనేయస్వామి ప్రాంతం వరకే చెల్లుతుందని మూలపాడు సెక్షన్ అధికారి ప్రసాద్ తెలిపారు. త్వరలోనే జాతీయ రహదారి నుంచి మూలపాడు వనం వరకు అటవీశాఖ ప్రత్యేక వాహనాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

ఉచిత బస్సు ప్రయాణంపై ఎమ్మెల్యే పరిశీలన



ప్రయాణికురాలి బియ్యం బస్తాను బస్సులోకి తీసుకెళ్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

గంపలగూడెం, న్యూస్‌టుడే: 'స్త్రీ శక్తి' పథకం ద్వారా ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. తిరువూరు డిపో నుంచి విజయవాడ వెళ్లే ఆర్టీసీ బస్సులో ఆయన గొల్లపూడి వరకు ప్రయాణం చేశారు. సీఎం చంద్రబాబు ప్రకటించిన సూపర్‌-6 హామీల్లో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే వివరించారు. తిరువూరు నుంచి గొల్లపూడి వరకు పలు స్టేజీలో ఎమ్మెల్యే బస్సు దిగి ఉచిత ప్రయాణం చేసేందుకు మహిళలను ఆహ్వానించారు. ఈ క్రమంలో కంభంపాడు స్టేజీలో ఒక మహిళ బియ్యం బస్తాతో బస్సు ఎక్కేందుకు రావడం గమనించిన ఎమ్మెల్యే కిందకు దిగి బస్తాను బస్సులోకి తీసుకు వచ్చారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై బస్సులో ఉచిత ప్రయాణం చేస్తున్న మహిళల అభిప్రాయాలు తెలుసుకుంటూ గొల్లపూడి వరకు ప్రయాణం సాగించారు.

'అమరావతిపై జగన్ అసత్యాలు'

తిరువూరు టౌన్: రాష్ట్ర రాజధాని అమరావతిపై జగన్ సాక్షి పత్రిక, చానళ్లలో అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజల్లో భయాందోళనలు కల్పిస్తున్నారని శాసన సభ్యులు కె.శ్రీనివాసరావు తెలిపారు. పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2014లో ఆంధ్రప్రదేశ్ రాజధాని అని అసెంబ్లీలో ప్రకటించినప్పుడు వైకాపా కూడా మద్దతు ఇచ్చిందని గుర్తుచేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో డిపాజిట్లు కోల్పోయి పార్టీ ఉనికిని కాపాడుకోవడానికి అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు.

వాన నీరు ఇళ్లల్లోకి చేరకుండా చర్యలు

తిరువూరు, న్యూస్‌టుడే: నగర పంచాయతీ పరిధిలోని చింతలకాలనీలో పురపాలిక కమిషనర్ కె.మనోజ మంగళవారం పర్యటించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో కాలనీలో పల్లపు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టారు. పల్లపు ప్రాంతమైన చింతలకాలనీలో వర్షం కురిస్తే నీరు ఇళ్లలోకి చేరే అవకాశం ఉండడంతో ముందస్తుగా వీధుల్లో నీరు నిల్వ ఉండకుండా బయటకు పంపించే పనులు పర్యవేక్షించారు. పురపాలిక ఏఈ లోకేష్, ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్ పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలకు రండి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: ఎగువ నుంచి భారీగా వస్తున్న వరద నీరు కారణంగా మండల పరిధిలోని నదీ తీర గ్రామస్థులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు రావాల్సిందిగా ఇబ్రహీంపట్నం తహసీల్దారు వెంకటేశ్వర్లు సూచించారు. ఆయన మంగళవారం నదీ తీర గ్రామాల్లో పర్యటించారు. నదీ తీరంలో పోలీసు, రెవెన్యూ సిబ్బందిని ఏర్పాటు చేసి వరద తీవ్రతను పరిశీలించి తీరవాసులను అప్రమత్తం చేయాలని సూచించారు. ఇబ్రహీంపట్నంలో ట్రక్ టెర్మినల్, ఏ కాలనీ ఆడిటోరియం, మూలపాడులో జడ్పీ ఉన్నత పాఠశాల, కాచవరంలో ముగ్గురమ్మల ఆలయం వద్ద సమాజిక భవనం, కొండపల్లిలో జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఆయా కేంద్రాలకు సమీపంలోని తీరవాసులు నిర్లక్ష్యం చేయకుండా వరద ప్రభావం దృష్ట్యా పునరావాస కేంద్రాలలో ఆశ్రయం పొందాలని సూచించారు.

రైతులకు సహకార సంఘాలు సేవలు అందించాలి



తిరువూరు మండలం టేకులపల్లి సొసైటీలో ఛైర్మన్ మల్లారెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

టేకులపల్లి(తిరువూరు), న్యూస్‌టుడే: నూతన పాలక వర్గాల ఆధ్వర్యంలో సహకార సంఘాలను బలోపేతం చేయాలని, రైతుల అవసరాల మేరకు సంఘాల ద్వారా సేవలు అందించాలని ఎమ్మెల్యే కె.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని టేకులపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్‌గా శీలం మల్లారెడ్డి, సభ్యులుగా జి.కాటయ్య, బి.లక్ష్మణరావు మంగళవారం బాధ్యతలు తీసుకుని ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని త్రిసభ్య కమిటీ సభ్యులను సత్కరించి అభినందించారు. అన్నదాతలకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సంఘాల ద్వారా సరఫరా చేయాలన్నారు. లాభాలు సాధిస్తూ సంఘంలోని రైతులకు ఆ లాభాలను పంపిణీ చేయాలన్నారు. తెదేపా మండల, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా కృషి



త్రిసభ్య కమిటీని అభినందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

మైలవరం, న్యూస్‌టుడే: సహకార సంఘాల త్రిసభ్య కమిటీలు రాజకీయాలకు అతీతంగా రైతులకు కృషి చేయాలని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని చంద్రగూడెం సంఘం త్రిసభ్య కమిటీ ఛైర్మన్‌గా మోర్ల రోశాలు, మరో ఇద్దరు సభ్యులు, పుల్లూరు సొసైటీ ఛైర్మన్ వజ్రాల సురేష్‌కుమార్ రెడ్డి, మరో ఇద్దరు సభ్యుల ప్రమాణ స్వీకారాన్ని ఆయా సొసైటీలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కమిటీలను అభినందించిన ఎమ్మెల్యే మెరుగైన సేవలు అందించడానికి కృషి చేయాలన్నారు. అనంతరం పలువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ కుమార్‌రెడ్డి, నరసింహారావు, రాజు, లీలాప్రసాద్, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలువ కాదు.. ఆర్‌అండ్‌బీ రోడ్డే..



కనిపించేది నీటి ప్రవాహం కాలువ కాదండోయ్.. మండలంలోని కందులపాడు గంగినేని ఎర్రుపాలెం (కేజీవై) ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి. గత ప్రభుత్వం అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం చేయడంతో ఈ దుస్థితికి చేరింది. కూటమి ప్రభుత్వం ఎట్టకేలకు 9 నెలల కిందటే రహదారి పనులు ప్రారంభించింది. బిల్లుల చెల్లింపు జాప్యం కారణంగా గుత్తేదారు పనులు నత్తనడకన కొనసాగిస్తున్నారు. దీంతో చిన్నపాటి వర్షానికి సైతం గడ్డమణుగు, చెరువుమాధవరం గ్రామాల మధ్యలో మోకాలి లోతు గుంతలు నీటితో నిండిపోయి చెరువులను తలపిస్తున్నాయి. అధికారులు స్పందించి రహదారి అభివృద్ధి పనులు పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, జి.కొండూరు**

ప్రజలను బెంబేలెత్తిస్తున్న శునకాలు



పట్టణంలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ప్రతి వీధిలో వందల సంఖ్యలో శునకాలు సంచరిస్తున్నాయి. రాకపోకలకు సాగిస్తున్న పాదచారులు, ద్విచక్ర వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇటీవల కాలంలో పలు ప్రాంతాల్లో ప్రజలపై దాడి చేసిన సంఘటనలు వెలుగు చూడడంతో పట్టణ ప్రజలు కూడా ఆందోళన చెందుతున్నారు. పలువురు విద్యార్థులు విద్యాలయాలకు వెళ్లే క్రమంలో గుంపులుగా తిరుగుతున్న శునకాలు తమ పిల్లలపై దాడి చేస్తాయోనన్న భయం తల్లిదండ్రులను వెంటాడుతోంది. పురపాలిక సమావేశాల్లో పలువురు కౌన్సిలర్లు పట్టణంలో శునకాల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, తిరువూరు**

బుడమేరు మళ్లింపు కాలువ గండ్లు పూడ్చండి



ఇటీవల వచ్చిన వరదల కారణంగా కోతకు గురైన ఖాజీమాన్యం గండ్లు పూడ్చాలని అక్కడి నివాసితులు కోరుతున్నారు. ఖాజీమాన్యంలో బుడమేరు మళ్లింపు కాలువ గట్టుపైన దాదాపు 20 కుటుంబాలు నివాసముంటున్నాయి. గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతోపాటు బుడమేరు మళ్లింపు కాలువ వద్ద వరద నీరు నిలవడంతో ఖాజీమాన్యం వద్ద గట్టుకు గండ్లు పడ్డాయి. బుడమేరుకు వరద వస్తే గండ్ల ద్వారా వరద నీరు తమ నివాసాలు ముంపునకు గురవుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కట్ట కోత కారణంగా ఇప్పటికే రెండు మూడు పూరిపాకలు వరదకు కొట్టుకుపోయినట్లు ఆందోళన చెందుతున్నారు. కట్టకు పడ్డ గండ్లు పూడ్చక పోతే ఆందోళన నిర్వహిస్తామని సీపీఎం మండల శాఖ కార్యదర్శి మహేష్ తెలిపారు. - **న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం**

పగలే వెలుగులు..



విద్యుత్తు కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం రకరకాల ప్రణాళికలు రూపొందిస్తుంటే గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం సంబంధిత శాఖ సిబ్బంది నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతో విద్యుత్తు వృథా అవుతోంది. మండలంలోని విస్సన్నపేట గ్రామ పంచాయతీ శివారు రాజీవ్ కాలనీలో 300 కుటుంబాలు నివాసిస్తున్నాయి. రహదారికి ఇరువైపులా 13 వీధులు విస్తరించి ఉన్నాయి. వీధి దీపాలు పగలు నిరంతరాయంగా వెలుగుతున్నాయి. విద్యుత్తు శాఖాధికారులు, సిబ్బంది పట్టించుకోరని కాలనీవాసులు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. - **న్యూస్‌టుడే, విస్సన్నపేట**

ఉత్తమ లైన్‌మెన్‌కు అభినందన



శ్రీనివాసరావును సన్మానిస్తున్న సిబ్బంది

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని గణపవరం విద్యుత్తు ఉపకేంద్రంలో పని చేస్తున్న శ్రీనివాసరావుకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'ఉత్తమ లైన్‌మెన్' అవార్డు రావడంపై మంగళవారం సబ్ స్టేషన్ సిబ్బంది అభినందించారు. ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి సన్మానించారు. ఏఈ రామ్మోహనరావు, సిబ్బంది జె.అనిల్ కుమార్, శివరాం నరేష్, సుందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్‌లో పూడిక తొలగింపు

ఆంజనేయపురం(తిరువూరు): మండలంలోని ఆంజనేయపురంలో మంగళవారం సర్పంచి మామిడి కుటుంబరావు, పంచాయతీ కార్యదర్శి లావణ్య ఆధ్వర్యంలో వీధుల్లో కచ్చా డ్రెయిన్లలో పూడిక తీసే పనులు చేపట్టారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద నీరు ప్రవహించడంతో మురుగు పారుదల కాలువల్లో బురద చేరి పూడుకుపోయాయి. దీంతో నీరు పారుదలకు జేసీబీ ఏర్పాటు చేసి కాలువలో పూడిక తీయిస్తున్నారు. పారిశుద్ధ్యం, డ్రెయినేజీ సమస్యలు పరిష్కరించేందుకు పూడిక తీసే పనులు చేపట్టినట్లు సర్పంచి తెలిపారు.

మాజీ ఎమ్మెల్యేకు పరామర్శ

జి.కొండూరు: మైలవరం మాజీ ఎమ్మెల్యే జె.రమేష్‌బాబు తల్లి విమలాదేవి గత బుధవారం రాత్రి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొర్రా కిరణ్ మంగళవారం రమేష్‌బాబును ఆయన స్వగృహంలో కలిసి పరామర్శించారు. విమలాదేవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆలయానికి విరాళం

పెనుగొలను (గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలను సమీప మెట్టగుట్టలోని శేషాచల శ్రీనివాసస్వామి గుడికి జగ్గయ్యపేటకు చెందిన కర్రి నిరంజన్, సత్యవాణి దంపతులు మంగళవారం రూ.10 వేలు విరాళం అందజేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పి.వెంకట్రావు, సభ్యుడు ఆర్.వెంకట సుబ్బారావు తెలిపారు. దాత కుటుంబాన్ని అర్చకులు శ్యామసుందరాచార్యులు ఆశీర్వదించారు.

విద్యార్థులకు టీకాలు



టీకా వేస్తున్న వైద్యాధికారి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : స్పెషల్ వ్యాక్సినేషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పుట్రేల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 5 ఏళ్ల వారికి డి.పి.టి ఇంజక్షన్, 10 నుంచి 16 ఏళ్ల విద్యార్థులకు టి.డి ఇంజక్షన్లు చేయించారు. కోరింత దగ్గు, ధనుర్వాతం వంటి వ్యాధులు రాకుండా వ్యాధి నిరోధక శక్తిని కలిగిస్తాయని కార్యక్రమంలో పాల్గొన్న హెల్త్ సూపర్‌వైజర్ పి. శివ కుమారి, ఎంఎల్‌హెచ్‌సీ పి మారేశ్వరి తెలిపారు. ఏఎన్‌ఎంలు ఎం.నాగమణి, కె.నిర్మల, హెల్త్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాసులు, ఆశా కార్యకర్తలు కె.కల్పన, మందాకిని, హెచ్‌ఎం ఎం.ప్రభాకర్ రెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు



వివరాలు తెలుపుతున్న డీఆర్పీ వెంకటేష్, పక్కన డ్వామా పీడీ ఎ.రాము, ఏపీడీ పార్థసారథి తదితరులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా డ్వామా పీడీ ఎ.రాము సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రెడ్డిగూడెం మండల పరిషత్తు కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై 18వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో కుదప, నరుకుళ్లపాడు క్షేత్రస్థాయి సిబ్బందిపై ఆయా గ్రామాలకు చెందిన వేతన దారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులు వచ్చిన వారిపై ప్రత్యేకంగా విచారించి చర్యలు తీసుకొంటామన్నారు. రూ.18.58 కోట్లు పనులకు చెల్లింపులు చేసినట్లు తెలిపారు. వేతన దారులకు రూ.14 కోట్లు చెల్లింపులు చేశామన్నారు. సామాజిక తనిఖీ బృందం గుర్తించిన రూ.6.58లక్షలు రికవరీకి ఆదేశించామన్నారు. రూ.2.04 లక్షలు ఫైన్ విధించామని చెప్పారు. మరో రూ.16.27లక్షలు విచారణ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా ఏపీడీ పార్థసారథి, సామాజిక తనిఖీ రాష్ట్ర ప్రోగ్రామ్ మేనేజర్ పి.ఈశ్వరరావు, ఎస్ఆర్పీ బి.తులసీ నాయక్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో పి.ప్రభాకరరావు, ఏపీవోలు వెంకటేశ్వరరావు, భాస్కరరావు, డీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

కొత్త బార్ లైసెన్సులకు 28న లాటరీ

తిరువూరు టౌన్, న్యూస్‌టుడే : తిరువూరు పట్టణ పరిధిలో బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేసుకునే వారికి లైసెన్స్ కోసం ఈ నెల 28న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్ కుమార్ తెలిపారు. అదే రోజు లాటరీ తీసి లైసెన్సు దారులను ఎంపిక చేస్తారని చెప్పారు. లైసెన్సులు జారీ అయిన 15 రోజుల్లో రెస్టారెంట్ ఏర్పాటు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

నానో ఎరువులు వాడండి



పుట్రేలలో తహసీల్దార్ లక్ష్మీకల్యాణి, ఉద్యాన శాఖాధికారి నరేంద్రకుమార్ తదితరులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : నానో ఎరువులు వాడి ఆధునిక వ్యవసాయం వైపు అడుగులు వేయాలని తహసీల్దార్ లక్ష్మీకల్యాణి, ఉద్యాన శాఖాధికారి నరేంద్ర కుమార్ అన్నదాతలకు పిలుపునిచ్చారు. మండలంలోని పుట్రేల గ్రామంలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో పాల్గొని రైతులకు ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. క్షేత్రస్థాయిలో పొలాలు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ సుజాత, వీఆర్వో సునంద, ఏఈవో ఉషారాణి, రైతులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెం: కూనపరాజుపర్వ గ్రామంలో మంగళవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో తహసీల్దార్ జె.సుశీలాదేవి పాల్గొన్నారు. నరుకుళ్లపాడు, మద్దులపర్వ, కుదప, రుద్రవరం గ్రామాల్లో ఉన్న వాగులు, చెరువులు, ఎన్ఎస్పీ కాలువలు రైతులతో కలిసి పరిశీలించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జి.పుల్లయ్య,రెవెన్యూ, పంచాయత్ రాజ్, వ్యవసాయశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

రహదారి పనులు ప్రారంభించండి

మైలవరం: మండలంలోని వెల్వడంలో అధ్వాన రహదారిపై ప్రయాణం ప్రాణసంకటంగా మారినా చర్యలు తీసుకోవడం లేదని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పీవీ ఆంజనేయులు ఆరోపించారు. రహదారి అవస్థలు తీర్చాలంటూ మంగళవారం స్థానిక ర.భ.ఈఈ కార్యాలయం ఎదుట వెల్వడం గ్రామస్థులతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నెలల తరబడి గోతుల్లో ప్రయాణాలతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని, పలువురు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. అనంతరం ఆందోళన చేస్తున్న వారితో ర.భ.ఈఈ రోజాకుమారి, డీఈ అప్పారావు చర్చించారు. రహదారి అభివృద్ధికి రూ.6 కోట్లు మంజూరయ్యాయని, దానిపై ఇప్పటికే టెండర్ల ప్రక్రియ ప్రారంభమైందని వివరించారు. వచ్చే నెల 3న టెండర్లు తెరుస్తామని, త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న సంఘం జిల్లా కార్యదర్శి సుప్రజ

తిరువూరు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులకు ప్రభుత్వం కనీస వేతనాలు చెల్లించాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సీహెచ్.సుప్రజ కోరారు. తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు మహాసభ నిర్వహించారు. అంగన్‌వాడీ ఉద్యోగులపై పనిభారం తగ్గించాలని, సంక్షేమ పథకాలు కార్యకర్తలు, సహాయకులకు వర్తింపజేయాలని సమావేశంలో తీర్మానించారు. తిరువూరు ప్రాజెక్ట్ కమిటీ అధ్యక్షురాలుగా పి.పద్మ, కార్యదర్శిగా కె.నాగమణి, సభ్యులుగా శ్రీలక్ష్మి, శివకుమారి, సుష్మ, దుర్గ, నజీమా, ఉష, యూన్సీ, ధనలక్ష్మి, మంగతాయారు, పద్మకుమారి, నిర్మలాకుమారి, గౌరవాధ్యక్షునిగా బి.వెంకటేశ్వరరావును ఎన్నుకున్నారు. సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

లూయిస్ డాగురేకు నివాళి

గంపలగూడెం: ప్రపంచ ఛాయాచిత్ర దినోత్సవం సందర్భంగా మంగళవారం గంపలగూడెం నుంచి తోటమూల వరకు మండల పరిధిలో ఫొటోగ్రాఫర్లు ప్రదర్శన నిర్వహించారు. గంపలగూడెంకు చెందిన సీనియర్ ఫొటోగ్రాఫర్ కొండా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ సృష్టికర్త లూయిస్ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

వారి కరుణ వెనుక అరుణ!

- నేతలు పెంచి పోషించారు.. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు సాగిలపడ్డారు!
- కరడుగట్టిన నేరగాడు శ్రీకాంత్‌కు వెన్నుదన్నులు
- వారిని ప్రభావితం చేసిన అరుణ
- పెరోల్ వెనక ఓ ఉన్నతాధికారి కీలక పాత్ర

ఈనాడు, అమరావతి: నెల్లూరు జిల్లాలో కరడుగట్టిన నేరగాడు శ్రీకాంత్‌ను ఒకరిద్దరు ప్రజాప్రతినిధులు పెంచి పోషించగా.. కొంతమంది ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు అతడికి కొమ్ముకాశారు. 2014 ఫిబ్రవరి 12న జైలు నుంచి పారిపోయిన శ్రీకాంత్ దాదాపు నాలుగున్నరేళ్ల పాటు బయటే ఉన్నాడు. ఆ సమయంలో పలు హింసాత్మక నేరాల్లో అతడికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రమేయముందనే అభియోగాలున్నాయి. లొంగిపోయిన తర్వాత సైతం జైల్లోంచే అనేక సెటిల్‌మెంట్లు, దందాలు చేయించాడనే ఆరోపణలున్నాయి. ప్రధానంగా వైకాపా హయాంలో ఐదేళ్ల పాటు కొందరు ప్రజాప్రతినిధుల అండతో శ్రీకాంత్ పేట్రేగిపోయాడు. అప్పట్లో ఎస్పీలుగా పనిచేసిన అధికారుల కళ్ల ముందే ఇవన్నీ జరుగుతున్నా. . శ్రీకాంత్‌పై చర్యలు తీసుకోకుండా అతడికి సహకరించారు. అంతకుముందు నాలుగేళ్ల పాటు శ్రీకాంత్ తప్పించుకుని తిరుగుతున్నా ఐపీఎస్‌లు చోద్యం చూశారు. అతడే వచ్చి లొంగిపోయేంత వరకూ మౌనంగా ఉన్నారు. ఆ తర్వాత కూడా జైల్లోంచే సెటిల్‌మెంట్లు చేస్తున్నాడని, బయట జరుగుతున్న నేరాల్లో అతని ప్రమేయముందని తెలినా సరే.. ఆ జిల్లా ఎస్పీల చర్యలు శూన్యం.

అధికారులకు హనీట్రాప్!

వైకాపా హయాంలో దిశ పోలీసుస్టేషన్‌లకు అనుబంధంగా కౌన్సెలింగ్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఆ కమిటీలో శ్రీకాంత్ ప్రియురాలైన అరుణను ఎస్పీ సిఫార్సులతో సభ్యురాలిగా నియమించారు. ఆ ఎస్పీ ఉన్నంతకాలం ఆయన అండతో అరుణ చెలరేగిపోయింది. పోలీసు యంత్రాంగమంతా ఆమె కనుసన్నల్లో ఉండేది. దాన్ని అడ్డం పెట్టుకుని పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడింది. హనీ ట్రాప్‌తో పలువురు అధికారులను ఆమె తన గుప్పిట్లో పెట్టుకున్నారనే ఆరోపణలున్నాయి.

పెరోల్ వెనక ఉన్నత స్థాయి అధికారి

శ్రీకాంత్‌కు నిబంధనలకు విరుద్ధంగా పెరోల్ మంజూరు చేయటంలో రాష్ట్ర ప్రభుత్వంలోని ఓ ఉన్నతాధికారి మౌఖిక ఆదేశాలిచ్చినట్లు సమాచారం. దీంతో తిరుపతి ఎస్పీ, నెల్లూరు జైలు సూపరింటెండెంట్ నివేదికలను పక్కనపెట్టి మరీ హోంశాఖ పెరోల్ మంజూరు చేసింది. ఓ కరడుగట్టిన నేరగాడికి పెరోల్ కోసం ఉన్నతాధికారి ఎందుకు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది? ఆయన్ను ఆ స్థాయిలో ప్రభావితం చేసింది ఎవరు? అనేవి తేలాల్సి ఉంది. ఎవరైనా ఖైదీకి పెరోల్ ఇవ్వాలంటే జైలు సూపరింటెండెంట్ సిఫార్సు చేయాలి. అయితే ఉన్నత స్థాయిలోని అధికారి నేరుగా జైళ్లశాఖలోని ఓ అధికారికి కాల్ చేసి. 'అరుణ మిమ్మల్ని కలుస్తామంటున్నారు. ఆమె చెప్పింది ఒకసారి వినండి.' అంటూ ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. సదరు అధికారిని అరుణ కలవగా.. ఈ విషయంలో తాను సిఫార్సు చేయలేనని కరాఖండిగా తేల్చిచెప్పినట్లు తెలిసింది. ఆ తర్వాత ఆయన కంటే పైస్థాయిలోని అధికారికి ఆ ఉన్నతాధికారి మౌఖిక ఆదేశాలిచ్చి పెరోల్ మంజూరు చేయించారని సమాచారం. అంతేకాదు జైల్లో ఉన్న శ్రీకాంత్‌ను జనవరి నుంచి ఏడు నెలల వ్యవధిలో 30 సార్ల వరకు కలిసిందంటే అరుణ అధికారులను ఏ స్థాయిలో ప్రభావితం చేసేదో స్పష్టమవుతుంది.

నన్ను నోరు విప్పమంటారా?.. అరుణ బెదిరింపులు

శ్రీకాంత్ ప్రియురాలు అరుణ పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులతో సంబంధాలు నెరుపుతూ.. తమ అరాచకాలు, సెటిల్‌మెంట్లకు అడ్డు లేకుండా చేసుకుంది. శ్రీకాంత్ పెరోల్ వ్యవహారం వివాదాస్పదం కావటం, ఈ క్రమంలో ఈ ముఠా అరాచకాలన్నీ వెలుగులోకి రావటంతో వారికి సహకరించిన ప్రజాప్రతినిధులు, బ్యూరోక్రాట్లు ప్రస్తుతం నోరువిప్పడంలేదు. వారందరి గుట్టురట్టు చేస్తానని హెచ్చరించేలా అరుణ మంగళవారం ఫేస్‌బుక్ ఖాతాలో పోస్టు పెట్టారు. "శ్రీకాంత్‌ను వాడుకున్న వారంతా ఎందుకు నోరు మెదపట్లేదు? ఇప్పటికైనా స్పందిస్తారా? లేకపోతే నా నోరు విప్పమంటారా?" అంటూ బెదిరింపు ధోరణితో హెచ్చరించారు. ఆమె అసలు ఎవరెవర్ని ఉద్దేశించి ఈ పోస్టు పెట్టింది? శ్రీకాంత్‌ను వాడుకున్నది ఎవరు? ఆమె నోరు విప్పితే ఎవరి బండారం బయటపడుతుంది? అనేవి ప్రశ్నార్థకంగా మారాయి.

'ధర్మా'గ్రహం!



కర్ణాటకలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రం ధర్మస్థళ పేరు దెబ్బతినేలా కొన్ని దుష్టశక్తులు కుట్ర పన్నాయంటూ పలు హిందూ సంఘాలు బెళగావి నగరంలో మంగళవారం భారీ ప్రదర్శన నిర్వహించాయి. ఎడతెరిపి లేని వానలోనూ వేల మంది తరలి వచ్చి గొడుగులతో నిరసనలో పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే, బెళగావి

హైకోర్టు ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఏకగ్రీవం

ఈనాడు, అమరావతి: ఏపీ హైకోర్టు ఉద్యోగుల సంఘం (ఏపీహెచ్‌సీఈఏ) అధ్యక్ష పదవి మినహా మిగిలిన కార్యవర్గం మొత్తం ఏకగ్రీవమైంది. ఉపాధ్యక్షులుగా ఆర్.దివాకర్, కార్యదర్శిగా సుధా వెంకటేశ్వరరావు, కోశాధికారిగా ఆర్.కోటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శులు- 1, 2గా కర్రా సీతాపతికుమారి, పినిని సత్యనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా పీరా సాహెబ్, కార్యనిర్వాహక సభ్యులుగా ఎం.నాగప్పయ్య, బి.లక్ష్మీనారాయణ, ఎస్.వెంకటేశ్వరరావు, లక్ష్మణ జస్వంత్, సీహెచ్.రాజేష్, కె.మీరయ్య, జనకోటి నూకరాజు, చంద్రశేఖర్, ఆర్.పద్మావతీదేవి, ఎం.పాలిని, చైతన్య ఏకగ్రీవం అయ్యారు.

అధ్యక్ష పదవికి 30న ఎన్నిక: అధ్యక్ష పదవికి నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ నెల 30న ఎన్నిక నిర్వహించనున్నారు. జె.గాయత్రీదేవి, పల్లా వినోద్‌కుమార్, ఎస్.సతీష్‌వర్మ, సయ్యద్ షానూషా బరిలో ఉన్నారు. ఎన్నికల అధికారి ఎం.సూర్యనారాయణరెడ్డి, సహాయ ఎన్నికల అధికారులు కేవీఎస్ ప్రసాదరావు, ఎస్.శిఖ ఈ వివరాలు తెలిపారు.

మినీ అంగన్‌వాడీ కేంద్రాలకు మెయిన్ హోదా

ఈనాడు, అమరావతి: గత ఎన్నికల్లో ఇచ్చిన మరో కీలక హామీని కూటమి ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చింది. ఈ మేరకు అంగన్‌వాడీ కేంద్రాల ఉన్నతీకరణ హామీని అమలు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా 4,687 మినీ అంగన్‌వాడీలు మెయిన్ అంగన్‌వాడీలుగా మారనున్నాయి.

నైపుణ్యాభివృద్ధిలో వ్యూహాత్మక భాగస్వామ్యం

విశాఖపట్నం (జగదాంబకూడలి), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ), రష్యన్ యూనియన్ ఆఫ్ ఇండస్ట్రియలిస్ట్స్ అండ్ ఆంత్రప్రెన్యూర్స్ (ఆర్ఎస్‌పీపీ) మధ్య నైపుణ్యాభివృద్ధిలో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదిరింది. మంగళవారం విశాఖపట్నంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌డీఅండ్‌టీ) ప్రధాన కార్యదర్శి కోన శశిధర్ పాల్గొన్నారు. రాష్ట్రంలో విద్య, నైపుణ్యాభివృద్ధి.. తదితర అంశాలను రష్యా ప్రతినిధులకు ఆయన వివరించారు. ఆంధ్ర యూనివర్సిటీ వీసీ రాజశేఖర్ హాజరై విశ్వవిద్యాలయాల్లో అమలుచేస్తున్న కార్యక్రమాలు, పురోగతిపై తెలియజేశారు. ఇరు దేశాల మధ్య సంయుక్త ప్రాజెక్టులు, శిక్షణ కార్యక్రమాల రూపకల్పన, విజ్ఞాన మార్పిడి, వ్యూహాత్మక సహకారం మెరుగవుతుందని, రాష్ట్ర యువతకు దేశీయంగా, రష్యాలో ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని కోన శశిధర్ తెలిపారు.



కార్యక్రమంలో పాల్గొన్న రష్యా బృందం, ఏపీఎస్ఎస్‌డీసీ ప్రతినిధులు

శ్రీకాంత్ పెరోల్‌కు నేను సిఫార్సు చేయలేదు: సోమిరెడ్డి

వెంకటాచలం, న్యూస్‌టుడే: ఒక మహిళ తన వద్దకు వచ్చి తన భర్త జైల్లో ఉన్నాడని, పెరోల్ ఇచ్చేందుకు ప్రభుత్వానికి సిఫార్సు లేఖ ఇవ్వాలని కోరినా తాను ఇవ్వలేదని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఒక పత్రికలో వచ్చిన చిత్రంపై ఆయన స్పందించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఒక సంస్థ ఛైర్మన్ సిఫార్సుతో ఆ మహిళ తన వద్దకు వచ్చారని.. శాలువా కప్పి, తన భర్త పెరోల్‌కు సిఫార్సు చేయాలని కోరారన్నారు. మరొక నియోజకవర్గానికి చెందిన విషయంలో తాను కల్పించుకోనని, తనకు తెలియని వ్యక్తికి లేఖ ఇవ్వలేనని తేల్చిచెప్పానన్నారు. ఆమె మూడుసార్లు వచ్చినా సిఫార్సు లేఖ ఇవ్వలేదని వెల్లడించారు.

30న విశాఖలో జనసేన విస్తృతస్థాయి సమావేశం

15 వేల మందికి పైగా హాజరవుతారన్న మంత్రి మనోహర్



విశాఖపట్నం (సీతంపేట), న్యూస్‌టుడే: జనసేన పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని ఈ నెల 30న మధ్యాహ్నం 3 గంటలకు విశాఖపట్నం మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి సుమారు 15 వేల మందికి పైగా హాజరవుతారన్నారు. మంగళవారం సాయంత్రం విశాఖపట్నంలోని పౌరగ్రంథాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'ప్రస్తుతం పార్టీకి 12.43 లక్షల మంది క్రియాశీలక సభ్యులు ఉన్నారు. భవిష్యత్తు కార్యాచరణపై పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తారు. సమావేశాన్ని విజయవంతం చేయడానికి 12 కమిటీలు నియమించాం. విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణకు పవన్ కల్యాణ్ కేంద్ర ప్రభుత్వంతో చర్చించి ఉత్తరాంధ్రకు అండగా నిలుస్తారు' అని చెప్పారు. కార్యక్రమంలో శాసనమండలిలో ప్రభుత్వ విప్ పి.హరిప్రసాద్, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు, సుందరపు విజయ్‌కుమార్, నిమ్మక జయకృష్ణ, తూర్పుకాపు కార్పొరేషన్ ఛైర్మన్ పాలవలస యశస్వి, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

నందమూరి జయకృష్ణ సతీమణి పద్మజ కన్నుమూత

భౌతికకాయానికి సీఎం చంద్రబాబు నివాళి



పద్మజ

పద్మజ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, చిత్రంలో బాలకృష్ణ, లోకేశ్, జయకృష్ణ

హైదరాబాద్, న్యూస్‌టుడే: దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ కుమారుడు నందమూరి జయకృష్ణ సతీమణి పద్మజ (73) మంగళవారం మృతి చెందారు. అనారోగ్యం కారణంగా కొద్ది రోజులుగా గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో ఆమె చికిత్స పొందుతున్నారు. కన్నుమూసిన విషయం తెలిసిన వెంటనే ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని జయకృష్ణ నివాసానికి చేరుకున్నారు. పద్మజ భౌతికకాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారితో తనకు ఉన్న అనుబంధం గుర్తుచేసుకున్నారు. "నా పెళ్లి సమయంలో జయకృష్ణ, పద్మజ పెద్ద దిక్కుగా ఉండి అన్నీ చూసుకున్నారు. ఇంట్లో మా అత్తగారి తర్వాత అదే కుటుంబం పెద్దగా అందరినీ కలుపుకొనేలా ఉండేవారు. ఆమె మృతి చెందడం చాలా బాధేస్తోంది. అందరికంటే జయకృష్ణతోనే నేను సినిమాల్లోనూ మంత్రిగా ఉన్నప్పుడు ఎగ్జిబిటర్‌గా ఆయన నా దగ్గరికి వచ్చేవారు" అని చంద్రబాబు తెలిపారు. సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పద్మజ భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించి కన్నీరు పెట్టుకున్నారు. వదిన మాకు అమ్మతో సమానమని ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని అన్నారు. ఏపీ రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, ఎంపీ పురందేశ్వరి, దగ్గుబాటి వెంకటేశ్వరరావు దంపతులు, పద్మజ భౌతికకాయానికి నివాళులర్పించారు. అంత్యక్రియలు బుధవారం ఉదయం జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆర్థిక సంఘం నిధులు రూ. 1,121 కోట్లు విడుదల చేయాలి

సీఎంకు ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ విజ్ఞప్తి



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం ఇస్తున్న వైవీబీ రాజేంద్రప్రసాద్, బిర్రు ప్రతాప్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని పంచాయతీలకు 2024-25లో రెండో విడత రావాల్సిన రూ. 1,121 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వైవీబీ రాజేంద్రప్రసాద్, బిర్రు ప్రతాప్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సర్పంచులు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల సమస్యల పరిష్కారానికి మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. పది నెలల గౌరవ వేతనాల బకాయిలు చెల్లించాలని కోరారు. రాజధాని అమరావతిలో పంచాయతీరాజ్ భవన్ నిర్మాణానికి పదెకరాలు కేటాయించాలన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు కుటుంబ సభ్యులతో ఏడాదికోసారి తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకునేందుకు అవకాశం కల్పించాలని విన్నవించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే గ్రామాల అభివృద్ధికి 'పల్లె పండుగ' కార్యక్రమం కింద ఉపాధి హామీ పథకంలో రూ.కోట్లలో నిధులు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

సముద్ర ఉత్పత్తుల ఎగుమతి పరిశ్రమను ఆదుకోండి

నిర్మలా సీతారామన్‌కు శ్రీనివాసవర్మ బృందం వినతి



కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, ఎంపీలు బీదమస్తాన్‌రావు, సానాసతీష్, సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతిదారుల సంఘం అధ్యక్షుడు పవన్‌కుమార్

ఈనాడు, దిల్లీ: అమెరికా ప్రభుత్వం విధించిన సుంకాల కారణంగా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నందున తమను ఆదుకోవాలని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు భారతీయ సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతిదారుల సంఘం విజ్ఞప్తి చేసింది. కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, తెదేపా ఎంపీలు బీదమస్తాన్‌రావు, సానాసతీష్‌ల నేతృత్వంలో ఆ సంఘం అధ్యక్షుడు పవన్‌కుమార్, సీఈఓ రాఘవన్ తదితరులు ఆర్థికమంత్రిని మంగళవారం కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. 25% సుంకాలతోపాటు, కౌంటర్ వెయిలింగ్ డ్యూటీ, యాంటీ డంపింగ్ డ్యూటీలు అన్నీ కలిపి 35% మేరకు సుంకాలను మోయాల్సి వస్తోందని వారు వివరించారు. ఈ పరిణామాలతో దేశవ్యాప్తంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా 25 లక్షల మంది నష్టపోయే ముప్పు ఏర్పడినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అమెరికాకు ఎగుమతి చేసే ఉత్పత్తుల విలువలో 8%, ఇతర దేశాలకు ఎగుమతి చేసే ఉత్పత్తుల విలువలో 2% మేర ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని కోరారు.



పుస్తక పఠనమంటే గణాంకాలు గుర్తుపెట్టుకోవడం కాదు!

పుస్తక పఠనమంటే కేవలం చదువుతూ వెళ్లడమో, గణాంకాలను గుర్తు పెట్టుకోవడమో కాదు. అది మన ఆలోచనా విధానంలో సానుకూల మార్పులు తీసుకురావాలి. అలా రావాలంటే.. చదివే ప్రతి వాక్యం వాస్తవమో, కాదో మనకు మనమే ప్రశ్నించుకోవాలి. అందులోని నిగూఢార్థాలను గ్రహించగలగాలి. అలా చేయగలిగితే.. మనం జీవితంలో ఎదుర్కొంటున్న చాలా సమస్యలకు పరిష్కార మార్గాలు పుస్తక పఠన సమయంలోనే దొరికే అవకాశాలుంటాయి.

– ఉమర్ రియాజ్, కాపీరైటర్

కేంద్రం, సీఈసీపైనా విద్వేషకర పోస్టులు

- కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌కు బుర్ర తక్కువని వ్యాఖ్యలు
- 'రోహింగ్యాలు వస్తుంటే గుట్కా నములుతున్నావా?' అంటూ బండి సంజయ్‌పై కామెంట్లు
- వాణిజ్య పన్నుల శాఖ అధికారి సుభాష్ చంద్రబోస్ బరితెగింపు

ఈనాడు, అమరావతి: బాధ్యతాయుతమైన ప్రభుత్వ కొలువులో ఉండి కూడా.. రాజధాని అమరావతి మునిగిపోయిందంటూ సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత పోస్టులు పెట్టిన తిరుపతికి చెందిన వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.సుభాష్ చంద్రబోస్ గతంలోనూ అలాంటి వివాదాస్పద వ్యాఖ్యలెన్నో చేశారు. ప్రభుత్వ అధికారినని మర్చిపోయి.. కేంద్ర ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ వ్యవస్థల పైనా ఆయన పరుష వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలోని ఎన్‌డీయే ప్రభుత్వం పైనా ఘాటైన విమర్శలు చేశారు. ఆయన ఫేస్‌బుక్ ఖాతాను పరిశీలిస్తే అలాంటి విద్వేషపూరిత వ్యాఖ్యలు చాలా కనిపించాయి. కాంగ్రెస్ లేవనెత్తిన 'ఓట్ల చోరీ' అంశంపై ప్రస్తుత, పూర్వ కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్లు జ్ఞానేశ్‌కుమార్, రాజీవ్ కుమార్‌ల వ్యాఖ్యల్ని తప్పు పడుతూ ఆయన ఈ నెల 17న ఒక పరుషమైన పోస్ట్ పెట్టారు. "అసలు వీళ్లు చదువుకున్నారా? లేదా? ఇంత బుర్ర తక్కువ కాబట్టే వీళ్లను నియమించుకున్నారా? రాజ్యాంగ సంస్థల్ని అవమానిస్తున్నారు. 3,600 సంవత్సరాలు పడుతుంది వీడియోలు చూడటానికి అని ఒకరు.. తల్లులు, కోడళ్లు, సోదరీమణుల వీడియోలు ఇవ్వాలని అడుగుతున్నారని ఒకరు.. ఫక్తు వీధి రాజకీయ నాయకుడి ప్రెస్‌మీట్‌లా సంబంధంలేని మాటలు, చెత్త సమర్థనలు. ఒక విషయం మీద సూటిగా సమాధానం చెప్పలేని అసమర్థత.. వెరసి రాహుల్ గాంధీ ఓట్ చోరీ మీద చేసిన ప్రతి విమర్శా సరైనదేనని రూఢి చేశారు" అంటూ వ్యాఖ్యలు చేశారు.

ఎన్నికల సంఘంపై నేరుగా మాటల దాడి..

సుభాష్ చంద్రబోస్ ఆ పోస్ట్‌తో ఆగలేదు.. "జాతికి అతి పెద్ద ద్రోహం చేసిన సంస్థ ఎన్నికల కమిషన్. ఓట్ల దొంగతనం అనేది అన్నిటికన్నా హీనమైంది. అదిప్పుడు చాలావాటికి సమాధానం చెప్పుకోవాలి" అని మరో పోస్ట్ పెట్టారు. కేంద్ర ప్రభుత్వంపై సుభాష్ ఒంటికాలిపై లేస్తూ పలు సందర్భాల్లో కామెంట్స్ పెట్టారు. "మీరు మార్వాడీ గోబ్యాక్ అంటే.. మేం రోహింగ్యాలు గో బ్యాక్ అంటాం" అని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నట్లుగా ఒక క్యాప్షన్‌ను, దానికి ఆయన ఫొటోను జత చేస్తూ.. వివాదాస్పద కామెంట్ పెట్టారు. "స్వయంగా నువ్వు హోం శాఖ సహాయమంత్రివి. డజను సంవత్సరాల నుంచి అధికారంలో ఉంది నీ పార్టీ. ఏం.. రోహింగ్యాలు వస్తుంటే గుట్కా నములుతూ కూర్చున్నావా?" అంటూ కామెంట్ పెట్టారు. ప్రధాని నరేంద్రమోదీని కూడా ఆ అధికారి విడిచిపెట్టలేదు. వక్ఫ్ ఆస్తులకు సంబంధించి.. ప్రధాని మోదీ, దానికి ప్రతిస్పందనగా మోడల్, నటి నేహాఖాన్ చేసిన వ్యాఖ్యల్ని జతచేస్తూ. . 'మర్యాదేమన్నా మిగిలిందా?' అని ప్రధానిని ఎద్దేవా చేసేలా పోస్టు పెట్టారు.

పవన్ కల్యాణ్‌ను అవమానిస్తూ..

సినిమా నటుడు సూర్య ఆర్థికసాయంతో కొందరు ఉన్నతస్థాయి డిగ్రీలు చేశారంటూ వచ్చిన వార్తను ట్యాగ్ చేస్తూ సుభాష్ చంద్రబోస్ కామెంట్ పెట్టారు. సూర్యను అభినందిస్తే ఫర్వాలేదు. కానీ దానితో పోలుస్తూ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేశారు. "51 మంది మెడికల్ విద్యార్థులు. 1,800 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు. . కేవలం సినిమా హీరోగా సహాయం చేసినందు వల్ల.." అంటూ సూర్యను పొగుడుతూనే దానికింద "సైలెన్సర్లు పీకేసి రోడ్లమీద స్టంట్లు చేసి.. థియేటర్లలో చిల్లర ఎగరేసి.. సినిమాల నుంచి ఉపముఖ్యమంత్రిగా ఎదిగిన వ్యక్తి సహాయం చేసినందు వల్ల!" అని జనసేన కార్యకర్తల్ని అవమానించేలా పోస్టు పెట్టారు.

సుభాష్ చంద్రబోస్‌పై ప్రభుత్వానికి నివేదిక

సర్వీసు నిబంధనలకు విరుద్ధంగా.. రాజధాని అమరావతిపై పెట్టిన అభూత కల్పనలతో పోస్టులు పెట్టడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తినా.. సుభాష్ చంద్రబోస్ వాటిని తొలగించలేదు. ఆయన పోస్టుల వివాదంపై తిరుపతిలోని వాణిజ్య పన్నులశాఖ అదనపు కమిషనర్ ప్రభుత్వానికి నివేదిక పంపారు. ప్రభుత్వం వాటిపై ఎలా స్పందిస్తుందో చూడాలి.

విశాఖ ఉక్కుపై వైకాపా దుష్ప్రచారం నమ్మొద్దు

ప్లాంట్ ఎప్పటికీ ప్రైవేటీకరణ కాదు: పల్లా

ఈనాడు, అమరావతి: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరిస్తున్నారని వైకాపాకు అనుబంధంగా ఉన్న కొందరు నేతలు, కార్మికసంఘాల నాయకులు చేస్తున్న ప్రచారం నిరాధారమని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. స్టీల్‌ప్లాంటు ఎప్పటికీ ప్రైవేటీకరణ కాదని, ప్లాంటు పరిరక్షణలో సీఎం చంద్రబాబు కీలకపాత్ర పోషించారని ఆయన వివరించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో పల్లా శ్రీనివాసరావు మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. 'కేంద్రం నుంచి రూ.11,440 కోట్లు, రాష్ట్రప్రభుత్వం నుంచి రూ.2,600 కోట్లు కలిపి మొత్తం రూ.14,040 కోట్లతో ప్లాంటుకు ఆర్థిక ఊపిరి అందించిన విషయాన్ని ప్రజలు, కార్మికులు గుర్తించాలి. ప్లాంటు మళ్లీ లాభదాయక దిశగా పయనిస్తోంది. కొందరు కార్మికసంఘ నేతలు ప్లాంటు మొత్తం ప్రైవేటీకరణ అవుతుందని సృష్టిస్తున్న ప్రచారం అవాస్తవం. కొన్ని కాంట్రాక్ట్ పనులను మెరుగైన సేవలు అందించేలా ప్రైవేటు సంస్థలకు అప్పగించారు. ఇదేమీ కొత్త విషయం కాదు. నెలకు రూ.240 కోట్ల జీతభత్యాల భారం ఉన్నా, పూర్తిస్థాయి ఉత్పత్తితో నెలకు రూ.100-200 కోట్ల లాభాలు సాధ్యమే' అని పల్లా శ్రీనివాసరావు అన్నారు. 'వైకాపా పాలనలో ప్లాంటు 20-30 శాతం సామర్థ్యంతోనే నడిచింది. స్టీల్‌ప్లాంటు, అమరావతిపై ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు ఇకనైనా మానుకోవాలి' అని వైకాపా నేతలను శ్రీనివాసరావు హెచ్చరించారు.

రూ.50 వేల రుణానికి రూ.15 లక్షల వసూలు!

కాల్‌మనీ కేటుగాళ్ల ఒత్తిడితో వివాహిత ఆత్మహత్య

ఏఎన్‌యూ (మంగళగిరి) న్యూస్‌టుడే: కాల్‌మనీ కేటుగాళ్లు రెచ్చిపోయారు. రూ.వేలల్లో తీసుకున్న అప్పునకు రూ.లక్షల్లో చెల్లించినా ఇంకా ఇవ్వాలంటూ ఓ మహిళను మానసికంగా వేధించి, ఆమె ప్రాణాలు తీసుకునేలా చేశారు. ఈ ఘటనకు సంబంధించి విజయవాడకు చెందిన ఐదుగురు కాల్‌మనీ వ్యాపారులను గుంటూరు జిల్లా తాడేపల్లి పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తాడేపల్లి మండలం నులకపేటకు చెందిన అద్దంకి కృష్ణవేణి, జయకృష్ణ దంపతులు 2016లో విజయవాడ కాల్‌మనీ వ్యాపారులు దుక్కా శ్రీను, దుక్కా వేణు వద్ద రూ.50 వేలు అప్పు తీసుకున్నారు. కొన్ని నెలల తర్వాత కాల్‌మనీ వ్యాపారులు వారి నుంచి రూ.15 లక్షలు వసూలు చేశారు. ఇంకా డబ్బులు ఇవ్వాలని తరచూ వేధిస్తున్నారు. జయకృష్ణ పురోహితుడిగా పనిచేసే విజయవాడ పుష్కర ఘాట్ వద్దకు, ఇంటికి వచ్చి అవమానకరంగా మాట్లాడడంతో కృష్ణవేణి తీవ్ర మనోవేదనకు గురయ్యారు. కాల్‌మనీ వ్యాపారుల ఆగడాల వల్లే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు లేఖ రాసి సెల్ఫీ వీడియో తీసి, ఈ నెల 14న ఎలుకలమందు తాగారు. భర్త ఆమెను విజయవాడ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల 15న మృతి చెందారు. జయకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ వీరేంద్రబాబు తెలిపారు. నిందితులు దుక్కా శ్రీను, దుక్కా వేణు, బచ్చి ప్రసాద్, రామకృష్ణ, రవికుమార్‌లను అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టామన్నారు.

ప్రభుత్వం.. ప్రజలకు వారధిగా ఫొటో జర్నలిస్టులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య ఫొటో జర్నలిస్టులు వారధిగా నిలుస్తున్నారని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ప్రశంసించారు. కరిగిపోయే కాలానికి చెరిగిపోని సాక్ష్యం.. ఫొటో అని పేర్కొన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఎంతో ఓపికతో, నిబద్ధతతో ఫొటోగ్రాఫర్లు తీసిన చిత్రాలు.. మనిషి మెదళ్లను కదిలిస్తాయని, అంతటి మహత్తర శక్తి చిత్రానికి ఉంటుందన్నారు. చక్రవర్తుల రాఘవాచార్యులు మీడియా అకాడమీ ఆఫ్ ఏపీ ఛైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. బాల్యం నుంచి తనకు ఫొటోగ్రఫీ అంటే ప్రత్యేకమైన ఆసక్తి ఉందని చెప్పారు. ఇక్కడి పోటీల్లో గెలుపొందిన ప్రతి చిత్రం.. స్ఫూర్తిదాయకం, సందేశాత్మకమన్నారు. సమాచార శాఖలో ఫొటోగ్రాఫర్‌గా సుదీర్ఘకాలం పాటు సేవలు అందిస్తున్న వి.వి.ప్రసాద్‌ను కలెక్టర్ లక్ష్మీశ సత్కరించారు. సీనియర్ జర్నలిస్ట్ పి.వి.కృష్ణారావు, సి.హెచ్.వి.మస్తాన్, సి.హెచ్.నారాయణరావులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. తొలుత ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్యురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏపీ స్టేట్ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్, సీఆర్ మీడియా అకాడమీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పోటీలకు తొమ్మిది రాష్ట్రాలు... 138 పత్రికలకు చెందిన ఫొటో జర్నలిస్టులు 552 ఎంట్రీలు పంపారు. వీటిల్లో 50 మందికి అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సి.హెచ్.విజయభాస్కర్, ప్రధాన కార్యదర్శి జి.మహేష్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కంచల జయరాజ్, చందు జనార్దన్, చావా రవి తదితరులు పాల్గొన్నారు.



ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, రాఘవాచార్యులు మీడియా అకాడమీ ఆఫ్ ఏపీ ఛైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వి.సుబ్బారావు, ఏపీపీజేఏ రాష్ట్ర అధ్యక్షుడు విజయభాస్కర్ తదితరులు



అవార్డులతో 'ఈనాడు' ఫొటో జర్నలిస్టులు రాజారమేష్ (కాకినాడ), వి.కె.ఆర్.ఎస్.శర్మ (కోనసీమ), హరిగంగాధర్ (తిరుపతి), ఎం.సంపత్‌కుమార్ (విజయవాడ), వై.వి.వి.సత్యనారాయణ (విజయవాడ), చల్లా మల్లికార్జున (ఒంగోలు)

'ఈనాడు' ఫొటోగ్రాఫర్ల ప్రతిభ

ఈ పోటీల్లో పదిమంది 'ఈనాడు' ఫొటోగ్రాఫర్లకు అవార్డులు లభించాయి. సి.హెచ్.రాజారమేష్ (కాకినాడ), హరిగంగాధర్ (తిరుపతి), ఎం.సంపత్‌కుమార్ (విజయవాడ), వై.వి.వి.సత్యనారాయణ (విజయవాడ), చల్లా మల్లికార్జున (ఒంగోలు), దండా శ్రీనివాస్ (హైదరాబాద్), ఆవుల శ్రీనివాస్ (హైదరాబాద్), పి.సింహాచలం (ఆదిలాబాద్), సైదేశ్వరరావు (వరంగల్), వి.కె.ఆర్.ఎస్.శర్మ (కోనసీమ ఫొటో కంట్రిబ్యూటర్)కు అవార్డులు వచ్చాయి.

29, 30 తేదీల్లో నరెడ్కో జాతీయ సదస్సు



సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నరెడ్కో ప్రతినిధులు

విశాఖపట్నం(పెదవాల్తేరు), న్యూస్‌టుడే: నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (నరెడ్కో) 17వ జాతీయ సదస్సు ఈ నెల 29, 30 తేదీల్లో దిల్లీ వేదికగా నిర్వహించనున్నారు. ఈ సదస్సుకు కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, మనోహర్‌లాల్ ఖట్టర్, కింజరాపు రామ్మోహన్‌నాయుడు, తోఖన్ సాహూ, రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, సీనియర్ ఐఏఎస్ అధికారులు, నరెడ్కో జాతీయ అధ్యక్షుడు హరిబాబు, ఛైర్మన్ నిరంజన్ హిరానందని, వైస్ ఛైర్మన్ రాజన్ ఎన్.బందేల్కర్ హాజరు కానున్నట్లు నరెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు గద్దె చక్రధర్ తెలిపారు. బుధవారం విశాఖ పెదవాల్తేరులోని నరెడ్కో ఉత్తరాంధ్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ సదస్సులో ప్రధానంగా రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి, నియంత్రణ సంస్కరణలు, పట్టణ పరివర్తన తదితర అంశాలపై చర్చించనున్నట్లు చెప్పారు. సదస్సులో అమరావతిపై ప్రజెంటేషన్ ఇస్తామన్నారు. ప్రధాన కార్యదర్శి వైవీ చౌదరి మాట్లాడుతూ పట్టణ ప్రణాళిక, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్, రెవెన్యూ, జీపీఏ మినహాయింపు, సింగిల్ విండో క్లియరెన్స్ వంటి అంశాలపై నరెడ్కో ప్రతినిధులు చర్చిస్తారని చెప్పారు.

వసుంధర

vasundhara@eenadu.in

మిర్చి తింటే జుట్టు నెరవదా?!

శోధిత



పండ్లు, కూరగాయలు, ఆకుకూరల్లోని పోషకాలతో ప్రయోజనాలెన్నో! జుట్టు నెరవకుండా చేయడంలోనూ వీటి పాత్ర ఉందని జపాన్ యూనివర్సిటీ పరిశోధన చెబుతోంది. పండ్లు, కూరగాయల్లో ఉండే ల్యూటియలిన్, హెస్పెరెటిన్, డయోస్మెటిన్ వంటి యాంటీ ఆక్సిడెంట్లు జుట్టు నెరవడాన్ని ఆలస్యం చేయడమో, నిరోధించడమో చేస్తాయంటున్నారు. ఈ మూడింటిలోకీ ల్యూటియలిన్ ప్రభావం ఎక్కువని ఎలుకలపైన చేసిన పరిశోధనల్లో గమనించారు. కేశాల రంగు, ఆరోగ్యం, రక్షణలో కీలకమైన కెరటినో సైట్ మూల కణాల వయోవృద్ధిని ల్యూటియలిన్ అడ్డుకోవడమే దీనికి కారణం. మనుషుల్లో ఈ మార్పు గురించి పరిశోధనలు జరగాల్సి ఉంది. జుట్టు సంగతి పక్కన పెడితే... ల్యూటెలిన్‌తో ఇతర రకాల ఆరోగ్య ప్రయోజనాలూ అనేకం ఉన్నాయి. వాపు, నొప్పిని తగ్గిస్తుంది. గుండె జబ్బుల్ని దూరం చేస్తుంది. మెదడును రక్షించి, క్యాన్సర్‌ను నివారించడంలోనూ తోడ్పడుతుంది. పచ్చిమిర్చి, క్యాప్సికం లాంటి అన్ని మిరప రకాల్లో ల్యూటియలిన్ ఎక్కువ మోతాదులో ఉంటుంది. ఇవి కాకుండా ఉల్లికాడలు, క్యాబేజీ, పాలకూర, సెలెరీ, గుమ్మడి, బ్రోకలీ వంటి కూరగాయల్లోనూ నిమ్మ, కమలాలు, కర్బూజా, కివీ... వంటి పండ్లలోనూ ఇది ఎక్కువగా ఉంటుంది. దీన్ని సప్లిమెంట్‌ల రూపంలోకంటే సహజంగా తీసుకుంటేనే ఎక్కువ ప్రయోజనాలు ఉంటాయనేది పోషకాహార నిపుణుల మాట.

ఆరోగ్యానికి గడ్డిపై నడక...



తెల్లారి లేచింది మొదలు.. రాత్రి నిద్రపోయేవరకూ మహిళలకు పని అలసట తప్పదు. దీంతో ఒక్కోసారి ఆందోళన, అదుపులోకి రాని ఒత్తిడి... వారిని గందరగోళ పరుస్తాయి. సమస్య గురించి ఆలోచించకుండానే... ఏదో ఒక ట్యాబ్లెట్ వేసుకుంటే సర్దుకుపోతుందిలే అనుకుంటారు. కానీ అది తాత్కాలికమే. మరేం చేయాలంటారా? కాసేపు గడ్డిలో నడవమని చెబుతున్నాయి పలు అధ్యయనాలు. ఇలా చెప్పులు లేకుండా గడ్డి మీద నడవడాన్నే ఎర్తింగ్ లేదా గ్రౌండింగ్ అని కూడా అంటారు. మీకెంత పని ఉన్నా సరే... ఉదయమో, సాయంత్రమో రోజూ ఓ పదినిమిషాలు గడ్డిలో నడిచి చూడండి. జర్నల్ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్ అండ్ పబ్లిక్ హెల్త్‌లో ప్రచురితమైన ఓ అధ్యయనం ప్రకారం ఒత్తిడి హార్మోన్ అయిన కార్టిసాల్ స్థాయులను ఈ నడక తగ్గిస్తుందట. నేలపై ఉండే ఎలక్ట్రాన్లు నిద్రలేమిని తగ్గించడమే కాదు... ఆరోగ్యకరమైన నిద్రకూ కారణమవుతాయట. ఇక, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా చేసిన మరో అధ్యయనం ఒంట్లోని వాపుని తగ్గించి వ్యాధినిరోధకశక్తిని పెంచుతుందని చెబుతోంది. అయితే, మీరు నడిచే గడ్డిలో పదునైనవేవీ లేకుండా చూసుకోండి చాలు. మధుమేహులు మాత్రం వైద్యుల సలహాతోనే ఈ పని చేయాలి.

మణిక... మిస్ యూనివర్స్ ఇండియా!



మణిక

లక్ష్యం మీద నమ్మకం... అనుకున్నది సాధించగలమన్న ధైర్యం ఉండాలే కానీ మహిళలకు సాధ్యం కానిదంటూ ఏదీ ఉండదు. మణికా విశ్వకర్మ జీవితమే ఇందుకు నిదర్శనం. 'మిస్ యూనివర్స్ ఇండియా 2025' కిరీటాన్ని దక్కించుకున్న ఈమె ఎవరో తెలియాలంటే...

'అందాల పోటీలు సౌందర్య ప్రదర్శనకు మాత్రమే కాదు... సమాజానికి అవసరమైన అంశాల్ని చర్చించడానికీ, మన అభిప్రాయాల్ని చెప్పడానికీ అనువుగా ఉండే వేదికలు' అని నమ్మే వాళ్లలో మణిక ఒకరు. విశ్వవ్యాప్తంగా తన గళం వినిపించాలనే కోరికతో... బ్యూటీ పాజంట్లలో పాల్గొందీమె. గత ఏడాది మిస్ యూనివర్స్ రాజస్థాన్ కిరీటాన్ని గెలుచుకుంది. దాంతో మిస్ యూనివర్స్ ఇండియా పోటీలో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకుంది. ఇప్పుడు ఇక్కడ కూడా గెలిచింది. ఈమె పుట్టిపెరిగింది రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్. ప్రస్తుతం దిల్లీలో ఉంటోంది. పొలిటికల్ సైన్స్‌లో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది మణిక. చిన్నప్పట్నుంచీ కళల మీద మక్కువ ఎక్కువ. ఆ ఇష్టంతోనే సంప్రదాయ నృత్యరీతులు నేర్చుకుంది. జాతీయస్థాయిలో ఎన్నో ప్రదర్శనలు ఇచ్చింది. బహుమతులూ గెలుచుకుంది. చిత్రలేఖనం కూడా ఇష్టం ఈమెకు. సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటుంది. 'న్యూరోనోవా' అనే సంస్థను స్థాపించి, ఏడీహెచ్‌డీ, ఆటిజంతో బాధపడుతున్న చిన్నారులకు చేయూత అందిస్తోంది.

ఏది ముఖ్యం అంటే...

జైపుర్ వేదికగా జరిగిన ఈ పోటీల్లో 'మహిళా విద్య, పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం... రెండింటిలో మీరేం ఎంపిక చేసుకుంటారు. ఎందుకు?' అన్న ప్రశ్నకు... 'ఈ సమస్యల గురించి మాట్లాడేటప్పుడు మనం నాణేనికి రెండు వైపులా చూడాలి. మనదేశంలో చాలా గ్రామాల్లో నివసిస్తున్న మహిళలు కట్టుబాట్ల పేరుతో విద్యకు దూరమవుతున్నారు. దాంతో ఇంటికే పరిమితం అవుతున్నారు. ఒక ఇంట్లో మహిళ చదువుకుంటే... ఆ ఇంటిల్లిపాదికీ సరైన దిక్సూచి అవుతుంది. ఆర్థికంగానూ సహాయపడుతుంది. దేశాభివృద్ధిలోనూ కీలక పాత్ర పోషిస్తుంది అని నేను నమ్ముతా. అందుకే నేను మహిళా విద్యనే ఎంపిక చేసుకుంటా' అని సమాధానం చెప్పి మిస్ యూనివర్స్ ఇండియా 2025 కిరీటాన్ని దక్కించుకుంది 22 ఏళ్ల మణిక. దీంతో థాయ్‌లాండ్‌లో జరగనున్న మిస్ యూనివర్స్ పోటీల్లో తన చోటు పదిలం చేసుకుంది. దూరదృష్టి, సమస్యను సానుకూల దృక్పథంతో చూడటం, విజయాల్ని మెట్లుగా భావించి అనుకున్న లక్ష్యాల్ని చేరుకోవడంలో దిట్ట ఈమె. అందుకే ఈ కిరీటం దక్కించుకున్నాక... 'కెరియర్‌లో రాణించడానికి మీరు అధిగమించిన ఇబ్బందులేంటి' అని అడిగితే... 'ఇబ్బందుల్నే ఎప్పుడూ ఎందుకు ప్రస్తావించాలి. నన్ను అడిగితే... గడ్డు పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నప్పుడు చేయూతనిచ్చి... చిన్న చిన్న ప్రశంసలతో మనలో ఆత్మవిశ్వాసం నింపిన వారిని ఇలాంటప్పుడు తలచుకోవాలి. అదే మనం వాళ్లకి ఇచ్చే గుర్తింపు. నా విజయానికి కారణం కూడా వాళ్లే. మా టీచర్లు, అమ్మానాన్నలు, స్నేహితులకు రుణపడి ఉంటాను నేను. వీళ్లే నా చీర్ లీడర్స్' అంటూ చెప్పుకొచ్చిందీమె.

బంగారం - వెండి



19న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,02,000	93,150	1,16,393
విజయవాడ	99,210	92,350	1,16,800
ప్రొద్దుటూరు	1,00,500	92,460	1,16,500
రాజమహేంద్రవరం	1,00,750	92,350	1,26,000
విశాఖపట్నం	1,00,400	92,350	1,25,000
తమిళనాడు	-----	92,350	1,26,000


మీకు తెలుసా



ఆరునెలల్లోపు పసిపిల్లలు డైవింగ్ రిఫ్లెక్స్ అనే సహజ గుణాన్ని కలిగి ఉంటారు. అంటే- నీటిలోపల శ్వాసని బిగబట్టగలగడంతో గుండె వేగం తగ్గుతుంది, ఉపరితల రక్తనాళాలు సంకోచిస్తాయి. నీళ్లు లోపలకు వెళ్లవు. అయితే ఈ లక్షణం... పుట్టిన ఆరునెలలకి చాలామందిలో దానంతటదే పోతుందట. అలాగని పసివాళ్లని సహజ స్విమ్మర్లుగా భావించి ఈతకొలనులో నేరుగా వదలకూడదు.

అయిదేళ్లు... నాలుగు ప్రమోషన్లు!

కెరియర్ మంత్ర



రిత్విక

కృత్రిమమేధ పుణ్యమాని గ్లోబల్ టెక్ పరిశ్రమలో పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఫలితమే లేఆఫ్‌లు, ఉద్యోగుల తొలగింపులు. పెద్ద సంస్థలన్నీ ఈ బాటలో నడుస్తుండటంతో టెక్ ఉద్యోగుల్లో భయం చోటు చేసుకుంటోందన్నది వాస్తవం. ఇలాంటి సమయంలో ఓ భారత సంతతి అమ్మాయి కెరియర్ అందరినీ ఆకర్షిస్తోంది. ఆమె పేరు రిత్విక నాగుల.

2019లో చదువు పూర్తవ్వగానే మైక్రోసాఫ్ట్‌లో ఉద్యోగం సాధించింది రిత్విక. చక్కగా పని చేస్తూ వెళ్తే చాలు ఫలితాలు అనుసరిస్తాయి అనుకుందట. 'మౌనంగా పనిచేస్తూ వెళ్తోంటే పైవాళ్లకేమో కెరియర్‌లో ఎదగాలన్న కోరిక లేదన్న సందేశం వెళ్లింది. అందుకే, పంథా మార్చా' అంటోందీమె. రెండో ఏడాది నుంచి మేనేజర్‌తో నెలకు ఒక్కటైనా వన్ టూ వన్ సెషన్ ఉండేలా చూసుకునేదట. ఏయే అంశాల్లో తను మెరుగ్గా ఉంది? మార్చుకోవాల్సినవేంటి? మెరుగవ్వాల్సినవి ఏమైనా ఉన్నాయా అని తెలుసుకునేది. అంతేకాదు, తనకోసం ప్రత్యేకంగా ఒక టైమ్‌టేబుల్ తయారుచేసుకుంది. ప్రతి 18-24 నెలలకు ఒక్కో స్థానం ఎదగాలన్న లక్ష్యాన్ని పెట్టుకుని ఆ దిశగా ప్రయత్నిస్తూ వెళ్లింది. 'ఇప్పుడున్న స్థానానికి నానుంచి ఏం ఆశిస్తున్నారు? తరవాతి స్థానానికి వెళ్లాలంటే ఇంకా ఏం కావాలో తెలుసుకునేదాన్ని. ఆ నైపుణ్యాలను పెంచుకుంటూ వచ్చా' అని చెబుతోంది రిత్విక. అలాగే ఫీడ్‌బ్యాక్‌ని కేవలం మేనేజర్ నుంచే కాదు, తోటి ఉద్యోగులు, మెంటార్‌ల నుంచీ తీసుకుంటుంది. తగ్గట్టుగా తనను తాను మార్చుకునేది. అవకాశం ఇచ్చేదాకా ఎదురుచూసేది కాదట. 'సీనియర్ హోదా దక్కాలంటే ఓ ప్రాజెక్టుకి లీడ్ చేయాలని విన్నా. ఆ అవకాశం నేను తీసుకోవాలనుకుంటున్నా అని నేరుగానే అడిగా. దీనివల్ల బాధ్యతలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నానని వాళ్లకి అర్థమైంది' అని చెబుతోందీమె. అంతేకాదు, 'ప్రమోషన్ అందుకోవడమంటే ఇచ్చిన పని చేయడం మాత్రమే కాదు. కొత్త అవకాశాలను వెతుక్కోవాలి. మన గురించి మనం తెలుసుకుంటూ... ఎప్పటికప్పుడు కొత్త లక్ష్యాలు నిర్దేశించుకోవాలి. వాటిని సమర్థంగా పూర్తిచేయాలి. ఈ తీరే నా అయిదేళ్ల కెరియర్‌లో నాలుగు ప్రమోషన్లు తెచ్చుకోవడానికి కారణమైంది' అంటోంది రిత్విక. ఈ సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ప్రయాణం గ్రాడ్యుయేట్లనే కాదు... ఉద్యోగులనూ ఆకర్షిస్తోంది. తన ప్రయాణం నెట్టింట వైరలైంది కూడా!

మీది పేసింగ్ పేరెంటింగేనా?



'నేను స్కూల్‌కి వెళ్లను. నాకు నచ్చట్లేదు' అని పిల్లలు అన్నారనుకోండి. 'నోరు మూసుకొని వెళ్లు. స్కూలుకి వెళ్లకుండా ఇంట్లో కూర్చొని ఏం చేస్తావ్?' ... సాధారణంగా చాలావరకూ అమ్మానాన్నలు అనే మాటే ఇది కదా!

'అమ్మా... నా బొమ్మ విరిగింది' అని ఏడుస్తుంటే... 'బొమ్మే కదా... దానికే ఏడవాలా? ఇంకోటి కొనిస్తాగా'... ఎంత చిన్న విషయం? దానికి ఎందుకు ఏడుపు అనే అనుకుంటాం.

మరి పిల్లలు? వాళ్లు ప్రతిదాన్నీ మనలా చూడరు. అంత పరిజ్ఞానం కూడా వాళ్లకు ఉండదు. పైగా మన ప్రవర్తన చూసి... అమ్మానాన్నలు మనల్ని అర్థం చేసుకోరు అనుకుంటారు. దీంతో ఫీలింగ్స్‌ని దాయడం నేర్చుకుంటారు. ఫలితం మనకు మానసికంగా దూరమవుతారు, లేదంటే మరింత పెంకివాళ్లుగా తయారవుతారు. ఇలా అవొద్దంటే మార్గం పేసింగ్ పేరెంటింగే! ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు దీనిమీదే చర్చ జరుగుతోంది. ఇంతకీ ఇదేమిటంటే... పిల్లల భావోద్వేగాలకు తగ్గట్టుగా మన తీరు మార్చుకోవడం. అంటే... స్కూలుకి వెళ్లను అనగానే 'నిజంగానే రోజూ స్కూలుకి వెళ్లడం బోరే' అనండి. ముందు వాళ్లు కామ్ అవుతారు. కారణాలు చెబుతారు. అప్పుడు నెమ్మదిగా వాళ్లకి స్కూలుకి వెళ్లడం వల్ల ఏం నేర్చుకోవచ్చు, ఎంత ఫన్ ఉంటుందో చెప్పి వాళ్ల దృష్టి మరల్చొచ్చు. బొమ్మ విషయంలో ఏడుస్తున్నప్పుడూ 'అరెరె... ఇది నీ ఫేవరెట్ కదా! అయ్యయ్యో ఎంత పనైంది' అని చూడండి. తరవాత 'ఇప్పుడేం చేద్దాం? పోనీ మనిద్దరం కలిసి అతికించి చూద్దామా? కుదరకపోతే ఇంకోటి కొనుక్కుందాం సరేనా' అని చెప్పొచ్చు. వాళ్ల దారిలోకి వెళ్లి... వాళ్లని ఊరుకోబెట్టడం. ఆపై నెమ్మదిగా నచ్చజెప్పడమే దీని ప్రత్యేకత. దీనివల్ల తల్లిదండ్రులు, పిల్లల మధ్య అనుబంధం పెరుగుతుందట. ప్రయత్నించొచ్చు కదూ!

సాహసాల పూబాట... గీతా సమోటా...

ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించటమంటే సాహసంతో కూడిన పని. అందుకు ఎంతో ధైర్యం, ప్యాషన్ ఉండాలి. ఇవన్నీ మెండుగా ఉన్న లేడీ సింగం గీతా సమోటా. కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం(సీఐఎస్ఎఫ్)లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తోన్న ఈమె... తాజాగా ఎవరెస్ట్ శిఖరాన్ని ఎక్కి, సీఐఎస్ఎఫ్ విభాగంలో ఈ ఘనత సాధించిన తొలి మహిళగా నిలిచారు. ఆమెను 'వసుంధర' పలకరించింది.



గీత

రాజస్థాన్ రాష్ట్రం సికార్ జిల్లాలోని చక్ గ్రామంలో ఓ సాధారణ మధ్య తరగతి కుటుంబంలో జన్మించారు గీతా సమోటా. పాఠశాల, కళాశాల విద్య స్థానికంగానే పూర్తి చేశారు. అయితే, చిన్నప్పటి నుంచీ పురుషుల విజయగాథలు విన్నంతగా, చదివినంతగా, మహిళలవి వినలేదామె. దాంతో మహిళలు ఎందుకు వెనకడుగు వేస్తున్నారా? అని ఆలోచించేవారు. తానెందుకు ఏదో ఒక రంగంలో ప్రత్యేకంగా ఉండకూడదనుకునేవారు. క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని, కళాశాలలో హాకీ క్రీడాకారిణిగా మంచి పేరూ తెచ్చుకున్నారు. అయితే, ఒక సమయంలో ఆమెకు తగిలిన గాయం జట్టు నుంచి దూరం చేసింది. అది కాస్తా ఆమెకు తెలియకుండానే వేరే రంగం వైపు అడుగులు వేసేలా చేసింది.

వరస రికార్డులతో...

2011లో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సీఐఎస్ఎఫ్)లో చేరారు గీత. ఇక్కడే ఆమెకు పర్వతారోహణ పరిచయమైంది. 2015లో ఆలిలోని ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీసు(ఐటీబీపీ) శిక్షణా సంస్థలో చేరారు. ఆ బ్యాచ్‌లో పాల్గొన్న ఏకైక మహిళ కూడా తనే. ప్రాథమిక కోర్సులో ఆమె రాణించడంతో దీనిపై మరింత అభిరుచి, నైపుణ్యాలు పెరిగాయి. 2017లో అధునాతన పర్వతారోహణ కోర్సును పూర్తి చేసి, ఆ ఘనత సాధించిన ఏకైక సీఐఎస్ఎఫ్ సిబ్బందిగా నిలిచారు. ఈ కఠినమైన శిక్షణ ఆమెలోని పర్వతారోహకురాలిని బయటకు తీసుకురావడంలో కీలకపాత్ర పోషించిందట.

2019లో ఉత్తరాఖండ్‌లోని మౌంట్ సటోపంత్, నేపాల్‌లోని మౌంట్‌లొబూచె అధిరోహించిన గీత, కేంద్ర సాయుధ పోలీసు దళం(సీఏపీఎఫ్) నుంచి ఈ ఘనత సాధించిన మొదటి మహిళగా నిలిచారు. కొవిడ్ సమయంలోనూ 'సెవెన్ సమిట్స్' ఎక్కాలనే తన కలను అవిశ్రాంతంగా కొనసాగించారు. 2021-22లోనే ఆస్ట్రేలియాలోని మౌంట్ కాజీయాస్కో రష్యాలోని మౌంట్ ఎల్బ్రస్, టాంజానియాలోని మౌంట్ కిలిమంజారో, అర్జెంటీనాలోని మౌంట్ అకన్‌కాగువా అధిరోహించి సత్తా చాటారు. ఏడు శిఖరాల్లో నాలుగింటిని కేవలం ఆరు నెలల 27 రోజుల వ్యవధిలో అధిరోహించిన భారత మహిళగానూ నిలిచారు. ఈ ఏడాది మే 19న గీతా సమోటా ప్రపంచంలోనే ఎత్తైన ఎవరెస్టు శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించారు. కేంద్ర పారిశ్రామిక భద్రతా దళంలో... ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించిన ట్రయల్‌బ్లేజింగ్ అధికారిణిగా గుర్తింపు పొందారు. ప్రస్తుతం ఆమె దిల్లీ సీఐఎస్ఎఫ్ భద్రతా దళంలో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. దిల్లీ మహిళా కమిషన్ ద్వారా 'అంతర్జాతీయ మహిళా దినోత్సవ అవార్డు', పౌర విమానయాన మంత్రిత్వశాఖ నుంచి 'గివింగ్ వింగ్స్ టు డ్రీమ్స్ అవార్డు'లనీ అందుకున్నారు గీత.

– కె.దేవేంద్ర, శ్రీహరికోట

సోషల్ మీడియా మన విలువను నిర్ణయించలేదు!



అందం, అభినయంతోపాటు అద్భుతమైన వ్యక్తిత్వం ఐశ్వర్యారాయ్‌ది. తాజాగా లోరియల్ పారిస్ 'లెసన్స్ ఆఫ్ వర్త్' సిరీస్ కోసం ఓ వీడియో చేశారామె. అందులో ఓ అమ్మగా సోషల్ మీడియా గురించి బలమైన సందేశాన్ని అందించారు. 'నేను అందుకు అర్హురాలిని. అయితే, నిజంగా ఆ విషయాన్ని నిర్ణయించేది ఎవరు? పోస్ట్ చేసిన చిత్రాలా? లైకులా? లేదా సోషల్ మీడియాలో వచ్చే వ్యాఖ్యలా? మన విలువను నిర్ణయించే శక్తిని మనమే దీనికి ఇచ్చాం. కానీ, నా దృష్టిలో సోషల్ మీడియాకు, సోషల్ ప్రెజర్‌కి మధ్య పెద్ద తేడా ఏం లేదు. ఓ మహిళగా, తల్లిగా చిన్ని మనసులపై చూపించే ఆ ప్రభావం గురించే నా ఆందోళన. ఈ ముద్ర పెద్దల మీదా కనిపిస్తోంది. ఎక్కడైతే ప్రతి కామెంట్, లైక్... ఒకరి స్వీయ విలువను పరిగణించే కొలమానం అవుతుందో అప్పుడు ముందుకు వెళ్లడం కష్టం. సెల్ఫ్‌వర్త్ అనేది ఎక్కడపడితే అక్కడ, ముఖ్యంగా సోషల్ మీడియాలో దొరికేది కాదు. ఇది మనకు మనమే ఇచ్చుకునేది. ఆ విలువ సహజమైనది. అది మనలోనే ఉంటుంది. వెతకండి.... అప్పుడు అద్దంలో మిమ్మల్ని మీరు చూసుకుని 'ఐయామ్ వర్త్ ఇట్' అని చెప్పండి' అంటూ సందేశమిచ్చారు ఐశ్వర్య. ఈ వీడియో పెద్ద ఎత్తున వైరల్ అవ్వడమే కాదు... ప్రశంసలూ అందుకుంటోంది.

కడుపు నిండుగా... మనసు చల్లగా!



'కడుపు నిండుగా ఉంటే మనసు నెమ్మదిస్తుంది. ప్రశాంతంగా నిద్ర పడుతుంది..' సాధారణంగా బామ్మల నోటి నుంచి వచ్చే మాటే ఇది. ఏదో పరిశోధన చేసినట్లే మనసు బాగోకపోయినా, చిరాకుగా ఉన్నా, నిద్ర పట్టట్లేదన్నా... ఇదిగో ఈ మాట చెప్పేస్తుంటారు. నిజానికి ఇప్పుడే కాదు... దాదాపు 2 వేల ఏళ్ల క్రితమే మన పూర్వికులు జీర్ణశక్తి బాగుంటే సంతోషంగా జీవితాన్ని గడిపేయొచ్చు అని చెప్పేవారట. నిజానికి దీనిమీద ఎన్నో పరిశోధనలూ జరుగుతున్నాయి. మరి తేలిందేంటో తెలుసా? గట్ అదేనండీ జీర్ణవ్యవస్థ బాగుంటే మనసూ బాగుంటుందనే! దీన్ని గట్- బ్రెయిన్ కనెక్షన్ అనీ పిలుస్తారట.

మన పెద్దపేగులో అనేక సూక్ష్మజీవులు నివసిస్తుంటాయని తెలుసుగా! ఇవి కేవలం ఆహారం జీర్ణమవడానికే సాయపడవు. రోగనిరోధకత, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ కాంపౌండ్స్ విడుదల, న్యూరోట్రాన్స్‌మిటర్లు తద్వారా సెరటోనిన్, డోపమైన్ వంటి హార్మోన్ల విడుదలపైనా ప్రభావం చూపుతాయట. అలాంటి వీటి క్షేమం గురించీ ఆలోచించాలిగా! అందుకు సాయపడేవే ప్రీబయాటిక్స్, ప్రోబయాటిక్స్ వగైరా. అందుకే వీటిని ఆహారం ద్వారా అందేలా తప్పక చూసుకోవాలి. తరచూ తీసుకున్నవారిలో ఒత్తిడి, ఆందోళన వంటివీ తగ్గుతాయని అంటున్నారు నిపుణులు. అందుకే దీన్ని 'సైకోబయాటిక్స్' అనీ పిలుస్తారు. కాబట్టి, పిల్లలు మారాం చేస్తున్నారు, త్వరగా పూర్తవుతున్నాయని ఇన్‌స్టంట్ వాటి జోలికి వెళ్లకుండా సంప్రదాయ రుచులనే ప్రయత్నించండి. పెరుగు, పులియబెట్టిన ఆహారాలకే చోటివ్వండి. ఒత్తిడిలో ఉన్నవారు తరచూ పెరుగు తీసుకుంటే సానుకూల ప్రభావం ఉంటుందని అధ్యయనాలూ చెబుతున్నాయి. వీటితోపాటు కళ్లను ఆకర్షించేలా రంగురంగుల కూరగాయలు, పండ్లు, గుర్తుంచుకుని నీళ్లు భోజనంలో తప్పనిసరి చేసుకోవాలి. దాన్ని కూడా హడావుడిగా కాకుండా ప్రశాంతంగా, ఆస్వాదిస్తూ తీసుకోండి. కడుపు బాగుంటుంది తద్వారా మనసూ ప్రశాంతంగా ఉంటుంది. ఇంకేం... కుటుంబ ఆరోగ్యానికి ప్రయత్నించేయండి మరి!

ప్యాకింగ్... ప్రత్యేకంగా!

ఆఫీసు, విహారాలు ఏదైనా... ఆహారం వెంట తీసుకెళ్లడం చాలా మంది చేస్తున్న పనే! అనారోగ్యాలు దరిచేరవని ఇలా చేస్తాం కానీ... సరైన బాక్సులు ఎంచుకోకపోతేనే తిప్పలు. అవి తగ్గాలంటే ఈ సాయాలు కావాల్సిందే.

పిజ్జాకో డబ్బా



పిల్లలతో బయటికి వెళ్లామంటే అడిగేవాటిల్లో పిజ్జా ఒకటి. బయటివెందుకు ఇంట్లోనే చేసుకెళ్తే నయమని ప్రయత్నిస్తుంటారా? అయితే ఈ 'పిజ్జా స్లైసెస్ స్టోరేజ్ కంటెయినర్' మీకు కావాల్సిందే. పీసులు నలగకుండా చెక్కుచెదరకుండా దీనిలో పెట్టుకోవచ్చు. ప్రత్యేకంగా ప్లేట్లూ ఉంటాయి కాబట్టి, మీద పడేసుకుంటారన్న భయమూ ఉండదు. పోనీ ఆర్డర్ పెట్టి ఇంటికే తెప్పించుకున్నా... మిగిలిన వాటిని ఇందులో దాచుకోవచ్చు. ప్లేటుతో సహా అవెన్‌లో పెట్టి హీట్ చేసుకుంటే వేడివేడిగా ఆస్వాదించొచ్చు. ఎలాగైనా ప్రయోజనమే!



సలాడ్ తీసుకెళ్లండి

అల్పాహారం చేయడం కుదరకపోయినా... సాయంత్రాలు స్నాక్స్‌లా తినాలనుకున్నా మీకు గుర్తొచ్చేది పండ్లేనా? అయితే ఈ సలాడ్ కప్స్ తెచ్చేసుకోండి. కప్పులో జాలీ వంటి ఏర్పాటు ఉంటుంది. ద్రాక్ష, బెర్రీలు వంటివి అప్పటికప్పుడు సులువుగా శుభ్రం చేసుకోవడానికి ఇది సాయపడుతుంది. లేదు ముక్కలుగా కోసుకుని తీసుకెళతామంటారా? విడిగా ఫోర్క్ తీసుకెళదామంటే బ్యాగుకు రంధ్రాలు చేస్తుందేమో... తీసుకెళ్లకపోతే పదే పదే చేతులు శుభ్రం చేసుకోవాలన్న భయాలు ఉండవు. దానిలోపలే ఫోర్క్ ఉంటుంది. చక్కగా దాంతో తినేయొచ్చు.





స్మార్ట్ కిచెన్

జార్ బాటిలవుతుంది



శరీర ఆరోగ్యానికీ ఉత్సాహంగా ఉండటానికీ రోజూ తగినన్ని నీళ్లు తీసుకోవడం తప్పనిసరి. అస్తమానూ నీళ్లే ఏం తాగుతాం? అందుకే మజ్జిగ, పండ్లరసాలు వంటి ప్రత్యామ్నాయాలు తీసుకోమంటారు నిపుణులు. ఇంట్లో ఉంటే సరే. బయటికి వెళితేనే సమస్య కదూ! జ్యూస్ చేసుకుని వెంట తీసుకెళ్దామంటే... జ్యూస్ చేసి, వేరే పాత్రలోకి తీసుకోవడం ఓ జంజాటమే. కడగాల్సినవీ పెరుగుతాయి, లీకేజీ సమస్య అనుకుంటున్నారా? ఈ పోర్టబుల్ జ్యూసర్ పనికొస్తుంది. బ్యాగులో పెట్టేసుకుని వెళ్లొచ్చు. దీంతో అప్పటికప్పుడు జ్యూస్ చేసుకోవచ్చు. అదంతా ఇబ్బంది అనిపిస్తే... జార్‌కి జ్యూసర్‌తోపాటు అదనంగా వచ్చే మూత పెట్టేయండి... ఎంచక్కా బాటిల్ అయిపోతుంది. సౌకర్యానికి తోడు ఆరోగ్యం!



కమ్యూనిటీ అండతో.. కాజీరంగా మహిళల విజయం



కోహోరా: అస్సాంలోని 'కాజీరంగా - కర్బీ ఆంగ్లాంగ్' అటవీప్రాంతంలో నివసించే కర్బీ తెగ మహిళలు జీవవైవిధ్య సమూహం 'అరణ్యక్' పుణ్యమా అని మంచి ఆదాయాలు గడిస్తున్నారు. 'సేంద్రియ పద్ధతిలో సాగుచేసిన చిరుధాన్యాలు, బియ్యం, అల్లం, పసుపు, మిరియాలు, తేనె, నువ్వులు, బిరియానీ ఆకు, తేయాకు, ఘోస్ట్ చిల్లీస్ (ఈశాన్యంలో పండించే ఘాటైన మిరప).. చీపుర్లు మొదలు చేనేత వస్త్రాల వరకు ఈ మహిళలు పలు ఉత్పత్తులను అందిస్తున్నారు. అయినా మార్కెట్తో అనుసంధానం లేకపోవడం, మధ్యవర్తుల ఆధిపత్యంతో చాలాకాలంగా సరైన ఆదాయం వచ్చేది కాదు. 'అరణ్యక్' తమ కమ్యూనిటీ వ్యాపార విధానమైన 'పిర్బీ' ద్వారా రైతులను, చేనేత వృత్తులవారిని ఇప్పుడు నేరుగా మార్కెట్కు అనుసంధానం చేస్తోంది. దీంతో గత ఆరేళ్లుగా కాజీరంగా గ్రామాల మహిళలకు గిట్టుబాటు ధరలు లభించి ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నట్లు 'పిర్బీ' కోశాధికారి స్వపన్ నాథ్ తెలిపారు.

మనకు 40 మంది వ్యోమగాములైనా ఉండాలి: మోదీ



దిల్లీ: భవిష్యత్తులో భారత్ చేపట్టబోయే అంతరిక్ష యాత్రల కోసం 2040 లోపు మనం 40-50 మంది వ్యోమగాములను తయారుచేసుకోవాల్సిన అవసరముందని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లి వచ్చిన వ్యోమగామి శుభాంశు శుక్లా సోమవారం ప్రధానితో భేటీ అయి అనుభవాలను పంచుకున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన వీడియోను మంగళవారం విడుదల చేశారు. భారత్ చేపట్టబోయే గగన్యాన్ మిషన్పై ప్రపంచం మొత్తం ఆసక్తిని కనబరుస్తోందని ప్రధానికి శుక్లా తెలిపారు. 'శుభాంశు అంతరిక్ష యాత్రతో గగన్యాన్ ప్రాజెక్టుకు తొలి అడుగు పడింది. భవిష్యత్తులో వ్యోమగాములుగా ఎదగాలనే ఆకాంక్షను పిల్లల్లో పెంచి, వారిని ఈ రంగం వైపు నడిపేలా ఇది ప్రోత్సహిస్తుంది' అని మోదీ పేర్కొన్నారు. శుభాంశు అంతరిక్ష ప్రయాణాన్ని లోతుగా పరిశీలిస్తూ, కాక్పిట్ వెనుక ఆయన ప్రస్థానాన్ని తెలిపే తొలి పుస్తకం 'స్కై వజ్ నెవర్ ది లిమిట్' మంగళవారం విడుదలైంది.

105 ఏళ్ల ఈ తాతయ్య కేరళ డిజిటల్ ఐకాన్



తిరువనంతపురం: కేరళలోని పెరుంబవూర్ సమీప అసమన్నూర్కు చెందిన ఎం.ఎ. అబ్దుల్లా మౌల్వీ 105 ఏళ్ల వయసులో డిజిటల్ అక్షరాస్యత సాధించి కేరళ డిజిటల్ ఐకాన్గా నిలిచారు. 99.99 శాతం డిజిటల్ అక్షరాస్యత సాధించిన రాష్ట్రంగా కేరళ ఆగస్టు 21న ప్రకటించుకోబోతోంది. తిరువనంతపురంలో జరిగే ఈ 'డిజి కేరళ' కార్యక్రమానికి అబ్దుల్లాకు ఆహ్వానం అందింది. వార్తాపత్రికలు చదివే అలవాటున్న అబ్దుల్లా కరోనా సమయంలో పత్రికలు ఆగిపోవడంతో ఫోను ద్వారా డిజిటల్ సాంకేతికత వైపు మొగ్గు చూపారు. స్మార్ట్ఫోన్ ఎలా వాడాలో మనవడు నేర్పించాడు. ఇప్పుడు అబ్దుల్లా స్వయంగా వాయిస్ టైపింగ్ చేస్తున్నారు. యూట్యూబ్లో శోధించి వార్తలు చూస్తున్నారు. విదేశాల్లో ఉంటున్న తన మనవడికి వీడియోకాల్ చేసి ప్రతిరోజూ మాట్లాడుతుంటారు. కేరళ మంత్రి ఎం.బి.రాజేశ్ ఇటీవల అబ్దుల్లా ఇంటికి వెళ్లి కొత్త స్మార్ట్ఫోన్ను కానుకగా ఇచ్చారు.



97 తేజస్ మార్క్-1ఏ కొనుగోలుకు పచ్చజెండా!

దిల్లీ: రూ.62వేల కోట్లతో 97 తేజస్ మార్క్-1ఏ యుద్ధవిమానాల కొనుగోలుకు కేంద్రం పచ్చజెండా ఊపినట్లు రక్షణ శాఖ వర్గాలు మంగళవారం తెలిపాయి. ఈ లోహవిహంగాలను హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) ఉత్పత్తి చేయనుంది. ఈ స్వదేశీ యుద్ధవిమానానికి దక్కిన రెండో ఆర్డర్ ఇది. రూ.48వేల కోట్లతో 83 యుద్ధవిమానాల సమీకరణకు కేంద్రం కొన్నేళ్ల కిందట పచ్చజెండా ఊపింది. వచ్చే నెలలో వైమానిక దళం నుంచి ఉపసంహరిస్తున్న మిగ్-21 యుద్ధవిమానాల స్థానంలో వీటిని ప్రవేశపెడతారు. దీంతో వైమానిక దళ పోరాట సామర్థ్యం మరింత పెరగనుంది.



వెల్లుల్లితో ఎంతో మేలు

అధిక రక్తపోటును తగ్గించే సహజసిద్ధ ఔషధంగా వెల్లుల్లి పనిచేయగలదు. దానిలోని సల్ఫర్ సమ్మేళనాలు రక్తప్రవాహంలో హైడ్రోజన్ సల్ఫైడ్లుగా మారతాయి. రక్తనాళాలు బిగుసుకుపోకుండా అవి నివారిస్తాయి. శరీరంలో మంచి కొవ్వుల స్థాయిలను పెంచడం ద్వారా గుండెకు వెల్లుల్లి మేలు చేస్తుంది. రక్తం గడ్డకట్టే ముప్పును తగ్గిస్తుంది.

– క్రిస్టీ లియాంగ్, వైద్యురాలు

ఉప రాష్ట్రపతిని ఏకగ్రీవంగా ఎన్నుకుందాం

- అధికార, విపక్షాలకు ప్రధాని పిలుపు


దిల్లీ: ఉప రాష్ట్రపతిగా సి.పి.రాధాకృష్ణన్ను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు సహకరించాలని విపక్షాలు సహా అన్ని పార్టీలకూ ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. మంగళవారం పార్లమెంటులోని బాలయోగి ఆడిటోరియంలో జరిగిన ఎన్డీయే ఎంపీల సమావేశంలో రాధాకృష్ణన్ను మోదీ పరిచయం చేశారు. అనంతరం ఆయనను ప్రధాని, కేంద్రమంత్రులు సన్మానించారు. ఆయన కూడా తనలాగే ఆరెస్సెస్ కార్యకర్తగా ఉంటూ జనసంఘ్లో చేరి, భాజపాలోకి వచ్చారని మోదీ గుర్తుచేసుకున్నారు. తలకు నల్ల జుత్తు ఉన్నప్పటి నుంచి తమకు పరిచయం ఉందని చమత్కరించారు. ప్రస్తుతం మహారాష్ట్ర గవర్నర్గా ఉన్న రాధాకృష్ణన్ వివాదరహితుడిగా, మచ్చలేని జీవితాన్ని గడుపుతున్నారని, ఉపరాష్ట్రపతిగా ఆయన ఎన్నిక యావద్దేశానికి ఆనందదాయక విషయమవుతుందని పేర్కొన్నారు. రాధాకృష్ణన్ బుధవారం నామినేషన్ దాఖలుచేసే అవకాశం ఉంది.

దేశాన్ని రెండుసార్లు విభజించిన నెహ్రూ

తొలి ప్రధాని నెహ్రూ.. రాడ్క్లిఫ్ లైన్తో ఒకసారి, సింధూ నదిని ముక్కలు చేసి మరోసారి దేశాన్ని విభజించారని మోదీ తన ప్రసంగంలో విమర్శించారు. దీనివల్ల దేశంలో వ్యవసాయానికి తీవ్రనష్టం వాటిల్లిందన్నారు. పార్లమెంటును, క్యాబినెట్ను విశ్వాసంలోకి తీసుకోకుండానే కుదుర్చుకున్న నదీజలాల ఒప్పందం వల్ల 80% నీరు పాకిస్థాన్కే వెళ్లేదని చెప్పారు. భారత్కు ఎలాంటి ప్రయోజనం లేదనే విషయాన్ని నెహ్రూనే ఆ తర్వాత అంగీకరించారన్నారు. రైతులకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకి అనే దానికి నెహ్రూ నిర్ణయాలే నిదర్శనమన్నారు.

రాష్ట్రాల బిల్లులను దీర్ఘకాలం నిలిపివేస్తే ఎలా?

- కేంద్రం, అటార్నీ జనరల్ను ప్రశ్నించిన సుప్రీంకోర్టు



దిల్లీ: రాష్ట్ర శాసనసభలు ఆమోదించి పంపించిన బిల్లులను గవర్నర్లు సుదీర్ఘ కాలం పాటు నిలిపివేయడం వల్ల తలెత్తే అసాధారణ పరిస్థితులకు పరిష్కారం ఏమిటి? అటువంటి వివాదాల పరిష్కారంలో న్యాయస్థానాలకు ఉండే ఐచ్ఛికాలు ఏమిటని కేంద్ర ప్రభుత్వం, అటార్నీ జనరల్ను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. రాష్ట్రాల బిల్లులకు ఆమోదం తెలపడంలో గవర్నర్లతో పాటు తనకు సర్వోన్నత న్యాయస్థానం గడువును నిర్దేశించడంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అభిప్రాయాలు కోరిన అంశంపై రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం విచారణ ప్రారంభించింది. సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని ఈ ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్నాథ్, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్ సభ్యులుగా ఉన్నారు. తొలుత కేరళ తరఫున సీనియర్ న్యాయవాది కె.కె.వేణుగోపాల్ వాదనలు వినిపిస్తూ...రాష్ట్రపతి అభిప్రాయార్థన(ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్) అంశాన్ని విచారణకు చేపట్టరాదని కోరారు. సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని రాష్ట్రపతి స్వయంగా కోరడంలో తప్పేమిటని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. రాష్ట్రపతి అభిప్రాయార్థన సమర్థనీయం కాదన్న ఒక్క తీర్పును చూపాలని జస్టిస్ గవాయ్ కోరారు. తమ ధర్మాసనం అభిప్రాయం మాత్రమే వెల్లడిస్తుందని, అది తమిళనాడు కేసు తీర్పుపై ఎలాంటి ప్రభావం చూపదని జస్టిస్ పి.ఎస్.నరసింహ పేర్కొన్నారు. విచారణ బుధవారం కూడా కొనసాగనుంది.

పూర్తి వివరాలు www.eenadu.net లో..



మహారాష్ట్ర రాజధాని ముంబయిలోని కుర్లా ప్రాంతంలో వరద నీట చిక్కుకున్న బస్సులు

మునిగిన ముంబయి

6 గంటల్లో 200 మి.మీ. వర్షపాతం ● రాష్ట్రవ్యాప్తంగా 10 మంది మృతి

ముంబయి: మహారాష్ట్ర రాజధాని ముంబయి రెండో రోజూ వర్షాలతో అతలాకుతలం అయ్యింది. ఆరు గంటల్లోనే 200 మి.మీ. వర్షపాతం నమోదైంది. దీంతో నగరంలో రోడ్లన్నీ నదులను తలపించాయి. జనజీవనం స్తంభించిపోయింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలను మూసివేశారు. బాంబే హైకోర్టు సైతం మధ్యాహ్నం 12.30 వరకు మాత్రమే పనిచేసింది. వివిధ ప్రాంతాల్లో 10 మంది మరణించారు. దీంతో వర్షాల కారణంగా గత ఐదు రోజుల్లో మరణించినవారి సంఖ్య 21కి చేరుకుంది. పట్టాలపై నీరు చేరడంతో ప్రధాన రైలు మార్గంలో తాత్కాలికంగా రైలు సేవలను నిలిపివేస్తున్నట్లు సెంట్రల్ రైల్వే వెల్లడించింది. 345 విమానాలు ఆలస్యంగా నడిచాయి. ఎనిమిది విమానాలను దారి మళ్లించారు.

మొరాయించిన మోనో ప్రయాణికులు ఉక్కిరి బిక్కిరి



ముంబయిలో భారీ వర్షాల ప్రభావంతో మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాల్లో తీవ్ర అంతరాయాలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో మైసూర్ కాలనీ- భక్తి పార్క్ స్టేషన్ల మధ్య ఎలివేటెడ్ ట్రాక్పై నడిచే రెండు మోనో రైళ్లు సాయంత్రం 6.15 గంటల నుంచి సుమారు గంట పాటు నిలిచిపోయాయి. వాటిలోని ఏసీ వ్యవస్థలు పనిచేయక ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. చివరకు అగ్నిమాపక సిబ్బంది మోనో రైళ్ల కిటికీల అద్దాలను పగులగొట్టి వాటిలోని దాదాపు 782 మంది ప్రయాణికులను సురక్షితంగా కిందికి దించినట్లు మున్సిపల్ కమిషనర్ వెల్లడించారు.

బిహార్లో ఒక్క ఓటూ చోరీ కానివ్వం

ఓటర్ అధికార్ యాత్రలో రాహుల్



నవాదా: బిహార్లో ఓట్లను దొంగిలించేందుకు భాజపా, ఎన్నికల కమిషన్ (ఈసీ) మధ్య భాగస్వామ్యం కుదిరిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి విమర్శలను గుప్పించారు. తాము (మహాగఠ్బంధన్) రాష్ట్రంలో ఒక్క ఓటును కూడా చోరీ కానివ్వబోమని నొక్కి చెప్పారు. మూడోరోజైన మంగళవారం కొనసాగిన 'ఓటర్ అధికార్ యాత్ర'లో భాగంగా బిహార్లోని నవాదాలో భగత్సింగ్ చౌక్ వద్ద రాహుల్ ప్రసంగించారు. "రాజ్యాంగం సామాన్య పౌరులకు కల్పిస్తున్న ఓటు హక్కును ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా, ఎన్నికల కమిషనర్లు లాగేసుకుంటున్నారు. బిహార్లో ఒక్క ఓటు కూడా చోరీ కానివ్వం" అని రాహుల్ స్పష్టంచేశారు.

ఎన్సీఈఆర్టీ పుస్తకాల్లో ఆపరేషన్ సిందూర్ పాఠాలు

దిల్లీ: జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్సీఈఆర్టీ) 3 నుంచి 12వ తరగతి విద్యార్థుల పాఠ్య ప్రణాళికలలో అనుబంధ బోధనాంశంగా ఆపరేషన్ సిందూర్ను చేర్చింది. రెండు మాడ్యూళ్ల రూపంలో ఈ చేర్పు జరిగింది. 3 నుంచి 8వ తరగతి వరకు 'ఆపరేషన్ సిందూర్- ఒక వీర గాథ' అనే మాడ్యూల్ను, 9 నుంచి 12వ తరగతి వరకు 'ఆపరేషన్ సిందూర్- ఆత్మగౌరవం కోసం సాహసిక ఎదురు దాడి' అనే మాడ్యూల్ను పాఠ్య ప్రణాళికలలో చేర్చారు. భారతదేశ సైనిక శక్తి, పరాక్రమం గురించి పాఠశాల విద్యార్థులకు తెలియజెప్పి చైతన్యవంతులను చేయడమే ఎన్సీఈఆర్టీ లక్ష్యమని అధికారులు తెలిపారు. భారత పౌరులపై పాకిస్థాన్ సైన్యం, రాజకీయ నేతల ప్రత్యక్ష ఆదేశాలపైనే పహల్గాంలో ఉగ్రదాడి జరిగిందని ఈ పాఠాల్లో పేర్కొన్నారు.

వెస్ట్ వర్జీనియాలో కాల్పులు

ఇద్దరి మృతి, ముగ్గురికి గాయాలు

మౌంట్ కార్బన్: అమెరికాలోని వెస్ట్ వర్జీనియాలో సోమవారం కాల్పుల ఘటన కలకలం సృష్టించింది. మౌంట్ కార్బన్లో జరిగిన కాల్పుల్లో ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకున్నారు. అనుమానిత నిందితుడు తన ఇంట్లో తనను తాను తుపాకీతో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మరో వ్యక్తి అక్కడి సమీపంలోని కార్పోర్ట్లో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను స్థానిక ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

అమెరికా-ద.కొరియా సైనిక విన్యాసాలు

అణ్వాయుధ దళాన్ని విస్తృతం చేస్తానన్న కిమ్

సియోల్: అమెరికా, దక్షిణ కొరియా సైనిక విన్యాసాలపై ఉత్తర కొరియా నియంత కిమ్ జోంగ్ ఉన్ మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమ అణ్వాయుధ దళాన్ని విస్తృతం చేస్తానని వ్యాఖ్యానించారు. అమెరికా, ద.కొరియా చేపడుతున్న సైనిక కసరత్తులను దండయాత్రకు సన్నాహాలుగా వాదిస్తున్న కిమ్.. తమ సైనిక, అణ్వాయుధ కార్యక్రమాలను సమర్థించుకున్నారు. అమెరికా, ద.కొరియాలకు దీటుగా ప్రతిస్పందించేందుకు తాము కూడా సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ క్రమంలోనే సోమవారం అణుసామర్థ్యం కలిగిన చో హ్యోన్ అనే యుద్ధనౌకను పరిశీలించారు.

కేరళలో అరుదైన మెదడు వాపునకు కారణమైన అమీబా

కోజికోడ్: కేరళలోని కోజికోడ్లో అమీబిక్ ఎన్కెఫలిటిస్ అనే అరుదైన మెదడు వాపు సోకి ఈ నెల 14న మృతిచెందిన 9 ఏళ్ల బాలిక ఇంటి పరిసరాల్లోని బావిలో వ్యాధికి కారణమైన అమీబాను కనుగొన్నట్లు అధికారులు మంగళవారం తెలిపారు. దీంతో పాటు ఆ ప్రాంతంలో ఇంకా ఎవరిలోనైనా వ్యాధి లక్షణాలు ఉన్నాయా అని సర్వే నిర్వహించారు. దీని ఆధారంగా బాలిక సోదరుడికి జ్వరంగా ఉన్నట్లు గుర్తించిన అధికారులు ప్రస్తుతం ఆ బాలుడిని పర్యవేక్షణలో ఉంచారు.

జర్నలిస్టులు సిద్దార్థ్ వరదరాజన్, కరణ్ థాపర్లకు సమన్లు

గువాహటి: దేశద్రోహం ఆరోపణలపై నమోదైన కేసుకు సంబంధించి సీనియర్ జర్నలిస్టులు సిద్దార్థ్ వరదరాజన్, కరణ్ థాపర్లకు అస్సాంలోని గువాహటి పోలీసులు సమన్లు జారీ చేశారు. ఈ నెల 22న గువాహటి పోలీసుల క్రైం బ్రాంచ్ ముందు హాజరు కావాలని కోరారు. ఈ నెల 14న వరదరాజన్కు సమన్లు అందగా, 18న థాపర్కు అందాయి.

రాజ్యసభ నుంచి ప్రతిపక్షాల వాకౌట్

ఎస్ఐఆర్పై కొనసాగిన నిరసనలు



పార్లమెంటు ఆవరణలో ఆందోళన చేస్తున్న విపక్ష సభ్యులు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ, అఖిలేశ్ యాదవ్ తదితరులు

దిల్లీ: బిహార్లో ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్)పై చర్చకు డిమాండు చేస్తూ ప్రతిపక్షాలు మంగళవారం రాజ్యసభ నుంచి వాకౌట్ చేశాయి. గనులు-ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లు-2025పై చర్చ ప్రారంభమైన వెంటనే ఇండియా కూటమి సభ్యులు సభా కార్యకలాపాలను బహిష్కరించారు. వాకౌట్ చేసిన వారిలో కాంగ్రెస్, వామపక్షాలు, డీఎంకే, ఆర్జేడీ, తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు ఉన్నారు. ఎస్ఐఆర్పై చర్చ జరిగి తీరాలని వారు పట్టుబట్టారు. ప్రతిపక్షాల నిరసనల మధ్యనే బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. దీనిని లోక్సభ ఈ నెల 12నే ఆమోదించింది. ఎన్నికల కమిషన్పై నిరసనల్ని విపక్ష సభ్యులు ముమ్మరం చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఫొటోలు, 'ఓట్ చోర్', "నిశ్శబ్ద రిగ్గింగ్" అనే మాటలు రాసి వున్న బ్యానర్ను పార్లమెంటు ప్రాంగణంలో వారు ప్రదర్శించారు. రాజ్యసభ విపక్షనేత మల్లికార్జున ఖర్గే దీనికి నేతృత్వం వహించారు. అఖిలేశ్ యాదవ్, ప్రియాంకా గాంధీ వాద్రా పాల్గొన్నారు.

ఇక 22 భాషల్లో పార్లమెంటు సమావేశాల వివరాలు

పార్లమెంటు కార్యకలాపాల వివరాలను ఇకపై కశ్మీరీ, కొంకణి, సంతాలీ భాషల్లో కూడా అందించనున్నారు. దీంతో రాజ్యాంగంలో పేర్కొన్న 22 భాషల్లో కూడా సమావేశాల వివరాలు అందుబాటులో ఉంటాయని లోక్సభలో స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. ఆయన ప్రకటన పూర్తికాగానే ప్రతిపక్ష సభ్యులు నిలబడి బిహార్ ఎస్ఐఆర్కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆ తర్వాత సభ వాయిదాపడింది.

సహకార రంగంలో ఎస్సీ, ఎస్టీలకు భాగస్వామ్యం

- లోక్సభలో అమిత్ షా వెల్లడి

దిల్లీ: బహుళ రాష్ట్ర సహకార సంఘాల కార్యనిర్వాహక మండళ్లలో ఒక స్థానాన్ని మహిళలకు, మరోస్థానాన్ని ఎస్సీ/ఎస్టీలకు రిజర్వు చేసినట్టు కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అడిగిన ఒక ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానమిచ్చారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (పీఏసీఎస్)లో కూడా మహిళలు, ఎస్సీ, ఎస్టీల భాగస్వామ్యం పెంచేందుకు నిబంధనలు రూపొందించామని తెలిపారు.

అంతరిక్ష కార్యక్రమానికి విఘాతం కలిగించిన కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు విదేశాల కోరిక మేరకు భారత అంతరిక్ష కార్యక్రమానికి విఘాతం కలిగించిందని భాజపా సభ్యుడు నిశికాంత్ దుబె ఆరోపించారు. వ్యోమగామి శుభాంశు శుక్లా ఘనతపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. అమెరికా, చైనా, పాకిస్థాన్ దేశాల ఒత్తిడికి తలొగ్గి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఒక ఇస్రో శాస్త్రవేత్తను అరెస్టు చేసిందని, తద్వారా అంతరిక్ష కార్యక్రమాన్ని దెబ్బతీసిందని పేర్కొన్నారు.

సోషల్ మీడియాలో ప్రసారాలు వద్దు: పార్లమెంటు అధికారిక రికార్డుల నుంచి తొలగించిన సభా కార్యకలాపాల వీడియోలను సోషల్ మీడియాలో ప్రసారం చేయరాదని రాజ్యసభాధ్యక్ష పీఠంపై ఉన్న సీనియర్ సభ్యుడు ఘన్శ్యామ్ తివారీ స్పష్టం చేశారు. రికార్డుల నుంచి తొలగించిన ప్రసంగాలను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారంటూ భాజపా సభ్యుడొకరు లేవనెత్తిన అంశంపై ఈ మేరకు వ్యాఖ్యానించారు.

- గువాహటిలో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ (ఐఐఎం) స్థాపించేందుకు ఉద్దేశించిన ఒక బిల్లుకు మంగళవారం లోక్సభ మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపి వాయిదా పడింది. దీని ఏర్పాటుకు కేంద్రం రూ.550 కోట్లు కేటాయించింది.
- 1975-77 మధ్య ఎమర్జెన్సీ కాలంలో దేశంలో 1.07 కోట్ల కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు జరిగాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నారాయణ్ రాయ్ లోక్సభకు లిఖితపూర్వకంగా తెలియజేశారు. ఆ రెండేళ్లలో 67.40 లక్షల ఆపరేషన్లు నిర్వహించాలన్నది లక్ష్యం కాగా అంతకు మించి చేశారని చెప్పారు.



భారీ వర్షాల కారణంగా హిమాచల్ ప్రదేశ్లోని కులూలో ధ్వంసమైన రహదారి

కాంగోలో 52 మంది నరికివేత

ఇంటర్నెట్డెస్క్: ఆఫ్రికా దేశం కాంగోలో ఇస్లామిక్ స్టేట్ మద్దతు కలిగిన తిరుగుబాటుదారులు రెచ్చిపోయారు. కత్తులు, గొడ్డళ్లతో 52 మందిని నరికి చంపేసినట్లు స్థానిక అధికారులు తెలిపారు. కాంగో దళాల చేతిలో ఓటమి పాలవడంతో రగిలిపోయిన అలైడ్ డెమోక్రటిక్ ఫోర్సెస్ (ఏడీఎఫ్) సభ్యులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని పేర్కొన్నారు. బెని, లుబెరో ప్రాంతాల్లోని పౌరులపై ఈ దాడి జరిగినట్లు వెల్లడించారు. నిద్రపోతున్న ప్రజలను లేపి తాళ్లతో చేతులు కట్టి.. కత్తులు, గొడ్డళ్లతో అతికిరాతకంగా నరికి చంపారన్నారు. మెలియా గ్రామంలోనే దాదాపు 30 మంది ప్రాణాలు తీశారన్నారు. ఎనిమిది మంది మహిళలు, ఇద్దరు చిన్నారులతో సహా మొత్తం 52 మంది ప్రాణాలు కోల్పోయినట్లు వివరించారు. ఇళ్లకు కూడా నిప్పంటించారని, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఇటీవల ఓ క్యాథలిక్ చర్చి ప్రాంగణంలో తిరుగుబాటుదారులు కాల్పులు జరపడంతో 38 మంది ప్రాణాలు కోల్పోయారు.

ద్రోహుల విషయంలో అప్రమత్తంగా ఉండాలి

తేజస్వీకి తేజ్ ప్రతాప్ సూచన

పట్నా: పార్టీ ద్రోహుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, లేదంటే అసెంబ్లీ ఎన్నికల్లో చేదు ఫలితాలు తప్పవని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్కు ఆయన సోదరుడు, మాజీ మంత్రి తేజ్ప్రతాప్ యాదవ్ సూచించారు. తేజ్ప్రతాప్ను పార్టీ నుంచి ఇటీవల బహిష్కరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం ఆయన స్పందించారు. 'కొందరు నా రాజకీయ జీవితాన్ని ముగించాలని కుట్ర పన్నుతున్నారు. ఇంకా సమయం ఉందని తేజస్వీకి చెప్పాలనుకుంటున్నా. నువ్వు ఇప్పుడు ఎంత తెలివిగా ఉన్నావన్నది ఎన్నికల ఫలితాలే నిర్ణయిస్తాయి' అని 'ఎక్స్'లో పోస్ట్చేశారు. రాహుల్గాంధీ, తేజస్వీ యాదవ్లు ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ఓట్ అధికార్ యాత్ర చేస్తున్నారా? లేదా విచ్ఛిన్నం చేయడానికా? అనేది అర్థం కావడంలేదన్నారు.

వాణిజ్య నౌక నుంచి సముద్రంలో పడిన కంటైనర్లు

పాల్ఘర్: ఓ వాణిజ్య నౌక నుంచి దాదాపు 48 కంటైనర్లు అరేబియా సముద్రంలో జారిపడ్డాయి. ఒమన్లోని సలాహ్ నుంచి బయల్దేరిన ఫోనిక్స్-15 అనే నౌక 20 నాటికల్ మైళ్ల దూరం ప్రయాణించిన తర్వాత ఈ ఘటన చోటుచేసుకుంది. వీటిలో 8 మాత్రమే దొరికాయి. మిగిలినవి తీరానికి కొట్టుకువచ్చే అవకాశం ఉండటంతో మహారాష్ట్రలోని పాల్ఘర్ పోలీసులు అప్రమత్తమయ్యారు. కంటైనర్లను గుర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలని స్థానిక మత్స్యకారులు, తీర ప్రాంతాల్లోని గ్రామస్థులు, గస్తీ బృందాలకు అధికారులు సూచించారు.

బ్రిటన్లో ఇద్దరు వ్యక్తులపై జాత్యహంకార దాడి



ఇంటర్నెట్డెస్క్: బ్రిటన్లో ఇద్దరు వ్యక్తులపై జాత్యహంకార దాడి ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. దీనికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఈ దాడికి పాల్పడిన ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. శిరోమణి అకాలీదళ్కు నాయకత్వం వహిస్తున్న సుఖ్బీర్ సింగ్ బాదల్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 15న బ్రిటన్లోని వోల్వర్హాంప్టన్ రైల్వేస్టేషన్ వద్ద ఇద్దరు సిక్కు వ్యక్తులపై ముగ్గురు యువకులు దాడి చేశారు. ఈ జాత్యహంకార దాడిని తాను పూర్తిగా ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా బ్రిటన్లోని సిక్కు ప్రవాసుల భద్రత అంశాన్ని బ్రిటన్ ప్రభుత్వం వద్ద లేవనెత్తాలని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ను సుఖ్బీర్ సింగ్ కోరారు. బాధితులకు న్యాయం చేయాలని అక్కడి పోలీసులను అభ్యర్థించారు. బ్రిటన్ ఎంపీ సురీనా బ్రాకెన్రిడ్జ్ కూడా ఈ దాడిని ఖండించారు. ఘటనకు సంబంధించిన నివేదికలను తనకు అందజేయాలని పోలీసులను ఆదేశించారు. ఈ సందర్భంగా వోల్వర్హాంప్టన్లోని ప్రజలంతా ఐక్యంగా ఉండాలని ఎంపీ పిలుపునిచ్చారు.

ఉష్ణమండల ప్రాంతాల్లోని చెట్లతోనే ఎక్కువ ప్రయోజనం

తాజా అధ్యయనం వెల్లడి



దిల్లీ: భూమిపై పెరుగుతున్న ఉష్ణ తాపాన్ని నిలువరించడానికి ఉత్తర, దక్షిణ ధ్రువాల వైపు కన్నా భూమధ్య రేఖ పరిధిలోని ఉష్ణమండల ప్రాంతాల్లో చెట్లను నాటడం ఎక్కువ ఫలితాలను ఇస్తుందని ఓ అధ్యయనం తేల్చింది. 'చెట్ల పనితీరుపై స్థానిక వాతావరణ పరిస్థితుల ప్రభావం' అనే అంశంపై అమెరికాలోని కాలిఫోర్నియా రివర్సైడ్ విశ్వవిద్యాలయం అధ్యయనం నిర్వహించింది. ఆ వివరాల ప్రకారం.. చెట్లను ఉత్తర, దక్షిణ ధ్రువ ప్రాంతాల్లో నాటితే అవి అక్కడ స్వల్ప ఉష్ణోగ్రత పెరిగేందుకు కారణమవుతున్నాయని.. తేమ ఎక్కువుండే భూమధ్య రేఖ ప్రాంతాల్లో ఫలితాలు ఇందుకు భిన్నంగా ఉన్నాయని తేలింది. "తేమ ప్రాంతాల్లో చెట్టు ఏడాదంతా ఎదుగుతూ ఉంటుంది. ఈ క్రమంలో వాతావరణ మార్పులకు ప్రధాన కారణమైన బొగ్గుపులుసు వాయువును ఎక్కువగా పీల్చుకుంటాయి. అంతే కాకుండా అవి చల్లబడే ప్రక్రియలో నీటి ఆవిరిని విడుదల చేస్తాయి. తద్వారా పరిసరాలు చల్లబడతాయి" అని అధ్యయనకర్త జేమ్స్ గోమెజ్ తెలిపారు. చెట్లను ఎక్కడ పెంచినా మంచిదేనని..కాకపోతే ఉష్ణమండల ప్రాంతాల్లో నాటితే ఎక్కువ ప్రయోజనాలను పొందవచ్చని పేర్కొన్నారు.

ఒక ఇజ్రాయెలీని చంపితే.. 50 మంది పాలస్తీనియన్లు చావాలి

మాజీ అధికారి ఆడియో వెలుగులోకి


ఇంటర్నెట్డెస్క్: ఒక ఇజ్రాయెలీ చనిపోతే.. దానికి బదులుగా 50 మంది పాలస్తీనియన్లను హతమార్చాలని ఆ దేశ మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ మేజర్ జనరల్ అహరోన్ హలీవా మాట్లాడిన ఆడియో మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఇజ్రాయెల్- హమాస్ల మధ్య ఉద్రిక్తతలు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో పాలస్తీనియన్లపై ప్రతీకారం తీర్చుకోవాలంటూ ఈ ఆడియో బయటకు రావడం గమనార్హం. దీనిని ఇజ్రాయెల్కు చెందిన ఓ న్యూస్ ఛానెల్ ప్రసారం చేసింది. దీనిలో అక్టోబరు 7 నాటి హమాస్ దాడులను ఉద్దేశిస్తూ హలీవా మాట్లాడారు. 'దాడుల్లో ఒక ఇజ్రాయెలీ చనిపోతే.. దానికి బదులుగా 50 మంది పాలస్తీనియన్లను చంపేయాలి. వారు చిన్నారులైనా పర్వాలేదు. గాజాలో 50వేల మందికి పైగా చంపేయడం అవసరం. గాజాలో అమాయకులు ఎవరూ లేరు. ఆ ప్రాంతం మొత్తాన్ని విధ్వంసం చేయాలి" అని హలీవా వ్యాఖ్యానించారు. అయితే, ఆయన ఈ వ్యాఖ్యలు ఎవరితో అన్నారనే విషయాన్ని వార్తా సంస్థ వెల్లడించలేదు.



గాజాలో విమానం నుంచి జారవిడిచిన ఆహారాన్ని తీసుకెళ్తున్న పాలస్తీనియులు

కళ్లముందు... మాయదారి!

ప్రమాదకరంగా మారుతున్న హైవే బ్లైండ్‌నెస్



రోడ్డుపై వాహనం వేగంగా పోతుంటుంది. డ్రైవర్ చాలా అప్రమత్తంగా ఉన్నాడు. కానీ కళ్లు మూసి తెరిచేలోపు ముందున్న వాహనాన్ని, లేదా డివైడర్లను ఢీకొట్టాడు. రోడ్డు పక్కనే ఉన్న గుంతలోకి దూసుకుపోయాడు. డ్రైవర్ అంత జాగ్రత్తగా ఉన్నా... ఇలా ఎందుకు జరిగింది? దీన్ని హైవే బ్లైండ్‌నెస్ అంటారు. హైవే హిప్నోసిస్, వైట్ లైన్ ఫీవర్ అనీ దీన్ని పిలుస్తారు.

దేశవ్యాప్తంగా ఏటా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో 5-10 శాతం హైవే బ్లైండ్‌నెస్ వల్లే చోటుచేసుకుంటున్నాయని వాహనరంగ నిపుణులు చెబుతున్నారు. హైదరాబాద్ - విజయవాడ, హైదరాబాద్ - భూపాలపట్నం జాతీయ రహదారులపై జరుగుతున్న ప్రమాదాల తీరును రాచకొండ పోలీసులు విశ్లేషించారు. ప్రమాదాలకు ప్రధాన కారణాల్లో హైవే బ్లైండ్‌నెస్ ఒకటని గుర్తించారు. డ్రైవర్లలో తరచూ వచ్చే ఈ మానసిక స్థితి చాలా ప్రమాదకరమని నిపుణులు చెబుతున్నారు.

- జాతీయ రహదారులు చాలా ప్రాంతాల్లో ఎగుడు దిగుడు, మలుపులు లేకుండా తిన్నగా ఉంటాయి. మధ్యలో తెల్లని లైన్లు ఉంటాయి.
- ఇలాంటి రహదారులపై డ్రైవింగ్ మొదలు పెట్టిన కొంతసేపటి తర్వాత ఓ రకమైన మానసిక స్థితి ఏర్పడుతుంది.
- రహదారిపై ఉన్న తెల్లని గీతలను చూస్తూ.. తిన్నగా... ఒకే తీరుగా పోవడం వల్ల కొద్ది సేపటి తర్వాత శరీరానికి, మెదడుకి అనుసంధానం తగ్గిపోతుంది.
- కళ్లు చూస్తుంటాయి కానీ, మెదడు వాస్తవ పరిస్థితిని విశ్లేషించదు.ఈ స్థితిలో వెనుక, ముందున్న వాహనాలను, వాటి వేగాన్ని గుర్తించలేరు. ఒక్కసారిగా ఎదురయ్యే ప్రమాదాలను అంచనా వేయడంలో డ్రైవర్లు విఫలమవుతారు.
- రోడ్డుపై వెళుతున్న జంతువులు, ఇతర వాహనాలు, ట్రాఫిక్ హెచ్చరికలను గ్రహించలేరు. దీంతో తీవ్రమైన ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది.
- రాత్రి వేళ... అవిశ్రాంతంగా వాహనం నడిపినప్పుడు ఈ ఘటనలు ఎక్కువగా జరుగుతుంటాయి.

ఇలా నివారించాలి...

- సీఎల్ఎన్ గాంధీ, రవాణారంగ నిపుణులు

- పనిగంటలు పెరగడం, తగినంత విశ్రాంతి లేకపోవడం వల్ల హైవే హిప్నోసిస్, హైవే బ్లైండ్‌నెస్ వస్తాయి.
- రహదారుల నిర్మాణ సమయంలోనే అనుమతించదగ్గ ఎత్తు పల్లాలు, వంపులు ఉండాలి. విదేశాల్లో సైతం ఈ విధానం పాటిస్తుంటారు.
- రోజుకు 6 గంటలకు మించి డ్రైవింగ్ చేయకూడదు. ప్రతి 3 గంటల తర్వాత కనీసం 10 నిమిషాలు పాటు విశ్రాంతి తీసుకోవడం అవసరం.
- డ్రైవింగ్ చేసేటప్పుడు మొబైల్‌లో మాట్లాడడం, మద్యం తాగి వాహనం నడపడం వల్ల కూడా మెదడు అదుపు తప్పుతుంది.
- సారూప్యత ఉన్న హైవేల్లో డ్రైవింగ్ చేస్తున్నప్పుడు అప్రమత్తంగా ఉండాలి. వేగం, సిగ్నల్స్‌పై దృష్టి సారించాలి.
- డ్రైవింగ్ ఏమాత్రం అసౌకర్యంగా అనిపించినా వెంటనే వాహనాన్ని పక్కకు తీసి కాసేపు విశ్రాంతి తీసుకోవాలి.

- ఈనాడు, హైదరాబాద్

ప్రతిభలోనూ కవలలే



వారిద్దరూ కవలలు.. చిన్నప్పటి నుంచి ఒకే పాఠశాల, ఒకే కళాశాలలో కలిసిమెలిసి చదివారు. ఇప్పుడు ఒకేసారి డాక్టరేట్ పట్టాలు అందుకొని ఔరా అనిపించారు. ఆదిలాబాద్ జిల్లా సోనాల మండల కేంద్రానికి చెందిన జక్క లక్ష్మీ-గంగారాం దంపతుల కుమార్తెలు భాగ్యలక్ష్మి, ఉదయరాణిలు ఇటీవల హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తమ పీహెచ్‌డీలు పూర్తిచేశారు. భాగ్యలక్ష్మి తెలుగులో 'ఆదిలాబాద్ జిల్లా కథలు' అనే అంశంపై, ఉదయరాణి చరిత్రలో 'టూరిజం పొటెన్షియల్ ఇన్ నార్త్ తెలంగాణ' అనే అంశంపై పరిశోధనలు చేశారు. మంగళవారం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఛైర్మన్ నారాయణన్ చేతుల మీదుగా వర్సిటీలో డాక్టరేట్ పట్టా అందుకున్నారు. - న్యూస్‌టుడే, సోనాల (బోథ్), నూచుడ

పాల సముద్రం నుంచి జాలువారుతున్నట్టు!



ప్రతిదానికీ ఓ రోజు వస్తుంది అంటారు కదా! అదేనేమో ఇది.. సాధారణ చెరువు.. అలుగు పారుతూ కొత్త అందాలను ఆవిష్కరిస్తోంది. శంషాబాద్‌లోని కాముని చెరువుకు విమానాశ్రయంలోని గొలుసు కట్టు చెరువుల ద్వారా వరద పోటెత్తగా.. స్వచ్ఛమైన నీరు పాల నురగల్లా ఇలా జాలువారుతూ కనిపించింది. - ఈనాడు, హైదరాబాద్

రూ.10 వేల నోటు.. వింటేజ్ గడియారం కావాలా?



దిల్లీ: ఇరువైపులా చూడగలిగే పాతకాలపు గడియారం, రూ.10 వేల నమూనా బ్యాంకు నోటు.. ఇలా అపురూపమైన దాదాపు 250 వస్తువులను రాష్ట్రపతి భవన్ వేలానికి పెట్టింది. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సహా పూర్వ రాష్ట్రపతులకు కానుకలుగా ఇవి అందినట్లు అధికారులు మంగళవారం వెల్లడించారు. ఇంకా సంప్రదాయ మిజో టూల్‌బాక్స్ 'దాయ్ మ్యూజ్', జాతీయ చిహ్నం జ్ఞాపిక, ఐక్యతా విగ్రహ నమూనా వంటి అరుదైన వస్తువులు ఇందులో ఉన్నాయి. ప్రత్యేక పోర్టల్ ద్వారా చేపట్టిన ఈ కానుకల వేలం ఆగస్టు 31తో ముగుస్తుందని రాష్ట్రపతి డిప్యూటీ ప్రెస్ సెక్రటరీ నావికా గుప్తా తెలిపారు. ఆసక్తి ఉన్నవారు https://upahaar.rashtrapatibhavan.gov.in/ ద్వారా బిడ్లు దాఖలు చేయవచ్చు.

అమ్మవారికి అగ్గిపెట్టెలో ఇమిడే చీర





రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి అమ్మవారికి సిరిసిల్ల సాయినగర్‌కు చెందిన చేనేత కళాకారుడు నల్ల విజయ్ అగ్గిపెట్టెలో ఇమిడే చీరను బహూకరించారు. ఆలయ ఇన్‌ఛార్జి ఈవో రాధాబాయికి మంగళవారం ఈ చీరను అందజేశారు. ఇది 5.5 మీటర్ల పొడవు, 48 అంగుళాల వెడల్పు, 250 గ్రాముల బరువు ఉంది. దీనిని పట్టుదారం, బంగారుజరీ, 21 రకాల సుగంధ ద్రవ్యాలతో తయారు చేసినట్లు విజయ్ వెల్లడించారు. - న్యూస్‌టుడే, వేములవాడ

ష్.. భయపడతాయి



పెద్దకళ్లు, ముదురుగోధుమ రంగులో ఉన్న ఈ జీవి పేరు దేవాంగపిల్లి(స్లెండర్ లోరీస్). శేషాచలం అడవుల్లో మనుగడ సాగిస్తున్న అరుదైన వన్యప్రాణుల్లో ఇదొకటి. చెట్ల మీదే ఎక్కువ సమయం గడుపుతాయి. వీటికి తోక ఉండదు. తరచూ భయానికి లోనవుతూ, బెదురుతున్నట్లు కనిపిస్తాయి. రాష్ట్ర అటవీశాఖ తొలిసారిగా వాటి గణన చేపట్టింది. శేషాచలం అడవుల్లోని తిరుపతి డివిజన్ పరిధిలో 441 దేవాంగపిల్లులు ఉన్నట్లు వెల్లడైంది. ఉమ్మడి కడప జిల్లా పరిధిలోని అడవుల్లో మరో వందకుపైగా ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. వాటి సంరక్షణ నిమిత్తం కొన్నింటిని తిరుపతి జంతు ప్రదర్శనశాలకు తీసుకురావాలని అధికారులు నిర్ణయించారు. - న్యూస్‌టుడే, తిరుపతి(జీవకోన)

హైకోర్టు సేవలకు పిల్లి ఎదురైంది..!



కొచ్చిన్: 'పిల్లి శాపాలకు ఉట్టి తెగదు' అన్నది సామెత. ఉట్టి మాట ఏమోగానీ, సాక్షాత్తు కేరళ హైకోర్టు కార్యకలాపాలు ఆగిపోయాయి. ఈ కోర్టు భవనాల ఫాల్ సీలింగు మీదకు చేరుతున్న పునుగుపిల్లులు చేస్తున్న మూత్ర విసర్జనతో తరచూ దుర్వాసన సమస్య ఎదురవుతోంది. మంగళవారం ఉదయం కోర్టు కార్యకలాపాలు ప్రారంభించగానే అది మరింత తీవ్రమై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నితిన్ జామ్‌దార్‌ను అసహనానికి గురిచేసింది. అత్యవసరంగా చూడాల్సిన కేసులను చకచకా ముగించి, మిగతావాటిని వేరే తేదీలకు డివిజను బెంచి వాయిదా వేసింది. 11.30కల్లా కోర్టు హాలు మూసివేసి, శుభ్రం చేయించాలని ప్రధాన న్యాయమూర్తి ఆదేశించారు.

గజరాజులకు డైట్ ప్లాన్





మనుషులకే కాదు.. ఏనుగులకూ పొట్ట కష్టాలుంటాయి! బొజ్జ పెరిగితే గజరాజులకూ నడవడంలో ఇబ్బందులు తలెత్తుతాయి. ఈ కారణంగానే.. కర్ణాటకలోని మైసూరు దసరా వేడుకల్లో పాల్గొనే ఏనుగులకు పొట్ట పెరగకుండా జాగ్రత్తలు తీసుకుంటూ పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. దసరా ఉత్సవాల చివరి రోజున బంగారు పల్లకిలో చాముండేశ్వరి అమ్మవారిని 'బలరామ' మోస్తుండగా.. మరో 13 ఏనుగులు అనుసరిస్తాయి. ఇందుకోసం ఇప్పటివరకు తొమ్మిది ఏనుగులు మైసూరు చేరుకున్నాయి. ఇక్కడ ప్రతి ఏనుగుకూ రోజుకు 450 కిలోల చెట్టు కొమ్మలు, 175 కిలోల నుంచి 300 కిలోల పచ్చిక, 20 కిలోల వడ్లు, 15 కిలోల వరి గడ్డి సాధారణ ఆహారంగా అందిస్తున్నారు. ప్రత్యేక ఆహారంగా మినుములు, ఉలవలు, అన్నం, బెల్లం, వివిధ రకాల కూరగాయలు తదితరాలను ఉడికించి ఒక్కో ఏనుగుకూ 12 కిలోల చొప్పున పెడుతున్నారు. కొబ్బరి ముక్కలు, చెరకుగడలను అందిస్తున్నట్లు మైసూరు జిల్లా అటవీశాఖ అధికారి ప్రభుగౌడ తెలిపారు. ఇంత కన్నా ఎక్కువ ఆహారం ఇస్తే వాటి బొజ్జ పెరుగుతుందని, నడవడం కష్టమవుతుందని వివరించారు. –న్యూస్‌టుడే, మైసూరు

మిద్దె పంటలకు... ఇంటి ఎరువు!



ఇంట్లో మిగిలిన అన్నమైనా...
బియ్యం కడిగిన నీళ్లయినా...
పక్కన పడేసిన కాయగూరల ముక్కలైనా...
మన మిద్దె తోటలో మొక్కలకు ఆహారమే.
ఇంటి వ్యర్థాలతో మంచి ఎరువును
అతి సులువుగా ఎలా చేయాలో తెలుసుకుందామా?

ఇలా చేయాలి...

- ఇంటి ఆవరణలోనే సేంద్రియ ఎరువు తయారు చేసుకోవడానికి చిన్న చిన్న ఉపకరణాలు అవసరం. 20 లీటర్ల బకెట్లు రెండు, లేదా 10 అంగుళాల ప్లాస్టిక్ పైపు, లేదా 50 లీటర్ల వాటర్ డ్రమ్ తీసుకోవాలి.
- రెండు బకెట్లలో ఒక దానికి కింద నీరు పోయేలా కుళాయి పెట్టుకోవాలి. రెండో బకెట్‌కు అడుగున, పక్కన అన్ని చోట్లా రంధ్రాలు చేయాలి. రంధ్రాలున్న బకెట్‌ను కుళాయి బిగించిన బకెట్ పైన పెట్టాలి.
- 10 అంగుళాల పైపునకు అన్ని వైపులా రంధ్రాలు చేయాలి. పైన మూత బిగించాలి. పైపును నేలలో పాతుకోవచ్చు లేదా ప్లాస్టిక్ బకెట్‌లో ఉంచిన మట్టిలో నిలబెట్టవచ్చు.
- 50 లీటర్ల డ్రమ్ము తీసుకుని దానికి కుళాయి బిగించాలి. మూత వైపు, అడుగు భాగంలో రంధ్రాలు చేయాలి. పై భాగంలో మట్టి వేసుకునేలా మూత ఏర్పాటు చేయాలి. దాన్ని తిప్పేందుకు వీలుగా రోలర్‌కు బిగించుకోవాలి.

ఇంటి వ్యర్థాలతోనే..

- ఇళ్లల్లో వచ్చే వ్యర్థాలతోనే ఎరువు తయారు చేసుకోవచ్చు. కూరగాయలు, ఆకుకూరల వ్యర్థాలను ముందుగానే తయారు చేసుకున్న ఉపకరణాల్లో వేయాలి. వాటిపై ఎండు ఆకులు, మట్టి వేయాలి.
- పతి రోజూ బియ్యం కడిగిన నీళ్లు, పుల్లటి మజ్జిగ పోయాలి. వాటిలో ఉండే బాక్టీరియా వ్యర్థాలను కుళ్ల బెట్టి మట్టిలో కలిసిపోయేలా చేస్తుంది. రోజూ వచ్చిన కూరగాయల వ్యర్థాలు కూడా వేయాలి.
- రోలర్ డ్రమ్ అయితే రోజుకు ఒకసారైనా తిప్పాలి. అందులో వ్యర్థాలు కలిసేలా కదుపుతూ ఉంటే మంచిది. సేంద్రీయ ఎరువు సిద్ధమవుతుంది.
- దీనిలో నుంచి ద్రవాలు వస్తుంటాయి. ఇది కూడా మొక్కలకు మంచి చేస్తుంది.
- సేంద్రియ ఎరువుతోపాటు వానపాముల ఎరువు కూడా మొక్కలకు వేసుకోవచ్చు.

- న్యూస్‌టుడే, విజయవాడ (గవర్నర్‌పేట)

చాలా సులువు...



ఇంట్లో కూరగాయలు, ఆకుకూరల వ్యర్థాలను చెత్త బండికి వేయకుండా.. వాటితో ఇంట్లోనే సేంద్రియ ఎరువు చేసుకోవచ్చు. వానపాములను వర్మీ కంపోస్టు ప్లాంట్లలో విక్రయిస్తుంటారు. వాటిని ఒకసారి తెచ్చుకుంటే సరిపోతుంది. వర్మీ కంపోస్టు తయారు కాగానే.. దాన్ని మొక్కలకు వేసి, వానపాములు విడతీసి సేంద్రియ ఎరువులో వేసుకోవాలి. ఇలా నిరంతరం ఎరువు తయారు చేసుకుంటూనే ఉండొచ్చు. - మద్దుకూరి వెంకట సుబ్బారావు, వర్మీకంపోస్టు ప్లాంట్ కమిటీల వ్యవస్థాపక సలహాదారు, విజయవాడ

ఒక్కో వ్యాధికి ఒక్కో మందు.. ఒక్కో వ్యర్థానికి ఒక్కో రంగు

ఆసుపత్రుల్లోనే కాదు.. ఇంటి దగ్గరా చికిత్స పొందేవారు, మంచానికే పరిమితమైన రోగులుంటే బయో మెడికల్ వ్యర్థాలు పోగుపడుతుంటాయి. వీటిని పద్ధతి ప్రకారం వేరు చేశాకే పారేయాల్సి ఉంటుంది. లేకుంటే ఇంట్లోని ఇతర సభ్యులకూ ఆరోగ్య సమస్యలొస్తాయి. పర్యావరణానికి హాని కలుగుతుంది. బయో మెడికల్ వ్యర్థాలకు వేర్వేరు కలర్ కోడింగ్ వల్ల వాటిని సురక్షితంగా తరలించడానికి వీలవుతుంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాల ప్రకారం బయో మెడికల్ వ్యర్థాలను ఆయా రంగుల డబ్బాల్లోనే వేయాలి.



- **పసుపు రంగు:** మానవ శరీర అవయవ అవశేషాలు, ఇన్‌ఫెక్టెడ్ వేస్ట్, రక్తం అంటిన బ్యాండేజీలు, కాటన్, ప్లాసెంటా.
- **ఎరుపు:** ఇన్‌ఫెక్టెడ్ డ్రెస్సింగ్-గాయాలపై వేసే కట్లు, ఎముక విరిగినప్పుడు కట్టే సిమెంటు లాంటి కట్టు, ఐవీ ట్యూబ్‌లు.
- **నీలం:** గ్లౌజులు, ప్లాస్టిక్ సిరంజిలతో పాటు వాడిన ప్లాస్టిక్ సెలైన్ బాటిళ్లు, ట్యూబ్‌ల వంటి వస్తువులు.
- **నలుపు:** రసాయన వ్యర్థాలు, క్యాన్సర్ చికిత్సలో వాడే సైటోటాక్సిక్ ఔషధాలు.
- **తెలుపు:** సూదులు, బ్లేడ్లు, సిరంజి, పగిలిన గాజు వ్యర్థాలు

☛ చికిత్సలో రోగులకు వాడే సిరంజిలు, మాస్కుల విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. బయో మెడికల్‌వేస్ట్‌ను బహిరంగ ప్రదేశాల్లో పారబోయకూడదు. ఈ వ్యర్థాల్ని నిర్వహించే ఆసుపత్రులకు లేదా స్థానిక సంస్థల సిబ్బందికి అప్పగించాలి. –ఈనాడు, హైదరాబాద్


ఇంపుగా.. తరలింపు

పట్టాలపై పరుగెడుతున్నాయా



పొక్లెయిన్ యంత్రాలు వరుసగా రైలు పట్టాలపై పరుగెడుతున్నాయా అన్నట్లున్న ఈ దృశ్యం పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కొలనూరు రైల్వే స్టేషన్‌లో మంగళవారం కనిపించింది. దిల్లీ వైపు నుంచి చెన్నై వైపు వెళుతున్న ఈ రైలును దారి పొడవునా స్థానికులు ఆసక్తిగా తిలకించారు. – న్యూస్‌టుడే, ఓదెల

కదిలింది కరుణరథం..





స్వీడన్‌లోని కిరునాలో ఇనుప ఖనిజం గని విస్తరణలో భాగంగా అక్కడ ఉన్న 113 ఏళ్ల చరిత్రగల ఓ చర్చిని మరో చోటుకు తరలించే ప్రక్రియ ప్రారంభమైంది. పూర్తిగా చెక్కలతో నిర్మించిన ఈ చర్చిని 224 చక్రాల ట్రాలీపైకి మంగళవారం ఎక్కించారు. ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న వేరే ప్రాంతానికి దీన్ని రెండు రోజుల్లో తరలించనున్నారు.

స్పష్టత ఉంటేనే సానుకూల వృద్ధి!



మీ జీవిత పయనం ఏ దిశగా సాగుతోందన్నదానిపై స్పష్టత లేకపోతే.. మీరు ఏమాత్రం తీరిక లేకుండా పనుల్లో తలమునకలై ఉండటంలో అర్థం లేదు. అలాంటప్పుడు మీరెంత శ్రమిస్తున్నా సానుకూల వృద్ధి సాధించలేరు. గొప్ప లక్ష్యాలను అందుకోలేరు. గొప్పదనం అనేది స్పష్టత ఉంటేనే సిద్ధిస్తుంది. – లెవిస్ హోవెస్, రచయిత

సలామ్ వాలేకుమ్ పాషా భాయ్!





ఖమ్మం బస్ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నారు 57 ఏళ్ల ఎం.డి.గౌస్‌పాషా. ఖాళీ సమయాల్లో తన ద్విచక్ర వాహనంపై తిరుగుతూ ప్లకార్డుల ద్వారా వివిధ సామాజిక అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని చాటడంతో పాటు వనజీవి రామయ్య స్ఫూర్తిని అందరూ అందిపుచ్చుకుని మొక్కలు నాటాలని గత 12 ఏళ్లుగా ప్రచారం చేస్తున్నారు. ఖమ్మం నగరంతో పాటు పరిసర గ్రామాలు, పట్టణాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మొక్కలు నాటించారు. రోడ్లపై గుంతలు కనిపిస్తే.. సొంత ఖర్చుతో వాటికి మరమ్మతులు చేసి ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నారు. – ఈనాడు, ఖమ్మం; న్యూస్‌టుడే, ఖమ్మం ఖానాపురం హవేలి

ముత్యాలమ్మకు కొమ్ములతో కోక



విజయనగరం జిల్లా భోగాపురం మండలంలోని గుడివాడలో మంగళవారం ముత్యాలమ్మ తల్లిని పసుపు కొమ్ముల చీరతో అలంకరించారు. శ్రావణ మాసం పురస్కరించుకుని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. – న్యూస్‌టుడే, భోగాపురం

శ్రీకాంత్‌కు పెరోల్‌పై విచారణ చేయిస్తాం

- తప్పు జరగలేదని అనడం లేదు..
- తెలిసిన వెంటనే చర్యలు తీసుకుంటున్నాం
- అరుణ వెనక ఉన్నదెవరో తేలుస్తాం
- హోంమంత్రి అనిత వెల్లడి

ఈనాడు, అమరావతి: హత్య కేసులో యావజ్జీవ శిక్ష అనుభవిస్తున్న తిరుపతి జిల్లా గూడూరుకు చెందిన కరడుగట్టిన నేరగాడు శ్రీకాంత్‌కు పెరోల్ ఎలా మంజూరైంది? దీని వెనక ఉన్నదెవరు? ఇందులో ఎంతమంది పోలీసు అధికారులు భాగస్వాములయ్యారు? అనే దానిపై విచారణ జరుగుతోందని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు. నాలుగైదు రోజుల్లో నివేదిక అందుతుందని, దీని వెనుక ఏ స్థాయి అధికారులున్నా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెరోల్ వచ్చాక.. అతను కరడుగట్టిన నేరగాడని తెలిసి దాన్ని వెంటనే రద్దు చేసి జైలుకు పంపించామని పేర్కొన్నారు. అతడికి సంబంధించి ఆసుపత్రి వ్యవహారంలో ఎస్కార్ట్ అధికారి తప్పిదం ఉన్నట్లు గుర్తించామని, దానిపైనా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సచివాలయంలో ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 'అవసరాలున్నప్పుడు ఎవరైనా ప్రజాప్రతినిధుల్ని ఆశ్రయిస్తారు. కొన్నిసార్లు వారు అన్నింటినీ పరిశీలించలేకపోవచ్చు. శ్రీకాంత్‌కు పెరోల్ విషయంలో తప్పు జరగలేదని మేం చెప్పడం లేదు. కానీ తెలిసిన వెంటనే చర్యలు తీసుకున్నాం. అదే వైకాపా ప్రభుత్వంలో అతనికి మొదట 30 రోజులు పెరోల్ ఇచ్చి మళ్లీ దాన్ని 15 రోజులు పొడిగించారు. జగన్ గత ప్రభుత్వంలో గూండాలు, రౌడీలను పెంచి పోషించారు.



అలాంటి పరిస్థితి అప్పుడున్నట్లే ఇప్పుడు కూడా కొనసాగుతుందని అనుకుంటున్నారు. కానీ ఇప్పుడున్నది కూటమి ప్రభుత్వం. బ్లాక్ మెయిల్ చేయడం, బెదిరించడం అనేవి కుదరవు. శ్రీకాంత్‌కు పెరోల్ మంజూరు కాకూడదనే విషయాన్ని జైళ్లశాఖపై సమీక్ష సందర్భంగా సూపరింటెండెంట్ మా దృష్టికి తెచ్చారు. ఆ రోజే నేను ఆదేశాలు జారీ చేశా. ఆ తర్వాతే పత్రికల్లో వచ్చింది' అని హోంమంత్రి వివరించారు.

నా పేషీ నుంచి ఫోన్ అంటూ..

'పెరోల్ వ్యవహారంలో అరుణ భాగస్వామ్యంపైనా విచారణ జరుగుతోంది. ఆమె వెనకున్నది ఎవరనేదానిపై కూపీ లాగుతున్నాం. గతంలో ఆమెపై రెండు కేసులు నమోదైనట్లు గుర్తించాం. నాలుగు రోజుల క్రితం హోంమంత్రి పేషీ నుంచి ఫోన్ చేస్తున్నట్లు చెప్పి ఆమె ఓ సీఐని కూడా బెదిరించినట్లు మా దృష్టికి వచ్చింది. అరుణ వైకాపా ప్రభుత్వం హయాంలో దిశ ఫౌండేషన్‌కు సెక్రటరీనంటూ ప్రకటించుకుంది. అప్పటి నుంచే మోసాలకు పాల్పడుతున్నట్లు తేలింది' అని వెల్లడించారు.

తప్పుడు ప్రచారాల అడ్డుకట్టకు ప్రత్యేక చట్టం

సామాజిక మాధ్యమాల్లో అవాస్తవాలు ప్రచారం చేస్తూ తప్పుడు పోస్టులు పెడుతూ ప్రజల్లో అభద్రతాభావాన్ని కలిగించేందుకు ప్రయత్నించే వారిపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు. ఇలాంటి పోస్టులపై ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీని ఏర్పాటు చేసి వారిచ్చిన నివేదిక ఆధారంగా వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో కొత్తగా చట్టాన్ని తీసుకువస్తామని ప్రకటించారు. 'కొంతమంది అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయంగా ఆలోచిస్తూ అసత్యాలను ప్రచారం చేసేందుకు సామాజిక మాధ్యమాలను వినియోగిస్తున్నారని మా దృష్టికి వచ్చింది. ఇలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం. మహిళలపై అనుచిత వ్యాఖ్యల చేసే వారినీ ఉపేక్షించం. దీనికి ప్రత్యేక చట్టం తీసుకొస్తాం' అని పేర్కొన్నారు. సచివాలయంలో ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 'జగన్ తన సొంత మీడియాలో రోజూ ఫేక్ న్యూస్ రాయిస్తూనే ఉన్నారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు. దీన్ని ఎదుర్కోడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అని స్పష్టం చేశారు.

ఫేక్ ప్రచారం చేస్తే కేసులు పెట్టకూడదా?

'అమరావతి మునిగిపోయిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఎక్కడ మునిగిపోయింది? సీడ్ యాక్సిస్ రోడ్డు, సచివాలయం, అసెంబ్లీ ఏమైనా మునిగాయా? సుభాష్ చంద్రబోస్ అనే అధికారి 'ఒకే ఒక వర్షం.. అమరావతి జలమయం' అని ఎలా పోస్టు పెడతారు? విజయవాడలో వరద విలయతాండవం చేస్తోందని ఇంకొకరు, బుడమేరు పొంగుతోందని మరొకరు పోస్టులు పెడతారు. ఎక్కడో జరిగిన రిగ్గింగ్ ఫొటోలు తీసుకొచ్చి పులివెందులలో జరిగిందని ఓ మాజీ మంత్రి పోస్ట్ చేస్తారు. 69 గేట్లు పని చేస్తుంటే ప్రకాశం బ్యారేజ్ గేట్లు పనిచేయడం లేదని రాస్తారు. ఇలాంటి వాటితో ప్రజల్లో ఆందోళన రేకెత్తదా? ఫేక్ ప్రచారం చేస్తే కేసులు పెట్టకూడదా? తప్పుడు ప్రచారాలకు అడ్డుకట్ట వేయాల్సిన బాధ్యత ఎన్డీయే ప్రభుత్వంపై ఉంది' అని స్పష్టం చేశారు.

బార్‌ల లైసెన్స్ రుసుం భారీగా తగ్గింపు

ఈనాడు, అమరావతి: నూతన బార్ పాలసీలో భాగంగా బార్ లైసెన్స్, దరఖాస్తు రుసుములను రాష్ట్ర ప్రభుత్వం భారీగా తగ్గించింది. లైసెన్స్ ఫీజు ఆరు వాయిదాల్లో చెల్లించే వెసులుబాటు కల్పించింది. ఈ నిర్ణయంతో ఎక్కువ మంది దరఖాస్తుదారులను ఆకర్షించే అవకాశముందని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిశాంత్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదాహరణకు.. గతంలో బార్ లైసెన్స్ ఫీజు కడపలో రూ.1.97 కోట్లు, అనంతపురంలో రూ.1.79 కోట్లు, తిరుపతిలో రూ.1.72 కోట్లు, ఒంగోలులో రూ.1.40 కోట్ల చొప్పున ఉండగా, ప్రస్తుతం ఈ నగరాల్లో రూ.55 లక్షలకు తగ్గించారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరులో రూ.71 లక్షలున్న ఫీజును రూ.35 లక్షలకు కుదించారు. 50 వేల వరకు జనాభా ఉన్న పట్టణాలకు రూ.35 లక్షలు, 50 వేలకు మించి 5 లక్షల వరకు జనాభా ఉంటే రూ.55 లక్షలు, ఐదు లక్షలకు మించి జనాభా ఉన్న నగరాలకు రూ.75 లక్షలుగా ఫీజు నిర్ణయించారు. ఇది రిటైల్ ఏ4 దుకాణాలతో పోలిస్తే 26-48 శాతం వరకు తక్కువ అని కమిషనర్ వెల్లడించారు. ఆరోగ్యకరమైన పోటీని ప్రోత్సహించడానికి బార్ లైసెన్స్‌లను బహిరంగ లాటరీ ద్వారా కేటాయిస్తామని తెలిపారు.

◆ కొత్త బార్ విధానంలో దరఖాస్తు రుసుము రూ.5 లక్షలకు తగ్గించినట్లు నిశాంత్‌కుమార్ తెలిపారు. 'పాత విధానంలో 90 శాతం పట్టణ స్థానిక సంస్థల్లోని బార్లకు రూ.5 లక్షలకు మించి చెల్లించాల్సి వచ్చేది. విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, నెల్లూరు, గుంటూరు నగరాల్లోని 362 బార్లకు గతంలో దరఖాస్తు రుసుము రూ.10 లక్షల చొప్పున ఉండేది. మదనపల్లె, చీరాల, బాపట్ల, ఒంగోలు వంటి మున్సిపాలిటీల్లోని 399 బార్లకు రూ.7.5 లక్షల చొప్పున ఉండేది. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఒకేలా దరఖాస్తు రుసుము రూ.5 లక్షలుగా నిర్ణయించామ'ని ఆయన వివరించారు.



అక్రమంగా తరలిస్తున్న విదేశీ పక్షుల పట్టివేత

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న విదేశీ పక్షులను శ్రీకాకుళం జిల్లా పలాస మండలంలో అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కాశీబుగ్గ అటవీశాఖ రేంజ్ అధికారి మురళీకృష్ణ నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కోల్‌కతాకు చెందిన రోంటిదాస్, అమిత్‌జ్ఞాన్ ఆస్ట్రేలియాకు చెందిన 236 పక్షులను కారులో చెన్నైకి తరలిస్తుండగా మంగళవారం తెల్లవారుజామున జాతీయ రహదారి పక్కన ఉన్న హోటల్ వద్ద పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేశారు.

EENADU Vol: 52, Issue: 11 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఏఐ సినిమా విడుదలే విడుదల!

సినీ చరిత్రలో కొత్త అధ్యాయం మొదలవుతోంది. సృజనాత్మక కృత్రిమ మేధ (జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ప్రయోగదశ దాటుకొని ప్రొడక్షన్ స్థాయికి చేరుకుంది. సినిమా నిర్మాణంలో కీలక సాధనంగా అవతరిస్తోంది. ఏఐ జనరేటెడ్ సినిమా అనేది ఇప్పుడు ఏమాత్రం ఊహాజనిత భావన కాదు. ఇప్పటికే వాడకంలోకీ వచ్చేసింది. సృజనాత్మక ప్రక్రియకు సవాల్ విసురుతోంది కూడా. విదేశాల్లోనే కాదు.. మనదేశంలోనూ ఏఐ సినిమా పరుగులు పెట్టటం మొదలెట్టింది.

సినిమా, సీరియల్, వెబ్‌సిరీస్.. ఏదైనా గానీ దృశ్యం చాలా ప్రధానం. ప్రేక్షకులను ఆకర్షించేవి విజువల్సే. వీటిని సృష్టించటంలో ఏఐ సాయం తీసుకోవటానికి ప్రముఖ మీడియా కంపెనీలన్నీ ఆసక్తి కనబరుస్తున్నాయి. ఉదాహరణకు- నెట్‌ఫ్లిక్స్‌నే తీసుకోండి. అర్జెంటీనా సైన్స్ ఫిక్షన్ సిరీస్ 'ద ఎటర్నాట్'లో చివరి విజువల్ ఎఫెక్ట్స్‌ను సృష్టించటానికి జనరేటివ్ ఏఐని వాడుకున్నామని ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచింది. భవనం కూలిపోతున్న సంక్లిష్ట దృశ్యాన్ని ఏఐ టెక్నాలజీతోనే పూర్తి చేశారు. సిరీస్ బడ్జెట్ పరంగా సంప్రదాయ పద్ధతిలో తీస్తే ఇది సాధ్యమయ్యేదే కాదని నెట్‌ఫ్లిక్స్ సీఈఓ పేర్కొనటం గమనార్హం. ఏఐ పుణ్యమాని దీన్ని పది రెట్లు ఎక్కువ వేగంతో పూర్తి చేశారు. అదీ అతి తక్కువ ఖర్చుతో. ఒక షోలో నేరుగా ఏఐ సృష్టించిన ఫుటేజీని సమ్మిళితం చేయటం నెట్‌ఫ్లిక్స్ చరిత్రలో ఇదే తొలిసారి. దీనికి ప్రపంచవ్యాప్తంగా సానుకూల ప్రతిస్పందనే లభించింది. అందుకే రెండో సీజన్‌లోనూ ఏఐ సాయం తీసుకోవాలని భావిస్తున్నారు. చిత్రమేంటంటే- రెండేళ్ల క్రితం హాలీవుడ్‌లో ఏఐని పరిచయం చేయటం మీద పెద్ద సమ్మె చేశారు. సృజనాత్మక అంశాలను ఆటోమేట్ చేస్తే ఉద్యోగాలు పోతాయని, కళాత్మక శోభ తగ్గుతుందనే భయాలు వ్యక్తమయ్యాయి. కానీ 2025 వచ్చేసరికి ప్రొడక్షన్‌లో ఏఐని బహిరంగంగా వాడుకోవటం సాధారణ విషయంగా మారిపోయింది! ప్రీవిజువలైజేషన్, షాట్ ప్రణాళికలలో ఇప్పటికే కృత్రిమ మేధ సాయం చేస్తోంది.







- రన్‌వే ఎంఎల్- సీన్ క్రియేషన్ కోసం
- డీ-ఐడీ- గొంతు సరిపోవటానికి
- ఫ్లాలెస్ ఏఐ- కచ్చితమైన డబ్బింగ్‌కు
- అడోబ్ సెన్సీ, బ్లాక్‌బర్డ్- పోస్ట్ ప్రొడక్షన్ కోసం. ఇవి మామూలు బడ్జెట్ సినిమాలనూ హాలీవుడ్ స్థాయిలో అలరించేలా తీర్చిదిద్దుతున్నాయి.

మొత్తమంతా ఏఐతోనే

నెట్‌ఫ్లిక్స్ కాస్త అటుఇటుగా ఏఐని పరీక్షిస్తుండగా.. కొన్ని కంపెనీలు మొత్తం కంటెంట్‌ను కృత్రిమమేధతోనే తీయటానికి సన్నద్ధమవుతున్నాయి. హాలీవుడ్‌లో కొత్తగా ప్రవేశించిన స్టెయిర్‌కేస్ స్టూడియోస్ తమ ప్రొప్రయిటరీ ఏఐతో నాలుగేళ్లలోనే ఏకంగా 30 సినిమాలను తీయాలని సంకల్పించటం గమనార్హం. అలాగని ఈ సినిమాల్లో దర్శకులు, రచయితలు, నటులు అసలే ఉండరని కాదు. వీరూ విశ్వ భాగమే. వీరి పాత్రా ఉంటుంది. కాకపోతే అత్యంత శ్రమతో కూడిన యానిమేషన్, ఎఫెక్ట్‌లకు ఏఐని వాడుకుంటారు. స్టెయిర్‌కేస్ స్టూడియోస్ తమ మొదటి ఏఐ సినిమా 'ద వుమన్ విత్ రెడ్ హెయిర్'ను కేవలం 5లక్షల డాలర్లతోనే పూర్తి చేయటం విశేషం. మామూలుగా తీసే సినిమాల్లో ఈ మొత్తం తిండి ఖర్చుకే సరిపోతుంది. అయితే ఈ సినిమాకు మిశ్రమ స్పందనే లభించింది. పాత్రల కదలికలు, ముఖ కవళికలు సహజంగా లేవని, కొన్ని పొరపాట్లు ఉన్నాయని విమర్శకులు ఎత్తిచూపారు.

- కొందరు స్వతంత్ర సినీ నిర్మాతలూ ఏఐతో ప్రయోగాలు చేపడుతున్నారు. అలీమ్ హొస్సేన్ కృత్రిమ మేధ టూల్స్‌తో 'ద బంగ్లాద్రాయిడ్స్ డ్రీమ్ ఆఫ్ ఎలక్ట్రిక్ టాగోర్' అనే లఘు సైన్స్ ఫిక్షన్ సినిమా తీశారు. అదీ కేవలం 300 డాలర్ల ఖర్చుతోనే. కథావస్తువును ఏఐ ప్రజాస్వామ్యం చేయగలదన్నది ఆయన అభిప్రాయం. అయితే ఇది సృజనాత్మక రంగం మీద దీర్ఘకాల ప్రభావాలు చూపగలదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- ప్రముఖ ఎంటర్టైన్మెంట్ సంస్థ టీసీఎల్ మరింత విస్తృతంగా ఆలోచిస్తోంది. ఏఐ జనరేటెడ్ కంటెంట్, సిరీస్‌లను రూపొందించటానికి టీసీఎల్ మెషిన్ అనే ఏఐ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను ఆవిష్కరించింది. ప్రకటనల సపోర్టుతో నడిచే ఇది సినిమాలు, ప్రకటనలు రూపొందించటానికి ఉపయోగ పడుతుంది.

మనదగ్గరా..

సినిమాల్లో ఏఐ వాడకంలో మనమూ ముందే ఉన్నాం. అప్పుడెప్పుడో వచ్చిన రాంఝణా హిందీ సినిమా ముగింపును ఇటీవల ఏఐ సాయంతో మార్చి, సుఖాంతం చేయటం కొత్త చర్చకు దారితీసింది. మహావతార్ నరసింహ చిత్రంలోనూ డిజిటల్ టూల్స్ వాడుకున్నారు. ఆ మధ్య వచ్చిన బ్రహ్మాస్త్ర సినిమాలో ఏఐ అసిస్టెడ్ విజువల్ ఎఫెక్ట్స్ ఆహా అనిపించాయి. ఇవి లేకపోతే అంత తక్కువ వ్యవధిలో సినిమా పూర్తయ్యేదే కాదు. కల్కి 2898 ఏడీ సినిమాలో భవిష్యత్ ప్రపంచాన్ని చూపించటానికి డిజిటల్ టూల్స్ సృష్టించిన వాతావరణమే ఆకర్షణగా నిలిచాయి. కన్నడ చిత్రం టుబిలో డబ్బింగ్, భావోద్వేగాలు కచ్చితంగా సరిపోవటానికి ఏఐ కూడా ఓ చేయి అందించింది. ఈ కోవలోనే మరెన్నో సినిమాలు ప్రయాణిస్తున్నాయి.



నైషాలోని దృశ్యం

మనదేశంలో మొట్టమొదటి ఏఐ సినిమాగా ప్రకటించుకుంటున్న నైషాలో విజువల్స్, పాత్రలు, డబ్బింగ్ వంటి పనులన్నీ ఏఐతోనే పూర్తిచేశారు. రన్‌వే, క్లింగ్ ఏఐ ల్యాబ్స్, 11 ల్యాబ్స్ వంటి సాఫ్ట్‌వేర్‌తో దీన్ని నిర్మించటానికి 8 నెలలు పట్టింది. భారీ బడ్జెట్ లేకపోయినా సినిమాలు సృష్టించొచ్చని ఇది నిరూపించింది.

- లవ్ యూ అనే కన్నడ సినిమా అయితే ప్రపంచంలోనే మొట్టమొదటి ఫుల్ లెంత్ ఏఐ ఫిల్మ్ అని ప్రకటించుకుంటోంది. దీని దర్శకుడు ఎస్ నరసింహమూర్తి.
- ఇంటెలిఫ్లిక్స్ తీసిన 'మహారాజా ఇన్ డెనిమ్స్' సినిమా కూడా మనదేశంలో మొట్టమొదటి ఏఐ ఫీచర్ ఫిల్మ్‌గా ప్రకటించుకుంటోంది. రన్‌వే, మిడ్‌జర్నీ, క్లింగ్ వంటి టూల్స్‌తో విజువల్స్, వీడియో దృశ్యాలను సృష్టించారు. ప్రాంప్ట్‌లు, సాఫ్ట్‌వేర్ సాయంతో చిన్న నిడివి దృశ్యాలను తీసి, క్రోడీకరించారు. త్వరలోనే దీన్ని విడుదల చేయాలని భావిస్తున్నారు.

మేధో సంపత్తి హక్కులపై ఆందోళన



ఏఐ వ్యవస్థలు చాలావరకూ పెద్దమొత్తంలో ఆన్‌లైన్‌లో ఉన్న డేటా మీద శిక్షణ పొందుతుంటాయి. సృష్టించినవారి అనుమతి తీసుకోకుండానే విజువల్స్‌ను రూపొందించొచ్చు. అందువల్ల మేధో సంపత్తి హక్కులపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే కొన్ని న్యాయపరమైన చిక్కులను ఎదుర్కొంటున్నాయి. నిరుద్యోగమూ కలవరం కలిగిస్తోంది. ఏఐ మూలంగా రచయితలు, వీఎఫ్ఎక్స్, డబ్బింగ్ కళాకారులు, సృజనాత్మక వృత్తి నిపుణులు పని కోల్పోయే ప్రమాదముందని భయపడుతున్నారు. భారీ ఏఐ మోడళ్లు చాలా విద్యుత్తును వాడుకోవటం పర్యావరణ పరంగానూ ఆందోళన కలిగిస్తోంది.

విమర్శలూ ఎక్కువే

తక్కువ ఖర్చు, వేగంగా పూర్తవటాన్ని పక్కనపెడితే అసహజ ఎఫెక్ట్స్‌ను అధిగమించే విషయంలో ఏఐ సినిమా ఇంకా పురిటిదశలోనే ఉందని చెప్పుకోవచ్చు. డిజిటల్ పాత్రలతో ప్రేక్షకులు మమేకం కావటానికిది అడ్డంకిగా నిలుస్తోంది. ఏఐ సినిమాలు ప్రత్యేకమైనవని, ఇంతకుముందు చెప్పని కథలకు జీవం పోస్తున్నాయని కొందరు ప్రేక్షకులు మెచ్చుకుంటుంటే.. ఏఐ విజువల్స్ యాంత్రిక స్వభావం సినిమా నాణ్యతను తగ్గిస్తున్నాయని మరికొందరు పెదవి విరుస్తున్నారు. ఏఐతో ప్రయోగాలు చేస్తున్న ప్రముఖ స్టుడియోలూ విమర్శలు ఎదుర్కొంటున్నాయి. ట్రైస్టార్ పిక్చర్స్ హియర్ సినిమాలో జనరేటివ్ ఏఐతో నటీనటుల వయసును తగ్గించి చూపటం చాలామందికి నచ్చలేదు. ఇలాంటి పరిమితులు ఉన్నప్పటికీ ఏఐ పరిజ్ఞానం శరవేగంగా విజృంభిస్తోంది. యానిమేషన్, మాటలకు పెదాల కదలికలు సరిపోవటం వంటివి మెరుగవుతున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్నకొద్దీ ఏఐ సినిమాలకు సహజత్వం అబ్బుతుందని భావిస్తున్నారు. రెండు మూడేళ్లలోనే ఈ విమర్శలు తగ్గిపోయే అవకాశముందనీ నిపుణులు ఆశిస్తున్నారు.

పోకో ఎం7 ప్లస్ అమ్మకం షురూ



పోకో ఎం7 ప్లస్ 5జీ ఫోన్ అమ్మకాలు మొదలయ్యాయి. 6జీబీ ర్యామ్, 128జీబీ స్టోరేజీ రకం పరిచయ ధర రూ.12,999. 8జీబీ+256జీబీ రకం ధర రూ.13,999. ప్రారంభ ఆఫర్‌గా హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంకు కార్డులకు రూ.1,000 తక్షణ రాయితీ లభిస్తుంది. అర్హత గల పరికరాలకు మరో రూ.1,000 ఎక్స్ఛేంజ్ బోనస్ కూడా అందుకోవచ్చు. ఈ ఫోన్ ఫీచర్లు ఇవిగో..

- ▼ 144హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగం, 850 నిట్స్ గరిష్ఠ ప్రకాశంతో కూడిన 6.9 అంగుళాల ఎఫ్‌హెచ్‌డీ+ తెర.
- ▼ స్నాప్‌డ్రాగన్ 6ఎస్ జన్ 3 ప్రాసెసర్.
- ▼ ఆండ్రాయిడ్ 15 ఆధారిత హైపర్‌ఓఎస్ 2.0.
- ▼ 33డబ్ల్యూ ఫాస్ట్ ఛార్జింగ్‌తో కూడిన భారీ 7,000ఎంఏహెచ్ బ్యాటరీ.
- ▼ రివర్స్ ఛార్జింగ్ టెక్నాలజీ.
- ▼ వెనకాల 50 ఎంపీ వైడ్ యాంగిల్ ప్రైమరీ కెమెరా, ఎల్ఈడీ ఫ్లాష్.. ముందు 8 ఎంపీ కెమెరా.
- ▼ రెండు ఆండ్రాయిడ్ జనరేషన్స్, నాలుగేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్.
- ▼ దుమ్ము, నీటిని తట్టుకునే ఐపీ64 రేటింగ్.

హాట్‌గా ఇన్‌ఫినిక్స్



బడ్జెట్ వినియోగదారులను దృష్టిలో పెట్టుకొని ఇన్‌ఫినిక్స్ తాజాగా హాట్ 60ఐ 5జీ ఫోన్‌ను తీసుకొచ్చింది. మాలి-ఎం57 ఎంసీ2 జీపీయూతో కూడిన మీడియాటెక్ డైమెన్సిటీ 6400 ప్రాసెసర్, ఆండ్రాయిడ్ 15 ఆధారిత ఎక్స్ఓఎస్ 15 మీద పనిచేస్తుంది. ఫీచర్ల విషయానికి వస్తే-

- ▼ 120హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగం, 670 నిట్స్ గరిష్ఠ ప్రకాశంతో కూడిన 6.75 అంగుళాల హెచ్‌డీ+ ఎల్‌సీడీ డిస్‌ప్లే.
- ▼ పాండా గ్లాస్ రక్షణతో పాటు దుమ్ము, నీటిని తట్టుకునే ఐపీ64 రేటింగ్.
- ▼ వెనక ఎల్ఈడీ ఫ్లాష్‌తో కూడిన 50ఎంపీ కెమెరా, 2కే 30ఎఫ్‌పీఎస్ వీడియో రికార్డింగ్ సపోర్టు. ముందు సెల్ఫీలు, వీడియో కాల్స్ కోసం 5ఎంపీ షూటర్.
- ▼ 4జీబీ ర్యామ్, 128జీబీ స్టోరేజీ. మైక్రోఎస్‌డీ ద్వారా 1టీబీ వరకూ స్టోరేజీని విస్తరించుకునే వీలు.
- ▼ 18డబ్ల్యూ వైర్డ్ ఫాస్ట్ ఛార్జింగ్ సపోర్టు గల 6,000ఎంఏహెచ్ బ్యాటరీ.
- ▼ సర్కిల్ టు సెర్చ్, ఏఐ కాల్ ట్రాన్స్‌లేషన్, ఏఐ సమ్మరైజేషన్, ఏఐ రైటింగ్ అసిస్టెంట్, ఏఐ ఎరేజర్, వాల్‌పేపర్ జనరేషన్ వంటి బోలెడన్ని ఏఐ ఫీచర్లు.
- ▼ అల్ట్రాలింక్ టెక్నాలజీ ద్వారా నో నెట్‌వర్క్ కాల్ సదుపాయం అదనపు ఆకర్షణ.
- ▼ షాడో బ్లూ, మాన్‌సూన్ గ్రీన్, ప్లమ్ రెడ్, స్లీక్ బ్లాక్ రంగుల్లో లభించే దీని ధర రూ.9,299.
- ▼ అమ్మకాలు ఆగస్టు 21 నుంచి. తొలిరోజున ప్రి-పెయిడ్ కార్డుల మీద రూ.300 రాయితీ.

నింగిలోకి రష్యా జీవ ఉపగ్రహం



రష్యా నేడు బయాన్-ఎం నం.2 అనే వినూత్న బయోశాటిలైట్‌ను ప్రయోగించనుంది. దీన్ని ఆధునిక 'నోవజ్ ఆర్క్'గానూ భావిస్తున్నారు. నెల పాటు కక్ష్యలో పరిభ్రమించనున్న ఇది 75 ఎలుకలు, వెయ్యికి పైగా ఈగలు, సెల్ కల్చర్స్, సూక్ష్మజీవులు, విత్తనాలను అంతరిక్షంలోకి తీసుకెళ్తుంది మరి. జీవుల మీద దీర్ఘకాలంలో సూక్ష్మగురుత్వాకర్షణ, రేడియేషన్ ఎలాంటి ప్రభావం చూపుతాయో తెలుసుకోవటం దీని ఉద్దేశం. భవిష్యత్తులో మానవసహిత వ్యోమనౌకల ప్రయోగానికిది అవసరమైన సమాచారంగా ఉపయోగపడుతుంది.

ఎలుకలు కీలకం

దాదాపు మనుషులను పోలిన జన్యు వ్యవస్థ, స్వల్ప జీవనకాలం, రేడియేషన్‌ను తట్టుకోలేకపోవటం వంటి గుణాలు ఉండటం వల్ల ఈ ప్రయోగంలో ఎలుకలు కీలకం కానున్నాయి. వీటిని మూడు బృందాలుగా విభజిస్తారు. ఒక బృందాన్ని భూమ్మీదే మామూలు పరిస్థితుల్లో పెడతారు. రెండో బృందాన్ని ఇక్కడే వ్యోమనౌకలోని పరిస్థితులను పోలిన చోట ఉంచుతారు. ఇక మూడో బృందాన్ని అంతరిక్షంలోకి పంపిస్తారు. భూమ్మీద ఉన్న ఎలుకలకు, అంతరిక్షంలోకి పంపినవాటికి మధ్య తేడాలను స్పష్టంగా గుర్తించటానికిది తోడ్పడుతుంది. కొన్ని ఎలుకల్లో శారీరక మార్పులను పసిగట్టటానికి చిప్స్‌నూ అమరుస్తారు. అంతరిక్షం నుంచి తిరిగి వచ్చాక అక్కడి వాతావరణానికి అవెలా తట్టుకున్నాయో విశ్లేషిస్తారు. ఎలుకలతో పాటు ఈగలూ జన్యు, కణస్థాయిలో రేడియేషన్ ప్రభావాల గురించి అదనపు సమాచారాన్ని అందిస్తాయి.

- జీవ నమూనాలతో పాటు చంద్రుడి ధూళి, మట్టిని పోలిన వాటినీ ఉపగ్రహంతో పంపనున్నారు. అంతరిక్ష రేడియేషన్, శూన్య పరిస్థితుల్లో వాటి గుణాలేవైనా మారాయేమో విశ్లేషిస్తారు. భవిష్యత్తులో చంద్రుడి మీద ఆవాసాల నిర్మాణానికిది తోడ్పడగలదని భావిస్తున్నారు. చంద్రుడి మీద దొరికే వనరుల నుంచి భవన నిర్మాణ సామగ్రిని తయారుచేసే అవకాశముందో పరిశీలిస్తారు.

గూగుల్ యాక్టివిటీ తనిఖీ చేశారా?

అప్పుడప్పుడూ గూగుల్ ఖాతా యాక్టివిటీని తనిఖీ చేసుకోవటం మంచిది. గూగుల్ ఖాతాకు సైన్ ఇన్ అయ్యి, మై అకౌంట్‌లోకి వెళ్లి దీన్ని చూసుకోవచ్చు. గత 28 రోజుల్లో మనం ఏయే పరికరాల మీద గూగుల్ ఖాతాను వాడుకున్నామో కనిపిస్తుంది. ఏదైనా అనుమానిత పరికరం కనిపిస్తే వెంటనే సైన్ అవుట్ కావాలి. అలాగే పాస్‌వర్డ్‌నూ మార్చుకోవాలి. అయితే ఒకే పరికరం నుంచి చాలా సెషన్లు కూడా కనిపించొచ్చని గుర్తుంచుకోండి. అది మనదే అయితే గాబరా పడాల్సిన పనిలేదు.



భూత కణం కనిపించింది!





అది 2023. మధ్యధరా సముద్రంలో 11,320 అడుగుల లోతున అమర్చిన కేఎం3నెట్ డిటెక్టర్ ఒక సంకేతాన్ని గుర్తించింది. ఇప్పటివరకూ దాన్ని ఓ సమస్యగానో, పొరపాటుగానో భావిస్తూ వచ్చారు. నిజానికది ఖగోళ న్యూట్రినో అని తాజాగా బయటపడింది. మన భూమ్మీద ఇలాంటిది గుర్తించటం ఇదే తొలిసారి. పైగా అది అంతరిక్షంలో అతి సుదూరంలో పుట్టిందని, విశ్వం తొలికాంతి నుంచి లేదా కొత్తరకం అంతరిక్ష వస్తువు నుంచి వచ్చి ఉండొచ్చనీ భావిస్తున్నారు. అందుకే శాస్త్రవేత్తలను బాగా ఆకర్షిస్తోంది.

న్యూట్రినోలను భూత కణాలు (ఘోస్ట్ పార్టికల్స్)గానూ భావిస్తుంటారు. ఇవి మన చుట్టే తిరుగుతుంటాయి. ఆ మాటకొస్తే మన శరీరం గుండా సాగుతుంటాయి కూడా. అయినా మనకేమీ తెలియదు. వీటిని గుర్తించటం దాదాపు అసాధ్యం. ఎందుకంటే ఈ రేణువులకు ద్రవ్యరాశి గానీ విద్యుదావేశం గానీ ఉండవు. ఇతర రేణువులతో ఢీకొట్టటమూ అంతంతే. ఇంతటి అదృశ్య శక్తినీ కేఎం3నెట్ డిటెక్టర్ గుర్తించటం గమనార్హం. అయితే దాన్ని అతి స్వల్ప సంకేతం రూపంలోనే పసిగట్టింది. కానీ 220 పెటాఎలక్ట్రోవోల్ట్స్ (పీఈవీ) శక్తి కలిగుండటం విశేషం. ఇదెలా సాధ్యమని శాస్త్రవేత్తలు అప్పటి నుంచీ విశ్లేషిస్తూనే ఉన్నారు. చివరికి న్యూట్రినోగా నిర్ధారించారు.

ఎలా పుడతాయి?

నక్షత్ర సంయోజనం లేదా విస్ఫోటం (సూపర్‌నోవా) చెందినప్పుడు పెద్దమొత్తంలో న్యూట్రినోలు పుట్టుకొస్తాయి. భౌతిక స్వరూపం లేకపోయినప్పటికీ కొన్నిసార్లు ఇవి ఇతర రేణువులతో ఢీకొట్టే అవకాశముంది. ఇలాంటప్పుడు మ్యూయాన్స్, ఫోటాన్స్ అనే కాంతి రేణువులు పుడతాయి. దీంతో స్వల్ప కాంతి ప్రేరేపితమవుతుంది. దీన్ని కొన్ని డిటెక్టర్లు గుర్తించే అవకాశముంది. రెండేళ్ల క్రితం కేఎం3నెట్ డిటెక్టర్ విషయంలోనూ ఇదే జరిగింది. సముద్రం లోలోతున, తీవ్ర గాఢాంధకారంలో ఉన్న దీనికి ఆ స్వల్ప కాంతి సైతం కాంతి పుంజంలా కనిపించింది. అప్పట్లో శాస్త్రవేత్తలు దాన్ని మరేదోగా భావించారు. ఎందుకంటే కేఎం3నెట్ కన్నా ముందు నుంచీ ఉన్న డిటెక్టర్లేవీ ఇప్పటివరకూ అత్యంత శక్తిమంతమైన న్యూట్రినోలను గుర్తించలేకపోయాయి. అత్యధిక శక్తితో కూడిన న్యూట్రినోలు ఉండే అవకాశం గల ప్రాంతాల్లో నెలకొల్పిన ఐస్‌క్యూబ్, ఆగర్ వంటి డిటెక్టర్లు సైతం పసిగట్టలేకపోయాయి. మ్యూయాన్ దిశ, దాని శక్తిని పునర్నిర్మించి మరీ దీన్ని న్యూట్రినోగా నిర్ధారించారు. డిటెక్టర్‌కు సమీపంలో ఖగోళ న్యూట్రినో ఢీకొనటం వల్ల ఈ మ్యూయాన్ పుట్టి ఉండొచ్చని భావిస్తున్నారు.

మన పాలపుంత ఆవలి నుంచి

కేఎం3నెట్ డిటెక్టర్ పసిగట్టిన భూత కణం పుట్టుకకు సంబంధించి మరో రహస్యమూ బయటపడింది. ఇది సుదూర విశ్వాంతరాళంలో పుట్టిందని భావిస్తున్నారు మరి. ఇదే విశ్వంలో న్యూట్రినోలు పుట్టుకొచ్చే వనరుల గురించి కొత్తగా ఆలోచించేలా చేస్తోంది. సుమారు 138 కోట్ల ఏళ్ల క్రితం నాటి విశ్వం తొలికాంతితో విశ్వ కిరణాలు ఢీకొన్నప్పుడు ఇలాంటి అత్యధిక శక్తిమంత న్యూట్రినోలు వెలువడతాయన్నది శాస్త్రవేత్తల భావన. ఇతరత్రా కొత్త ఖగోళ వస్తువులూ దీనికి కారణమయ్యే అవకాశముంది. అందువల్ల మనకు తెలియని ఇలాంటి కొత్త వస్తువేదో విశ్వంలో ఉండి ఉంటుందనే భావనకిది ఆస్కారం కలిగిస్తోంది. మొత్తమ్మీద కేఎం3నెట్ గుర్తించిన న్యూట్రినో మన పాలపుంతకు సంబంధించింది కాదనేది మాత్రం సుస్పష్టం. విశ్వంలో ఎక్కడో సుదూరాల నుంచి ప్రయాణించి, మన భూమిలోకి చొచ్చుకొచ్చిందనటం నిస్సందేహం.

ఆఫీసులో వాట్సప్ వెబా?

ఆఫీసు కంప్యూటర్, ల్యాప్‌టాప్‌లో వాట్సప్ వెబ్ వాడుతున్నారా? అయితే జాగ్రత్త. ఇలాంటి పని చేయటం తగదని కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ (మీటీ) బహిరంగ సూచన చేసింది. కార్పొరేట్ పరికరాల్లో వాట్సప్ వెబ్ ద్వారా వ్యక్తిగత చాట్స్, ఫైళ్లను హ్యాకర్లు యాక్సెస్ చేసే ప్రమాదముందని, ఉద్యోగుల రహస్య సమాచారాన్ని కాజేయొచ్చని హెచ్చరించింది. కార్యాలయ పనులకు ఉద్దేశించిన పరికరాల మీద వాట్సప్ మెసేజ్‌లను చూడటం సౌకర్యంగానే ఉండొచ్చు. కానీ ఇది గోప్యత ఉల్లంఘనలు, భద్రత ముప్పులకు దారితీయగలదని మంత్రిత్వ శాఖకు చెందిన ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ (ఐఎస్ఈఏ) విభాగం పేర్కొంటోంది. వ్యక్తిగత చాట్స్, ఫైళ్లను ఐటీ అడ్మినిస్ట్రేటర్లు లేదా సిస్టమ్ మానిటరింగ్ టూల్స్ చూసే అవకాశముండటమే దీనికి కారణం. ముఖ్యంగా స్క్రీన్ మానిటరింగ్, మాల్వేర్, బ్రౌజర్ హైజాక్ టూల్స్ వాడే వాతావరణాల్లో ఈ ముప్పు మరింత పొంచి ఉంటుండటం గమనార్హం. వాట్సప్ వెబ్ వంటి మెసేజింగ్ యాప్స్ ద్వారా కార్పొరేట్ నెట్‌వర్క్స్, పరికరాలకు ఫిషింగ్ దాడులు, మాల్వేర్లు వ్యాపించే ముప్పు రోజురోజుకీ పెరుగుతోందని ఐఎస్ఈఏ నోట్ సూచిస్తోంది. చివరికి ఆఫీస్ వై-ఫైతోనూ పర్సనల్ ఫోన్‌లో వాట్సప్‌ను యాక్సెస్ చేసే అవకాశముందని, రహస్య సమాచారాన్ని కొల్లగొట్టే ప్రమాదముందని వివరించింది. ప్రత్యేకించి యాంటీవైరస్ వంటి రక్షణ సదుపాయాలు లేని, వాడకంలో లేని ఆఫీసు పరికరాలు డేటా ఉల్లంఘనలకు గురయ్యే ప్రమాదముందని చెబుతోంది. హానికర లింకులను క్లిక్ చేయటం, తెలియని కాంటాక్ట్‌ల నుంచి అటాచ్‌మెంట్లను డౌన్‌లోడ్ చేయటం వంటివి చేయొద్దని.. ఇవి సంస్థ ఐటీ వ్యవస్థలోకి హ్యాకర్లు చొచ్చుకురావటానికి అవకాశం కల్పిస్తాయని తెలిపింది.



ఇలా భద్రంగా

- పని పూర్తయ్యాక, డెస్క్‌ను వదిలే ముందు వాట్సప్ వెబ్ నుంచి లాగ్ అవుట్ కావాలి.
- అనుమానిత లింకులను క్లిక్ చేయొద్దు, తెలియని అటాచ్‌మెంట్లను డౌన్‌లోడ్ చేయొద్దు.
- ఆఫీసులో వ్యక్తిగత పరికరాలు, అప్లికేషన్లను వాడేటప్పుడు సంస్థ ఐటీ విధానాలను పాటించాలి.

ఫోన్ నిరంతరం ట్రాక్ చేస్తుంటే..

ఫోన్‌లో లొకేషన్ ఫీచర్‌ను వాడుకునే యాప్‌ను ఓపెన్ చేసినప్పుడు జీపీఎస్ గుర్తును గమనించే ఉంటారు. దారిని చూపించటానికి, క్యాబ్‌ను బుక్ చేసినప్పుడు అదెక్కడుందో తెలుసుకోవటానికి, దారిని చూపించటానికి బాగానే ఉపయోగపడుతుంది. ఇది మంచిదే కావొచ్చు గానీ నిరంతరం మనల్ని ట్రాక్ చేస్తూనే ఉంటుందనే సంగతి మరవరాదు.

లొకేషన్ ఫీచర్ ఒక్కటే కాదు.. సెల్‌ఫోన్ టవర్లు, వై-ఫై నెట్‌వర్క్స్, బ్లూటూత్, చివరికి బ్యాక్‌గ్రౌండ్ పింగ్స్ కూడా గమనిస్తూనే ఉంటాయి. అలాగని పూర్తిగా భయపడాల్సిన పనిలేదు. కాకపోతే దీనిపై నియంత్రణ కలిగుండటం మంచిది. ఫోన్ సెటింగ్స్‌లో మార్పులు చేసుకోవటం ద్వారా దీన్ని అదుపులో ఉంచుకోవచ్చు.

ఐఫోన్‌లో- తెలివైన సెటింగ్

యాపిల్ పరికరాల్లో సెటింగ్స్‌లో ఎక్కడో **సిగ్నిఫికెంట్ లొకేషన్** దాగుంటుంది. మ్యాప్స్ చురుకుగా పనిచేయటానికి, మెరుగ్గా సూచనలు ఇవ్వటానికి ఈ ఏర్పాటు చేశారు. అయితే మనం ఎప్పుడెప్పుడు ఎక్కడ గడిపామో మొత్తం చరిత్రంతా ఇందులో నిక్షిప్తమై ఉంటుంది. దీన్ని ఎలా క్లియర్ చేసుకోవాలంటే?

- సెటింగ్స్ ద్వారా ప్రైవసీ అండ్ సెక్యూరిటీలోకి వెళ్లి లొకేషన్ సర్వీసెస్ కనిపిస్తుంది. ఇందులో సిస్టమ్ సర్వీసెస్‌లోకి వెళ్లి, **సిగ్నిఫికెంట్ లొకేషన్స్** మీద తాకాలి.
- ఫేస్ ఐడీ లేదా పాస్‌కోడ్ సాయంతో అన్‌లాక్ చేసి, హిస్టరీని సమీక్షించుకోవచ్చు.
- క్లియర్ హిస్టరీ మీద తాకితే వివరాలన్నీ పోతాయి. ఒకవేళ అసలే ట్రాక్ చేయొద్దని అనుకుంటే బటన్‌ను ఆఫ్ చేసుకోవాలి.
- లొకేషన్ సర్వీసెస్ జాబితాను సమీక్షించుకొని, ఆయా యాప్స్‌కు **వైల్ యూజింగ్** లేదా **నెవర్**‌ను సెట్ చేసుకోవాలి. చాలావాటికి 24 గంటలూ యాక్సెస్ అవసరం లేదు కదా.

ఆండ్రాయిడ్‌లో- టైమ్‌లైన్, యాప్ పర్మిషన్స్‌లో

ఆండ్రాయిడ్ ఫోన్లలో **టైమ్‌లైన్** రూపంలో ట్రాకింగ్ కనిపిస్తుంది. గూగుల్ ఖాతాతో ముడిపడే ఇది కేవలం పరికరానికే పరిమితం కాదు. టర్న్ ఆఫ్ చేసుకోకపోతే ఫోన్‌ను మార్చినా మనల్ని అనుసరిస్తూనే ఉంటుంది. దీన్ని చూడాలంటే?

- గూగుల్ మ్యాప్స్ ఓపెన్ చేయాలి. ప్రొఫైల్ పిక్చర్ మీద తాకి, **యువర్ టైమ్‌లైన్**‌ను క్లిక్ చేయాలి. మూడు చుక్కల మీద తాకితే లొకేషన్ అండ్ ప్రైవసీ సెటింగ్స్ కనిపిస్తాయి.
- లొకేషన్ సెటింగ్స్‌లో టైమ్‌లైన్ ఫీచర్‌ను ఆఫ్ చేసుకోవాలి. **డిలీట్ ఆల్ టైమ్‌లైన్ డేటా**‌ను తాకితే మొత్తం వివరాలన్నీ పోతాయి కూడా. అనంతరం యాప్ పర్మిషన్స్‌ను తనిఖీ చేయాలి.
- సెటింగ్స్ ద్వారా లొకేషన్‌లోకి వెళ్లి యాప్ పర్మిషన్స్‌ను గమనించాలి.
- అలో ఆల్ ద టైమ్ యాప్స్‌ను **అలో ఓన్లీ వైల్ యూజింగ్**‌కు మార్చుకోవాలి. కావాలంటే మొత్తానికే **డినై** చేయొచ్చు.

ఈనాడు బిజినెస్

సైయెంట్ బోర్డులోకి పీఆర్ రమేష్, మదన్ పిల్లుట్ల



ఈనాడు, హైదరాబాద్: ఐటీ, ఇంజినీరింగ్ సేవల సంస్థ అయిన సైయెంట్ లిమిటెడ్ డైరెక్టర్ల బోర్డులో మార్పులు చోటుచేసుకున్నాయి. కొత్తగా పీఆర్ రమేష్, మదన్ పిల్లుట్ల స్వతంత్ర డైరెక్టర్లుగా చేరారు. చార్టర్డ్ అకౌంటెంట్ అయిన పీఆర్ రమేష్ డెలాయిట్ ఇండియా ఛైర్మన్‌గా పనిచేశారు. సెబీ, ఐఆర్‌డీఏఐ, ఆర్‌బీఐ, వివిధ ప్రభుత్వ కమిటీల్లో అకౌంటింగ్ ప్రమాణాలపై క్రియాశీలకంగా పనిచేశారు. దాదాపు నాలుగు దశాబ్దాల అనుభవం ఉన్న ఆయన ప్రస్తుతం సిప్లా, ఎల్ అండ్ టీ, నెస్లే ఇండియా, ఐటీసీ హోటల్స్.. తదితర సంస్థల బోర్డుల్లో ఉన్నారు. మదన్ పిల్లుట్ల హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) డీన్, ప్రొఫెసర్ (ఆర్గనైజేషనల్ బిహేవియర్)గా వ్యవహరిస్తున్నారు. లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో 22 ఏళ్ల పాటు పనిచేశారు. ఎన్నో అంతర్జాతీయ పత్రికల్లో పరిశోధనా వ్యాసాలు రాశారు. ఈ ఇద్దరికి ఉన్న విశేష అనుభవం కంపెనీకి మేలు చేస్తుందని సైయెంట్ లిమిటెడ్ నాన్-ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ ఎం.ఎం. మురుగప్పన్ పేర్కొన్నారు.

రిలయన్స్ రేటింగ్ మరింత పెంపు!

అవకాశం ఉందన్న ఎస్ అండ్ పీ

దిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ రేటింగ్ పెంచేందుకు అవకాశం ఉంటుందని ఎస్ అండ్ పీ తెలిపింది. ప్రస్తుతం రిలయన్స్‌కు 'బీబీబీ+' రేటింగ్ ఉంది. 'ఈ రేటింగ్‌ను ఒక స్థానం మేర పెంచాలంటే కంపెనీ స్టాండలోన్ క్రెడిట్ ప్రొఫైల్ మెరుగవ్వాల్సి ఉంటుంది. ఇందుకు రుణాలపై తక్కువగా ఆధారపడి కార్యకలాపాలు నిర్వహించాలి. తక్కువ ఒడుదొడుకులు ఉండే ఇంధనేతర వ్యాపారాలను బలోపేతం చేసుకోవాల్సి ఉంటుంద'ని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ క్రెడిట్ విశ్లేషకుడు నీల్ గోపాలకృష్ణన్ తెలిపారు. ఈ సమయంలో కంపెనీ మూలధన వ్యయాలు అంచనాల మించి పెరిగి, కీలక వ్యాపారాల పనితీరు నెమ్మదించడం ద్వారా ఆదాయాలు తగ్గి నగదు ప్రవాహం తగ్గితే రేటింగ్‌ను తగ్గించే అవకాశమూ ఉంటుందని అన్నారు.

భారత్ వృద్ధి రేటు 6.7%!

ఏప్రిల్-జూన్ త్రైమాసికంపై ఇక్రా అంచనా

దిల్లీ: భారత వృద్ధి రేటు 2025-26 ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 6.7 శాతంగా నమోదు కావచ్చని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. ఏడాది క్రితం ఇదే సమయంలో నమోదైన వృద్ధి 6.5 శాతంతో పోలిస్తే ఇది అధికం. ప్రభుత్వం మూలధన వ్యయాలు అధికంగా చేయడం, ఎక్కువ ఎగుమతులు వృద్ధికి దోహదం చేయొచ్చని ఇక్రా పేర్కొంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) జూన్ త్రైమాసికంలో 6.5 శాతం వృద్ధి నమోదు కావొచ్చని అంచనా వేసిన సంగతి విదితమే. 2024-25 జనవరి-మార్చి త్రైమాసికంలో దేశ జీడీపీ వృద్ధి 7.4 శాతంగా నమోదైంది. 2025-26 తొలి త్రైమాసిక (ఏప్రిల్-జూన్) వృద్ధి గణాంకాలు ఈ నెల 29న అధికారికంగా విడుదల చేయనున్నారు.

కోడి గుడ్డు

20న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (వంద గుడ్లకు రూపాయల్లో)

హైదరాబాద్	495
వరంగల్	497
విజయవాడ	525
గోదావరి	520
విశాఖపట్నం	520
చిత్తూరు	553

ఎగుమతుల్లో తెలుగు రాష్ట్రాల హవా

- ఇంజినీరింగ్ ఉత్పత్తుల్లో వేగంగా ముందుకు
- ఔషధాలు, ఎలక్ట్రానిక్స్, ధాన్యం ఎగుమతుల్లోనూ అగ్రగామిగా
- త్వరలో టాప్-5 రాష్ట్రాల జాబితాలో స్థానం

తెలుగు రాష్ట్రాలు ఎగుమతుల్లో ఆసక్తికరమైన వృద్ధి నమోదు చేస్తున్నాయి. ఏటేటా ఎగుమతులు పెరగటమే కాకుండా, ఎగుమతుల శ్రేణి విస్తరించటం మరొక ప్రత్యేకత. ఎన్నో ఏళ్లుగా తెలుగు రాష్ట్రాల నుంచి అధికంగా ఎగుమతి అవుతున్న వస్తువుల జాబితాలో వ్యవసాయ ఉత్పత్తులు ముందుంటూ వచ్చాయి. కానీ ఇప్పుడు పరిస్థితి మారుతోంది. ఇంజినీరింగ్ ఉత్పత్తులు, ఔషధాలు, రసాయనాలు, ఎలక్ట్రానిక్స్ వంటి 'మ్యాన్‌ఫ్యాక్చర్డ్ గూడ్స్' ఎగుమతులు బాగా పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఇంజినీరింగ్ ఉత్పత్తుల విభాగంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు సాధిస్తున్న ప్రగతి ఎంతో ఆకర్షణీయంగా ఉంది. సమీప భవిష్యత్తులో ఇంజినీరింగ్ ఉత్పత్తుల ఎగుమతులు ఇంకా అధికంగా నమోదవుతాయని, అందుకు అవసరమైన పరిస్థితులు (ఎకో సిస్టమ్) తెలుగు రాష్ట్రాల్లో విస్తరిస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి అత్యధిక ఎగుమతులు సాధించిన రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్ 6వ స్థానంలో, తెలంగాణ 7వ స్థానంలో నిలిచాయి. త్వరలో టాప్-5 జాబితాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు స్థానం సంపాదించే అవకాశం ఉందని తెలుస్తోంది.

రక్షణ, అంతరిక్ష పరిజ్ఞానం



తెలంగాణ రాష్ట్రం మన దేశంలో రక్షణ, అంతరిక్ష పరిజ్ఞానానికి వెన్నుదన్నుగా మారుతోంది. ముఖ్యంగా హైదరాబాద్ నగరం రక్షణ ఉత్పత్తులకు కీలకమైన కేంద్రంగా ఎదుగుతోంది. బీడీఎల్, మిధాని, డీఆర్‌డీఎల్ విభాగాలకు తోడు ప్రైవేటు రంగంలో ఎన్నో సంస్థలు కీలకమైన రక్షణ ఉత్పత్తులను భారత సైన్యానికి అందించటమే కాకుండా పెద్దఎత్తున ఎగుమతులు చేస్తున్నాయి. ఇదే కాకుండా స్పేస్‌టెక్ పరిశ్రమలు ఇక్కడ విస్తరిస్తున్నాయి. ఇతర ఇంజినీరింగ్ ఉత్పత్తులను ఎగుమతి చేసే యూనిట్లు, కంపెనీలు పెద్ద సంఖ్యలో హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న పారిశ్రామిక వాడల్లో ఏర్పాటవుతున్నాయి. దీనివల్ల ఇంజినీరింగ్ ఉత్పత్తులు గత కొన్నేళ్లలోనే ఎంతో అధికంగా పెరిగే అవకాశం ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రోత్సాహకర విధానాలు, రాష్ట్రంలో ఉన్న మౌలిక సదుపాయాలు, మానవ వనరుల లభ్యత కూడా ఎగుమతుల్లో వృద్ధికి వీలు కల్పిస్తున్నట్లు సంబంధిత వర్గాలు వివరిస్తున్నాయి.

2024-25 ఎగుమతుల్లో టాప్-10 రాష్ట్రాలు... (మిలియన్ డాలర్లలో..)

గుజరాత్	1,16,331
మహారాష్ట్ర	65,855
తమిళనాడు	52,073
కర్ణాటక	30,480
ఉత్తర ప్రదేశ్	21,980
ఆంధ్రప్రదేశ్	20,782
తెలంగాణ	19,122
పశ్చిమ బెంగాల్	12,667
ఒడిశా	10,097
మధ్యప్రదేశ్	7,824

వ్యవసాయోత్పత్తుల కంటే మిన్నగా...

వ్యవసాయ ప్రాధాన్య రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ నుంచి వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు అధికంగా కనిపిస్తున్నాయి. ఈ రాష్ట్రం నుంచి ధాన్యం, పొగాకు, కాఫీ, మిర్చి, పసుపు ఎగుమతులకు తోడు చేపలు, రొయ్యలు, రొయ్యల మేత అధికంగా ఎగుమతి అవుతున్నాయి. కానీ ఇటీవల కాలంలో ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్ వస్తువులు, రసాయనాలు, మందుల ఎగుమతులు పెరుగుతున్నాయి. వచ్చే రెండు నుంచి మూడేళ్ల వ్యవధిలో ఇంజినీరింగ్ వస్తువులు, ఎలక్ట్రానిక్స్ వస్తువుల ఎగుమతులు ఇంకా బాగా పెరుగుతాయని, ప్రభుత్వం అందుకు తగిన చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమల శాఖ వర్గాలు వివరిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వ్యవసాయ రంగంలోని ఎక్కువ మంది ఉపాధి పొందుతున్నారు. దీన్ని తగ్గించాలంటే పరిశ్రమలను ప్రోత్సహించి ఉద్యోగాలు కల్పించటమే మార్గం. అందువల్ల పారిశ్రామిక అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు, దీని ఫలితాలు త్వరలోనే కనిపిస్తాయని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. కొత్తగా పారిశ్రామిక వాడల ఏర్పాటు, ప్రోత్సాహకాలు ఇవ్వటం, అంకుర సంస్థలను ప్రోత్సహించటం... వంటి చర్యలను ప్రస్తావిస్తున్నాయి. దీనివల్ల ఎగుమతులు ఇంకా బాగా పెరుగుతాయని అంచనా వేస్తున్నారు.

తెలంగాణ ఏం ఎగుమతి చేస్తోంది...?
- ఇంజినీరింగ్ ఉత్పత్తులు
- డ్రగ్స్, ఫార్మాస్యూటికల్స్
- ఆర్గానిక్, ఇన్‌ఆర్గానిక్ కెమికల్స్
- ఎలక్ట్రానిక్స్ వస్తువులు
- రత్నాభరణాలు
- ధాన్యం
- మైకా, బొగ్గు, ఇతర ఖనిజాలు
- కాఫీ

ఆంధ్రప్రదేశ్ నుంచి...
- ఇంజినీరింగ్ వస్తువులు
- సముద్ర ఉత్పత్తులు
- డ్రగ్స్, ఫార్మాస్యూటికల్స్
- కాఫీ
- ఆర్గానిక్, ఇన్‌ఆర్గానిక్ కెమికల్స్
- ఎలక్ట్రానిక్స్ వస్తువులు
- పొగాకు
- పెట్రోలియం ఉత్పత్తులు
- ధాన్యం

- ఈనాడు, హైదరాబాద్

ప్రతిపాదిత జీఎస్టీ అమలుతో ఏటా రూ.85,000 కోట్ల ఆదాయ నష్టం: ఎస్‌బీఐ రీసెర్చ్



దిల్లీ: కేంద్రం ప్రతిపాదించిన తదుపరి తరం (నెక్స్ట్‌జెన్) జీఎస్టీ సంస్కరణలు అమలైతే ప్రభుత్వానికి ఏడాదికి సగటున రూ.85,000 కోట్ల ఆదాయ నష్టం రావచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక మంగళవారం వెల్లడించింది. అయితే కొత్తగా ప్రతిపాదించిన రెండంచెల జీఎస్టీ గృహ వినియోగ వస్తువులపై జీఎస్టీ తగ్గడంతో రూ.1.98 లక్షల కోట్ల వినియోగాన్ని ప్రోత్సహించే అవకాశం లేకపోలేదని వివరించింది. తదుపరి తరం జీఎస్టీ కింద 5, 18 శాతం శ్లాబులు మాత్రమే ఉండనున్నాయి. వీటితో పాటు 5-7 వస్తువులపై (పాన్ మసాలా, పొగాకు ఉత్పత్తులు వంటివి) 40 శాతం జీఎస్టీ ఉండబోతోంది.

✦ జీఎస్టీ 2017 జులై 1 నుంచి అమల్లోకి రాగా, ఆ సమయంలో సగటు జీఎస్టీ రేటు 14.4 శాతంగా ఉండేదని ఎస్‌బీఐ రీసెర్చ్ తెలిపింది. 2019 సెప్టెంబరు నాటికి అది 11.6 శాతానికి తగ్గగా, ప్రస్తుత రేట్ల హేతుబద్ధీకరణతో సగటు జీఎస్టీ రేటు 9.5 శాతానికి దిగొస్తుందని వివరించింది.

మరో కంపెనీ కొనుగోలులో నాట్కో





రాజీవ్ నన్నపనేని

ఈనాడు, హైదరాబాద్: నాట్కో ఫార్మా మరొక కంపెనీని కొనుగోలు చేయటానికి సన్నద్ధమవుతోంది. ఈ సంస్థ దక్షిణాఫ్రికా కంపెనీ అయిన అడ్‌కాక్‌లో 35 శాతం వాటాను దాదాపు రూ.2,000 కోట్లకు కొనుగోలు చేయాలని నిర్ణయించిన విషయం విదితమే. ఈ కొనుగోలు ప్రక్రియ వచ్చే రెండు, మూడు నెలల్లో పూర్తి కానుంది. ఇప్పుడు మరో కంపెనీ కొనుగోలుకు ప్రయత్నిస్తోంది. ఈ మొదటి త్రైమాసిక ఆర్థిక ఫలితాలపై ఇన్వెస్టర్లతో నిర్వహించిన 'ఎర్నింగ్స్ కాల్‌'లో నాట్కో ఫార్మా సీఈఓ, రాజీవ్ నన్నపనేని ఈ విషయాన్ని వెల్లడించారు. దీనికి అవసరం అయితే నిధుల సమీకరణ చేపడతామని తెలిపారు. ... ఆదాయాల్లో స్థిరత్వం వస్తుందని అంచనా వేస్తున్నారు.

వచ్చే ఏడాదిలో 'సెమాగ్లుటైడ్' ఔషధం విడుదల: టైప్-2 మధుమేహం, ఊబకాయం చికిత్సలో వినియోగించే సెమాగ్లుటైడ్ జనరిక్ ఔషధం నాట్కో ఫార్మా నుంచి వచ్చే ఏడాదిలో అందుబాటులోకి రానుంది. దీనికి అవసరమైన సన్నాహాలు చేస్తున్నట్లు రాజీవ్ నన్నపనేని తెలిపారు. అవకాశం కలిగిన వెంటనే, తొలిదశలోనే ఈ మందును మార్కెట్లో విడుదల చేస్తామని తెలిపారు. సెమాగ్లుటైడ్‌పై పేటెంట్ గడువు త్వరలోనే తీరిపోనుండడంతో పలు కంపెనీలతో పాటు నాట్కో ఫార్మా కూడా దీనిపై దృష్టిసారించింది. మన దేశంలో సెమాగ్లుటైడ్ బ్రాండెడ్ ఔషధం ధర ఎక్కువే అయినా అధిక అమ్మకాలు నమోదవుతున్నాయి. అందువల్ల తక్కువ ధరలో లభించే జనరిక్ మందుకు కొనుగోలుదార్లు ఎక్కువగా ఉంటారని స్థానిక ఫార్మా కంపెనీలు ఆశిస్తున్నాయి. మరో వైపు, కంపెనీకి చెందిన క్రాప్ హెల్త్ సైన్సెస్ వ్యాపారం త్వరలో 'బ్రేక్-ఈవెన్' దశకు చేరుకోవచ్చని కంపెనీ వర్గాలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.150 కోట్ల అమ్మకాలు నమోదు చేసే అవకాశం కనిపిస్తోంది.

ఓపెన్ ఏఐ 'చాట్‌జీపీటీ గో'

నెలవారీ అద్దె రూ.399



దిల్లీ: మన దేశంలో ఓపెన్ ఏఐ 'చాట్‌జీపీటీ గో' పేరుతో కొత్త సేవలను ప్రారంభించింది. రూ.399 నెలవారీ అద్దెకే ఈ ప్లాన్ అందుబాటులో ఉంటుందని తెలిపింది. సందేశాలు, ఇమేజ్ జనరేషన్, ఫైల్ అప్‌లోడ్‌ల సంఖ్యను భారీగా అనుమతించనుంది. చాట్‌జీపీటీ సబ్‌స్క్రిప్షన్ల కోసం యూపీఐతోనూ చెల్లింపులు చేసే సౌలభ్యాన్ని తీసుకొచ్చినట్లు వెల్లడించింది. దేశవ్యాప్తంగా వినియోగదార్లు సులభంగా ఓపెన్ ఏఐ అడ్వాన్స్‌డ్ ఏఐ టూల్స్‌ను యాక్సెస్ చేసుకోవచ్చని వివరించింది. ఉచిత ప్లాన్‌తో పోలిస్తే చాట్‌జీపీటీ గోలో సందేశాల పరిమితి, ఇమేజ్ జనరేషన్, ఫైల్ లేదా ఇమేజ్ అప్‌లోడ్‌లు 10 రెట్లు ఎక్కువగా ఉండనున్నాయి. మెమొరీ కూడా ఉచిత ప్లాన్‌తో పోలిస్తే రెండింతలు అధికంగా ఉండనుంది. ఇదివరకే అందుబాటులో ఉన్న రూ.1,999 చాట్‌జీపీటీ ప్లస్ ప్లాన్‌కు అదనంగా ఇది కొనసాగనుంది. దీంతోపాటు నిపుణులు, సంస్థల కోసం ఇప్పటికే ప్రో ప్లాన్‌కు రూ.19,900తో అడ్వాన్స్‌డ్ ఫీచర్లను ఓపెన్ ఏఐ అందిస్తోన్న విషయం తెలిసిందే.

మొబైల్ ఫోన్లపై 18% జీఎస్టీ సరికాదు

5% శ్లాబ్‌లోకి మార్చాలంటున్న ఐసీఈఏ



దిల్లీ: మొబైల్ ఫోన్లు, వాటి విడిభాగాలను నిత్యావసర వస్తువులకు కేటాయిస్తున్న 5 శాతం జీఎస్టీ శ్లాబులోకి చేర్చాల్సిందిగా ప్రభుత్వాన్ని ఇండియా సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) కోరింది. డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలంటే.. . మొబైల్ ఫోన్లకు ప్రస్తుతం విధిస్తున్న 18 శాతం జీఎస్టీ సరికాదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. 'విద్య, ఆరోగ్య సంరక్షణ, బ్యాంకింగ్.. ఇలా పలు రంగాలకు సంబంధించి డిజిటల్ సేవలను పొందేందుకు ప్రజలకు మొబైల్ ఫోన్లే ముఖ్య వారధి. అందువల్ల తదుపరి జీఎస్టీ సంస్కరణల్లో ఫోన్లను నిత్యావసర వస్తువుగా పరిగణించాల'ని ఐసీఈఏ ఛైర్మన్ పంకజ్ మొహింద్రూ తెలిపారు. తొలుత మొబైల్ ఫోన్లు 12 శాతం శ్లాబులో ఉండేవి. 2020లో వీటిని 18 శాతం శ్లాబులోకి చేర్చిన తర్వాత మొబైల్ ఫోన్ల వార్షిక వినియోగం, గిరాకీ నెమ్మదించేందుకు దారి తీసిందని ఐసీఈఏ తెలిపింది.

భారత్‌పై టారిఫ్‌ల ప్రభావం ఉండదు

ఎస్ అండ్ పీ అంచనా



దిల్లీ: భారత దీర్ఘకాలిక వృద్ధిపై అమెరికా టారిఫ్‌ల ప్రభావం ఉండకపోవచ్చని ఎస్ అండ్ పీ గ్లోబల్ రేటింగ్స్ అభిప్రాయపడింది. ఆర్థిక సంస్కరణలపై ప్రభుత్వం దృష్టి పెడుతుండటం, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చేందుకు ప్రయత్నిస్తుండటం ఇందుకు కారణమని విశ్లేషించింది. 'విదేశీ వాణిజ్యంపై భారత ఆర్థిక వ్యవస్థ పరిమితంగానే ఆధారపడుతోంది. జీడీపీ వృద్ధిలో ఎగుమతుల వాటా కేవలం 15 శాతమే కాగా... దేశీయ గిరాకీనే 85 శాతం వరకు ప్రభావం చూపుతోంది. అందుకే టారిఫ్‌ల ప్రభావం భారత్‌పై పెద్దగా ఉండబోద'ని ఎస్ అండ్ పీ ఆసియా పసిఫిక్ ఆర్థికవేత్త విశ్రుత్ రాణా విశ్లేషించారు.

అమెరికా విధించే 50 శాతం అధిక టారిఫ్‌లు భారత్ నుంచి ఎగుమతి అయ్యే అన్ని వస్తువులకూ వర్తించబోదనే విషయాన్ని ఇక్కడ గుర్తుంచుకోవాలని అన్నారు. 'భారత ఆర్థిక వ్యవస్థపై టారిఫ్‌ల ప్రభావాన్ని పరిమితం చేసేందుకు పలు అంశాలు దోహదం చేస్తాయి. స్వల్పకాలంలో కొంత ప్రభావమైతే ఉండొచ్చు. మౌలిక రంగంపై అధిక కేటాయింపులు, వ్యాపార అనుకూల పరిస్థితులు లాంటివి మధ్యకాలంలో దేశ వృద్ధి పథాన్ని నిర్దేశిస్తాయ'ని ఆయన వివరించారు. దీర్ఘకాలిక అంచనా ఆధారంగానే రేటింగ్స్‌ను నిర్ణయిస్తామని.. ఫార్మా, ఎలక్ట్రానిక్స్ లాంటి రంగాలకు మినహాయింపు ఉంటుందని విశ్లేషించారు. 'భారత్ మొత్తం ఎగుమతుల్లో అమెరికా వాటా కేవలం ఒక్క శాతమే. అందువల్ల టారిఫ్‌లు అధికంగా ఉన్నా.. భారత దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలపై ఎటువంటి ప్రభావం ఉండద'ని ఆయన వివరించారు.

✦ జీఎస్టీ విధానంలో శ్లాబుల సంఖ్యను రెండింటికి తగ్గించాలనే ప్రతిపాదన వల్ల పన్ను రేట్లు దిగివస్తాయని.. దీర్ఘకాలంలో ఆదాయాలు పెరిగేందుకు తోడ్పడుతుందని అభిప్రాయపడ్డారు.

కార్పొరేట్లపైనా తక్కువే: ఫిచ్

భారత కార్పొరేట్ సంస్థలపై అమెరికా టారిఫ్‌ల ప్రభావం కొంత మేరకే ఉండొచ్చని ఫిచ్ రేటింగ్స్ విశ్లేషించింది. ప్రస్తుతానికి ఫార్మా సంస్థలపై ఎటువంటి ప్రభావం ఉండనప్పటికీ.. భవిష్యత్‌లో అమెరికా టారిఫ్‌లపై చేసే ప్రకటనల మీద ఇది ఆధారపడి ఉంటుందని తెలిపింది. అలాగే టారిఫ్‌ల మలివిడత ప్రభావ ముప్పునకు కూడా అవకాశం ఉంటుందని, అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరితే ఈ ముప్పు తగ్గుతుందని ఫిచ్ వివరించింది. భారత చమురు మార్కెటింగ్ కంపెనీల మొత్తం ఎగుమతుల్లో రష్యా నుంచి సుమారు 30-40% వరకు ఉంటున్నాయని, తక్కువ ధరకే చమురును దిగుమతి చేసుకోవడం వల్ల ఆ కంపెనీల లాభదాయకతకు తోడ్పడుతోందని తెలిపింది. భారత ఐటీ కంపెనీలతో పాటు దేశీయ వినియోగంపై ఆధారపడే చమురు-గ్యాస్, సిమెంట్, భవన నిర్మాణ సామగ్రి, ఇంజినీరింగ్, టెలికాం, యుటిలిటీస్ లాంటి రంగాలపై టారిఫ్‌లు నేరుగా ప్రభావం చూపేది తక్కువేనని ఫిచ్ అంచనా వేసింది. అయితే ఈ అధిక టారిఫ్‌లు ఇలాగే కొనసాగితే.. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధి అంచనాను తగ్గించాల్సిన పరిస్థితి ఏర్పడొచ్చని తెలిపింది.

ఉద్యోగం చేస్తూ చదువు

టెక్‌బీని తీసుకొచ్చిన హెచ్‌సీఎల్ టెక్

HCLTech

ఈనాడు, హైదరాబాద్: ఐటీ రంగంలో స్థిరపడాలనుకునే వారికి పరిశ్రమకు అవసరమైన శిక్షణతో పాటు, ఉద్యోగంలో చేరి, చదువుకునే అవకాశాన్ని హెచ్‌సీఎల్ టెక్ అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇంటర్మీడియట్ లేదా 12వ తరగతి పూర్తయిన వారు హెచ్‌సీఎల్ టెక్‌బీ కోర్సులో చేరేందుకు అర్హులని సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బీ.సుబ్బారామన్ తెలిపారు. ఇందులో చేరిన వారికి ఏడాది పాటు శిక్షణ ఉంటుందని, ఆ తర్వాత హెచ్‌సీఎల్ టెక్ సంస్థలో చేర్చుకుంటామన్నారు. ఆ తర్వాత బిట్స్ పిలానీ, ఐఐటీ కొట్టాయం, అమిటీ యూనివర్సిటీ ఆన్‌లైన్, కేఎల్ యూనివర్సిటీలాంటి వాటిలో చేరి, నచ్చిన కోర్సును ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు. విజయవాడతోపాటు, మధురై, చెన్నై తదితర నగరాల్లో శిక్షణ కేంద్రాలున్నాయన్నారు.


బ్యాంక్.ఇన్ డొమైన్‌లోకి పీఎన్‌బీ

pnb

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) తన వెబ్‌సైటును బ్యాంక్.ఇన్ డొమైన్‌లోకి తీసుకొచ్చినట్లు వెల్లడించింది. కొత్త వెబ్‌సైట్ పీఎన్‌బీ.బ్యాంక్.ఇన్‌గా ఉంటుందని తెలిపింది. వినియోగదారులు బ్యాంకుల వెబ్‌సైట్లను సులభంగా గుర్తుపట్టేందుకు వీలుగా బ్యాంక్.ఇన్ డొమైన్‌లోకి మారాల్సిందిగా ఆర్‌బీఐ సూచించింది. ఈ నేపథ్యంలో పీఎన్‌బీ తన వెబ్‌సైటు పేరును మార్చింది.

ఎయిర్ ఇండియాకు ఎస్ఏఎఫ్


ఒప్పందం కుదుర్చుకున్న ఐఓసీ



గురుగ్రామ్: వినియోగించిన వంట నూనెతో 'సుస్థిర విమాన ఇంధనం (ఎస్ఏఎఫ్)'ను ఉత్పత్తి చేసేందుకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) సిద్ధమవుతోంది. ఈ ఇంధనాన్ని ఎయిర్ ఇండియాకు సరఫరా చేసేందుకు రెండు సంస్థలూ ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. విమానయన రంగంలో పర్యావరణ అనుకూల భవిష్యత్తు వైపు ఇది ఒక ముఖ్యమైన అడుగు అని రెండు సంస్థలూ మంగళవారం వెల్లడించాయి. ఈ మేరకు ఐఓసీ ఛైర్మన్ ఎ.ఎస్.సాహ్నీ, ఎయిర్ ఇండియా సీఈఓ కాంప్‌బెల్ విల్సన్ సమక్షంలో ఇరు సంస్థలు ప్రతినిధులు ఒప్పందంపై సంతకాలు చేశారు. ఐఓసీ తన పానిపట్ రిఫైనరీలో ఈ ఏడాది డిసెంబరు నుంచి వాడిన వంట నూనె నుంచి సస్టైనబుల్ ఏవియేషన్ ఫ్యూయల్ (ఎస్ఏఎఫ్) ఉత్పత్తి ప్రారంభించాలనే ప్రణాళికల్లో ఉందని ఈ సందర్భంగా సాహ్నీ తెలిపారు. ఈ రిఫైనరీ ఏటా 35,000 టన్నుల హరిత ఇంధనాన్ని ఉత్పత్తి చేయనుంది. ఇందుకోసం హోటళ్లు, రెస్టారెంట్ల నుంచి వాడిన వంట నూనెను ఐఓసీ సేకరించనుంది. విమాన రవాణాలో కాలుష్యాన్ని ఎస్ఏఎఫ్ తగ్గిస్తుంది. దీన్ని సంప్రదాయ ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్)లో 50 శాతం వరకూ కలపొచ్చు. 2027 నుంచి అంతర్జాతీయ విమానయాన సంస్థలకు విక్రయించే ఏటీఎఫ్‌లో 1 శాతం ఎస్ఏఎఫ్‌ను కలపాలనే నిబంధనను భారత్ తీసుకొచ్చింది. విల్సన్ మాట్లాడుతూ.. 2050 నాటికి సున్నా శాతం కర్బన రహితం కావాలనే ఐఏటీఏ (ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్) లక్ష్యానికి మద్దతు ఇచ్చేందుకు ఈ ఒప్పందం తోడ్పడుతుందని పేర్కొన్నారు.

నాలుగో రోజూ సూచీల జోరు

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.634 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.2,261 కోట్లు



సెన్సెక్స్ ▲ 371 — 81644
నిఫ్టీ ▲ 104 — 24981

సమీక్ష

వరుసగా నాలుగో రోజూ సూచీలు లాభాల జోరును కొనసాగించాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా మోటార్స్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడం ఇందుకు కలిసొచ్చింది. జీఎస్టీ సంస్కరణలపై సానుకూల అంచనాలు, భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం ఇందుకు తోడయ్యాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 26 పైసలు పెరిగి 87.13 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 0.93% నష్టంతో 65.98 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు నష్టాల్లో ముగియగా, ఐరోపా సూచీలు మెరుగ్గా ట్రేడయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ మంగళవారం రూ.3.44 లక్షల కోట్లు పెరిగి రూ.454.40 లక్షల కోట్లు (5.21 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 45 పాయింట్ల (క్రితం ముగింపు 81,273.75) లాభంతో 81,319.11 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. కొనుగోళ్ల మద్దతుతో లాభాల జోరు కొనసాగించిన సూచీ, 81,755.88 వద్ద గరిష్ఠాన్ని నమోదుచేసింది. చివరకు 370.64 పాయింట్ల లాభంతో 81,644.39 వద్ద ముగిసింది. నిఫ్టీ 103.70 పాయింట్లు పెరిగి 24,980.65 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,873.95- 25,012.65 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 19 రాణించాయి. టాటా మోటార్స్ 3.50%, అదానీ పోర్ట్స్ 3.16%, రిలయన్స్ 2.82%, ఎటెర్నల్ 2.15%, టెక్ మహీంద్రా 1.70%, కోటక్ బ్యాంక్ 1.56%, హెచ్‌యూఎల్ 1.37%, మారుతీ 1.17% లాభపడ్డాయి. బజాజ్ ఫిన్‌సర్వ్, పవర్‌గ్రిడ్, ఎం అండ్ ఎం, హెచ్‌సీఎల్ టెక్, బీఈఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.09% వరకు నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో.. చమురు-గ్యాస్ 1.49%, ఇంధన 1.48%, వాహన 1.45%, వినియోగ 1.25%, సేవలు 1.12%, టెలికాం 1.04% మెరిశాయి. ఐటీ, విద్యుత్, టెక్ నిరాశపరిచాయి. బీఎస్ఈలో 2580 షేర్లు లాభపడగా, 1502 స్క్రిప్‌లు నష్టపోయాయి. 158 షేర్లలో ఎటువంటి మార్పులేదు.

✦ కన్‌స్ట్రక్షన్ కెమికల్స్ విభాగం కింద 'హార్డ్ వర్కర్' బ్రాండ్‌ను **రామ్‌కో సిమెంట్స్** తీసుకొచ్చింది. వచ్చే 4-5 ఏళ్లలో రూ.2,000 కోట్ల ఆదాయాన్ని ఈ బ్రాండ్ సృష్టిస్తుందని కంపెనీ భావిస్తోంది.

✦ మెక్సికో సిటీలో ఏఐ ఆధారిత కార్యకలాపాల కేంద్రాన్ని **టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)** ప్రారంభించింది. మెక్సికో, లాటిన్ అమెరికాలో ఆవిష్కరణలను వేగవంతం చేయాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది.

✦ 2030 నాటికి మొత్తం 15 తయారీ కేంద్రాల్లో 100 శాతం పునరుత్పాదక ఇంధనాన్ని వినియోగిస్తామని **సుజ్లాన్ గ్రూప్** ప్రతిజ్ఞ చేసింది.

✦ 390 మెగావాట్ సౌర విద్యుత్ ప్రాజెక్టు, 780 మెగావాట్ అవర్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ వ్యవస్థ కోసం ఎన్‌హెచ్‌పీసీ నుంచి ఆర్డరు దక్కించుకున్నట్లు **రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్** వెల్లడించింది.

✦ తమిళనాడులో హీలియం రికవరీ డిమాన్‌స్ట్రేషన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు ఇంజినీర్స్ ఇండియాతో **ఓఎన్‌జీసీ** ఆర్ అండ్ డీ విభాగం ఓఎన్‌జీసీ ఎనర్జీ సెంటర్ ట్రస్ట్ ఒప్పందం కుదుర్చుకుంది.

✦ కృత్రిమ మేధ కంపెనీ కోరోవర్‌లో పెట్టుబడులు పెట్టినట్లు ప్రైవేటు రంగంలోని **హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్** తెలిపింది. ఈ సంస్థ ఎంటర్‌ప్రైజ్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్ (ఎల్ఎల్ఎం) భారత్‌జీపీటీని సృష్టించింది.

ఐపీఓ సమాచారం..

✦ **బ్లూస్టోన్ జువెలరీ అండ్ లైఫ్‌స్టైల్** షేరు ఇష్యూ ధర రూ.517తో పోలిస్తే బీఎస్ఈలో 1.58% నష్టంతో రూ.508.80 వద్ద ప్రారంభమైంది. అనంతరం పుంజుకున్న షేరు, ఇంట్రాడేలో రూ.564 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 5.60% లాభంతో రూ.546 దగ్గర ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.8,262.09 కోట్లుగా నమోదైంది.

✦ **విక్రాన్ ఇంజినీరింగ్** ఐపీఓ ఆగస్టు 26న ప్రారంభమై 29న ముగియనుంది. ఇందుకు ధరల శ్రేణిగా రూ.92-97 నిర్ణయించారు. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.772 కోట్లు సమీకరించాలని భావిస్తోంది.

✦ ఐపీఓ ద్వారా నిధులు సమీకరించేందుకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ వద్ద డిజిటల్ రుణాల ప్లాట్‌ఫామ్‌ను కిస్తును నిర్వహించే **ఆన్‌ఈఎంఐ టెక్నాలజీ సొల్యూషన్స్** ముసాయిదా పత్రాలు దాఖలు చేసింది. ఇష్యూలో భాగంగా రూ.1000 కోట్ల తాజా షేర్లను, ఆఫర్ ఫర్ సేల్‌లో 88.79 లక్షల షేర్లను ప్రమోటర్లు విక్రయించనున్నారు.

✦ **జెమ్ అరోమాటిక్స్** ఐపీఓ మొదటి రోజు 1.03 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 97,82,363 షేర్లను ఆఫర్ చేయగా, 1,00,64,616 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.

✦ **శ్రీజీ షిప్పింగ్ గ్లోబల్** ఐపీఓ మొదటి రోజు 2.13 రెట్ల స్పందన వచ్చింది. ఇష్యూలో భాగంగా 1,14,08,600 షేర్లను జారీ చేయగా, 2,42,92,024 షేర్లకు బిడ్లు నమోదయ్యాయి.

✦ **పటేల్ రిటెయిల్** ఐపీఓ మొదటి రోజు 6.39 రెట్ల స్పందన దక్కింది. ఇష్యూలో భాగంగా 78,15,612 షేర్లను ఆఫర్ చేయగా, 4,99,04,186 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.

ఈనాడు సినిమా

ఓ సినిమాకి పేరు ఖరారు చేయడం అంత ఆషామాషీ వ్యవహారమేమీ కాదు. దీనికోసం తెర వెనుక ఓ స్థాయి మేథోమథనమే జరుగుతుంటుంది. పేరు కథకు అద్దం పట్టేలా ఉందా.. కొత్తదనం ఉట్టిపడుతోందా.. ఆకర్షణీయంగా ఉందా.. హీరో క్రేజ్, ఇమేజ్‌కు సరిపోతోందా.. ఇక పాన్ ఇండియా బొమ్మయితే ఆ పేరు అన్ని భాషలకు నప్పేలా ఉందా.. ఇలా భిన్న కోణాల్లో ఆలోచించి పేర్లు ఖరారు చేసే ప్రయత్నం చేస్తుంటారు. ప్రస్తుతం తెలుగులో పలువురు కథానాయకుల సినిమాలకు సంబంధించి పేరు కసరత్తులు ఓ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. వీటిలో కొన్ని ఇప్పటికే నెట్టింట ప్రచారంలో వినిపిస్తూ.. సినీప్రియుల్లో ఆసక్తి రేకెత్తిస్తున్నాయి.

పేర్లు ఖరారేనా!


చిరంజీవి

కథానాయకుడు చిరంజీవి.. దర్శకుడు అనిల్ రావిపూడి కలయికలో రూపొందుతున్న సినిమాకి సంబంధించి గత కొన్నాళ్లుగా అనేక పేర్లు ప్రచారంలో వినిపిస్తూనే ఉన్నాయి. తాజాగా దీనిపై దర్శకుడు అనిల్ ఓ స్పష్టత ఇచ్చే ప్రయత్నం చేశారు. 'మన శంకర వరప్రసాద్ గారు', 'ఈ సంక్రాంతికి రఫ్ఫాడిస్తాం', 'బాస్‌తో ఈ పండగ రఫ్ఫాడిస్తున్నాం'.. ఈ మూడు పేర్లలో ఒకటి ఖరారు చేయనున్నట్లు తెలియజేశారు. అయితే వీటిలో 'మన శంకర వరప్రసాద్ గారు' అనే పేరే దాదాపు ఖాయమైనట్లు సమాచారం. ఈ పండగకి వస్తున్నారు.. అన్నది ఉపశీర్షిక. శివ శంకర వరప్రసాద్ అన్నది చిరు సొంత పేరన్న సంగతి అందరికీ తెలిసిందే. ఇప్పుడీ సినిమాలో ఆయన అదే పేరుతో అలరించనున్నారు. అందుకే ఆ పాత్ర పేరుకు తగ్గట్లుగానే టైటిల్‌ను ఖరారు చేసినట్లు తెలుస్తోంది. దీనిపై చిరు పుట్టినరోజు సందర్భంగా ఈనెల 22న స్పష్టత రానుంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ కామెడీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ వచ్చే ముగ్గుల పండక్కి థియేటర్లలోకి రానుంది.

ఆ టైటిల్‌కే జై కొట్టేనా!


వెంకటేశ్

వెంకటేశ్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ సినిమా ముస్తాబవుతున్న సంగతి తెలిసిందే. ఇటీవలే పూజా కార్యక్రమాలతో లాంఛనంగా మొదలైన ఈ చిత్రం.. వచ్చే నెల మధ్య నుంచి చిత్రీకరణ ప్రారంభించుకునే అవకాశముంది. ఇది త్రివిక్రమ్ శైలి స్వచ్ఛమైన వినోదం, గాఢమైన కుటుంబ భావోద్వేగాలతో అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించేలా ఉండనుందని చిత్ర వర్గాలు ఇప్పటికే ప్రకటించాయి. దీనికి 'వెంకట రమణ' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం బలంగా జరుగుతోంది.

ఇమేజ్‌కు భిన్నంగా..


రవితేజ

కథానాయకుడు రవితేజ తన 76వ సినిమాని ఇప్పటికే పట్టాలెక్కించారు. కిశోర్ తిరుమల దర్శకత్వం వహిస్తున్న ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సంక్రాంతి లక్ష్యంగా చిత్రీకరణ ప్రారంభించుకున్న సంగతి తెలిసిందే. దీనికి రవితేజ మాస్ ఇమేజ్‌కు భిన్నంగా 'అనార్కలి' అనే పేరును ఖరారు చేయనున్నట్లు సమాచారం. ఇప్పటికే దీనికి చిత్ర బృందమంతా ఓటేసినట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

విశ్వనాథన్ అండ్ సన్స్?


సూర్య

సూర్య 46వ సినిమాపై ఇటు తెలుగులోనూ.. అటు తమిళంలోనూ మంచి అంచనాలు నెలకొని ఉన్నాయి. వెంకీ అట్లూరి తెరకెక్కిస్తున్న ఈ ద్విభాషా చిత్రం ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న సంగతి తెలిసిందే. ఈ చిత్ర టైటిల్‌పై టాలీవుడ్‌తో పాటు కోలీవుడ్‌లోనూ ఇప్పటికే ఆసక్తికర చర్చ మొదలైపోయింది. దీనికి 'విశ్వనాథన్ అండ్ సన్స్' అనే పేరు పరిశీలనలో ఉన్నట్లు వార్తలొస్తున్నాయి.

చైతూ - నితిన్.. మాటేంటి?


నాగచైతన్య

హీరో అక్కినేని నాగచైతన్య.. దర్శకుడు కార్తిక్ దండు కలయికలో ఓ మిస్టిక్ థ్రిల్లర్ రూపొందుతున్న సంగతి తెలిసిందే. చైతూ ఇందులో నిధి అన్వేషకుడిగా సాహసాలు చేయనున్నారు. ఈ సినిమా కోసం 'వృషకర్మ' అనే పేరు ఖరారైనట్లు సమాచారం. ఇక హీరో నితిన్ త్వరలో విక్రమ్ కె.కుమార్ దర్శకత్వంలో ఓ సినిమా పట్టాలెక్కించనున్న సంగతి తెలిసిందే. క్రీడా నేపథ్య కథాంశంతో రూపొందనున్న పీరియాడిక్ చిత్రమిది. నితిన్ ఇందులో గుర్రపు స్వారీ వీరుడిగా కనువిందు చేయనున్నట్లు తెలిసింది. దీనికి తగ్గట్లుగానే ఈ సినిమాకి 'స్వారీ' అనే పేరు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.


నితిన్

హిట్టు కొట్టేశారనిపించేలా లిటిల్ హార్ట్స్ టీజర్

– అనిల్ రావిపూడి


వంశీ, సాయి, బన్నీ వాస్, అనిల్ రావిపూడి, శివాని, మౌళి

"ప్రేమించుకుందాం రా' పేరు చెప్పగానే అందరికీ గుర్తొచ్చేది వెంకటేశ్ చేతిలో ఉన్న లిటిల్ హార్ట్స్. ఈ చిత్ర టైటిల్ చూసినప్పుడు నాకు అదే గుర్తొచ్చింది. ఈ టీజర్ చూశాక వీళ్లు థియేటర్లలో హిట్టు కొట్టేశారన్న నమ్మకం నాకు ముందే కలిగింది" అన్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. మౌళి తనూజ్, శివానీ నాగారం జంటగా ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్‌లో రూపొందిన చిత్రమే 'లిటిల్ హార్ట్స్'. సాయి మార్తాండ్ తెరకెక్కించిన ఈ సినిమాని దర్శకుడు ఆదిత్య హాసన్ నిర్మించారు. ఇది నిర్మాతలు బన్నీవాస్, వంశీ నందిపాటి ద్వారా సెప్టెంబరు 12న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే దర్శకుడు అనిల్ రావిపూడి మంగళవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఎవరు ఏ జనరేషన్ నుంచి వచ్చినా టీనేజ్ అందరికీ ఒకేలా ఉంటుంది. ఈ నేపథ్యం నుంచి మంచి లైఫ్లీ కథలొస్తే బాగుంటుంది కదాని ఈ మధ్యే మా టీమ్‌తో చర్చించాం. ఇప్పుడీ టీజర్ చూస్తుంటే నాకు అలాగే అనిపించింది. గల్లీలో కొట్లాటలు.. ఇంట్లో అమ్మానాన్నలతో చివాట్లు.. అమ్మాయిల చుట్టూ తిరగడాలు.. ఎంసెట్ ఎగ్జామ్ టెన్షన్లు.. అన్నీ చాలా వాస్తవికంగా ఉన్నాయి. నాకైతే టీజర్ చాలా నచ్చింది. ఇలాంటి కామెడీ చిత్రాన్ని థియేటర్లో చూస్తే ఆ వైబే వేరుగా ఉంటుంది" అన్నారు. "కుటుంబ సమేతంగా చూసి ఆనందించే చిత్రమిది. ఇందులో నా తండ్రి పాత్రను రాజీవ్ కనకాల పోషించారు. ఆయన తెరపై కనిపించినప్పుడల్లా పడిపడి నవ్వుతూనే ఉంటారు" అన్నారు హీరో మౌళి. 'రెండు గంటల పాటు అందర్నీ అలరిస్తుంది" అన్నారు దర్శకుడు సాయి మార్తాండ్. ఈ కార్యక్రమంలో బన్నీ వాస్, ఆదిత్య, సాయికృష్ణ, నితిన్ రెడ్డి, శివాని, రాజీవ్ కనకాల, వంశీ నందిపాటి, సింజిత్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

'థామా' ఓ భిన్నమైన అనుభవం

మడాక్ హారర్ కామెడీ యూనివర్స్‌లో భాగంగా మొదటి ప్రేమకథగా తెరకెక్కుతోన్న చిత్రం 'థామా'. ఆయుష్మాన్ ఖురానా, రష్మిక జంటగా నటించిన ఈ సినిమాకి ఆదిత్య సర్పోత్దార్ దర్శకత్వం వహిస్తున్నారు. దినేశ్ విజన్, అమర్ కౌశిక్ నిర్మిస్తున్నారు. ఈ దీపావళి పండగ సందర్భంగా థియేటర్లలో విడుదల కానుంది. తాజాగా చిత్రబృందం వరల్డ్ ఆఫ్ థామా పేరుతో.."మడాక్ హారర్ కామెడీ యూనివర్స్‌లో భాగంగా మొదటి ప్రేమకథను చూడటానికి మిమ్మల్ని మీరు సిద్ధం చేసుకోండి. థామా ప్రపంచంలోకి అడుగు పెట్టండి. మీరు ఇంతకు ముందు చూసిన వాటికి భిన్నమైన సినిమాటిక్ అనుభవం" అంటూ సామాజిక మాధ్యమాల వేదికగా టీజర్‌ను ఆవిష్కరించింది. ఈ టీజర్ అతీంద్రియ శక్తుల మధ్య నాయకానాయికల పోరాటాలు, యాక్షన్ సన్నివేశాలతో సాగుతూ.. నేపథ్య సంగీతంతో ఆద్యంతం ప్రేక్షకులకి థ్రిల్‌ని పంచుతూ ఆకట్టుకుంటోంది. ఈ సినిమాలో పరేశ్ రావల్, నవాజుద్దీన్ సిద్దిఖీ కీలకపాత్రలు పోషిస్తున్నారు.


రష్మిక

సీఎంను కలిసిన సుకుమార్

సినీ దర్శకుడు సుకుమార్ దంపతులు, నిర్మాత యలమంచిలి రవి శంకర్‌లు మంగళవారం తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. 'గాంధీ తాత చెట్టు' సినిమాకు ఉత్తమ బాల నటిగా జాతీయ అవార్డును పొందిన సుకుమార్ కూతురు సుకృతిని ఈ సందర్భంగా సీఎం సన్మానించి అభినందించారు.

–ఈనాడు, హైదరాబాద్


సుకుమార్, రేవంత్‌రెడ్డి, సుకృతి

యూనివర్సిటీలో నిజాలున్నాయి


బ్రహ్మానందం
ఆర్.నారాయణమూర్తి, బ్రహ్మానందం

"అందమైన హీరో ఎవరని నన్నడిగితే నారాయణమూర్తి పేరు చెబుతాన"న్నారు నటుడు బ్రహ్మానందం. అందమంటే గ్లామర్ కాదని.. మంచి మనసని.. అలాంటి వ్యక్తిత్వం నారాయణమూర్తి సొంతమని.. ఆయనెప్పుడూ ప్రజల గురించే ఆలోచిస్తారని కొనియాడారు. 'యూనివర్సిటీ పేపర్ లీక్' చిత్రాన్ని కూడా పేద ప్రజల కోసమే తీసినట్లు తెలియజేశారు. ఆర్.నారాయణమూర్తి ప్రధాన పాత్రలో నటిస్తూ.. స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 22న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో బ్రహ్మానందం ఈ చిత్రాన్ని వీక్షించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "అప్పట్లో విదేశాల నుంచి మన దేశానికి వచ్చి చదువుకునే వారు. కానీ, ఈరోజు మన విద్యావ్యవస్థ మారిపోయింది. అదిప్పుడు ఎలా ఉందనే అంశంపై నారాయణమూర్తి రూపొందించిన గొప్ప చిత్రమిది. ఇది వాస్తవానికి దగ్గరగా ఉండే సినిమా. ఇందులో నిజాలుంటాయి వెతుక్కోండి. జీవితపు లోతులు ఉంటాయి. డబ్బు కోసం కాకుండా నిజాయతీగా తాను అనుకున్న దాన్ని అద్భుతంగా తీసినందుకు ఈ చిత్రం చూడండి" అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.నారాయణమూర్తి పాల్గొన్నారు.

బాలీవుడ్ నటుడు అచ్యుత్ కన్నుమూత



అచ్యుత్ పోత్దార్

బాలీవుడ్ సీనియర్ నటుడు అచ్యుత్ పోత్దార్ (90) మరణించారు. గుండె సంబంధిత ఆరోగ్య సమస్యలతో థానేలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన సోమవారం తుది శ్వాస విడిచారు. అచ్యుత్ 'పరిణీత', 'దబాంగ్ 2', 'ఫెరారీ కి సవారి' ..ఇలా 125పైగా చిత్రాలతో పాటు బుల్లితెరపై పలు ధారావాహికల్లోనూ నటించారు. రాజ్‌కుమార్ హిరాణీ దర్శకత్వంలో రూపొందిన '3 ఇడియట్స్' సినిమాలో కఠినమైన ప్రొఫెసర్‌గా నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇందులోని 'కెహ్నా క్యా చహ్‌తే హో' డైలాగ్ మీమ్స్ రూపంలో సోషల్ మీడియాలో నేటికీ సందడి చేస్తూనే ఉంది.

వేతనాల పెంపుపై కొనసాగుతున్న చర్చలు

వేతనాల పెంపు కోరుతూ సినీ కార్మికులు చేపట్టిన ఆందోళన 16రోజులు పూర్తి చేసుకుంది. కానీ, ఈ సమస్య విషయమై చలన చిత్ర వాణిజ్య మండలి, కార్మిక సంఘాలు, నిర్మాతలకు మధ్య జరుగుతున్న చర్చలు ఇంకా కొలిక్కి రాలేదు. మంగళవారం ఫిల్మ్ ఫెడరేషన్ నాయకులతో ఫిల్మ్ ఛాంబర్ ప్రతినిధులు మరోసారి సుదీర్ఘంగా చర్చలు జరిపారు. రోజువారీ సెట్‌లో ఉండే ఏడు ప్రధాన యూనియన్లతో విడివిడిగా చర్చించారు. 9 టూ 9 కాల్షీట్ పనికి ఫెడరేషన్ నాయకుల్ని ఒప్పించేందుకు ఛాంబర్ ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. ఈరోజు ఉదయం నిర్మాతలతో.. సాయంత్రం ఫెడరేషన్ నాయకులతో ఫిల్మ్ ఛాంబర్ మరోసారి చర్చలు జరపనుంది. ఈ అంశంపై ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షుడు వల్లభనేని అనిల్ మాట్లాడుతూ.. "మంగళవారం జరిగిన చర్చల్లో నిర్మాతల షరతులపై మాట్లాడారు. మా వివరాలు తెలుసుకున్నారు. మా నిర్ణయాన్ని స్పష్టంగా చెప్పాం. మా కష్టాలు చూసి పర్సంటేజ్ పెంచుతామని అన్నారు. అదెంత అనేది బుధవారం నిర్మాతలతో మాట్లాడి చెప్తారు. సాయంత్రానికి అందరికీ ఆమోదయోగ్యమైన కబురు వినిపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాం. ఈ వివరాల్ని చిరంజీవికి ఫోన్‌లో వివరిస్తాం" అన్నారు.

జటాయువు పాత్రకు అమితాబ్ గాత్రం?


అమితాబ్

సినీ ప్రియుల అందరి దృష్టి ప్రస్తుతం 'రామాయణ' మీదే. నితేశ్ తివారీ రూపొందిస్తున్న ఈ సినిమాలో సీతగా సాయిపల్లవి, రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్ కనిపించనున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోన్న ఈ సినిమా గురించి ఇప్పుడో ఆసక్తికర వార్త బయటికొచ్చింది. బాలీవుడ్ సీనియర్ కథానాయకుడు అమితాబ్ బచ్చన్ ఈ చిత్రంలో జటాయువు పాత్రకు గాత్రదానం చేయనున్నట్లు సమాచారం. ఆయన స్వరంలో ఉన్నంత గంభీరతను మరెవరూ అందించలేరని చిత్రబృందం ఈ నిర్ణయం తీసుకున్నట్లు, ప్రస్తుతం ఇది ఇంకా చర్చల దశలోనే ఉందని అమితాబ్ సన్నిహిత వర్గాలు తెలిపాయి. రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ చిత్రంలో యశ్, సన్నీ దేవోల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

నవ్విస్తూ.. భయపెడుతూ


చిన్ను, గీతిక

"ఆద్యంతం అందర్నీ కడుపుబ్బా నవ్వించే సినిమా 'లవ్ యూ రా" అన్నారు హీరో చిన్ను. ఆయన.. గీతికా రతన్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని ప్రసాద్ ఏలూరి తెరకెక్కించారు. సముద్రాల మంత్రయ్య బాబు, కొన్నిపాటి శ్రీనాథ్ ప్రజాపతి నిర్మించారు. ఈ సినిమా సెప్టెంబరు 5న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల హైదరాబాద్‌లో ఈ చిత్ర పాటల వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో చిన్ను మాట్లాడుతూ.."వినోదం, ప్రేమ, హారర్.. అంశాలతో ముడిపడి ఉన్న చిత్రమిది. దీన్ని అందరూ విజయవంతం చేయాలని కోరుతున్నా" అన్నారు.

కబడ్డీ కథల్లో ఇది ప్రత్యేకం


శ్రీని

"కబడ్డీ ఆట నేపథ్యంలో ఇప్పటి వరకు తెరపైకి కొన్ని చిత్రాలొచ్చాయి. కానీ, వాటన్నింటిలో 'అర్జున్ చక్రవర్తి' ప్రత్యేకంగా నిలవనుంది" అన్నారు నిర్మాత శ్రీని గుబ్బల. విజయ రామరాజు టైటిల్ పాత్రలో విక్రాంత్ రుద్ర దర్శకత్వంలో ఆయన ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇది ఈనెల 29న రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశంలో శ్రీని గుబ్బల మాట్లాడుతూ.. "నల్గొండకు చెందిన కబడ్డీ ప్లేయర్ నాగులయ్య జీవిత కథకు కొంత ఫిక్షన్‌ను జోడించి తెరకెక్కించిన చిత్రమిది. కబడ్డీ ఆటను ఈ సినిమాలో చూపిస్తున్నంత సీరియస్‌గా ఇప్పటిదాకా ఏ చిత్రంలోనూ చూపించలేదు" అన్నారు.

ఎప్పటికీ గుర్తుండిపోతుంది


విజయ్

"ప్రేక్షకులకు ఓ విభిన్నమైన అనుభూతిని అందించే సినిమా 'పరదా'. ఇది కచ్చితంగా ఎప్పటికీ గుర్తుండిపోయే చిత్రమవుతుంది" అన్నారు నిర్మాత విజయ్ డొంకాడ. అనుపమ పరమేశ్వరన్ ప్రధాన పాత్రధారిగా నటించిన ఈ సినిమాని ప్రవీణ్ కండ్రేగుల తెరకెక్కించారు. విజయ్ డొంకాడ, శ్రీధర్ మక్కువ, పీవీ శ్రీనివాసులు నిర్మించారు. సంగీత, దర్శన రాజేంద్రన్ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఈ నెల 22న విడుదల కానున్న నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. నిర్మాత విజయ్ మాట్లాడుతూ.. "ఇది పూర్తిగా కల్పిత కథే. కాకపోతే ఆ కథ మొదలవడానికి ఒక వాస్తవ ఘటన స్ఫూర్తి. అదేంటన్నది సినిమాలో చూసినప్పుడు అందరికీ తెలుస్తుంది" అన్నారు.

నేహాశర్మ దర్శకత్వంలో.. అజయ్ నిర్మాతగా!


నేహా శర్మ

'సన్ ఆఫ్ సర్దార్ 2' సినిమాతో ఇటీవలే ప్రేక్షకుల్ని అలరించారు బాలీవుడ్ నటుడు అజయ్ దేవగణ్. ఇప్పుడు ఆయన తన సొంత నిర్మాణ సంస్థలో ఒక భారీ యాక్షన్ డ్రామాను నిర్మించడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ చిత్రంతో నటి నేహా శర్మ తొలిసారి దర్శకురాలిగా మారింది. ఇంకా పేరు ఖరారు కాని ఈ ప్రాజెక్ట్‌లో సిద్ధాంత్ చతుర్వేది, మోహిత్ కీలక పాత్రల్లో నటించనున్నట్లు తెలుస్తోంది. ఇది 1945 నేపథ్యంలో పీరియాడికల్ డ్రామాగా సాగే కథని సమాచారం.

'కాంతార' కులశేఖర


గుల్షన్ దేవయ్య

భాషతో సంబంధం లేకుండా ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న చిత్రం 'కాంతార చాప్టర్ 1'. రిషబ్ శెట్టి నటిస్తూ.. దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్నారు. తాజాగా చిత్రబృందం ఈ సినిమా నుంచి బాలీవుడ్ నటుడు గుల్షన్ దేవయ్య.. కులశేఖర పాత్రలో నటిస్తున్నట్లు సామాజిక మాధ్యమాల వేదికగా పోస్టర్‌ను పంచుకుంది. ఈ చిత్రం కన్నడతో పాటు తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, బెంగాలీ, ఇంగ్లిషు భాషలలో అక్టోబరు 2న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

కొత్త చిత్రానికి శ్రీకారం


రోహిత్, రియా

రోహిత్ వర్మ, రియా సుమన్ జంటగా గోవింద రెడ్డి చంద్ర దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోంది. నజీర్ జమాల్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా మంగళవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి విజయ్ కనకమేడల క్లాప్‌నివ్వగా, దర్శకుడు రామ్ ప్రసాద్ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. మల్లిఖార్జున గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ.. "క్రేజీ కథతో ప్రేక్షకుల్ని అలరించడానికి త్వరలో రాబోతున్నాం. ఇది కచ్చితంగా అందరికీ చేరువయ్యేలా ఉంటుంది. ఇంకా పేరు ఖరారు కానీ ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాల్ని వినాయకచవితికి వెల్లడిస్తామ"ని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ కనకాల, ప్రగతి, వర్మ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలనతో సగం విజయం!


స్టడీ స్కిల్స్



ఏ పనిలో అయినా సమయపాలన (టైం మేనేజ్‌మెంట్) పాటిస్తే సగం విజయం సాధించినట్లే. ముఖ్యంగా రకరకాల పరీక్షలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు ఇది మరింత చక్కగా సరిపోతుంది. అయితే సమయాన్ని సరిగా నిర్వహించడం అంత తేలికైన విషయం కాదు. అందుకు చాలా నిబద్ధత, దృఢ సంకల్పం కావాలి. మెరుగైన సమయపాలనను ఎలా సాధ్యం చేసుకోవచ్చో హార్వర్డ్ విశ్వవిద్యాలయం కొన్ని చిట్కాలు చెప్పింది. ప్రతి విద్యార్థి సులువుగా, సూటిగా ఆచరించగలిగే ఆ సూచనలను తెలుసుకోవాలంటే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

కరెంట్ అఫైర్స్

■ ఇస్పోర్ట్స్ వరల్డ్ కప్ 2025 (EWC)కు గ్లోబల్ అంబాసిడర్‌గా ఎవరు ఎంపిక య్యారు?(ఇస్పోర్ట్స్ వరల్డ్ కప్ ఫౌండేషన్ ఈ పోర్చుగీస్ దిగ్గజ ఫుట్‌బాల్ క్రీడాకారుడిని ఎంపిక చేసింది.)



జ: క్రిస్టియానో రొనాల్డో

మాదిరి ప్రశ్నలు

■ 2025 మే 26 నుంచి జూన్ 10 వరకు ఏ రెండు దేశాల వైమానిక దళ ప్రత్యేక దళాలు మొట్టమొదటిసారిగా 'టైగర్ క్లా' పేరిట ఉమ్మడి విన్యాసాలను నిర్వహించాయి?

జ: భారత్ - అమెరికా (ఉత్తర్‌ప్రదేశ్ లోని గరుడ్ రెజిమెంటల్ ట్రైనింగ్ సెంటర్ వేదికగా ఈ విన్యాసాలను నిర్వహించారు.)

■ 2025 జూన్ 12న జరిగిన ఎయిర్ ఇండియా ఫ్లైట్ 171 విమాన ప్రమాదంలో మరణించిన గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి ఎవరు? (ఈ ప్రమాదంలో ఈయన సహా మొత్తం 242 మంది ప్రయాణికులు మరణించారు.)

మరింత సమాచారం

జ: విజయ్ రూపానీ

వర్గం - వర్గమూలాలు

వర్గం: ఏదైన ఒక సంఖ్యను మళ్లీ అదే సంఖ్యతో గుణిస్తే వచ్చే లబ్ధాన్ని వర్గం అంటారు.

$x \times x = x^2$

కొన్ని వర్గాలు

$1^2 = 01$	$10^2 = 100$	$19^2 = 361$
$2^2 = 04$	$11^2 = 121$	$20^2 = 400$
$3^2 = 09$	$12^2 = 144$	$21^2 = 441$
$4^2 = 16$	$13^2 = 169$	$22^2 = 484$
$5^2 = 25$	$14^2 = 196$	$23^2 = 529$
$6^2 = 36$	$15^2 = 225$	$24^2 = 576$
$7^2 = 49$	$16^2 = 256$	$25^2 = 625$
$8^2 = 64$	$17^2 = 289$	
$9^2 = 81$	$18^2 = 324$	

నోట్: ఎ) కచ్చిత వర్గం ఒకట్ల స్థానం 2, 3, 7, 8 తో అంతం కాదు.

బి) కచ్చిత వర్గం యొక్క చివరి 2 అంకెలు కూడా 1 నుంచి 25 యొక్క వర్గాల చివరి రెండు అంకెలు మాత్రమే ఆవర్తనం అవుతాయి.

సి) కచ్చిత వర్గాల అంకమూలం 1, 4, 7, 9 అవుతుంది.

డి) $x^2, (50 \pm x)^2, (100 \pm x)^2, (150 \pm x)^2$ .... వర్గాల చివరి రెండు అంకెలు ఒకే విధంగా ఉంటాయి.

$12^2 = 1\underline{44}$ $62^2 = 38\underline{44}$

$38^2 = 14\underline{44}$ $88^2 = 77\underline{44}$

$n^2, (n+1)^2$ ల మధ్య '2n' వర్గాలు కాని సంఖ్యలు ఉంటాయి.

★ ఒక సంఖ్యలో n అంకెలు ఉంటే దాని వర్గంలో 2n లేదా 2n – 1 అంకెలుంటాయి.

ఒక సంఖ్యను అదే సంఖ్యతో గుణిస్తే..!

జనరల్ స్టడీస్ అరిథ్‌మెటిక్

గణితంలో ఒక సంఖ్యను అదే సంఖ్యతో గుణిస్తే వచ్చే సంఖ్యను వర్గం అంటారు. ఏ సంఖ్యతో గుణిస్తే కావాల్సిన సంఖ్య వస్తుందో ఆ సంఖ్యను వర్గమూలంగా పేర్కొంటారు. వ్యవసాయ భూమికి కంచె వేయాలంటే భుజాల పొడవు తెలియాలి. అందుకోసం వైశాల్యాన్ని వర్గాల్లో లెక్కిస్తారు. భవన నిర్మాణంలో గదుల విస్తీర్ణాన్ని చదరపు అడుగులు లేదా చదరపు మీటర్లలో చెప్పాలంటే వర్గమూలాలను ఉపయోగిస్తారు. ఈ విధంగా నిత్య జీవితంలో తరచూ అవసరమయ్యే వర్గాలు, వర్గమూలాలపై పోటీ పరీక్షార్థులు అవగాహన పెంచుకోవాలి. కొన్ని సంఖ్యల వరకు వర్గాలను కంఠస్థం చేయాలి. వర్గమూలాలను కనుక్కునే భాగహార, గుణకార పద్ధతులను నేర్చుకోవాలి. ఒక సంఖ్య వర్గమూలం ఏ పూర్ణాంకాల మధ్య ఉంటుందో అంచనా వేయడం ప్రాక్టీస్ చేయాలి.



మాదిరి ప్రశ్నలు

1. 6084 వర్గ మూలం ఎంత?

1) 72 2) 62 3) 78 4) 88

వివరణ: పద్ధతి - 1: కారణాంక పద్ధతి

2	6084
2	3042
3	1521
3	507
13	169
	13



$6084 = 2^2 \times 3^2 \times 13^2$

$\sqrt{6084} = 2 \times 3 \times 13 = 78$ **జ: 3**

పద్ధతి - 2:



$$\begin{array}{r|l|l} 7 & \overline{60}\,\overline{84} & 7\underline{8} \\ & 49 & \\ \hline 14\underline{8} & 1184 & \\ & 1184 & \\ \hline & 0 & \end{array}$$

వర్గ మూలం (78).

పద్ధతి - 3:

పోటీ పరీక్షల దృష్ట్యా ఇది అవసరం.

step - 1: $\sqrt{6084}$ → 2 / 8

ఇచ్చిన వర్గంలో చివరి అంకె 4 కాబట్టి వర్గమూలం ఒకట్ల స్థానం 2 లేదా 8 ఉంటుంది.

step - 2: $\sqrt{6084}$ → $\underline{7}2$ / $\underline{7}8$

చివరి 2 అంకెలు విడిచి పెట్టి మిగిలిన సంఖ్యలకు దగ్గరి వర్గమూలం నెంబరు రాయాలి. 60 కి దగ్గర వర్గం = 7^2 = 49

step - 3: 7 తర్వాత సంఖ్య 8తో గుణించగా వచ్చే 56 కంటే √ లోపల ఉన్న 60 పెద్దది కాబట్టి 78 జవాబు అవుతుంది.

$\sqrt{6084}$ → 72 / (78)



2. 6889 వర్గమూలం ఎంత?

1) 73 2) 83 3) 87 4) 77

వివరణ: $\sqrt{6889}$ → 83 / 87

$8 \times 9 = 72$ కంటే చిన్నది కాబట్టి 83 జవాబు **జ: 2**

3. $\sqrt{10 + \sqrt{25 + \sqrt{108 + \sqrt{154 + \sqrt{225}}}}}$ **విలువ ఎంత?**

1) 4 2) 6 3) 8 4) 10

వివరణ: $= \sqrt{10 + \sqrt{25 + \sqrt{108 + \sqrt{154 + \underbrace{\sqrt{225}}_{15}}}}}$

$= \sqrt{10 + \sqrt{25 + \sqrt{108 + \underbrace{\sqrt{169}}_{13}}}}$

$= \sqrt{10 + \sqrt{25 + \underbrace{\sqrt{121}}_{11}}}$

$= \sqrt{10 + \underbrace{\sqrt{36}}_{6}}$

$= \sqrt{16} = 4$ **జ: 1**

4. $\sqrt{18225} = 135$ **అయితే** $\sqrt{182.25} + \sqrt{1.8225} + \sqrt{0.018225} + \sqrt{0.00018225}$ **విలువ ఎంత?**

1) 1.49985 2) 14.9985 3) 149.985 4) 1499.85

వివరణ: $\sqrt{182.25} + \sqrt{1.8225} + \sqrt{0.018225} + \sqrt{0.00018225}$

$= 13.5 + 1.35 + 0.135 + 0.0135$

$= 14.9985$ **జ: 2**

5. $\sqrt{1 + \frac{x}{169}} = \frac{14}{13}$ **అయితే x విలువ?**

1) 1 2) 13 3) 27 4) ఏదీకాదు

వివరణ: $\sqrt{1 + \frac{x}{169}} = \frac{14}{13}$

$\frac{169 + x}{169} = \frac{196}{169}$

$x = 196 - 169 \Rightarrow x = 27$ **జ: 3**

6. $0.\overline{4}$ **వర్గమూలం ఎంత?**

1) $0.\overline{6}$ 2) $0.\overline{2}$ 3) $0.\overline{8}$ 4) $0.\overline{9}$



వివరణ: $0.\overline{4} = \frac{4}{9}$

$\sqrt{0.\overline{4}} = \sqrt{\frac{4}{9}} = \frac{2}{3} = 0.6666 \ldots = 0.\overline{6}$ **జ: 1**


7. ప్రతి అడ్డు వరుసలో ఎన్ని చెట్లు ఉన్నాయో, అదే సంఖ్యలో అడ్డు వరుసలు ఉండే విధంగా ఒక వ్యక్తి 15376 చెట్లు నాటాడు. అయితే అడ్డు వరుసల సంఖ్య?

1) 124 2) 126 3) 134 4) 144

వివరణ: అడ్డు వరుసలు = x

ఒక్కొక్క అడ్డు వరుసకి చెట్లు = x

మొత్తం చెట్లు = $x \times x = x^2 = 15376$.



$x = \sqrt{153\underline{76}}$ → $\underline{12}4$ / $\underline{12}6$

$12 \times 13 = 156$ కంటే √ లోపల ఉన్న 153 చిన్నది కాబట్టి x= 124 **జ: 1**

8. కిందివాటిలో కచ్చిత వర్గం అయ్యే సంఖ్య?

1) 6250.49 2) 1250.49 3) 1354.24 4) 5768.28

వివరణ: ఆప్షన్ 4లో ఒకట్ల స్థానంలోని అంకె '8' కాబట్టి ఇది వర్గం కాదు.

⇒ కచ్చిత వర్గాల అంకమూలం 1, 4, 7, 9.

ఆప్షన్ 1 = 6250.49 ⇒ అంకమూలం (Digital root) = 8 (తప్పు)

ఆప్షన్ 2 = 1250.49 ⇒ అంకమూలం = 3 (తప్పు)

ఆప్షన్ 3 = 1354.24 ⇒ అంకమూలం = 1 (సరైంది) **జ: 3**

9. ఒక సంఖ్య యొక్క వర్గంలో 17 అంకెలుంటే ఆ సంఖ్యలోని అంకెల సంఖ్య?

1) 8 2) 9 3) 10 4) 11

వివరణ: N^2 = 17 అంకెలు (బేసి సంఖ్య)

N లో అంకెలు $= \frac{17+1}{2} = 9$ అంకెలుంటాయి. **జ: 2**

10. $125^2, 126^2$ **మధ్య వర్గాలు కాని పూర్ణ సంఖ్యలు ఎన్ని?**

1) 500 2) 251 3) 450 4) 250

వివరణ: $n^2, (n+1)^2$ మధ్య వర్గాలు కాని పూర్ణ సంఖ్యలు = 2n.

$\therefore 2 \times 125 = 250$ **జ: 4**

ప్రాక్టీస్ ప్రశ్నలు

1. 0.4 వర్గమూలం ఎంత?
   1) 0.02 2) 0.2 3) 0.51 4) 0.63
2. $\sqrt{1 + \frac{55}{729}} = 1 + \frac{x}{27}$ అయితే x విలువ?
   1) 1 2) 3 3) 5 4) 7
3. $N = (12345)^2 + 12345 + 12346$ అయితే $\sqrt{N}$ విలువ?
   1) 12346 2) 12344 3) 12345 4) 12347
4. aabaa అనేది ఒక 5 అంకెల కచ్చిత వర్గం. అయితే a + b + ab విలువ?
   1) 49 2) 51 3) 48 4) 50
5. 4 వరుస బేసి సంఖ్యల లబ్ధానికి ఏ కనిష్ఠ సంఖ్యను కలిపితే అది కచ్చిత వర్గం అవుతుంది?
   1) 12 2) 14 3) 15 4) 16
6. కిందివాటిలో 5 అంకెల గరిష్ఠ వర్గ సంఖ్య?
   1) 99956 2) 99856 3) 98856 4) 99852
7. $\sqrt{248 + \sqrt{51 + \sqrt{169}}}$ విలువ ఎంత?
   1) 12 2) 17 3) 16 4) 18

సమాధానాలు: 1-4, 2-1, 3-1, 4-1, 5-4, 6-2, 7-3.



రచయిత: పిరాది నరేష్

విడిపోయే వీలులేని పరిపాలన సమాఖ్య!

ఇండియన్ పాలిటీ

భారత్ సమాఖ్య వ్యవస్థగా ఉన్నప్పటికీ రాజ్యాంగం మాత్రం దేశాన్ని రాష్ట్రాల యూనియన్‌గానే పేర్కొంది. భూభాగాన్ని పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది. కాలానుగుణ పరిస్థితులు, ప్రజల ఆకాంక్షల మేరకు వాటి పరిధిని మార్చుకునే అవకాశాన్ని కల్పించింది. పార్లమెంటు సాధారణ మెజార్టీతోనే నూతన రాష్ట్రాలను ఏర్పాటు చేయవచ్చు. ప్రత్యేక మెజార్టీతో విదేశీ భూభాగాలను విలీనం చేసుకోవచ్చు. అత్యున్నత చట్టమైన రాజ్యాంగం ప్రకారం దేశ నిర్వచనం, రాజకీయ స్వరూపం గురించి పోటీ పరీక్షార్థులకు విస్తృత అవగాహన ఉండాలి. స్వాతంత్ర్యానంతరం దేశ భూభాగంలో జరిగిన విలీనాలు, విభజనలు, అందుకోసం చేసిన రాజ్యాంగ సవరణ చట్టాలు, సంబంధిత సుప్రీంకోర్టు తీర్పులతో పాటు రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణలో ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుకు ఉన్న ప్రాధాన్యాన్నీ తెలుసుకోవాలి.



భారత పార్లమెంట్ భవనం


భారత భూభాగం-భారత యూనియన్

1. భారత యూనియన్ గురించి రాజ్యాంగంలో ఎక్కడ వివరించారు?
   1) 1వ భాగం, ఆర్టికల్స్ 1 నుంచి 3
   2) 1వ భాగం, ఆర్టికల్స్ 1 నుంచి 4
   3) 1వ భాగం, ఆర్టికల్స్ 1 నుంచి 5
   4) 1వ భాగం, ఆర్టికల్స్ 1 నుంచి 6
2. భారత యూనియన్‌కి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) భారతదేశం పరిపాలనాపరమైన సమాఖ్యను అనుసరిస్తుంది కానీ, సిద్ధాంతపరమైన సమాఖ్యను అనుసరించలేదు.
   బి) రాజ్యాంగంలో సమాఖ్య అనే పదాన్ని పేర్కొన్నారు.
   సి) భారత సమాఖ్య అమెరికా సమాఖ్య మాదిరిగా రాష్ట్రాల మధ్య ఒప్పందం ద్వారా ఏర్పడలేదు. అందువల్ల భారతదేశం నుంచి రాష్ట్రాలు విడిపోవడానికి అవకాశం లేదు.
   డి) కెనడా సమాఖ్యను స్ఫూర్తిగా తీసుకుని యూనియన్ అనే పదాన్ని రాజ్యాంగంలో చేర్చారు.
   1) ఎ, సి, డి 2) ఎ, బి, డి 3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి
3. భారతదేశాన్ని రాజ్యాంగంలోని ఆర్టికల్ – 1లో ఏ విధంగా పేర్కొన్నారు?
   1) రాష్ట్రాల సమాఖ్య
   2) రాష్ట్రాల సమ్మేళనం (యూనియన్ ఆఫ్ స్టేట్స్)
   3) రాష్ట్రాల కేంద్రీకరణ 4) రాష్ట్రాల గుంపు
4. రాజ్యాంగంలోని ఆర్టికల్ 2లో పేర్కొన్న అంశాలు?
   ఎ) పార్లమెంట్ ఒక చట్టం ద్వారా కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేయవచ్చు.
   బి) అంతర్జాతీయ ఒప్పందాలకు లోబడి పార్లమెంటు చట్టం చేయాల్సి ఉంటుంది.
   సి) విదేశీ భూభాగాలను భారత యూనియన్‌లో విలీనం చేయాలంటే పార్లమెంటు 2/3 ప్రత్యేక మెజార్టీతో చట్టాన్ని చేయాల్సి ఉంటుంది.
   డి) విదేశీ భూభాగాలను భారత యూనియన్‌లో విలీనం చేసే అంశంపై పార్లమెంటు ఉభయసభల మధ్య అభిప్రాయ బేధాలు వస్తే రాష్ట్రపతి ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఏర్పాటు చేస్తారు.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి 3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
5. విదేశీ భూభాగాలను భారత యూనియన్‌లో విలీనం చేయాలన్నా, భారత భూభాగాలను విదేశాలకు బదిలీ చేయాలన్నా అనుసరించాల్సిన మార్గదర్శకాలను ఏ కేసు సందర్భంగా సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది?
   1) రాంజువాయ్‌సింగ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ (1957)
   2) బెరుబారి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1960)
   3) బిజో ఇమ్మాన్యుయల్ వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ (1986)
   4) చంపకం దొరైరాజన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ మద్రాస్ (1951)
6. పోర్చుగీసు వారి నుంచి గోవా, డామన్–డయ్యూలను భారత యూనియన్‌లో విలీనం చేసేందుకు పార్లమెంటు రూపొందించిన చట్టం ఏది?
   1) 1వ రాజ్యాంగ సవరణ చట్టం, 1951
   2) 2వ రాజ్యాంగ సవరణ చట్టం, 1952
   3) 12వ రాజ్యాంగ సవరణ చట్టం, 1962
   4) 15వ రాజ్యాంగ సవరణ చట్టం, 1964
7. వివిధ భూభాగాలను భారత యూనియన్‌లో విలీనం చేసేందుకు భారత పార్లమెంటు రూపొందించిన చట్టాలను గుర్తించండి.
   ఎ) ఫ్రెంచ్ వారి నుంచి పుదుచ్చేరిని విలీనం చేసేందుకు 14వ రాజ్యాంగ సవరణ చట్టం-1962.
   బి) చోగ్యాల్ రాజు నుంచి సిక్కింను భారత్‌లో విలీనం చేసి భారత్‌లో 22వ రాష్ట్రంగా చేసేందుకు 36వ రాజ్యాంగ సవరణ చట్టం-1975.
   సి) రాజా హరిసింగ్ నుంచి జమ్ము-కశ్మీర్‌ను విలీనం చేసేందుకు 2వ రాజ్యాంగ సవరణ చట్టం -1951.
   1) ఎ, బి, సి 2) ఎ, సి 3) ఎ, బి 4) బి, సి
8. భారత్–బంగ్లాదేశ్‌ల మధ్య కుదిరిన ద్వైపాక్షిక ఒప్పందం (ల్యాండ్ బౌండరీ అగ్రిమెంట్ (ఎల్‌బీఏ) – 1974) ప్రకారం భారత్‌కు చెందిన 111 భూభాగాలను బంగ్లాదేశ్‌కు, బంగ్లాదేశ్ నుంచి 51 భూభాగాలను భారతదేశానికి బదిలీ చేయడం కోసం రూపొందించిన రాజ్యాంగ సవరణచట్టం ఏది?




ఎల్‌బీఏ ఒప్పంద సమయంలో నాటి భారత ప్రధాని ఇందిరా గాంధీ, బంగ్లాదేశ్ ప్రధాని ముజిబుర్ రెహ్మాన్

   1) 24వ రాజ్యాంగ సవరణ చట్టం - 1974
   2) 39వ రాజ్యాంగ సవరణ చట్టం - 1977
   3) 42వ రాజ్యాంగ సవరణ చట్టం - 1976
   4) 100వ రాజ్యాంగ సవరణ చట్టం - 2015
9. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ గురించి రాజ్యాంగంలోని ఏ ఆర్టికల్ వివరిస్తుంది?
   1) ఆర్టికల్-2 2) ఆర్టికల్-3 3) ఆర్టికల్-4 4) ఆర్టికల్-5
10. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ అంటే?
   ఎ) నూతన రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడం, ఒక రాష్ట్రాన్ని రెండుగా విభజించడం.
   బి) రాష్ట్రాల సరిహద్దును మార్పు చేయడం.
   సి) ఒక రాష్ట్రం విస్తీర్ణాన్ని పెంచడం లేదా తగ్గించడం.
   డి) రాష్ట్రాల పేర్లు మార్పులు, చేర్పులు చేయడం.
   1) ఎ, సి, డి 2) ఎ, బి, డి 3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి
11. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ బిల్లు ప్రక్రియకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) బిల్లును రాష్ట్రపతి పూర్వానుమతితోనే పార్లమెంటులో ప్రవేశపెట్టాలి.
   బి) బిల్లును ముందుగా లోక్‌సభలో ప్రవేశపెట్టాలి.
   సి) బిల్లు ప్రతులను ప్రభావితం చేసే రాష్ట్ర శాసనసభకు పంపి, నిర్ణీత గడువులోగా బిల్లుపై అభిప్రాయాన్ని వెల్లడించాలని రాష్ట్రపతి నిర్దేశించవచ్చు.
   డి) బిల్లును పార్లమెంటు ఉభయసభలు విడివిడిగా సాధారణ మెజార్టీతో ఆమోదిస్తే సరిపోతుంది.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి 3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
12. భాషా ప్రయుక్త రాష్ట్రాల కమిటీ, 1948కి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) భాష ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటు సమంజసమా? కాదా? అనే అంశాన్ని అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేశారు.
   బి) దీన్ని ఏర్పాటు చేస్తున్నట్లు జవహర్‌లాల్ నెహ్రూ ప్రకటించారు.
   సి) ఈ కమిటీకి అధ్యక్షుడు ఎస్.కె.ధర్.
   డి) ఈ కమిటీలో సభ్యులు పన్నాలాల్, జగత్ నారాయన్‌లాల్.
   1) ఎ, సి, డి 2) ఎ, బి, డి 3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి
13. భాషా ప్రయుక్త రాష్ట్రాల కమిటీ, 1948 డిసెంబరులో తన నివేదికను సమర్పించింది. ఈ నివేదికలోని అంశాన్ని గుర్తించండి.
   ఎ) భాష ప్రాతిపదికన రాష్ట్రాలను ఏర్పాటు చేయడం సమంజసం కాదు.
   బి) పరిపాలనా సౌలభ్యం కోసం మాత్రమే రాష్ట్రాల ఏర్పాటు జరగాలి.
   సి) రాష్ట్రాల ఏర్పాటుకు భౌగోళిక, భవిష్యత్తు, ఆర్థికపరమైన అంశాలను ప్రామాణికంగా తీసుకోవాలి.
   డి) రిఫరెండం ఆధారంగా మాత్రమే రాష్ట్రాల ఏర్పాటు జరగాలి.
   1) ఎ, బి, డి 2) ఎ, సి, డి 3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి
14. జేవీపీ కమిటీకి సంబంధించి సరైన జవాబు?



జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభాయ్ పటేల్, పట్టాభి సీతారామయ్య

   ఎ) 1948, డిసెంబరులో జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభాయ్ పటేల్, పట్టాభి సీతారామయ్య సభ్యులుగా కమిటీ ఏర్పాటైంది.
   బి) 1949, ఏప్రిల్‌లో ఈ కమిటీ అఖిల భారత కాంగ్రెస్ కమిటీకి (ఏఐసీసీ) నివేదిక సమర్పించింది.
   సి) ఈ కమిటీ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటును తాత్కాలికంగా వాయిదా వేయాలని సిఫార్సు చేసింది.
   డి) తెలుగువారు మద్రాస్‌ను వదులుకుంటే ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయవచ్చని పేర్కొంది.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి 3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
15. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలని 1951, ఆగస్టు 15న ఆమరణ నిరాహార దీక్షను ఎవరు ప్రారంభించారు?
   1) పొట్టి శ్రీరాములు
   2) గొల్లపూడి సీతారామశాస్త్రి
   3) భోగరాజు పట్టాభి సీతారామయ్య
   4) అనంతశయనం అయ్యంగార్
16. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు కోసం 35 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసిన గొల్లపూడి సీతారామశాస్త్రి ఎవరి సూచన మేరకు దీక్షను విరమించారు?
   1) ఆచార్య వినోబా భావే
   2) జవహర్‌లాల్ నెహ్రూ
   3) సర్దార్ వల్లభాయ్ పటేల్
   4) నీలం సంజీవరెడ్డి
17. పొట్టి శ్రీరాములు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం చేసిన ఆమరణ నిరాహార దీక్షకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) 1952, అక్టోబరు 19న మద్రాస్‌లోని బులుసు సాంబమూర్తి గృహంలో దీక్ష ప్రారంభించారు.
   బి) దీక్ష 58 రోజులపాటు కొనసాగింది.
   సి) 1952, డిసెంబరు 15న మరణించారు.
   డి) ఆంధ్ర ప్రాంతంలో హింస చెలరేగడంతో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమవుతుందని 1952, డిసెంబరు 19న పార్లమెంటులో జవహర్‌లాల్ నెహ్రూ ప్రకటించారు.
   1) ఎ, బి, సి 2) ఎ, బి, డి 3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి
18. కైలాష్‌నాథ్ వాంఛూ కమిటీకి సంబంధించి సరైన జవాబును గుర్తించండి.



కైలాష్‌నాథ్ వాంఛూ

   ఎ) ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుపై అధ్యయనం కోసం 1953, జనవరి 6న నియమించిన ఏకసభ్య కమిషన్ ఇది.
   బి) 1953, మార్చి 23న నివేదికను సమర్పించింది.
   సి) 1953, మార్చి 25న జవహర్‌లాల్ నెహ్రూ పార్లమెంటులో ప్రసంగిస్తూ 11 జిల్లాలతో కూడిన ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటును ప్రకటించారు.
   డి) ఈ కమిటీ నివేదికను పార్లమెంటు తిరస్కరించింది.
   1) ఎ, బి, సి 2) ఎ, సి, డి 3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
19. 'రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్– 1953'కు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.
   ఎ) భాషాప్రయుక్త రాష్ట్రాల డిమాండ్‌కు శాశ్వత పరిష్కారం కోసం 1953, డిసెంబరులో ఈ కమిషన్‌ను ఏర్పాటు చేశారు.
   బి) ఈ కమిషన్ ఛైర్మన్ - ఫజుల్ అలీ
   సి) ఈ కమిషన్‌లో హృదయనాథ్ కుంజ్రూ, కవలం మాధవ ఫణిక్కర్ సభ్యులు.
   డి) ఈ కమిషన్ తన నివేదికను 1955, సెప్టెంబరు 30న కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది.
   1) ఎ, బి, డి 2) ఎ, బి, సి 3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి



రచయిత: బంగారు సత్యనారాయణ

సమాధానాలు

1-2; 2-1; 3-2; 4-1; 5-2; 6-3; 7-3; 8-4; 9-2; 10-4; 11-2; 12-1; 13-3; 14-4; 15-2; 16-1; 17-4; 18-1; 19-4.



రీజనింగ్ విభాగంలో గణిత అసమానతలు అనే అంశం నుంచి తరచుగా ప్రశ్నలు ఇస్తుంటారు. రెండు గణాంకాలు లేదా వ్యక్తీకరణల మధ్య సంబంధాన్ని తెలిపేది గణిత అసమానతలు. వీటిని సాధారణంగా $<, >, \leq, \geq$ లాంటి సంజ్ఞలతో సూచిస్తారు. దీనిలో ప్రకటన (ప్రవచనం) ఇచ్చి దాని కింద కొన్ని తీర్మానాలు ఇస్తారు. వీటిని గమనించి ప్రకటనను ఆధారంగా చేసుకుని ఏ తీర్మానం సరైందో పోటీపరీక్షార్థులు కనిపెట్టాల్సి ఉంటుంది.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
రీజనింగ్

ప్రకటనను అనుసరిస్తేనే సరైన తీర్మానం

గణిత అసమానతలు

సూచన (ప్ర. 1 – 6): దిగువ ఇచ్చిన ప్రకటనల ఆధారంగా సరైన తీర్మానాన్ని గుర్తించండి.

తీర్మానం I మాత్రమే ప్రకటనను అనుసరిస్తే 1 అని
తీర్మానం II మాత్రమే ప్రకటనను అనుసరిస్తే 2 అని
తీర్మానం I లేదా II మాత్రమే ప్రకటనను అనుసరిస్తే 3 అని
రెండు తీర్మానాలు ప్రకటనను అనుసరించకపోతే 4 అని
రెండు తీర్మానాలు ప్రకటనను అనుసరిస్తే జవాబు 5 అని గుర్తించండి.

1. ప్రకటనలు: $M < N \leq O < R = S < T$
తీర్మానాలు: I) $M = O$ II) $N < S$

సాధన: I. $M < N \leq O < R$ నుంచి
$M < N \leq O \;\&\; O < R$ అని గమనించవచ్చు.
$\Rightarrow M < O \;\&\; O < R$
$\Rightarrow M < R$
తీర్మానం I అనుసరించదు.
II. $M < N \leq O < R = S < T$
$\Rightarrow M < N \leq O \;\&\; N \leq O < R = S < T$
$\Rightarrow M < O \;\&\; N \leq O < S$
$\Rightarrow M < O \;\&\; N < S$
తీర్మానం II అనుసరిస్తుంది.

సమాధానం: 2

2. ప్రకటనలు: $C \geq D = E \leq F < G \leq H$
తీర్మానాలు: I: $C \geq F$ II: $F > C$

సాధన: $C \geq D = E \leq F \Rightarrow C \geq E \leq F$
$C \geq E \leq F$ లో $\geq, \leq$ వ్యతిరేక దిశలో ఉన్నాయి. అందుకే C, Fల మధ్య సంబంధం కనుక్కోలేం.
రెండు తీర్మానాలూ అనుసరించవు.

సమాధానం: 4

3. ప్రకటనలు: $S > U \geq V = W \leq X;\; W \leq Y \leq Z$
తీర్మానాలు: I: $S > W$, II: $U \geq Y$

సాధన: I. $S > U \geq V = W \leq X$
$\Rightarrow S > U \geq V = W$
$\Rightarrow S > V = W$
$\Rightarrow S > W$
తీర్మానం I అనుసరిస్తుంది.
II. $S > U \geq V = W \leq X;\; W \leq Y \leq Z$
$\Rightarrow S > U \geq V = W \leq Y \leq Z$
$\Rightarrow S > U \geq W \leq Y \leq Z$
$\Rightarrow U > W \leq Y \leq Z$
$\geq, \leq$ లు వ్యతిరేక దిశలో ఉన్నాయి
కాబట్టి U, Yల మధ్య సంబంధం కనుక్కోలేం.
తీర్మానం II అనుసరించదు.

సమాధానం: 1

4. ప్రకటనలు: $M > B \geq V; C \leq B = Z; K \geq J < Z$
తీర్మానాలు: I: $V \leq Z$, II: $J < C$

సాధన: I. $M > B \geq V$ నుంచి $V \leq B$ అని గమనించవచ్చు.
$\Rightarrow V \leq B, C \leq B = Z, \Rightarrow V \leq B, B = Z$
$\Rightarrow V \leq Z$
తీర్మానం I అనుసరిస్తుంది.
II. $K \geq J < Z \Rightarrow J < Z$
$C \leq B = Z \Rightarrow C \leq Z$
$\Rightarrow Z \geq C$
$\therefore J < Z, Z \geq C$
$<, \geq$ లు వ్యతిరేక దిశలో ఉన్నాయి.
కాబట్టి J, C ల మధ్య సంబంధం కనుక్కోలేం.
తీర్మానం II అనుసరించదు.

సమాధానం: 1

5. ప్రకటన: $C \geq D > E = M < J = L$
తీర్మానాలు: I: $L > E$ II: $C \geq J$

సాధన: I. $C \geq D > E = M < J = L$
$\Rightarrow E = M < J = L \Rightarrow E < J = L$
$\Rightarrow E < L \Rightarrow L > E$ తీర్మానం I అనుసరిస్తుంది.
II. $C \geq D > E = M < J$
$\Rightarrow C \geq D > M < J \Rightarrow C > M < J$
$>, <$ లు వ్యతిరేక దిశలో ఉన్నాయి. కాబట్టి C, J ల మధ్య సంబంధం కనుక్కోలేం. తీర్మానం II అనుసరించదు.

సమాధానం: 1

6. ప్రకటన: $P = N \leq Q > R > T = S$
తీర్మానాలు: I: $N \geq S$ II: $P \leq Q$

సాధన: I. $P = N \leq Q > R > T = S$
$\Rightarrow N \leq Q > R > T = S$
N, Rల మధ్య సంబంధం కనుక్కోలేం. ($\leq, >$ వ్యతిరేక దిశలో ఉన్నాయి)
కాబట్టి N, Sల మధ్య సంబంధం కూడా కనుక్కోలేం.
తీర్మానం I అనుసరించదు.
II. $P = N \leq Q \Rightarrow P \leq Q$
తీర్మానం II అనుసరిస్తుంది.

సమాధానం: 2

సూచన (ప్ర. 7 – 8): కింది వాటిలో సరైన తీర్మానాన్ని ఎంచుకోండి.

తీర్మానాలు I, IIలు ప్రకటనను అనుసరిస్తే 1 అని
తీర్మానాలేవీ ప్రకటనను అనుసరించకపోతే 2 అని
తీర్మానం III మాత్రమే ప్రకటనను అనుసరిస్తే 3 అని
తీర్మానాలు II, IIIలు ప్రకటనను అనుసరిస్తే 4 అని
తీర్మానాలు I, IIIలు అనుసరిస్తే జవాబు 5 అని గుర్తించండి.

7. ప్రకటనలు: $J \geq K = M < N, O > N = P, \quad Q \leq P \leq R$
తీర్మానాలు: I: $J > O$, II: $Q \leq M$, III: $K < R$

సాధన: **I.** $J \geq K = M < N, \quad O > N = P$
$\Rightarrow J \geq M < N, P = N < O \Rightarrow J \geq M < N, N < O$
$\Rightarrow J \geq M < N < O$ ($\geq, <$ లు వ్యతిరేక దిశలో ఉన్నాయి).
II. $Q \leq P \leq R, O > N = P$
$\Rightarrow Q \leq P = N \Rightarrow Q \leq N$ కానీ $J \geq K = M < N$
$\therefore Q \leq N, N > M$ (... $M < N$)
$\leq, >$ లు వ్యతిరేక దిశలో ఉన్నాయి. తీర్మానం II నిజం కాదు.
III. $J \geq K = M < N, O > N = P$
$\Rightarrow J \geq K < N = P \Rightarrow K < P$ కానీ $P \leq R$
$\therefore K < P \leq R \Rightarrow K \leq R$
తీర్మానం III అనుసరిస్తుంది.

సమాధానం: 3

8. ప్రకటనలు: $V < W = X \geq Y, Z \leq X = U, T > U = Y$
తీర్మానాలు: I. $T > V$ II. $Y > W$ III. $Z \leq W$

సాధన: **I.** $V < W = X \geq Y$
$\Rightarrow V < X \geq Y \Rightarrow$ V, Yల మధ్య సంబంధం గుర్తించలేం
$T > U = Y \Rightarrow T > Y$
V, Yల మధ్య సంబంధం గుర్తించలేం, కాబట్టి T, V ల మధ్య సంబంధం కూడా గుర్తించలేం. తీర్మానం I నిజం కాదు
II. $V < W = X \geq Y$
$\Rightarrow Y \leq X = W \;(\because X \geq Y \Rightarrow Y \leq X)$
$\Rightarrow Y \leq W$
తీర్మానం II నిజం కాదు
III. $Z \leq X = U, T > U = Y$
$\Rightarrow Z \leq U, U = Y \Rightarrow Z \leq Y$
$V < W = X \geq Y \Rightarrow Y \leq X = W$
$\therefore Z \leq Y, Y \leq W$
$\Rightarrow Z \leq W$
తీర్మానం III అనుసరిస్తుంది.

సమాధానం: 3



రచయిత
రాజేశ్ మధు,
విషయ నిపుణులు

Word of the Day

747

Harrowing

Telugu meaning: బాధాకరమైన, విచారకరమైన

English meaning: The word harrowing (హారోయింగ్) is an adjective that describes something extremely distressing, disturbing, or traumatic.

Synonyms: Disturbing, Traumatic

Antonyms: Comforting, Pleasant

Usage: **1.** The movie portrayed the harrowing experience of war survivors with painful reality.
2. Listening to her harrowing tale of survival left the entire audience in silence.

కరెంట్ అఫైర్స్



ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల ఎయిర్ పిస్టల్ టీమ్ విభాగంలో భారత జట్టు రజతం గెలుచుకుంది. 2025, ఆగస్టు 18న షెమ్‌కెంట్ (కజకిస్థాన్)లో జరిగిన మ్యాచ్‌లో అన్మోల్ (580), ఆదిత్య మాల్రా (579), సౌరభ్ చౌదరి (576)లతో కూడిన భారత జట్టు 1735 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. చైనా (1744) స్వర్ణం నెగ్గగా, ఇరాన్ (1733) కాంస్యాన్ని సొంతం చేసుకుంది.



దేశంలో వామపక్ష తీవ్రవాదం తగ్గినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. గత పదేళ్లలో మావోయిస్టు ప్రభావిత జిల్లాల సంఖ్య 126 నుంచి 18కి చేరినట్లు తెలిపింది. వామపక్ష తీవ్రవాదాన్ని ఎదుర్కొనేందుకు కేంద్రం 2015లో జాతీయ విధానం తీసుకొచ్చింది. మావోయిస్టులతో పోరాడేందుకు రాష్ట్రాలకు సాయం చేయడంతోపాటు ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేయడం మొదలుపెట్టింది.



నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి తండాకు చెందిన రమేశ్ కార్తిక్ నాయక్ రాసిన కవిత పాఠమైంది. ఆయన రచించిన 'చక్‌మక్' (చెకుముకి రాయి) ఆంగ్ల కవితా సంపుటిలోని 'ది రోస్ ల్యాండ్' కవితను సీబీఎస్ఈ బోర్డు ఈ ఏడాది (2025) 8వ తరగతి ఆంగ్ల సిలబస్‌లో ఆరో పాఠంగా చేరుస్తూ ఆగస్టు 18న సమాచారం అందజేసింది.

ఉద్యోగాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి వికసిత్ భారత్ ఉపాధి యోజన' పేరుతో కొత్త పథకాన్ని ప్రవేశపెట్టడంతోపాటు అనుబంధ పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. సంస్థల యజమానులు, తొలిసారి ఉద్యోగంలో చేరేవారు ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు.

✦ ఈ ఉపాధి ఆధారిత ప్రోత్సాహక పథకానికి కేంద్ర కేబినెట్ జులై 1న ఆమోదం తెలిపింది. పథకం ద్వారా రూ.లక్ష కోట్లతో రెండేళ్ల కాలం (2025 ఆగస్టు 1 - 2027 జులై 31)లో 3.5 కోట్లకుపైగా ఉద్యోగాలు కల్పించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నారు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జాతీయ పునరుత్పాదక శక్తి దినోత్సవం



పునరుత్పాదక శక్తి వనరుల ఆవశ్యకతను తెలియజేసే లక్ష్యంతో ఏటా ఆగస్టు 20న 'జాతీయ పునరుత్పాదక శక్తి దినోత్సవం'గా (National Renewable Energy Day) నిర్వహిస్తారు. దీన్నే 'అక్షయ్ ఉర్జా దివస్' అని పిలుస్తారు. మానవ ప్రమేయం లేకుండా ప్రకృతిలో నిరంతరం లభించే శక్తిని 'రెన్యువబుల్ ఎనర్జీ' అంటారు. దీన్నే తరిగిపోని శక్తిగా పేర్కొంటారు. సౌరశక్తి, పవన శక్తి, నీటిశక్తి, తరంగ శక్తి, టైడల్ శక్తి, భూతాప శక్తి, జీవ ఇంధనం, బయోగ్యాస్ శక్తి మొదలైనవి దీనికి ఉదాహరణలు. ఇవి తక్కువ ఖర్చుతో కూడుకున్నవి, కాలుష్యరహితాలు. ప్రకృతిలో పరిమితంగా లభించే వనరుల వినియోగాన్ని తగ్గించి, పునరుత్పాదక వనరులు వాడేలా ప్రోత్సహించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

▮ ఐక్యరాజ్య సమితి ప్రవేశపెట్టిన 17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో (2015-30) 13వ లక్ష్యమైన 'పర్యావరణ మార్పు, దాని ప్రభావంపై సత్వర చర్యలు' ముఖ్యమైంది. అందుకే పర్యావరణ సమతౌల్యం దెబ్బతినకుండా, ప్రస్తుత అవసరాలకు తగ్గట్లు పునరుత్పాదక శక్తి వనరుల వినియోగంపై భారత్ దృష్టిసారించింది.

ఆగస్టు 20
చరిత్రలో ఈనాడు


▮ ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2025, జనవరి నాటికి భారతదేశ మొత్తం శిలాజేతర ఇంధన ఆధారిత సామర్థ్యం 217.62 గిగావాట్లుగా ఉంది. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిని లక్ష్యంగా చేసుకుని కేంద్ర ప్రభుత్వం 2023లో నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌ను ప్రారంభించింది. 2030 నాటికి ఏడాదికి 5 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి దీని లక్ష్యం. నేషనల్ సోలార్ మిషన్ ద్వారా దేశంలో సౌరశక్తి వృద్ధి చెందింది.

చారిత్రక నేపథ్యం:

శిలాజ ఇంధనాలైన బొగ్గు, పెట్రోలియం, సహజవాయువులను అధికంగా వినియోగించడం వల్ల వాతావరణ కాలుష్యం పెరిగి, పర్యావరణ సమతౌల్యం దెబ్బతింటోంది. అంతేకాక అవన్నీ పరిమితంగానే లభ్యమవుతాయి. వాటి వినియోగాన్ని తగ్గించి, ప్రత్యామ్నాయాలైన పునరుత్పాదక సహజవనరుల వాడకంవైపు ప్రజలను మళ్లించాలని నాటి మన్మోహన్ సింగ్ ప్రభుత్వం భావించింది. దీనికి అనుగుణంగా మినిస్ట్రీ ఆఫ్ న్యూ అండ్ రెన్యువబుల్ ఎనర్జీ (ఎంఎన్ఆర్ఈ) ఏటా ఆగస్టు 20న 'జాతీయ పునరుత్పాదక శక్తి దినోత్సవం'గా జరుపుకోవాలని 2004లో తీర్మానించింది.

జనరల్ స్టడీస్ - ఇండియన్ జాగ్రఫీ

శీతోష్ణస్థితి



అక్షాంశాలు, రేఖాంశాల ఆధారంగా ఒక ప్రదేశ ఉనికి, ఉష్ణోగ్రత, శీతోష్ణస్థితిని అంచనా వేస్తారు. భారతదేశం దక్షిణాసియా ఖండంలో 8°4' - 37°6' ఉత్తర అక్షాంశాలు, 68°7' - 97°25' తూర్పు రేఖాంశాల మధ్య విస్తరించి ఉంది. మనదేశ శీతోష్ణస్థితి - దాన్ని ప్రభావితం చేసే అంశాలు, కాలాలు, వర్షపాతం మొదలైన వాటిపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి.

వాతావరణం

ఒక ప్రాంతంలో నిర్దిష్ట సమయంలోని వాతావరణ పరిస్థితులను వాతావరణం అంటారు. ఇది ప్రతిరోజూ మారుతూ ఉంటుంది.

శీతోష్ణస్థితి

ఒక విశాల ప్రాంతంలో దీర్ఘకాలంపాటు ఒక క్రమాన్ని చూపే వాతావరణ స్థితులను శీతోష్ణస్థితి అంటారు.

▮ సాధారణంగా ఒక ప్రాంత 30 ఏళ్ల వాతావరణ పరిస్థితులను అంచనా వేసి, దాని శీతోష్ణస్థితిని కనుక్కుంటారు.

అక్షాంశం

కర్కటరేఖ భారతదేశం మధ్యగా వెళ్తోంది.

▮ కర్కటరేఖ దక్షిణ ప్రాంతం ఉష్ణమండలంలో, ఉత్తర ప్రాంతం సమశీతోష్ణ మండలంలో ఉన్నాయి.

శీతోష్ణస్థితిని ప్రభావితం చేసే అంశాలు, సమశీతోష్ణస్థితి, ఎత్తు, తొలకరి జల్లులు - స్థానిక పేర్లు, దేశంలో వర్షపాత విస్తరణ, రుతుపవనాల పుట్టుకను వివరించే సిద్ధాంతాలు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Faculty Posts

Tirumala Tirupati Devasthanams (TTD), Sri Venkateswara Institute of Medical Sciences (SVIMS-SPMCW), Tirupati invites applications from eligible candidates for Direct Recruitment to the following Medical faculty posts on regular basis. The total no. of posts is 106. The last date for offline applications is 8 September 2025.

Assistant Professor Jobs

All India Institute of Medical Sciences Jammu (AIIMS Jammu) is inviting applications for the recruitment of Assistant Professor posts in various departments on a contractual basis. The application fee is Rs.1000. The last date for receipt of online applications is 28 August 2025.

Apprentice Posts

Eastern Coalfields Limited (ECL), Coal India Limited is inviting applications for the recruitment of ITI Apprentices for the year 2025-26. The total no. of posts is 280. Eligible candidates can apply online before 26 September 2025.

Did You Apply..?

Today (August 20) is the last date for the following Jobs/ Apprentice posts.

☛ Indian Air Force - Agniveer Vayu (Sports 01/2026) Posts. ***Qualification:*** Intermediate/ 10+2.

☛ 33 jobs in Digital India Corporation. ***Eligibility:*** Degree.

☛ 14 jobs in Srikakulam Government Hospital. ***Eligibility:*** Degree, PG.

For more information and other notifications - scan QR code

Bank Exams
English
Error Detection - Prepositions

Directions (Qs. 1 - 30): *In the following question, a sentence is divided into four parts and one of those fragments may have errors. Find out which part of the sentence has an error and select the appropriate option. If a sentence is free from error, select 'No Error' as your answer.*

1. The students were prohibited (A)/ to use mobile phones (B)/ during the examination (C)/ in the hall. (D)/ No error. (E)

2. He has been suffering (A)/ with fever (B)/ for the last (C)/ three days. (D)/ No error.

3. The workers protested (A)/ against the new policy (B)/ and demanded (C)/ for better working conditions. (D)/ No error. (E)

4. He is weak (A)/ in English (B)/ but good (C)/ in Mathematics. (D)/ No error. (E)

5. The cat jumped (A)/ on the wall (B)/ and then climbed (C)/ in the roof. (D)/ No error. (E)

6. We will meet (A)/ in Monday morning (B)/ to discuss the (C)/ final arrangements. (D)/ No error. (E)

7. She is married (A)/ into a famous lawyer (B)/ and lives happily (C)/ with her family. (D)/ No error. (E)



8. He was accused (A)/ for cheating (B)/ during the (C)/ final examination. (D)/ No error. (E)

9. The principal congratulated (A)/ the students (B)/ for their success (C)/ in the competition. (D)/ No error. (E)

10. He distributed sweets (A)/ between the children (B)/ who had gathered (C)/ for the celebration. (D)/ No error. (E)

11. The teacher divided (A)/ the students in (B)/ four groups for (C)/ the discussion. (D)/ No error. (E)

12. He was angry (A)/ on his friend (B)/ for not helping him (C)/ during the crisis. (D)/ No error. (E)

13. The train will arrive (A)/ on 7 a.m. (B)/ tomorrow morning (C)/ at the station. (D)/ No error. (E)

14. She was married (A)/ with a businessman (B)/ who lived abroad (C)/ for several years. (D)/ No error. (E)

15. The principal presided (A)/ on the meeting (B)/ that was held (C)/ in the seminar hall. (D)/ No error. (E)

16. She is good (A)/ in mathematics (B)/ but weak (C)/ in history. (D)/ No error. (E)

17. We congratulated her (A)/ for her success (B)/ in the civil services examination (C)/ last year. (D)/ No error. (E)

18. The boy was sitting (A)/ beside his father (B)/ when the chief guest (C)/ entered the hall. (D)/ No error. (E)

19. She entered (A)/ into the room (B)/ without knocking (C)/ on the door. (D)/ No error. (E)

20. He is suffering (A)/ with fever (B)/ and has been advised (C)/ to take complete rest. (D)/ No error. (E)

21. She is waiting (A)/ at the bus stop (B)/ since two hours (C)/ without moving an inch. (D)/ No error. (E)

22. The principal congratulated (A)/ the students (B)/ on their success (C)/ in the competition. (D)/ No error. (E)

23. The manager insisted (A)/ to meet (B)/ the candidate (C)/ before the final round. (D)/ No error. (E)

24. The lawyer was accused (A)/ for hiding (B)/ some important evidence (C)/ from the court. (D)/ No error. (E)

25. He was prohibited (A)/ from entering (B)/ into the office (C)/ by the security guard. (D)/ No error. (E)

26. The teacher divided (A)/ the class (B)/ in six groups (C)/ for the activity. (D)/ No error. (E)

27. She has been absent (A)/ in school (B)/ for the last three days (C)/ without informing anyone. (D)/ No error. (E)

28. He is junior (A)/ than me (B)/ by five years (C)/ in this department. (D)/ No error. (E)

29. The scientist emphasized (A)/ on the need (B)/ for renewable sources (C)/ of energy in his speech. (D)/ No error. (E)

30. The tourist was astonished (A)/ in the beauty (B)/ of the Taj Mahal (C)/ at sunrise. (D) / No error. (E)

Scan the QR code for Key

Writer: P. Manoj Kumar, Subject Expert



కెరియర్‌ను మలిచే కార్పొరేట్ ఎటికెట్

కార్పొరేట్ సంస్థల్లో ప్రత్యేకించి ఒక బృందంగా పనిచేసేచోట చిన్న చిన్న వ్యక్తిగత ప్రవర్తనలు కూడా ఒక్కొక్కరి వైఖరిని తెలియజేస్తాయి. వస్తువులూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, సహోద్యోగుల పట్లా, పని వాతావరణం పట్లా జవాబుదారీతనాన్ని తెలుపుతుంది. ఇలాంటి ప్రవర్తనలను గురించి ఎక్కడా లిఖితపూర్వకంగా ఉండదు. ఎవరూ నేరుగా ముఖంపై చెప్పరు. కానీ.. ఇవి కార్పొరేట్ సంస్థల్లో పాటించాల్సిన మర్యాదలు!

ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ సునీత ఒక ప్రపంచ స్థాయి ఐటీ సంస్థలో చేరింది. చురుగ్గా పని చేస్తూ అందరి మన్ననలూ పొందింది. అయితే ఇటీవల వారం రోజులుగా టీమ్ లీడర్ తన పట్ల ముభావంగా ఉండటం గమనించింది. ఎంత ఆలోచించినా అందుకు తగిన కారణం బోధపడలేదు.

ఒకరోజు ఆమె తన వర్క్ స్టేషన్ నుంచి కాఫీ కప్పుతో వచ్చి టీమ్ లీడర్ ఎదురుగా కూర్చుని పని గురించి చర్చించసాగింది. కాఫీ తాగడం పూర్తిచేసి కప్పు టేబుల్‌పై పెట్టి మాట్లాడుతుంటే టీమ్ లీడర్ తన వైపు కాకుండా తన కాఫీ కప్పు వైపు చూస్తూ మాట్లాడటం గమనించింది. టీమ్ లీడర్ కాఫీ తాగాక తన కప్పును తానే శుభ్రం చేసి తుడిచి ప్యాంట్రీ దగ్గరున్న స్టాండులో ఉంచి తన సీట్‌లో కూర్చుని చర్చ కొనసాగించాడు. తన కొలీగ్ వర్క్ స్టేషన్ వైపు చూస్తే.. ఆమె కూడా తాగిన కాఫీ కప్పును శుభ్రంగా కడిగి తుడిచి దాన్ని స్టాండులో పెడుతోంది. ఈ నెల రోజుల్లో ఈ విషయాలెప్పుడూ తానూ గమనించలేదు. వెంటనే సునీత తన కప్పు తీసుకెళ్లి శుభ్రం చేసి పెట్టింది. గమనించిన టీమ్ లీడర్ ఆమెతో తిరిగి స్నేహపూర్వకంగా మాట్లాడటం మొదలుపెట్టాడు.

తాజాగా ఉద్యోగంలో చేరినవారికి ఉపయోగపడే కొన్ని 'కార్పొరేట్ ఎటికెట్స్' గురించి తెలుసుకుందాం.

1 గాసిప్ వ్యాప్తి

కార్పొరేట్ సంస్థల్లో కొన్ని ప్రొఫెషనల్ ప్రమాణాలను పాటించాలి. కొంతమంది అదే పనిగా వదంతులు మాట్లాడుతుంటారు. ఇవి ఉద్యోగుల మధ్య అపనమ్మకాన్ని పెంచి పని వాతావరణాన్ని కలుషితం చేస్తాయి, టీమ్ స్పిరిట్‌ను దెబ్బతీస్తాయి. ఏ సంస్థకయినా ఈ వదంతులు ప్రమాదకరం. వీటి పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. ఇవి ఉద్యోగుల కెరియర్‌ను ప్రమాదంలో పడవేస్తాయి. కొత్తగా కార్పొరేట్ సంస్థల్లో చేరేవారు గాసిప్స్‌కు దూరంగా ఉండాలి.

ఓ ఐటీ సంస్థలో ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ ట్రెయినీగా చేరింది శ్వేత. తన పక్క సీట్లోని స్నేహితురాలితో తరచూ ఉద్యోగుల గురించీ, సంస్థ గురించీ గాసిప్ మాట్లాడుతుండేది. ఇవి కొంతకాలానికి యాజమాన్య దృష్టికి వెళ్లాయి. ఆమెలో మంచి నైపుణ్యం, ప్రతిభ ఉన్నప్పటికీ ఈ ప్రవర్తన కారణంగా ప్రమోషన్ అవకాశాలు దెబ్బతిన్నాయి.

2 ప్రొఫెషనల్ లుక్

కార్పొరేట్ సంస్థల్లో చేరినవారు తమను తాము ప్రజెంట్ చేసుకునే విధానం తెలుసుకోవాలి. ఒక ఉద్యోగి ప్రొఫెషనల్ లుక్‌లో కనిపిస్తే.. .. మంచి అభిప్రాయం కలుగుతుంది. హుందాగా ఉండే దుస్తులతో, గౌరవప్రదమైన ప్రవర్తనతో మెలిగితే వృత్తికీ, పని ప్రదేశానికీ విలువ ఇస్తున్నట్టు అనుకోవచ్చు. మనం కనిపించే విధానం మనం చెప్పే విషయాలను ప్రభావితం చేస్తుంది.

3 హ్యుమిలిటీ (వినయం)

సాంకేతిక నైపుణ్యాలు, డిగ్రీలు ఉద్యోగ సాధనకు అత్యంత విలువైన వనరులు. అయితే మేనేజర్లు, క్లయింట్లు, తన టీమ్ సభ్యులతో మంచి మానవ సంబంధాలను ఏర్పరుచుకోడానికి ఉద్యోగి వినయం సహకరిస్తుంది. వినయం అంటే సీనియర్ల పట్ల గౌరవభావం ప్రదర్శించడం లాంటివి మాత్రమే కాదు. వినయం అంటే తన పొరబాట్లను మనస్ఫూర్తిగా అంగీకరించడం, అవసరమైనప్పుడు దిద్దుబాటు చర్యలు చేపట్టడం. ప్రతి సహోద్యోగి నుంచీ నిరంతరం నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండటం. కార్పొరేట్ సంస్థల్లో విలువలతో కూడిన మంచి ప్రొఫెషనల్‌గా గుర్తింపు పొందాలంటే హ్యుమిలిటీ అవసరం.

4 పరిశుభ్రత- ఆహార్యం

'ఫస్ట్ ఇంప్రెషన్ ఈజ్ ద బెస్ట్ ఇంప్రెషన్' అంటారు కదా? తొలి పరిచయంతోనే సహోద్యోగులనూ, ఉన్నతాధికారులనూ, క్లయింట్లనూ ఆకట్టుకోగల ఉద్యోగి సంస్థకు ఒక అసెట్. ఇంటర్వ్యూకి హాజరైనప్పుడూ, ఉద్యోగంలో జాయిన్ అవ్వడానికి వెళ్లినప్పుడూ ధరించే దుస్తులు, పాటించే శుభ్రత ప్రొఫెషనలిజాన్ని ప్రతిబింబిస్తాయి.

బీటెక్ గ్రాడ్యుయేట్ రాహుల్ మడతపడిన చొక్కా, మురికిగా ఉన్న షూస్, చెదిరిన జుట్టు, ట్రిమ్ చేయని గడ్డంతో ఒక ఐటీ సంస్థలో ఇంటర్వ్యూకు వెళ్లాడు. అతని టెక్నికల్ స్కిల్స్ బాగున్నప్పటికీ వ్యక్తిగత పరిశుభ్రత సరిగా లేని కారణంగా అతని ప్రజెంటేషన్‌పై ఎవరూ శ్రద్ధ పెట్టలేదు. ఫలితంగా సెలెక్ట్ కాలేకపోయాడు.



5 ఇతరుల విజయాన్ని గౌరవించడం

సహోద్యోగుల విజయాన్ని గౌరవించడం కార్పొరేట్ సంస్కృతిలో అంతర్భాగం. కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాన్ని ఆశిస్తున్నవారు తెలుసుకోవలసిన ముఖ్యమైన అంశమిది. సహోద్యోగుల విజయాన్ని గుర్తించి గౌరవించడం ద్వారా కలిసికట్టుగా పనిచేసే వాతావరణం ఏర్పడుతుంది. అది వ్యక్తిగత అభివృద్ధికి కూడా ఉపయోగపడుతుంది.

ఐటీ గ్రాడ్యుయేట్ అమిత్ ఓ కార్పొరేట్ సంస్థలో ఇంటర్వ్యూకి వెళ్లాడు. అతనితో పాటు మరో అభ్యర్థి సుజాత నిర్దిష్ట ప్రాజెక్టులో తన అనుభవంతో ఉద్యోగానికి ఎంపికైంది. అమిత్ నిరాశకులోనైనప్పటికీ వెంటనే తన భావోద్వేగాలను నియంత్రించుకుని ఆమె విజయాన్ని హృదయపూర్వకంగా అభినందించాడు. ఈ లక్షణాన్ని సంస్థ హెచ్‌ఆర్ టీమ్ గమనించింది. అతడి సానుకూల దృక్పథాన్ని గుర్తించి అతడికి మరో మంచి అవకాశం కల్పించింది.



- దొరైరాజ్
సీనియర్ జనరల్ మేనేజర్,
ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్

ఇంటర్నల్ ఆడిటర్ అయ్యేదెలా?

ఫైనాన్స్ స్పెషలైజేషన్‌తో ఎంకాం (డిస్టెన్స్) పూర్తి చేశాను. సర్టిఫైడ్ ఇంటర్నల్ ఆడిటర్ అవ్వాలంటే ఏ కోర్సు చదవాలి? - అరవింద్



■ సర్టిఫైడ్ ఆడిటర్లు కంపెనీల్లో ఫైనాన్షియల్ రిస్క్ తగ్గించడంలో, నష్టాలను నియంత్రించడంలో, కొత్త అవకాశాలను సృష్టించడంలో కీలక పాత్ర పోషిస్తారు. మానవ తప్పిదాలు, సాంకేతిక సవాళ్లు, ప్రాసెస్ లోపాలు, రిస్క్ అంశాలపై స్పష్టమైన అవగాహనతో సంస్థ అభివృద్ధికి తోడ్పడతారు. సీఐఏ సర్టిఫికేషన్ పూర్తి చేసినవారికి ఇంటర్నల్ ఆడిటర్, ఇంటర్నల్ ఆడిట్ అసోసియేట్, ఆడిట్ ఎగ్జిక్యూటివ్, అస్యూరెన్స్ స్పెషలిస్ట్, ఫోరెన్సిక్ ఆడిటర్, ఫ్రాడ్ రిస్క్ మేనేజర్, ప్రాసెస్ ఆడిట్ అసోసియేట్ లాంటి అనేక ఉద్యోగాలు లభిస్తాయి. ఈ రంగంలో ప్రవేశించాలంటే ఇంటర్నల్ ఆడిట్/ క్వాలిటీ అస్యూరెన్స్/ రిస్క్ మేనేజ్‌మెంట్/ అసెస్‌మెంట్/ కంప్లయెన్స్/ ఎక్స్‌టర్నల్ ఆడిట్/ ఇంటర్నల్ కంట్రోల్ లాంటి విభాగాల్లో కనీసం రెండేళ్ల ఉద్యోగానుభవం ఉంటే ఉపయోగకరం.



ఎంకాం పూర్తిచేసినవారు అకౌంట్స్, ఆడిటింగ్, ట్యాక్సేషన్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ లాంటి అంశాలపై పట్టు పెంచుకుంటే సీఐఏ పరీక్షకు సిద్ధమవడం సులువవుతుంది. సీఐఏతో పాటు సీఏ (చార్టెడ్ అకౌంటెన్సీ), సీఎంఏ (కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్), ఏసీసీఏ (అసోసియేషన్ ఆఫ్ చార్టర్డ్ సర్టిఫైడ్ అకౌంటెంట్స్) లాంటి ఇతర సర్టిఫికేషన్లు ఉన్నాయి. సీఐఏ ప్రత్యేకంగా ఇంటర్నల్ ఆడిట్ రంగానికే కేంద్రీకృతమై ఉండటం వల్ల గ్లోబల్ డిమాండ్ ఎక్కువ. ఈ ఆడిటర్లకు బ్యాచిలర్ డిగ్రీ, అవసరమైన ఉద్యోగానుభవం, నైతిక ప్రమాణాల పట్ల అవగాహన ఉండాలి.

సీఐఏ పరీక్ష మూడు భాగాలు. మొదటిది ఇంటర్నల్ ఆడిటింగ్‌పై, రెండోది ఆడిటింగ్ ప్రాక్టీస్‌పై, మూడోది వ్యాపార పరిజ్ఞానంపై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా ఏడాది పాటు సమయం కేటాయించి రోజూ క్రమబద్ధంగా చదువుతూ, ఎక్కువ ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి. ఈ రంగంలో విజయం సాధించాలంటే కొన్ని ప్రత్యేక నైపుణ్యాలూ అవసరం. ట్యాలీ, ఎస్ఏపీ, ఒరాకిల్ లాంటి సాఫ్ట్‌వేరుల్లో ప్రావీణ్యం ఉండటం మంచిది. డేటా అనలిటిక్స్, ఎంఎస్ ఎక్సెల్ అడ్వాన్స్‌డ్ లాంటి సాంకేతిక నైపుణ్యాలుంటే మరింత ఉపయోగకరం.

- ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

వీడియో ఎడిటర్

సంస్థ: పాకెట్ ఎఫ్ఎం
నైపుణ్యాలు: అడోబ్ ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో
స్టైపెండ్: రూ.15,000-20,000
☛ http://internshala.com/i/a05792

గ్రాఫిక్ డిజైన్

సంస్థ: సూపర్‌నోవా ఏఐ
నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ఫిగ్మా, కేన్వా
స్టైపెండ్: రూ.15,000-35,000
☛ http://internshala.com/i/62408b

మెషిన్ లెర్నింగ్

సంస్థ: న్యూరాసిస్
నైపుణ్యాలు: డేటా అనలిటిక్స్, డేటా సైన్స్, డీప్ లెర్నింగ్, మెషిన్ లెర్నింగ్, నాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్, పైతాన్
స్టైపెండ్: రూ.7,500-15,000
☛ http://internshala.com/i/a00352

కేర్ ఫార్మా

సంస్థ: జైలా హెల్త్ **నైపుణ్యం:** ఫార్మకాలజీ
స్టైపెండ్: రూ.10,000
☛ http://internshala.com/i/7e9651

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: సెప్టెంబరు 13

పీహెచ్‌పీ డెవలప్‌మెంట్

సంస్థ: ఎక్‌జెరోన్
నైపుణ్యాలు: ఎజాక్స్, కోడ్ ఇగ్నైటర్, జేక్వెరీ, జావాస్క్రిప్ట్, పీహెచ్‌పీ, మైఎస్‌క్యూఎల్, హెచ్‌టీఎంఎల్, లారావెల్
స్టైపెండ్: రూ.12,000
☛ http://internshala.com/i/d26259

అకౌంట్స్

సంస్థ: ఫ్రెజున్ ఇన్‌కార్పొరేషన్
నైపుణ్యాలు: అకౌంటింగ్, గూగుల్ డాక్స్, షీట్స్, జీఎస్‌టీ, జర్నల్ ఎంట్రీస్, జోహో బుక్స్
స్టైపెండ్: రూ.15,000
☛ http://internshala.com/i/48d11c

కోడింగ్ జూనియర్ సంస్థలో..

1. ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్

నైపుణ్యాలు: ఏపీఐస్, గోలాంగ్, హెచ్‌టీఎంఎల్, జావాస్క్రిప్ట్, సీఎస్ఎస్, మైఎస్‌క్యూఎల్, నెస్ట్.జేఎస్, నోడ్.జేఎస్, రియాక్ట్, టైప్‌స్క్రిప్ట్
స్టైపెండ్: రూ.15,000-20,000
☛ http://internshala.com/i/0966ad

2. హ్యూమన్ రిసోర్సెస్

నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-వర్డ్, ఎంఎస్-ఆఫీస్
స్టైపెండ్: రూ.15,000
☛ http://internshala.com/i/606688

మార్కెటింగ్

సంస్థ: మామెనాక్స్ ప్రైమ్ ప్రై.లి.
నైపుణ్యాలు: డిజిటల్, ఈమెయిల్, సోషల్‌మీడియా మార్కెటింగ్, ఎంఎస్-ఆఫీస్, ఇంగ్లిష్ మాట్లాడటం
స్టైపెండ్: రూ.10,000-20,000
☛ http://internshala.com/i/9b2c7b

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: సెప్టెంబరు 12

తరగతిలో నిద్ర వస్తోందా?

ఉదయం సమయంలో సాధారణంగా విద్యార్థులందరూ చురుగ్గానే ఉంటారు. కానీ భోజన విరామం తర్వాత పరిస్థితి మారిపోతుంది. ఎంత జాగ్రత్తగా ఉన్నా నిద్ర ముంచుకొస్తుంది. ఇది పెద్ద సమస్య కాకపోవచ్చు. కానీ ముఖ్యమైన పాఠాలు అర్థంకాకపోతే.. ఆ తర్వాత ఇబ్బందిపడాల్సి వస్తుంది. దీన్నుంచి తప్పించుకోవాలంటే...

కొస్త మత్తుగా అనిపించినా పాఠాలను అలాగే వింటూ కూర్చోవడం వల్ల నిద్ర ఇంకా ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. ఏ చిన్న సందేహం వచ్చినా వెంటనే అధ్యాపకులను అడిగి నివృత్తి చేసుకోవాలి.

✦ ముఖ్యాంశాలను నోట్ చేసుకోవడం వల్ల కూడా మగతకు చెక్ పెట్టినట్లు అవుతుంది.

✦ అధ్యాపకులు ఏదైనా ప్రశ్న సంధించినా చెప్పడానికి సంశయించకూడదు. నిలబడి సమాధానం చెప్పడం వల్ల నిద్ర మబ్బు మాయవుతుంది.

✦ పాదాలను నేల మీద ఆన్చి పైకీ కిందకీ కదపాలి.

✦ పెన్నును రాస్తున్నప్పుడు పట్టుకున్నట్టుగా కాకుండా.. ఇతర వేళ్ల మధ్య కూడా పెట్టుకుని అటూఇటూ కాసేపు కదుపుతుండాలి.

✦ విశ్రాంతిగా కూర్చోవడం వల్ల హాయిగా ఉండి ఒక్కోసారి నిద్ర కమ్ముకొస్తుంది. కాబట్టి వెన్నెముక నిటారుగా ఉంచి కూర్చోవాలి.

✦ తదేకంగా ఒకేవైపు చూడటం వల్ల కూడా కళ్లు మూతపడతాయి. కాబట్టి ఒకసారి దూరంగా ఉండే వస్తువులను.. మరోసారి దగ్గరగా ఉండే వస్తువులను చూడాలి.



✦ నిటారుగా కూర్చుని దీర్ఘంగా శ్వాస తీసుకుని.. దాన్ని మెల్లగా బయటకు వదలాలి. దీంతో మీ దృష్టి శ్వాస మీదకు మళ్లుతుంది.

✦ ఒకసారి బయటకు వెళ్లి.. చేతులను ఒకసారి సవ్య దిశలో, మరోసారి అపసవ్య దిశలో తిప్పాలి. అలాగే ముఖం కడుక్కోవడమూ చేయొచ్చు.

✦ సాధ్యమైనంత వరకు లంచ్‌లో నూనె, నెయ్యి, తీపి పదార్థాలకు దూరంగా ఉండాలి. ఆ సమయంలో పోషకాహారం తీసుకోవడానికే ప్రాధాన్యమివ్వాలి. దాంతో సాయంత్రం వరకూ చురుగ్గా ఉండగలుగుతారు.

✦ మరీ మత్తుగా ఉన్నప్పుడు రబ్బర్‌బ్యాండ్‌ను రిస్ట్‌కు వేసుకోండి. దాన్ని గట్టిగా లాగి వదిలితే చురుక్కుమంటుంది. దాంతో మత్తు పరారవుతుంది.

✦ నిజానికి రోజూ రాత్రిపూట తగినంత నిద్రపోతే.. పగటి నిద్ర సమస్యే ఉండదు. కాబట్టి ప్రతిరోజూ గాఢంగా నిద్రపోతున్నారో లేదో పరిశీలించుకోవాలి.

రైట్స్‌లో సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్లు

రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్ (రైట్స్).. 30 సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులను ప్రకటించింది. ఒప్పంద ప్రాతిపదికన ఏడాది కాలానికి ఎంపిక చేస్తారు.

మొత్తం ఖాళీల్లో.. అన్‌రిజర్వ్‌డ్‌కు 15, ఈడబ్ల్యూఎస్‌లకు 3, ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు 5, ఎస్సీలకు 4, ఎస్టీలకు 3 కేటాయించారు.

అర్హతలు: సివిల్ ఇంజినీరింగ్ డిప్లొమా, ప్రొడక్షన్/ మెటీరియల్ టెస్టింగ్/ ఫీల్డ్ క్వాలిటీ ఇన్‌స్పెక్షన్/ క్వాలిటీ అస్యూరెన్స్/ క్వాలిటీ కంట్రోల్‌లో రెండేళ్ల అనుభవం. లేదా సిమెంట్ కాంక్రీట్ కన్‌స్ట్రక్షన్ పనుల్లో రెండేళ్ల అనుభవం ఉండాలి.



● ఇంజినీరింగ్ డిప్లొమాను జనరల్ అభ్యర్థులు 50 శాతంతో, ఎస్సీ/ ఎస్టీ/ ఓబీసీ (ఎన్‌సీఎల్)/ పీడబ్ల్యూడీలు 45 శాతంతో పూర్తిచేయాలి.

వయసు: దరఖాస్తు చివరి తేదీ నాటికి 40 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ/ ఎస్టీ/ ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు గరిష్ఠ వయసులో సడలింపులు వర్తిస్తాయి.

దరఖాస్తు ఫీజు: జనరల్/ ఓబీసీలకు రూ.300. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులకు రూ.100.

వేతనం: నెలకు రూ.29,735. మూలవేతనానికి అదనంగా అలవెన్సులు, పనిచేసే ప్రాంతాన్ని బట్టి ఇతర సదుపాయాలు ఉంటాయి.

ఎంపిక ఇలా

రాత పరీక్షతో నియామకాలుంటాయి. 125 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. వ్యవధి రెండున్నర గంటలు. రుణాత్మక మార్కులు ఉండవు.

● రైల్వే ఇంజినీరింగ్, సర్వేయింగ్, జియోటెక్నికల్ ఇంజినీరింగ్, క్వాలిటీ సర్వేయింగ్, కాంట్రాక్ట్, టెండర్స్, హైవే, ఎయిర్‌పోర్ట్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్.. మొదలైన అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. సిలబస్ వివరాలు ప్రకటనలో ఉన్నాయి.

● రాత పరీక్షలో జనరల్ అభ్యర్థులు 50 శాతం, ప్రత్యేక వర్గాలకు చెందినవారు 45 శాతం కనీసార్హత మార్కులు సంపాదించాలి.

● కనీసార్హత మార్కులు సాధించినవారి ధ్రువపత్రాలను పరిశీలించి, వైద్య పరీక్షల అనంతరం తుది ఎంపిక చేస్తారు.

● సంస్థ అవసరాలు, ఉద్యోగి పనితీరును బట్టి ఒప్పంద కాలాన్ని పొడిగించే అవకాశం ఉంటుంది.

● ఎంపికైనవారిని మహారాష్ట్ర, ఒడిశా, ఉత్తర్ ప్రదేశ్, హరియాణాల్లో నియమిస్తారు.

రాత పరీక్ష కేంద్రాలు: దిల్లీ/గుడ్‌గావ్, ముంబయి, కోల్‌కతా, భువనేశ్వర్. దరఖాస్తు సమయంలో రెండు కేంద్రాలను ఎంచుకోవాలి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 23.08.2025
రాత పరీక్ష తేదీ: 30.08.2025
వెబ్‌సైట్: http://www.rites.com/

ఏ పరీక్ష ఎప్పుడు?

యూపీఎస్సీ- 2026

జాతీయ స్థాయిలో ప్రభుత్వ పరంగా అత్యున్నత ఉద్యోగ నియామకాలకు సంబంధించిన ప్రకటనలు, పరీక్షలు, ముఖాముఖి, తుది ఎంపిక... ఇవన్నీ యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆధ్వర్యంలో జరుగుతాయి. ఈ సంస్థ 2026లో నిర్వహించనున్న పరీక్షల షెడ్యూల్ విడుదల చేసింది. దాదాపు పరీక్షలన్నీ ఆదివారమే జరుగుతాయి.

పోస్టు	ప్రకటన తేదీ	చివరి తేదీ	పరీక్ష తేదీ
కంబైన్డ్ జియో సైంటిస్ట్ (ప్రిలిమినరీ)	03.09.2025	23.09.2025	08.02.2026
సీడీఎస్ఈ (1)	10.12.2025	30.12.2025	12.04.2026
ఎన్‌డీఏ, ఎన్ఏ (1)	10.12.2025	30.12.2025	12.04.2026
సివిల్స్, ఐఎఫ్ఎస్ (ప్రిలిమ్స్)	14.01.2026	03.02.2026	24.05.2026
ఐఈఎస్, ఐఎస్ఎస్	11.02.2026	03.03.2026	19.06.2026
ఇంజినీరింగ్ సర్వీసెస్ (ప్రిలిమినరీ)	17.09.2025	07.10.2025	08.02.2026
సీఏపీఎఫ్స్ అసిస్టెంట్ కమాండెంట్స్	18.02.2026	10.03.2026	19.07.2026
మెడికల్ సర్వీసెస్	11.03.2026	31.03.2026	02.08.2026
ఎన్‌డీఏ ఎన్ఏ (2)	20.05.2026	09.06.2026	13.09.2026
సీడీఎస్ఈ (2)	20.05.2026	09.06.2026	13.09.2026
కంబైన్డ్ జియో సైంటిస్ట్ (మెయిన్)			20.06.2026, 21.06.2026
సివిల్స్ మెయిన్స్			21.08.2026 నుంచి 5 రోజులు
ఇంజినీరింగ్ సర్వీసెస్ (మెయిన్)			21.06.2026
ఫారెస్ట్ సర్వీస్ (మెయిన్)			22.11.2026 నుంచి 7 రోజులు



నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ మెదక్‌లో..

ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ మెదక్ ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో 37 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: ప్రొడక్షన్, మెకానికల్, క్వాలిటీ, ఇంటిగ్రేటెడ్ మెటీరియల్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అనలిటిక్స్, సివిల్, ఐటీ, టూల్ డిజైన్, డిజైన్, క్వాలిటీ కంట్రోల్, స్టోర్స్, హెచ్‌ఆర్.
✦ జూనియర్ మేనేజర్: 21
✦ డిప్లొమా టెక్నీషియన్: 06 ✦ అసిస్టెంట్: 10
అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీ, డిప్లొమాతో పాటు పని అనుభవం.
వయసు: 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
వేతనం: నెలకు జూనియర్ మేనేజర్‌కు రూ.30,000, డిప్లొమా టెక్నీషియన్‌కు రూ.23,000, అసిస్టెంట్‌కు రూ.23,000.
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 06.09.2025
దరఖాస్తు పంపవలసిన చిరునామా: డిప్యూటీ జనరల్ మేనేజర్/ హెచ్ ఆర్, ఆర్డ్‌నెన్స్ ఫ్యాక్టరీ మెదక్, ఎద్దుమైలారం, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ- 502205.
ఎంపిక: విద్యార్హతల్లో సాధించిన మెరిట్‌తో.
వెబ్‌సైట్: https://ddpdoo.gov.in/career

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో..

ఛత్తీస్‌గఢ్‌లోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా- సామాజిక్ ఉత్థాన్ అవమ్ ప్రశిక్షణ్ సంస్థాన్.. ఒప్పంద ప్రాతిపదికన 7 ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
✦ ఫ్యాకల్టీ -02 ✦ ఆఫీస్ అసిస్టెంట్ -02 ✦ అటెండర్ -02
✦ వాచ్‌మన్-కమ్-గార్డనర్ -01
అర్హత: పోస్టును అనుసరించి టెన్త్, డిగ్రీ, పీజీ (గ్రామీణాభివృద్ధి, సోషియాలజీ/సైకాలజీ, వెటర్నరీ, హార్టికల్చర్, అగ్రి మార్కెటింగ్)తో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం.
వయసు: 22 ఏళ్లు - 40 ఏళ్లు.
వేతనం: నెలకు ఫ్యాకల్టీకి రూ.30,000. ఆఫీస్ అసిస్టెంట్‌కు రూ.20,000. అటెండర్‌కు రూ.14,000. వాచ్‌మన్-కమ్-గార్డనర్‌కు రూ.12,000.
ఎంపిక : ఇంటర్వ్యూ ఆధారంగా. **ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** 04.09.2025.
చిరునామా: రీజినల్ హెడ్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ప్రాంతీయ కార్యాలయం, అంబికాపూర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని ధంజల్ కాంప్లెక్స్, నెమ్నాకల, అంబికాపూర్, జిల్లా సర్గుజా, ఛత్తీస్‌గఢ్- 479001.
ఎంపిక: ఇంటర్వ్యూతో.
వెబ్‌సైట్: https://www.centralbankofindia.co.in/en/recruitments

వాక్-ఇన్

ఈఎస్ఐసీలో బెంగళూరులో ఫ్యాకల్టీ

ఎంప్లాయీస్ స్టేట్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) బెంగళూరు ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో 13 అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
విభాగాలు: డెర్మటాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, ఫోరెన్సిక్ మెడిసిన్, సైకియాట్రీ, అనాటమీ, బయోకెమిస్ట్రీ, ఐసీయూ.
✦ అసిస్టెంట్ ప్రొఫెసర్: 09
✦ అసోసియేట్ ప్రొఫెసర్: 04
అర్హత: పోస్టును అనుసరించి ఎండీ/డీఎన్‌బీ/పీజీతో పాటు పని అనుభవం.
వయసు: ఇంటర్వ్యూ తేదీ నాటికి 67 ఏళ్లు మించకూడదు.
వేతనం: నెలకు అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,67,844, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1,44,201.
ఎంపిక: ఇంటర్వ్యూతో.
ఇంటర్వ్యూ తేదీ: 29.08.2025
వేదిక: న్యూ అకడెమిక్ బ్లాక్, ఈఎస్ఐసీ ఎంసీ & పీజీఐఎంఎస్ఆర్, రాజాజీనగర్, బెంగళూరు.
వెబ్‌సైట్: https://esic.gov.in/recruitments

ప్రయాసా.. అడియాసా!

- సీఈసీపై అభిశంసన ప్రతిపక్షానికి సాధ్యమేనా?
- లోక్‌సభలో తీర్మానానికి 100 మంది ఎంపీల సంతకాలు అవసరం
- రాజ్యసభలో 50 మందివి కావాలి
- పాలకపక్షం మద్దతు లేకుంటే విజయం అసాధ్యం
- ఈటీవీ భారత్ ఇంటర్వ్యూలో లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ పి.డి.టి.ఆచారి



ఈటీవీ భారత్: ప్రస్తుత వర్షాకాల పార్లమెంటు సమావేశాల్లో ప్రతిపక్ష 'ఇండియా' కూటమి ఎన్నికల సంఘం ప్రధాన అధికారి (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై ప్రవేశపెట్టాలని భావిస్తున్న అభిశంసన తీర్మానం ఎంతవరకు విజయవంతం అవుతుందన్నది సర్వత్రా చర్చనీయాంశమైంది. పార్లమెంటు ఉభయసభల్లో ఏదైనా ఒక సభ నుంచి సీఈసీపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టే హక్కు ప్రతిపక్షానికి ఉందని లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ పి.డి.టి.ఆచారి అంటున్నారు. అయితే బలమైన ప్రాతిపదిక చూపకపోతే తీర్మానం తిరస్కారానికి గురయ్యే ప్రమాదముందని ఆయన అన్నారు. పాలక పక్షం మద్దతు లేకుండా ఈ విషయంలో ప్రతిపక్షం విజయం సాధించలేదని ఆయన ఈటీవీ భారత్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు.

సీఈసీని ఎప్పుడు అభిశంసించవచ్చు?

సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల అభిశంసనకు అనుసరించే విధానమే సీఈసీకి కూడా వర్తిస్తుందని ఆచారి అన్నారు. "సీఈసీకి రాజ్యాంగం నిర్దేశించిన విధులు నిర్వహించే సామర్థ్యం లేదని కానీ ఆయన దుర్వ్యవహారాన్ని కానీ నిరూపిస్తే అదే ప్రాతిపదికన ఆయనను అభిశంసించవచ్చు. న్యాయమూర్తుల అభిశంసనకూ ఇదే ప్రాతిపదిక" అని తెలిపారు. దుర్వ్యవహారమంటే ఏమిటన్నది సుప్రీంకోర్టు పలుమార్లు వివరించింది. "పనితనంలో ఘోర తప్పిదాలు, పర్యవసానాలను గురించి పట్టించుకోకుండా ఉద్దేశపూర్వకంగా తప్పులు చేయడం దుర్వ్యవహారం కిందికి వస్తాయి. అవినీతికి పాల్పడటం కూడా దుర్వ్యవహారమే. విధులు నిర్వహించే సామర్థ్యం లేకపోవడం అంటే సంస్థకు సంబంధించిన బాధ్యతల్ని చేపట్టేందుకు అవసరమైన శారీరక, మానసిక సామర్థ్యం లేకపోవడం. ఈ ప్రాతిపదికన ఒక న్యాయమూర్తిని, సీఈసీని అభిశంసించవచ్చు" అని ఆచారి వివరించారు.

అవసరమైతే న్యాయ సలహా

అభిశంసన తీర్మానం లోక్‌సభలో ప్రవేశపెడితే అందుకు సంబంధించి 100 మంది సభ్యులు నోటీసుపై సంతకాలు చేయాల్సి ఉంటుంది. అదే తీర్మానం రాజ్యసభలో ప్రవేశపెడితే 50 మంది సభ్యుల సంతకాలు సరిపోతాయి. తీర్మానం లోక్‌సభ స్పీకరుకు, లేదా రాజ్యసభ ఛైర్మన్ చేతికి చేరిన తర్వాత ఆయన అందుబాటులో ఉన్న వాస్తవాలన్నింటినీ క్రోడీకరిస్తారు. తీర్మానాన్ని ఆమోదించాలా వద్దా అన్న అంశంపై న్యాయ సలహా పొందుతారు. ఆ తర్వాత స్పీకర్ లేదా రాజ్యసభ ఛైర్మన్ నిర్ణయం తీసుకుంటారు. ఆ స్థాయిలో స్పీకర్ లేదా ఛైర్మన్ తీర్మానాన్ని తిరస్కరిస్తే అంతటితో ఆ పర్వం ముగుస్తుంది. దానిపై తదుపరి చర్యలేవీ తీసుకునే వీలు లేదని ఆచారి తెలిపారు.

త్రిసభ్య కమిటీని నియమించొచ్చు

ఒకవేళ తీర్మానంలో పస ఉందని స్పీకర్ భావిస్తే అందులో పేర్కొన్న ఆరోపణలపై దర్యాప్తు జరిపేందుకు త్రిసభ్య కమిటీని నియమిస్తారు. ఈ కమిటీలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి, ఏదైనా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఒక న్యాయశాస్త్ర కోవిదుడు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ఆరోపణల్ని క్రోడీకరిస్తుంది. ఈ ఆరోపణలు కచ్చితంగా ఉండాలి. దీనిపై సమాధానం చెప్పేందుకు అభిశంసనకు గురవుతున్న సీఈసీ లేదా న్యాయమూర్తికి అవకాశం ఇస్తారు. ఆ తర్వాత త్రిసభ్య కమిటీ ఒక నివేదికను స్పీకరుకు సమర్పిస్తుంది. ఆ తర్వాత స్పీకరు తీర్మానాన్ని సభ ముందు ఉంచుతారు. తీర్మానం గెలవాలంటే సభ మొత్తం సంఖ్యాబలంలో మెజారిటీ లేదా ఓటింగులో పాల్గొన్న సభ్యుల్లో మూడో వంతు మంది మద్దతు అవసరమవుతుందని ఆచారి తెలిపారు.

చరిత్రలో ఇప్పటి వరకూ లేదు

భారత చరిత్రలో ఇప్పటి వరకూ ఏ ఒక్క సీఈసీనీ అభిశంసించలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతిపక్షం అభిశంసనకు బలమైన ప్రాతిపదికను చూపాలి. లేకుంటే తీర్మానం నోటీసు స్థాయిలోనే తిరస్కారానికి గురవుతుంది' అని ఆయన పేర్కొన్నారు.

అమెరికాలో మెలోనీ నమస్తే వీడియో వైరల్

- మోదీ ప్రభావం అంటున్న నెటిజన్లు



ఇంటర్నెట్ డెస్క్: భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీల పేర్లు మరోసారి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. అమెరికాలో జెలెన్‌స్కీ, ట్రంప్ మధ్య జరిగిన సమావేశానికి ఐరోపా నేతలతో కలిసి వచ్చిన మెలోనీ.. అక్కడి అధికారులను భారత సంప్రదాయంలో నమస్తే అంటూ పలకరించారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఇదంతా మోదీ ప్రభావం అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. గతంలో ఇటలీ ఆతిథ్యమిచ్చిన జీ-7 సదస్సులోనూ ప్రపంచ నాయకులను మెలోనీ 'నమస్తే' అంటూ స్వాగతించడం గమనార్హం.

అత్యాచారం, ప్రేమబంధం మధ్య వ్యత్యాసం గుర్తించండి: సుప్రీంకోర్టు

దిల్లీ: అత్యాచారానికి, యువతీ యువకుల మధ్య నెలకొన్న లైంగిక సంబంధాలకు మధ్య వ్యత్యాసాన్ని గుర్తించాల్సిన అవసరాన్ని సుప్రీంకోర్టు మంగళవారం నొక్కి చెప్పింది. విశ్వవిద్యాలయాల్లో, సహ విద్యా సంస్థల్లో యువతీ యువకుల మధ్య ప్రణయ భావనలు చిగురిస్తుంటాయి. 'ప్రేమలో పడటం నేరమెలా అవుతుంది? ఇలాంటి వ్యవహారాలను, నేర భావనతో కూడుకున్న అత్యాచారానికి మధ్య తేడాను గుర్తించాలి' అని జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్ ధర్మాసనం పేర్కొంది. పోక్సో చట్టం కింద శారీరక కలయికకు సమ్మతి తెలిపే వయసును 18 సంవత్సరాల నుంచి 16 ఏళ్లకు తగ్గించాలా వద్దా అన్న ప్రశ్నను లేవనెత్తిన ఒక పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. నిజమైన ప్రేమ వ్యవహారం కేసుల్లో యువతీ యువకులు పరస్పరం ఇష్టపడి పెళ్లి చేసుకున్నప్పుడు జరిగిన ఉదంతాలను నేరంగా పరిగణించకండి అని ధర్మాసనం సూచించింది. ప్రేమికుల ప్రణయాన్ని పోక్సో చట్టం కింద నేరంగా పరిగణిస్తూ అమ్మాయి బంధువుల ఫిర్యాదుతో అబ్బాయిని జైలుకు పంపడాన్ని కోర్టు ప్రస్తావించింది. యువతీ యువకులు పారిపోయిన సందర్భాల్లో వాస్తవాన్ని కప్పిపుచ్చేందుకు పోక్సో కింద కేసు నమోదు చేస్తున్నారని పేర్కొంది. ఇలాంటి కేసుల్లో పోలీసులు ఇది కిడ్నాపింగ్ వ్యవహారమా, మానవ అక్రమ రవాణా అంశమా, లేక నిజమైన ప్రేమ వ్యవహారమా అన్నది పరిశీలించాలని కోర్టు వ్యాఖ్యానించింది.

తాత్కాలికం పేరుతో దీర్ఘకాల సేవలు వద్దు

ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో తాత్కాలికతను పెంపొందించడాన్ని సుప్రీంకోర్టు మంగళవారం తప్పుపట్టింది. తాత్కాలిక నియామకమన్న పేరు పెట్టి దీర్ఘకాలంపాటు ఒకే పనికి వ్యక్తుల్ని నియమించడం పాలనా వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని హరిస్తుందని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం పేర్కొంది. ఉత్తర్‌ప్రదేశ్ ఉన్నత విద్యా సేవల కమిషన్‌లో కొందరు ఉద్యోగుల సర్వీసును శాశ్వతం చేస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. ఉద్యోగాల కల్పన ప్రభుత్వానికి రాజ్యాంగం నిర్దేశించిన బాధ్యత. బడ్జెట్ నియంత్రణ సాకుతో ప్రభుత్వం అట్టడుగు స్థాయిలో ప్రజలకు సేవలందించేవారి సర్వీసును తాత్కాలిక కోవలో ఉంచడం తగదని ధర్మాసనం అభిప్రాయపడింది.

'రక్షణ కల్పిస్తే సవాలు చేయడమేమిటి?'

ఒక ముస్లిం జంటకు రక్షణ కల్పిస్తూ పంజాబ్, హరియాణా హైకోర్టు వెలువరించిన ఆదేశాన్ని జాతీయ బాలలహక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) సవాలు చేయడాన్ని సుప్రీంకోర్టు తప్పు పట్టింది. 16 ఏళ్ల ముస్లిం యువతి అదే మతానికి చెందిన 21 సంవత్సరాల యువకుణ్ని వివాహం చేసుకుంది. ఈ వివాహం ముస్లిం వైయక్తిక చట్టం పరిధిలో సరియైనది అయినప్పుడు దీనిపై ఎన్‌సీపీసీఆర్‌కు అభ్యంతరం ఎందుకని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఈ ఇరువురికీ రక్షణ కల్పిస్తూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని, రక్షణ కల్పించడాన్ని ఎన్‌సీపీసీఆర్ సవాలు చేయడమేమిటని జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది.



అయిదేళ్ల 'అయోధ్య' నిర్మాణం ప్రత్యేక కెమెరాలతో చిత్రీకరణ

అయోధ్య (యూపీ): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన శంకుస్థాపనతో 2020 ఆగస్టు 5న ప్రారంభమై అయిదేళ్లు కొనసాగిన అయోధ్య రామ మందిర నిర్మాణ ప్రక్రియ మొత్తం ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో అమర్చిన 5 ప్రత్యేక కెమెరాల్లో రికార్డు చేసినట్లు అధికారులు మంగళవారం వెల్లడించారు. ఈ రికార్డింగులను "మేధో సంపత్తి హక్కులు"గా రామమందిర ట్రస్టు ప్రకటించింది. ఈ హక్కులను రూర్కీలోని 'సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' (సీబీఆర్ఐ)కు స్వాధీనం చేసి ఒప్పందం కుదుర్చుకుంటారు. తద్వారా ఆ సమాచారాన్ని విద్య, శిక్షణ, డాక్యుమెంటరీల తయారీకి ఉపయోగించుకోవచ్చని ఆలయ నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్ర తెలిపారు. అక్టోబరు నెలాఖరుకు ఆలయ నిర్మాణ పనులన్నీ దాదాపుగా పూర్తవుతాయన్నారు.

పుతిన్-జెలెన్‌స్కీ భేటీకి ఏర్పాట్లు మొదలు

- వేదిక ఎక్కడనేది ఇంకా తేల్చలేదు: ట్రంప్

వాషింగ్టన్: సుమారు మూడున్నరేళ్లుగా జరుగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపు దిశగా సన్నాహాలు జరుగుతున్నాయి. త్వరలోనే రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఉక్రెయిన్ అధినేత వొలొదిమిర్ జెలెన్‌స్కీ ముఖాముఖి సమావేశమయ్యేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అయితే సమావేశ వేదికపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. జెలెన్‌స్కీ, పుతిన్ సమావేశం ముగిసిన తర్వాత త్రైపాక్షిక భేటీ ఉంటుందని.. అందులో తానూ పాల్గొంటానని ట్రంప్ తెలిపారు. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య సమావేశం ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, విదేశాంగ శాఖ మంత్రి మార్కో రూబియో, ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ సమన్వయంతో జరగనుందని పేర్కొన్నారు. సోమవారం వైట్‌హౌస్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, యురోపియన్ దేశాల నేతలతో సమావేశం ముగిసిన అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ప్రకటన చేశారు. అలాగే రష్యా నుంచి ఉక్రెయిన్ రక్షణ కోసం తమ సేనలను కీవ్‌కు పంపేది లేదని మంగళవారం ట్రంప్ స్పష్టం చేశారు. అదేవిధంగా నాటోలో సభ్యత్వం, క్రిమియా ద్వీపకల్పాన్ని తిరిగి పొందాలన్న ఉక్రెయిన్ ఆశలు అసాధ్యమైనవని పేర్కొన్నారు. మరోవైపు ట్రంప్‌తో జరిగిన చర్చలు నిర్మాణాత్మకంగా జరిగాయని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. భద్రతా హామీలతో సహా పలు సున్నిత విషయాలను చర్చించినట్లు తెలిపారు.



ఈసారి జెలెన్‌స్కీ సూట్‌తో...!

జెలెన్‌స్కీ, ట్రంప్ సమావేశం చిరునవ్వులతో ముగిసింది. ఈ సందర్భంగా జెలెన్‌స్కీ ధరించిన సూట్‌కు సంబంధించి ఆసక్తికర పరిణామం జరిగింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు వేసుకున్న సూట్ అద్భుతంగా ఉందంటూ అమెరికా మీడియా ప్రతినిధి ఒకరు కితాబిచ్చారు. దానికి ట్రంప్ స్పందిస్తూ, అప్పుడు నీపై అటాక్ చేసింది ఇతడే నంటూ సరదాగా గుర్తు చేశారు.

శ్వేతసౌధం వద్ద అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

✦ అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ అమెరికా ఎయిర్‌ఫోర్స్ అత్యున్నత అధికారి జనరల్ డేవిడ్ అల్విన్ ముందస్తు పదవీ విరమణకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో తన వారసుడి ఎంపిక జరిగే వరకూ ఆయన పదవిలో కొనసాగుతారని ఎయిర్‌ఫోర్స్ ఓ ప్రకటనలో తెలిపింది.

ఎన్నికల వ్యవస్థ బలోపేతానికి 28 రకాల చర్యలు

- ఎన్నికల సంఘం వెల్లడి

దిల్లీ: వివిధ అంశాలపై విపక్షాల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న ఎన్నికల సంఘం (ఈసీ) కీలక ప్రకటన చేసింది. ఎన్నికల ప్రక్రియను మరింత మెరుగుపర్చడం, క్రమబద్ధీకరించడమే లక్ష్యంగా గత ఆరు నెలల్లో 28 రకాల చర్యలు తీసుకున్నట్లు వెల్లడించింది. మరణాల నమోదు సమాచారాన్ని అనుసంధానించడం ద్వారా క్షేత్రస్థాయి ఎన్నికల అధికారులకు మృతి చెందిన ఓటర్ల గురించి సకాలంలో సమాచారం అందుతుందని తెలిపింది. ఎన్నికల ప్రక్రియ బలోపేతం కోసం... భాగస్వామ్యపక్షాలతో సంప్రదింపులు, ఎన్నికల వ్యవస్థ బలోపేతం, ప్రక్షాళన, సాంకేతికత వినియోగం పెంపు, ఓటర్ల జాబితాలను సరిచేయడం, ఓటింగ్ ప్రక్రియను సులభతరం చేయడం, ఈసీ సామర్థ్యాలను పెంపొందించడం వంటి విభాగాల్లో చర్యలు తీసుకున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను కీలక సంస్కరణగా పేర్కొంది. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడం, అనర్హుల పేర్లు లేకుండా చూసుకోవడమే ఈ ప్రక్రియ ప్రధాన లక్ష్యమని చెప్పింది.

దేశమే మొదటి ప్రాధాన్యంగా ఉండాలి: ద్రౌపదీ ముర్ము

దిల్లీ: ప్రపంచమంతా వసుధైక కుటుంబం అనే భావనతో ఉన్నా దేశానికే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలనేది ఎప్పుడూ గుర్తుంచుకోవాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తెలిపారు. ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి భారత్ ముఖ్య భూమిక పోషిస్తోందన్నారు. వాటిల్లో వాతావరణ మార్పుల కారణంగా ఉత్పన్నమవుతున్న సమస్యలు, సరిహద్దు ఉగ్రవాదం, ప్రపంచంలోని ఉత్తర, దక్షిణ ప్రాంతాల మధ్య ఉన్న అసమానతల వల్ల ఎర్పడే ఇబ్బందులు ఉన్నాయన్నారు. శిక్షణ పొందుతున్న 2024 బ్యాచ్ ఇండియన్ ఫారిన్ సర్వీస్(ఐఎఫ్ఎస్) అధికారులను ఉద్దేశించి మంగళవారం రాష్ట్రపతి మాట్లాడారు. 'ప్రస్తుత కాలంలో సాంస్కృతిక దౌత్య ప్రాముఖ్యత పెరిగింది. వికసిత్ భారత్-2047 లక్ష్యాన్ని చేరుకోవటంలో దౌత్యపరమైన చర్యలు ఎంతగానో తోడ్పడతాయి. మన ప్రతి మాట అత్యంత కీలకమైంది. దౌత్యవేత్తలుగా ఉండబోయే మీ మాటలు, చర్యలు, నైతిక విలువలనే ప్రపంచం గమనిస్తుంది. నా విదేశీ పర్యటనల్లో అక్కడి మన పౌరులు దేశం పట్ల కనబరిచే ఉత్సాహం, నిబద్ధత ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. త్వరలోనే విదేశాల్లో పోస్టింగులను పొందే మీరు అన్ని విషయాల్లో నిజాయితీగా ఉండాలి' అని పేర్కొన్నారు.

మధ్యప్రదేశ్‌లో 27 స్థానాల్లో ఓట్ల చోరీ: కాంగ్రెస్

భోపాల్: మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో 27కు పైబడి నియోజకవర్గాల్లో ఓట్లు చోరీకి గురయ్యాయని కాంగ్రెస్ నేత ఉమాంగ్ సింగార్ మంగళవారం ఆరోపించారు. దీంతో అధికార భాజపాకు అనైతిక లాభం చేకూరిందని పేర్కొన్నారు. ఈ ఆరోపణలు నిరాధారమైనవని భాజపా తోసిపుచ్చింది. ఎన్నికలు జరిగిన 20 నెలల తర్వాత ఇప్పుడు ఆరోపణలు చేయడాన్ని తప్పుపట్టింది.

నిమిషప్రియ కేసులో ప్రభుత్వం విరాళాలు సేకరిస్తోందన్న వార్తలు అవాస్తవం

- విదేశీ వ్యవహారాల శాఖ స్పష్టీకరణ

దిల్లీ: యెమెన్‌లో మరణశిక్షను ఎదుర్కొంటున్న కేరళ నర్సు నిమిషప్రియను కాపాడేందుకు ప్రభుత్వం విరాళాలు సేకరిస్తోందంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలు అవాస్తవాలని విదేశీ వ్యవహారాల శాఖ(ఎంఈఏ) మంగళవారం స్పష్టం చేసింది. ఓ వ్యక్తి పోస్ట్‌చేసిన 'సేవ్ నిమిష ప్రియ' నినాదంతో సహా బ్యాంకు వివరాలున్న ఫోటోను ఎంఈఏ నిజ నిర్ధారణ (ఫ్యాక్ట్‌చెక్) విభాగం తనిఖీచేసి ఈ మేరకు వెలువరించింది. నిమిష ప్రియ కేసులో సాధ్యమైనంత వరకు అన్ని ప్రయత్నాలు చేస్తామని ప్రభుత్వం ఈ నెల 1న తెలిపిన విషయం విదితమే.

అనధికార యాప్ ఉంది.. పారాహుషార్: సీఆర్పీఎఫ్

దిల్లీ: కేంద్ర రిజర్వు పోలీసు దళం (సీఆర్పీఎఫ్)కు చెందిన ప్రామాణిక ఆన్‌లైన్ వేదికల్లో ఒకదానిని అనుకరించేలా చలామణిలో ఉన్న అనధికార యాప్‌పై అధికారులు అప్రమత్తం అయ్యారు.



సిబ్బంది వ్యక్తిగత సమాచారంతో పాటు సున్నితమైన సంస్థాగత వివరాలను సేకరించడం ద్వారా ఇది భద్రతాపరంగా తీవ్రమైన ముప్పును కలిగించే అవకాశం ఉంది. అప్రమత్తంగా ఉండాలంటూ తమ 3.25 లక్షలమంది సిబ్బందిని సీఆర్పీఎఫ్ హెచ్చరించింది. 'సీఆర్పీఎఫ్ సంభవ్' పేరిట అసలైన యాప్ వినియోగంలో ఉంది. 'సంభవ్ అప్లికేషన్ రైటర్' పేరిట చక్కర్లు కొడుతున్న నకిలీ యాప్ సిబ్బందిని కొత్తగా వివరాలు అడుగుతోంది. ఆన్‌లైన్ ప్లేస్టోర్ నుంచి దీన్ని తొలగించాలని ప్రభుత్వ సైబర్ భద్రతాసంస్థలను కోరిన సీఆర్పీఎఫ్ ఈ విషయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తన అడ్వైజరీలో పేర్కొంది.

ఇది భావజాలాల మధ్య పోరాటం

- ఉపరాష్ట్రపతి ఎన్నికలపై విపక్షం

దిల్లీ: ఉపరాష్ట్రపతి పదవికి వచ్చేనెల 9న జరగనున్న ఎన్నికల్లో ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా ఎంపికైన జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి మంగళవారం సాయంత్రం దిల్లీ చేరుకున్నారు. ఆయన గురువారం నామినేషన్ దాఖలు చేస్తారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఎంపికపై విపక్ష సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భిన్న భావజాలాల మధ్య సాగుతున్న పోరాటంగా వారు ఈ ఎన్నికను అభివర్ణించారు. రాజ్యాంగ విలువల్ని కాపాడేందుకే జస్టిస్ రెడ్డి తన యావత్ వృత్తి జీవితాన్ని అంకితమిచ్చారని ప్రతిపక్ష నేతలు పేర్కొంటున్నారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి భారత రాజ్యాంగ స్ఫూర్తికి ప్రతినిధి అని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ కొనియాడారు. ప్రతిపక్షాల అభ్యర్థి ఉపరాష్ట్రపతిగా ఎన్నికవుతారని జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా జోస్యం పలికారు. "దేశంపై ఈ ఎన్నికను ఎందుకు రుద్దుతున్నారో అర్థం కావడంలేదు. మాజీ ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ ఎక్కడ? ఆయన ఆరోగ్యంగానే ఉన్నారని ఆశిస్తున్నాను" అని ఆయన అన్నారు. "ఇది కేవలం సంఖ్యాబలానికి సంబంధించిన విషయం కాదు.. భావజాలానికి, రాజ్యాంగ అంతరంగానికి సంబంధించిన విషయం" అని సీపీఐ ఎంపీ పి.సందోష్ కుమార్ అన్నారు. జస్టిస్ రెడ్డి వెలువరించిన పలు పురోగామ్య తీర్పుల్ని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య గుర్తు చేసుకున్నారు. ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లిన ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి వ్యక్తి ఉపరాష్ట్రపతిగా ఎన్నికైతే ప్రజాస్వామ్యం, రాజ్యాంగం బలోపేతమవుతాయని అన్నారు. ఆర్ఎస్ఎస్, హిందుత్వ రాజకీయ నేపథ్యం కలిగిన భాజపా అభ్యర్థికి వ్యతిరేకంగా ప్రతిపక్షం ఉమ్మడి అభ్యర్థిని నిలపడం హర్షదాయకమని డీఎంకే నాయకురాలు కనిమొళి అన్నారు.

రాజస్థాన్‌లోనూ ఓ నీలి డ్రమ్ము!

- భర్తను చంపి ప్రియుడితో పరారైన ఇల్లాలు

జైపుర్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని మేరఠ్‌లో ప్రియుడిపై మోజుతో భర్తను చంపి నీలి డ్రమ్ములో కుక్కిన ముస్కాన్ ఉదంతం ఎంత కలకలం రేపిందో తెలిసిందే. ఈ ఘటన తర్వాత సామాజిక మాధ్యమాల్లో 'నీలి డ్రమ్ము' వైవాహిక హింసకు చిహ్నంగా, మీమ్స్‌కు వస్తువుగా మారిపోయింది. తాజాగా రాజస్థాన్‌లోని ఖైరథల్ తిజారా జిల్లాలోనూ ఓ ఇంటి మిద్దెపై నీలి డ్రమ్ము బయటపడింది. ఆ ఇంటి ఇల్లాలు లక్ష్మీదేవి తమ యజమాని కుమారుడైన జితేంద్రశర్మతో ఉన్న వివాహేతర సంబంధం కారణంగా భర్త హన్స్‌రామ్‌ను చంపి, డ్రమ్ములో కుక్కి ఉప్పు చల్లింది. ఆగస్టు 15న ఈ హత్యకు పాల్పడ్డాక, తన ముగ్గురు పిల్లలతో కలిసి ప్రియుడితో పరారైంది. మిద్దె పైనుంచి దుర్వాసన వస్తుండటంతో 17వ తేదీన శవాన్ని గుర్తించారు. వెంటనే విచారణ ప్రారంభించిన పోలీసులు అల్వార్ జిల్లా పరిధిలో ఓ ఇటుక బట్టీ వద్ద తల దాచుకొన్న లక్ష్మీదేవి, జితేంద్రశర్మలను అరెస్టు చేశారు.



భర్త హన్స్‌రామ్ (శవాన్ని దాచిన డ్రమ్ము), లక్ష్మీదేవి

'మెటా' అప్రమత్తం చేయడంతో పరుగులు తీసిన పోలీసులు



కౌశాంబీ (యూపీ): విషం తీసుకొని ఆత్మహత్య చేసుకోబోతున్నట్లు ఓ యువకుడు (20) ఇన్‌స్టాగ్రాంలో పెట్టిన పోస్టుపై 'మెటా' అప్రమత్తం చేయడంతో వేగంగా స్పందించిన ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు అతణ్ని కాపాడేందుకు పరుగులు తీశారు. సోన్‌భద్ర్ జిల్లాలోని పిప్రీ పట్టణ సమీపంలో గల ఔధాన్ గ్రామానికి చెందిన వేద్‌కుమార్ పాల్ ఈనెల 18న ఈ పోస్టు పెట్టాడు. విషం బాటిలును వీడియోలో చూపుతూ 'ఈరోజు రాత్రి విషం తాగుతాను. నా కథ ఇంతటితో సమాప్తం'' అని హిందీలో వ్యాఖ్య జోడించాడు. ఈ పోస్టును గమనించిన సాంకేతిక కంపెనీ 'మెటా' ఆ వీడియో, మొబైల్ నంబరు, లొకేషను వివరాలను లఖ్‌నవూలోని పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపింది. కౌశాంబీ సోషల్ మీడియా సెల్‌కు చేరవేసిన ఈ సమాచారం పిప్రీ పోలీసులను అప్రమత్తం చేసింది. ఓ పోలీసు బృందం ఆగమేఘాలపై వేద్‌కుమార్ ఇంటికి చేరుకొంది. తన తండ్రి పొలానికి వాడే పురుగుమందు బాటిలు కవరును తీసుకొని వీడియో చేశానని, తీవ్రమైన ఉద్దేశం ఏదీ తనకు లేదని వేద్‌కుమార్ చెప్పడం గమనార్హం. కౌన్సెలింగు అనంతరం యువకుణ్ని అతడి కుటుంబానికి అప్పగించినట్లు సీనియర్ పోలీసు అధికారి తెలిపారు.

రిషి సునాక్‌కు హత్యా బెదిరింపులు

- యువకుడికి 14 వారాల జైలుశిక్ష

ఇంటర్నెట్ డెస్క్: బ్రిటన్ మాజీ ప్రధాని రిషి సునాక్‌పై జాత్యాహంకార బెదిరింపులకు పాల్పడిన ఓ 21 ఏళ్ల యువకుడికి స్థానిక కోర్టు 14 వారాల జైలుశిక్ష విధించింది. ఈ రోజుల్లో ఇలాంటి వివక్షతకు ఎక్కడా చోటు లేదని స్పష్టం చేసింది. క్రౌన్ ప్రాసిక్యూషన్ సర్వీస్ తెలిపిన వివరాల ప్రకారం.. బర్కన్‌హెడ్‌కు చెందిన లియామ్ షా గతేడాది జూన్‌లో రిషి సునాక్‌కు జాత్యాహంకార హత్యా బెదిరింపులతో కూడిన రెండు ఈ-మెయిళ్లు పంపాడు. ఆ సమయంలో సునాక్ బ్రిటన్ ప్రధానిగా ఉన్నారు. ఆయన వ్యక్తిగత సహాయకుడు వాటిని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

20 రోజులు పునరావాస కేంద్రంలో గడపాలి

ఈ క్రమంలోనే సెప్టెంబరులో పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. కేసును విచారించిన కోర్టు గత బుధవారం అతడికి 14 వారాల జైలుశిక్ష విధించింది. 20 రోజులు పునరావాస కేంద్రంలో గడపాలని, మాదకద్రవ్యాల రిహాబిలిటేషన్ కోర్సును కూడా పూర్తి చేయాలని ఆదేశించింది. అదేవిధంగా రెండేళ్లపాటు రిషి సునాక్‌కు, ఆయన కార్యాలయానికి దూరంగా ఉండాలని పేర్కొంది.

హరియాణాలో టీచర్ అనుమానాస్పద మృతి

- 48 గంటల పాటు ఇంటర్నెట్ సేవల నిలిపివేత

ఛండీగఢ్: హరియాణలోని ఓ ఉపాధ్యాయురాలి(19) అనుమానాస్పద మృతి ఘటన సంచలనం సృష్టిస్తోంది. ఈ ఘటనపై స్థానికుల ఆందోళనలతో శాంతిభద్రతలను కాపాడేందుకు బివానీ, చరఖీ దాదరీ జిల్లాల్లో 48 గంటల పాటు మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేయాలని ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. బల్క్ ఎస్ఎంఎస్‌ల సేవలనూ ఆపేసింది. కేవలం వాయిస్ కాల్స్‌కు మాత్రమే అనుమతించింది. ఈ నెల 11న పాఠశాల ముగిసిన అనంతరం ఓ నర్సింగ్ కళాశాల గురించి తెలుసుకోవడానికి వెళ్లిన మనీషా కనిపించకుండా పోయారు. 13న బివానీలోని ఓ పొలంలో ఆమె మృతదేహాన్ని గుర్తించారు. అక్కడ గల ఆమె బ్యాగ్‌లో ఆత్మహత్య లేఖ, ఆధార్ కార్డు తదితర పత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాటిలో ఆమె పురుగుల మందు కొనుగోలు చేసినట్లు ఆధారాలు లభించాయి. అయితే ఆమెను హత్య చేసి ఉంటారని మృతురాలి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు.

వివాదాస్పద ఆడియో క్లిప్‌పై ఫోరెన్సిక్ కసరత్తు దారిమళ్లింది

- మణిపుర్ మాజీ సీఎంపై ఆరోపణల కేసులో సుప్రీం వ్యాఖ్య

దిల్లీ: మణిపుర్‌లో జాతుల మధ్య ఘర్షణల్లో ఆ రాష్ట్ర మాజీ సీఎం బీరేన్ సింగ్ ప్రమేయంపై ఆరోపణలకు కారణమైన ఆడియో క్లిప్ పరీక్ష విషయంలో కేంద్ర ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (సీఎఫ్ఎస్ఎల్) తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఫోరెన్సిక్ కసరత్తు దారి తప్పిందని జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ ధర్మాసనం మంగళవారం ఆక్షేపించింది. 'ఆడియో క్లిప్పుల ప్రామాణికతను మేం కోరలేదు. స్వర నమూనాలను పరీక్షించాలని మాత్రమే ఆదేశించామ'ని ధర్మాసనం పేర్కొంది. ఆ ఆడియో క్లిప్పులలో ఉన్నది ఒకేరకమైన వ్యక్తులా, వేర్వేరా అన్నది తేల్చాలని కోరామని తెలిపింది.

జస్టిస్ వర్మపై కేసు నమోదును తిరస్కరించిన తీర్పును సమీక్షించాలని పిటిషన్

దిల్లీ: అధికార నివాసంలో భారీగా నోట్ల కట్టలు లభించిన వివాదంలో జస్టిస్ యశ్వంత్ వర్మపై పోలీసు కేసు నమోదు చేయాలన్న తమ అభ్యర్థనను కొట్టివేస్తూ వెలువరించిన తీర్పును సమీక్షించాలంటూ పిటిషనర్లు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ నెల 7న వెలువడిన ఈ తీర్పును సమీక్షించాలని ముగ్గురు న్యాయవాదులు, ఒక ఛార్టర్డ్ అకౌంటెంట్ తమ పిటిషన్‌లో కోరారు.

పోలీసును ఢీకొన్న రాహుల్ కాన్వాయ్

నవాదా: బిహార్‌లోని నవాదాలో ఓటరు అధికార్ యాత్రలో రాహుల్, ఇతర మహాగఠ్‌బంధన్ నాయకులు ప్రయాణిస్తున్న వాహనం విధుల్లో ఉన్న ఓ పోలీసును ఢీకొంది. వాహనం నెమ్మదిగా ప్రయాణిస్తుండటంతో ఆయన స్వల్పంగా గాయపడ్డారు. దీంతో వెంటనే రాహుల్ పోలీసును తన వాహనంలో కూర్చోబెట్టి నీళ్లు తాగించారు. కాన్వాయ్ కొద్దిసేపు అలాగే ముందుకు కదిలింది. దీనిపై భాజపా తీవ్ర విమర్శలు గుప్పించింది. జనాలను తొక్కించే యాత్రను రాహుల్ నిర్వహిస్తున్నారని విమర్శించింది.

ఈసీకి తిరుగులేని అధికారాలు తగవు

- జమిలి ఎన్నికల బిల్లుపై మాజీ సీజేఐ జస్టిస్ ఖన్నా

దిల్లీ: జమిలి ఎన్నికల బిల్లులో ఎన్నికల సంఘానికి తిరుగులేని అధికారాలు ఇవ్వడం అభిలషణీయం కాదనీ, తరచూ ఎన్నికలు జరగకుండా నివారించాలన్న బిల్లు లక్ష్యం ఆచరణలో నెరవేరకపోవచ్చని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సంజీవ్ ఖన్నా పేర్కొన్నారు. మంగళవారం పార్లమెంటు సంయుక్త సంఘం (జేపీసీ) ఎదుట తన అభిప్రాయాలను వ్యక్తపరిచారు. పార్లమెంటును కానీ, శాసనసభలను కానీ గడువుకు ముందే రద్దు చేసిన సందర్భాలలో రెండింటికీ కలిపి జమిలిగా ఎన్నికలు జరపడం సాధ్యం కాకపోవచ్చని వివరించారు. జమిలి ఎన్నికల బిల్లును పార్లమెంటు, ఆపైన రాష్ట్రపతి ఆమోదించిన తరవాత జరిగే కొత్త లోక్‌సభ ప్రథమ సమావేశం నుంచి బిల్లును అమలు చేయాలని ప్రతిపాదిస్తున్నారు. దీనికి బదులు బిల్లు అమలుకు నిర్దిష్ట తేదీని నిర్ణయించాలని జస్టిస్ ఖన్నా సూచించారు. జమిలి ఎన్నికల బిల్లు వల్ల భారతదేశ సమాఖ్య స్వభావం బలహీనపడవచ్చనే వాదనా ఉందని వివరించారు. భాజపా ఎంపీ పీపీ చౌధరి అధ్యక్షతన సమావేశమైన జేపీసీ ముందు మాజీ సీజేఐ ఖన్నా తన అభిప్రాయాలను వెల్లడించారు. ఈ జేపీసీలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా, తెలుగుదేశం సభ్యుడు జీఎం హరీశ్ బాలయోగి, వైకాపా ఎంపీ వైవీ సుబ్బారెడ్డి సభ్యులు.

బ్రిటన్ నౌకాదళంలో తొలి హిందూ పురోహితుడి నియామకం

లండన్: బ్రిటన్ నౌకాదళంలో సిబ్బందికి ధార్మిక, ఆధ్యాత్మిక మార్గదర్శనం చేసేందుకు తొలిసారిగా ఒక హిందూ చాప్లెయిన్ (పురోహితుడి)ని నియమించారు. క్రైస్తవుడు కాని వ్యక్తి చాప్లెయిన్‌గా ఎంపిక కావడం ఇదే ప్రథమం. హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన భాను అత్రి ఈ పదవికి ఎంపికయ్యారు. ఈ నియామకంపై తాను గర్విస్తున్నానని భాను అత్రి అన్నారు.



వంద మార్కుల ప్రాతిపదికగా వసతి గృహాల పనితీరు అంచనా

● బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత

ఈనాడు, అమరావతి: బీసీ సంక్షేమ వసతి గృహాల పనితీరును మెరుగుపరిచేందుకు 100 మార్కుల ప్రాతిపదికగా తీసుకుని వాటిని అంచనా వేయాలని నిర్ణయించినట్లు ఆ శాఖ మంత్రి సవిత వెల్లడించారు. విద్యార్థుల హాజరుకు 10, పరీక్షల్లో వారి ప్రతిభకు 20, ఉత్తీర్ణత శాతం ఆధారంగా మరో 20, నిర్దేశిత మెనూ అమలుకు 10 మార్కులు ఇలా వివిధ అంశాలను ప్రాతిపదికగా తీసుకుని హాస్టళ్ల పనితీరును అంచనా వేయనున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అత్యధిక మార్కులు సాధించిన వార్డెన్లకు బదిలీలు, పదోన్నతుల్లో ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేసే వార్డెన్లకు గుర్తింపు ఇవ్వాలనే ఆలోచనతోనే ఈ విధానం తీసుకొస్తున్నట్లు తెలిపారు.

ఒప్పంద అధ్యాపకుల క్రమబద్ధీకరణపై చర్చించాలి: ఐకాస

ఈనాడు, అమరావతి: ఎన్నికల కోడ్ కారణంగా నిలిచిపోయిన ఒప్పంద అధ్యాపకుల క్రమబద్ధీకరణ అంశంపై జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో చర్చించాలని కాంట్రాక్టు లెక్చరర్ల ఐకాస ఛైర్మన్ కుమ్మరకుంట సురేష్, కో-ఛైర్మన్ కల్లూరి శ్రీనివాస్ కోరారు. "గతంలో జీఓ-114 ద్వారా ఒప్పంద ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసింది. పలు శాఖల్లో కాంట్రాక్టు ఉద్యోగులు గతేడాది ఏప్రిల్ నుంచి శాశ్వత ప్రాతిపదికన కొనసాగుతున్నారు. కానీ, ఇంటర్మీడియట్ విద్య, మరికొన్ని శాఖల్లో ఈ ప్రక్రియ అమలులో జాప్యం జరిగింది. ఈలోపు ఎన్నికల కోడ్ రావడంతో క్రమబద్ధీకరణ నిలిచిపోయింది. దీన్ని పునఃప్రారంభించాలి" అని పేర్కొన్నారు.

సచివాలయాల శాఖ ఉద్యోగులను మాతృశాఖలకు పంపాలి

● ఉద్యోగుల ఐక్య వేదిక

ఈనాడు, అమరావతి: సచివాలయాల శాఖను రద్దు చేసి ఆ ఉద్యోగులను మాతృశాఖలతోపాటు ఇతర ప్రభుత్వ ఖాళీల్లో సర్దుబాటు చేయాలని రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్య వేదిక రాష్ట్ర ఛైర్మన్ ఎండీ జానీ పాషా, రాష్ట్ర కార్యదర్శులు విప్పర్తి, కృష్ణ, కన్వీనర్ షేక్ అబ్దుల్ రజాక్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల సమస్యలపై సచివాలయాల శాఖ దృష్టి సారించకపోగా... ఇతర శాఖలకు అవసరమైన ఉద్యోగులను తీసుకునేలా సంస్థాగత మార్పులు చేయాలని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగుల క్రీడలకు నిధులా?

ఈనాడు, అమరావతి: ఎన్నికల సమయంలో వైకాపాకు అనుకూలంగా ప్రచారం చేసిన సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగుల ఆటల పోటీలకు సంబంధించి నిధుల మంజూరుకు దస్త్రం సిద్ధం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సాధారణ పరిపాలన శాఖలోని ఓ కీలక అధికారి రూ.13 లక్షల మంజూరుకు దస్త్రం సిద్ధం చేయాలని చెప్పినట్లు సమాచారం. వెంకటరామిరెడ్డికి మరో మూడు నెలల పదవీకాలం ఉండగా... ఈ నిధుల విడుదలకు ప్రయత్నాలు చేయడాన్ని కొందరు ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. ప్రత్యేక అధికారిని నియమించి క్రీడలు నిర్వహించాలని కోరుతున్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల పదోన్నతులకు అనుమతివ్వాలి: ఈయూ

ఈనాడు, అమరావతి: ఆర్టీసీ ఉద్యోగులకు ఆరేళ్లుగా పదోన్నతులు దక్కలేదని, దీనికి సంబంధించిన దస్త్రం ప్రభుత్వ వద్దకు వెళ్లిన ప్రతిసారి ఏదో ఒక కారణంతో వెనక్కి పంపిస్తున్నారని ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దామోదరరావు, నరసయ్య ఓ ప్రకటనలో తెలిపారు. తాజాగా గత నెల 31న పదోన్నతుల దస్త్రం సీఎస్ వద్దకు వెళ్లగా, ఇంత వరకూ నిర్ణయం తీసుకోలేదన్నారు. సీఎం చంద్రబాబు చొరవ తీసుకుని ఉద్యోగులకు పదోన్నతులు వచ్చేలా చూడాలని కోరారు. దీని ద్వారా 3 వేల మందికి మేలు కలుగుతుందన్నారు.

ఏపీలో వ్యవసాయ రుణాలు రూ.3.08 లక్షల కోట్లు

ఈనాడు, దిల్లీ: ఈ ఏడాది మార్చి 31 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ రుణాలు రూ.3,08,716.83 కోట్లకు చేరినట్లు కేంద్ర వ్యవసాయశాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ తెలిపారు. రాజ్యసభలో మంగళవారం తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా ప్రశ్నకు ఇచ్చిన సమాధానం మేరకు ఈ విషయం వెల్లడైంది. ఇందులో రూ.2,11,657.36 కోట్ల రుణాలు (68.56%) చిన్న, సన్నకారు రైతులవేనని ఆయన తెలిపారు. దక్షిణాదిలోని అన్ని రాష్ట్రాల్లో కలిపి రూ.12,49,500 కోట్ల రుణాలున్నట్లు చెప్పారు.

డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలనకు శిక్షణ

ఈనాడు, అమరావతి: మెగా డీఎస్సీలో ప్రతిభ కనబరిచిన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించేందుకు జిల్లా అధికారులకు పాఠశాల విద్యా శాఖ బుధవారం శిక్షణ ఇవ్వనుంది. మెరిట్ జాబితా విడుదల చేయకుండానే నేరుగా మార్కుల ఆధారంగానే ధ్రువపత్రాల పరిశీలన చేపట్టాలని నిర్ణయించింది. ఈ శిక్షణ పూర్తయిన అనంతరం సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. 50 మంది అభ్యర్థులకు ఇద్దరు అధికారులను కేటాయించారు. ఎంఈవో స్థాయికి తగ్గకుండా సబ్జెక్టు నిపుణులు ఒకరు, కంప్యూటర్ ఆపరేటర్ బృందాలుగా నియమించింది.

విద్యుత్ పరికరాల తయారీపై సమీక్ష

ఈనాడు, అమరావతి: జెన్‌కో ప్రాజెక్టులకు విద్యుత్ పరికరాలు తయారుచేసే భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్(బీహెచ్‌ఈఎల్) ప్లాంట్‌ను జెన్‌కో ఎండీ చక్రధర్‌బాబు ఐదీస సందర్శించారు. జెన్‌కోకు అవసరమైన జనరేటర్లు, టర్బైన్లను బీహెచ్‌ఈఎల్ తయారుచేస్తోంది. హరిద్వార్‌లో బీహెచ్‌ఈఎల్ తయారుచేస్తున్న 210, 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ యూనిట్లలో వినియోగించే టర్బైన్లు, జనరేటర్ల తయారీని పరిశీలించారు. పోలవరం, లోయర్ సీలేరు ప్రాజెక్టుల కోసం తయారవుతున్న రోటర్ బ్లేడ్ కాస్టింగ్, ఫోర్జింగ్ పనుల వివరాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఎగువ సీలేరు పీఎస్‌పీకి అటవీ భూములే అడ్డంకి

● మట్టిని తరలించే ప్రాంతం లేదంటూ అనుమతుల నిరాకరణ

ఈనాడు, అమరావతి: ఎగువ సీలేరులో ప్రతిపాదించిన 1,350 మెగావాట్ల పంప్డ్ స్టోరేజి విద్యుత్ ప్రాజెక్టు ప్రతిపాదనకు కేంద్ర అటవీ శాఖ అనుమతులను నిరాకరించింది. ప్రాజెక్టు నిర్మాణం కోసం సుమారు 480 ఎకరాల అటవీ భూమి అవసరమవుతుంది. ఇందుకు ప్రత్యామ్నాయంగా అనంతపురం జిల్లాలో 831 ఎకరాలను ప్రభుత్వం అటవీశాఖకు బదిలీ చేసింది. అయితే ప్రాజెక్టులో భాగంగా నిర్మించే 300 మీటర్ల సొరంగ మార్గ(టన్నెల్) పైపులైన్ కోసం సుమారు 1.5 కి.మీ మేర జరిపే తవ్వకాల ద్వారా వచ్చిన మట్టిని డంప్ చేసేందుకు స్థలాన్ని చూపలేదంటూ అటవీశాఖ అభ్యంతరం వ్యక్తం చేసింది. డంపింగ్‌కు అటవీ భూములను వినియోగించడానికి వీల్లేదని.. ఇందుకు ప్రత్యామ్నాయంగా భూములను చూపిన తర్వాతే ప్రతిపాదనను పరిశీలిస్తామని తెలిపింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఏర్పాటు కానున్న ప్రాజెక్టులో ఒక్కొక్కటి 150 మెగావాట్ల సామర్థ్యం ఉన్న 9 యూనిట్ల ఏర్పాటుకు జెన్‌కో ప్రతిపాదించింది. దీని నిర్మాణానికి గుత్తేదారు సంస్థకు జెన్‌కో లెటర్ ఆఫ్ అవార్డు(ఎల్‌వోఏ) ఇచ్చింది. ఒప్పందం చేసుకున్న నాటి నుంచి నాలుగేళ్లలో ప్రాజెక్టు పూర్తి చేయాలన్నది అధికారుల అంచనా.

● ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా టన్నెల్, పైపులైను ఏర్పాటుకు తవ్వకాలు జరపడం వల్ల సుమారు 80 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి వస్తుందని అంచనా. తవ్విన గుంతలు పూడ్చడానికి, లోతట్టు ప్రాంతాలను సరిచేసేందుకు 25 శాతం వరకు ఈ మట్టిని వినియోగించే అవకాశం ఉంది. మిగిలినదాన్ని ఎక్కడికి తరలించాలనే దాన్ని ప్రాజెక్టు నివేదికల్లో అధికారులు పేర్కొనలేదు.

రూ.13,500 కోట్లకు ప్రాజెక్టు వ్యయం

ప్రాజెక్టును ఈపీసీ విధానంలో రూ.7,800 కోట్లతో చేపట్టేందుకు మేఘా సంస్థకు అధికారులు ఎల్‌వోఏ ఇచ్చారు. అటవీశాఖ నుంచి అనుమతులు రాకపోవడంతో సంస్థ పనులు ప్రారంభించలేదు. త్వరలో శంకుస్థాపన చేయాలని అధికారులు నిర్ణయించారు. టెండర్ల ప్రక్రియ..గుత్తేదారు ఎంపిక మొత్తం గత ప్రభుత్వంలో పూర్తయింది. నిర్మాణ పనులు, పునరావాసం, ఇతర ఖర్చులు కలిపి ప్రాజెక్టు నిర్మాణానికి రూ.12 వేల కోట్లు ఖర్చు కానుంది. ప్రాజెక్టు నిర్మాణంలో జాప్యం, ఎస్కలేషన్ ఛార్జీలు కలిపి సుమారు రూ.13,500 కోట్లకు ప్రాజెక్టు వ్యయం చేరుతుందని అంచనా.

ప్రత్యామ్నాయ ఆలోచన

తవ్విన మట్టిని తరలించడానికి బదులు..గుంతలు పూడ్చిన తర్వాత అక్కడే 15 మీటర్ల ఎత్తు వరకు పోసి..దానిపై మొక్కలు నాటాలని అధికారులు యోచిస్తున్నారు. దీనికి అటవీశాఖ ఆమోదం తెలిపేలా సంప్రదింపులు జరుపుతున్నారు. కొలిక్కి వస్తే ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.



రవీంద్రభారతిలో మౌనసాక్ష్యాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కె.పద్మనాభయ్య, చిత్రంలో ప్రసాద్, శ్రీధర్, శంకరనారాయణ, రమణాచారి, ఎం.నాగేశ్వరరావు, ఎం.కె. రాము, సి.కేశవులు, సుందరసాయి

కేశవుల చిత్రాలు 'మౌన సాక్ష్యాలు'

కేంద్ర హోం శాఖ మాజీ కార్యదర్శి కె.పద్మనాభయ్య

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: సమాజంలో నెలకొన్న అనేక సమస్యలపై సీనియర్ ఫొటో జర్నలిస్టు కేశవులు తీసిన చిత్రాలు పరిష్కారానికి మార్గం చూపెట్టాయని కేంద్ర హోం శాఖ మాజీ కార్యదర్శి కె.పద్మనాభయ్య అన్నారు. కేశవులు తీసిన చిత్రాలతో డాక్టర్ సత్యవోలు సుందర సాయి రచించిన 'మౌన సాక్ష్యాలు' పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం సృజన భారతి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి రవీంద్రభారతిలో జరిగింది. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో పుస్తకాన్ని ఈనాడు వ్యవస్థాపకులు దివంగత రామోజీరావుకు అంకితమిచ్చారు. ముఖ్య అతిథిగా హాజరైన పద్మనాభయ్య మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలకు పైగా ఫొటో జర్నలిజంలో సేవలందిస్తున్న కేశవులు అంతర్జాతీయ ఫొటో జర్నలిస్టులకు ఏమాత్రం తీసిపోరని, ఆయన తీసిన చిత్రాలు విదేశీ పత్రికల్లో ప్రచురితమైతే పులిట్జర్ పురస్కారం వచ్చేదని అన్నారు. పేదరికానికి సంబంధించి ఆయన తీసిన చిత్రాలు హృదయాలను కదిలించి వేశాయని చెప్పారు. అధ్యక్షత వహించిన తెలంగాణ ప్రభుత్వ మాజీ సలహాదారు కేవీ రమణాచారి మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్లకు మనోస్థైర్యం పెంపొందించేందుకు ఈ పుస్తకం దారిచూపుతుందన్నారు. కేశవులు ఎన్నో అద్భుతాలు, సాహసాలు చేశారని చెబుతూ ఆయన తీసిన అనేక చిత్రాలు, సమాజం నుంచి వచ్చిన స్పందన గురించి వివరించారు. వెయ్యి పదాలు చెప్పలేని భావాలు... ఒక్క ఫొటో, కార్టూను చెబుతాయని తెలిపారు. ఈనాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంపాదకుడు ఎం.నాగేశ్వరరావు మాట్లాడుతూ... "ఫొటోలు పత్రికకు ప్రాణం లాంటివి. ప్రస్తుతం ఫొటోల ప్రాధాన్యం విశేషంగా పెరగడంతోపాటు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. దీనిని దృష్టిలో పెట్టుకుని వార్తాంశాలకు సంబంధించి ఫొటో జర్నలిస్టులు అధ్యయనం చేయాలి. ఫొటో జర్నలిస్టులకు పరిశీలన, మానవీయ స్పర్శ, ప్రజల గురించి ఆలోచించే శక్తి ఉన్నప్పుడే సమాజాన్ని ప్రభావితం చేయగలుగుతారు. ఈ పుస్తకం యువ పాత్రికేయులకు ఓ పాఠ్య గ్రంథంగా ఉపయోగపడుతుంది. కేశవులు తీసిన ఫొటోలు, శ్రీధర్ కార్టూన్లు 'ఈనాడు' పత్రికను ప్రజలకు ఎంతో చేరువ చేశాయి'' అని వివరించారు. రచయిత సుందర సాయి మాట్లాడుతూ ఫొటో జర్నలిస్టులు నిజాలను ఆవిష్కరిస్తారని అన్నారు. కార్టూనిస్టు శ్రీధర్ మాట్లాడుతూ ఫొటో మౌనంగా ఉండేది కాదని.. గట్టిగా అరిచి నిజాల్ని చూపించగలుగుతుందని చెప్పారు. ఫొటో జర్నలిస్టు సి.కేశవులు మాట్లాడుతూ ఫొటో జర్నలిజాన్ని బతికించుకోవాల్సిన అవసరముందని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు శంకరనారాయణ, రసమయి సంస్థ అధ్యక్షుడు ఎంకే రాము, సృజన భారతి సంస్థ అధ్యక్షుడు కొమ్మూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ కేసుల గుర్తింపునకు ఎన్‌సీడీ 4.0 సర్వే

● 18 వేల మంది వైద్యారోగ్య సిబ్బందికి శిక్షణ

● 4.10 కోట్ల మంది నుంచి వివరాల సేకరణ

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా క్యాన్సర్ లక్షణాలున్న వారిని ప్రాథమిక దశలోనే గుర్తించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం వచ్చే అక్టోబరు నుంచి అసంక్రమిక వ్యాధుల (ఎన్‌సీడీ) 4.0 సర్వే పేరిట ఇంటింటా వివరాలు సేకరించనుంది. సర్వే తీరుపై ఈనెల 21 నుంచి సెప్టెంబర్ 20 వరకు 18 వేల మంది వైద్యులు, ఆరోగ్య సంరక్షణ సహాయకులకు వైద్య ఆరోగ్య శాఖ శిక్షణ ఇవ్వనుంది. గతేడాది నవంబర్‌లో నిర్వహించిన ఎన్‌సీడీ 3.0 సర్వేలో రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ పీడితులను గుర్తించారు. నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ లక్షణాలు ఉన్న వారిలో కొందరు వివరాలు చెప్పడానికి, పరీక్షలకు ఆసక్తి చూపలేదు. తద్వారా వాస్తవ పరిస్థితులు వెలుగులోకి రాలేదు. తాజా సర్వేలో కేవలం క్యాన్సర్ లక్షణాలు ఉన్నవారిని మాత్రమే గుర్తించనున్నారు. సర్వే లక్ష్యాలపై జనంలో అవగాహన కల్పించేందుకు సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారంతోపాటు ప్రజాప్రతినిధులను కూడా భాగస్వాములను చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

అప్పుడు 225.. ఇప్పుడు 28 ప్రశ్నలే

ఎన్‌సీడీ 3.0 సర్వేలో ఆరోగ్యశాఖ 225 ప్రశ్నలు అడిగింది. ఇన్ని ప్రశ్నలకు సమాధానాలు రాబట్టడం ఇబ్బందిగా మారింది. 4.0 సర్వేలో ప్రశ్నలను 28కి తగ్గించారు. 18 ఏళ్లు పైబడిన 4.10 కోట్ల మంది నుంచి ఈ ప్రశ్నలకు సమాధానాలు రాబడతారు. పురుషుల్లో నోటి క్యాన్సర్, మహిళల్లో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ లక్షణాలు ఉన్నవారి వివరాలు సేకరిస్తారు. ప్రాథమిక స్థాయిలో సర్వేతో ఓ అంచనాకు వచ్చి, వైద్యుల సమక్షంలో మరోసారి పరీక్షిస్తారు. అనుమానిత కేసులని తేలితే బోధనాసుపత్రుల్లోని ప్రివెంటివ్ ఆంకాలజీ విభాగాలకు పంపుతారు.

పీఆర్‌సీ, డీఏ బకాయిలపై హైకోర్టులో వ్యాజ్యం

● కౌంటర్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశం

ఈనాడు, అమరావతి: ఉద్యోగులకు 2020 నుంచి పెండింగ్‌లో ఉన్న కరవు భత్యం(డీఏ), 11వ పీఆర్‌సీ బకాయిలను వడ్డీ సహా చెల్లించేలా ఆదేశించాలని కోరుతూ ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పఠాన్‌బాజీ దాఖలు చేసిన వ్యాజ్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీచేసింది. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి, ట్రెజరీస్, ఎకౌంట్స్ డైరెక్టరేట్, పే, అకౌంట్స్ ఆఫీసర్, వర్క్స్ ఎకౌంట్స్ డైరెక్టర్‌ను ఆదేశించింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్. విజయ్ మంగళవారం ఈమేరకు ఉత్తర్వులిచ్చారు. అంతకు ముందు జరిగిన విచారణలో పిటిషనర్ తరఫు న్యాయవాది కేఏఆర్ కామేశ్వరి వాదనలు వినిపించారు.

వైకాపా నిర్ణయం ప్రజలను మోసం చేయడమే: సీపీఎం

ఈనాడు, అమరావతి: ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థిని బలపరచాలన్న వైకాపా నిర్ణయం ప్రజలను వంచనకు గురి చేయడమేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. "ఎన్డీయే కూటమి దేశ వ్యాప్తంగా మత కల్లోలాలు సృష్టిస్తూ ప్రజల మధ్య విష బీజాలు నాటుతోంది. మన రాష్ట్రాన్ని అదానీ లాంటి కార్పొరేట్లకు ధారదత్తం చేస్తోంది. భాజపా, ఎన్డీయే కూటమి ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర హాని చేస్తోంది. ప్రత్యేక హోదా ఇవ్వలేదు. విభజన హామీలు అమలు చేయలేదు. రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న ఎన్డీయే కూటమికి వైకాపా ఎలా మద్దతిస్తుందో అన్న అంశంపై రాష్ట్ర ప్రజలకు బహిరంగ వివరణ ఇవ్వాలి. రాష్ట్ర హక్కుల కోసం కూటమికి వ్యతిరేకంగా గంభీరమైన ప్రసంగాలు చేస్తున్న వైకాపా.. ఎన్డీయే కూటమికి చెందిన ఉపరాష్ట్రపతి అభ్యర్థిని బలపరచడం తెదేపాతో కుమ్మక్కు కావడం తప్ప మరొకటి కాదు'' అని విమర్శించారు.

వెంకటేశ్‌నాయుడి ఫోన్‌లోని డేటాను లీక్ చేయలేదు

● హైకోర్టులో వాదనలు వినిపించిన ఏపీపీ

● వివరాలు సమర్పించాలని సిట్‌కు కోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: మద్యం కేసులో నిందితుడు వెంకటేశ్‌నాయుడి సెల్‌ఫోన్‌లోని డేటాను లీక్ చేశామన్న ఆరోపణల్లో వాస్తవం లేదని సిట్ తరఫున సహాయ పీపీ సాయి రోహిత్ హైకోర్టుకు చెప్పారు. యాపిల్ ఫోన్ లాక్ తీయాలంటే బయోమెట్రిక్, ఫేస్ లాక్ పాస్‌వర్డ్ అవసరం అన్నారు. లాక్‌ను తెరిచేందుకు వెంకటేశ్‌నాయుడు సహకరించలేదని.. ఫోన్‌లో ఏముందో ఇప్పటికీ తమకు తెలియదని పేర్కొన్నారు. వెంకటేశ్‌నాయుడికి సంబంధించిన సమాచారమేదీ బయటికి రాకుండా మీడియా నోరు మూయించాలన్న ఉద్దేశంతోనే ఆయన సతీమణి గ్యాగ్ ఆర్డర్ పొందాలని యత్నిస్తున్నారన్నారు. అధికరణ 19 ప్రకారం సమాచారాన్ని ప్రచురించే, ప్రసారం చేసే అధికారం మీడియాకు ఉందన్నారు. పూర్తి వివరాలను కోర్టు ముందు ఉంచేందుకు, కౌంటర్ వేసేందుకు సమయం కోరారు. అందుకు అంగీకరించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి విచారణను ఈ నెల 22కి వాయిదా వేశారు. వివరాలు సమర్పించాలని సిట్‌ను ఆదేశించారు. మద్యం కేసు దర్యాప్తులో భాగంగా తన భర్త సీహెచ్ వెంకటేశ్‌నాయుడు సెల్‌ఫోన్ల నుంచి సేకరించిన సమాచారాన్ని సిట్ అధికారులు మీడియాకు లీక్ చేస్తున్నారంటూ వాసిరెడ్డి మహిత హైకోర్టులో వ్యాజ్యం వేశారు. దీనిపై స్వతంత్ర విచారణ జరిపించాలని, ఇప్పటికే మీడియాలో వచ్చిన సమాచారాన్ని తొలగించాలని, ఇకపై ప్రచురణ, ప్రసారం చేయకుండా నియంత్రించాలని కోరారు. మంగళవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది వీఆర్ ఆవుల ఈ మేరకు వాదనలు వినిపించారు. దర్యాప్తు జరుగుతున్న కేసులో సమాచారాన్ని లీక్ చేయడం సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమన్నారు.

దొంగ ఫొటోలు ఇక పట్టేస్తారు

● ఉపాధి హామీలో తప్పుడు మస్తర్ల కట్టడికి వ్యూహం

● హాజరుపై గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పరిశీలన

ఈనాడు, అమరావతి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాల కట్టడికి కేంద్రం మరిన్ని చర్యలు చేపడుతోంది. దొంగ మస్తర్లను నిరోధించేందుకు గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అధికారుల భాగస్వామ్యం, పర్యవేక్షణ తప్పనిసరి చేసింది. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆదేశాలపై రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కార్యాచరణ సిద్ధం చేసి అమలుకు కలెక్టర్లకు మంగళవారం ఆదేశాలిచ్చింది. వైకాపా హయాంలో భారీగా జరిగిన దొంగ మస్తర్లలో పెద్దఎత్తున నిధులు దుర్వినియోగమయ్యాయి. శ్రామికుల హాజరు యాప్‌లో తప్పుడు సమాచారం అప్‌లోడ్ చేసి నిధులు తినేశారు. కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ పరిశీలనలో ఈ విషయాలు తెలిశాయి. దీంతో దొంగ మస్తర్లను అడ్డుకోవాలని కేంద్రం ఆదేశించింది.

యాప్‌లో శ్రామికుల హాజరు సమయంలో మాయాజాలం ఇలా

- సంబంధం లేని ఫొటోలు అప్‌లోడ్ చేయడం
- వాస్తవ పని ఫొటోకు బదులు వేరే పని ఫొటో పెట్టడం
- పని ప్రదేశంలో హాజరు తక్కువగా ఉన్నా.. ఫొటోలో ఎక్కువగా చూపడం
- పురుషుల హాజరుపై మహిళల ఫొటోలు అప్‌లోడ్ చేయడం
- వేర్వేరు మస్తర్లలో ఒకే శ్రామికుడి ఫొటో పెట్టడం
- ఉదయం, మధ్యాహ్నం అప్‌లోడ్ చేసే ఫొటోల్లో శ్రామికులు వేర్వేరుగా ఉండటం
- మధ్యాహ్నం ఫొటో అప్‌లోడ్ చేయకపోవడం

పర్యవేక్షణ ఇక ఇలా

- గ్రామస్థాయిలో శ్రామికుల హాజరుపై మేట్‌లు అప్‌లోడ్ చేస్తున్న ఫొటోలను క్షేత్రస్థాయి సహాయకులు (ఎఫ్‌ఏ), పంచాయతీ సిబ్బంది అదేరోజు 100% పరిశీలించాలి.
- జిల్లా పంచాయతీ అధికారులు 30 ఫొటోలు, డ్వామా పథక సంచాలకులు 100, ఫీల్డ్ టెక్నికల్ అసిస్టెంట్లు, ఇతర కాంట్రాక్టు సిబ్బంది 200 ఫొటోలు.. లేదంటే అప్‌లోడ్ చేసినవాటిలో 10 శాతమైనా పరిశీలించాలి.
- రాష్ట్రస్థాయిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ పది ఫొటోలు, ఉపాధి పథక సంచాలకులు, ఆయన ఆధ్వర్యంలోని శాశ్వత సిబ్బంది 100 ఫొటోలు పరిశీలించాలి. కాంట్రాక్ట్ సిబ్బంది 200 ఫొటోలు లేదంటే అప్‌లోడ్ చేసిన వాటిలో 50 శాతమైనా పరిశీలించాలి.
- తప్పుడు ఫొటోలు అప్‌లోడ్ చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట పడేలా, తప్పులు పునరావృతం కాకుండా ఉండేలా చర్యలు ఉండాలని కేంద్రం ఆదేశించింది.
- గ్రామ, జిల్లాస్థాయిలో గుర్తించిన అవకతవకలు, బాధ్యులపై తీసుకున్న చర్యలపై రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కార్యాలయానికి జిల్లా అధికారులు రోజూ నివేదిక పంపాలి.

ప్రజల ఆస్తులు కబ్జా చేస్తున్నారు

● అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటిపై మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి ఫిర్యాదు

● తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌తో భేటీ

ఈనాడు, అమరావతి: అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అనేక అరాచకాలకు పాల్పడుతున్నారని, పార్టీకి చెడ్డపేరు తెస్తున్నారని మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. వారిద్దరూ పరస్పర ఆరోపణలతో రచ్చకెక్కడంతో.. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు పల్లా సోమవారం వారితో ఫోన్‌లో మాట్లాడారు. పార్టీ ప్రతిష్ఠ దెబ్బతీసేలా ఆరోపణలు చేసుకోవడం సరికాదని, సమస్యలేమైనా ఉంటే పార్టీ నాయకత్వం దృష్టికి తేవాలని స్పష్టంచేశారు. తానే వచ్చి అన్ని విషయాలు సాక్ష్యాధారాలతో సహా వివరిస్తానని ప్రభాకర్ చౌదరి చెప్పారు. దగ్గుపాటి ప్రజల ఆస్తులు కబ్జా చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ప్రభాకర్ చౌదరి వెంట వచ్చిన పలువురు తమ ఆస్తుల్ని ఎమ్మెల్యే అనుచరులు లాక్కున్నారని చెబుతూ కొన్ని డాక్యుమెంట్లు చూపించారు. 60-70 కుటుంబాలకు ఆధారమైన సుమారు రూ.100 కోట్ల విలువైన ఏడెకరాల ఆస్తిని దగ్గుపాటి తన బంధువుల పేరిట రిజిస్టర్ చేసుకున్నారని, బాధితులంతా తెదేపా మద్దతుదారులేనని ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. ఒక నేత్రవైద్యురాలికి చెందిన రూ.3 కోట్ల విలువైన ఆస్తులను లాగేసుకున్నారని తెలిపారు.

ఆయనతో నాకు విభేదాలేం లేవు

పల్లాతో సమావేశం అనంతరం ప్రభాకర్ చౌదరి మీడియాతో మాట్లాడుతూ.. అనంతపురం ఎమ్మెల్యేకూ, తనకూ ఎలాంటి విభేదాలు లేవని, వచ్చే ఎన్నికల్లో తాను అసలు పోటీయే చేయబోనని తెలిపారు. గత 14 నెలలుగా జిల్లాలో తాను పార్టీ కార్యక్రమాలకే హాజరవడం లేదన్నారు. జిల్లా వెలుపల పార్టీ ఏ బాధ్యత అప్పగిస్తే దాన్ని నిర్వర్తిస్తున్నానన్నారు.

'సుపరిపాలనలో తొలి అడుగు'లో వెనుకబడినవారితో భేటీ

ఈనాడు, అమరావతి: తెదేపా తలపెట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా 30 వేల కంటే తక్కువ ఇళ్లకే నాయకులు వెళ్లిన నియోజకవర్గాల ఎమ్మెల్యేలు/పార్టీ ఇన్‌ఛార్జులు తొమ్మిదిమందిని మంగళవారం పార్టీ కార్యాలయానికి పిలిచారు. వారిలో మంత్రి పయ్యావుల కేశవ్, తాడిపత్రి ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి.. వేరే కార్యక్రమాలు ఉన్నందున రాలేమని సమాచారమిచ్చారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, అరకు, పాడేరు, పాలకొండ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు హాజరయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌తో వారు భేటీ అయ్యారు. ఎచ్చెర్ల నియోజకవర్గ బాధ్యతలు చూస్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు దిల్లీలో ఉండటంతో హాజరవలేదు. పి.గన్నవరం ఇన్‌ఛార్జులుగా ఉన్న ముగ్గురు నాయకులు కూడా హాజరవలేదు. యాప్ పనిచేయకపోవడం, నెట్‌వర్క్ సరిగా లేకపోవడం వంటి కారణాల వల్ల వెనకబడ్డామని, పెండింగ్‌లో ఉన్న గృహాలను కూడా పూర్తి చేస్తామని హాజరైన నాయకులు తెలియజేసినట్లు సమాచారం.

భూముల రీ సర్వేతో అసలుకే మోసం

● తెదేపా కేంద్ర కార్యాలయంలో వినతులిచ్చిన ప్రజలు

ఈనాడు, అమరావతి: భూముల రీ సర్వేలో లోపాలపై చర్యలు తీసుకోవాలని, వడ్డీ వ్యాపారుల నుంచి రక్షణ కల్పించాలని, భూ కబ్జాల నుంచి విముక్తుల్ని చేయాలని పలువురు మంగళగిరిలోని తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక సంస్థ ఛైర్‌పర్సన్ పీతల సుజాత, రాష్ట్ర ఆర్యవైశ్య సంక్షేమ, అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డూండి రాకేశ్‌లకు మంగళవారం వినతులు ఇచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నాయకులు హామీ ఇచ్చారు.

● సర్వే నంబరు 201లో తనకు చెందిన 0.85 సెంట్ల భూమి రీ సర్వే తర్వాత 0.55 సెంట్లకు తగ్గిందని ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం చెవిటికల్లుకి చెందిన రాయపాటి రంగమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.

● వడ్డీ వ్యాపారుల నుంచి తన కుటుంబానికి ప్రాణహాని ఉందని నంద్యాలకు చెందిన ముంగర విజయసుందరి కోరారు. తన భర్త వైద్య ఖర్చుల కోసం అప్పులు తీసుకోగా తిరిగి రెండింతలు వసూలు చేశారని ఆమె వివరించారు. మరో రూ.32 లక్షలకు అప్పు ఉన్నట్లుగా బాండ్ రాయించుకుని చెల్లించాలని బెదిరిస్తున్నారని, కిడ్నాప్ కూడా చేశారని బాధితురాలు వాపోయారు.

● తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం ఉద్యోగి మునిరత్నంరెడ్డి, ఆయన తమ్ముడు కలిసి తనకు చెందిన 15 సెంట్ల భూమిని ఆక్రమించారని తిరుపతి గ్రామీణ మండలం దామినీడు గ్రామానికి చెందిన దీపారెడ్డి ఫిర్యాదు చేశారు.

ట్రిపుల్‌ఐటీల మెస్‌ల నిర్వహణ హెచ్‌కేఎంసీఎఫ్‌కు ఇవ్వొద్దు: ఆర్‌ఎస్‌యూ

ఈనాడు, అమరావతి: ట్రిపుల్‌ఐటీల్లో విద్యార్థులకు భోజనం అందించే బాధ్యతలను ఏపీ హరే కృష్ణ మూమెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్(హెచ్‌కేఎంసీఎఫ్)కు అప్పగించాలనే ఆలోచనను విరమించుకోవాలని కోరుతూ రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్(ఆర్‌ఎస్‌యూ) అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి మంగళవారం శాప్ ఛైర్మన్ రవినాయుడుకు వినతిపత్రం ఇచ్చారు.

డిస్కంలకు రూ.91.30 కోట్లు చెల్లింపునకు అనుమతి

ఈనాడు, అమరావతి: వివిధ ప్రభుత్వ శాఖలు ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్ నెలల్లో వినియోగించిన విద్యుత్‌కుగానూ డిస్కంలకు చెల్లించాల్సిన రూ.91.30 కోట్ల విడుదలకు అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

● వివిధ పార్టీల ఎంపీల డిమాండ్

ఈనాడు, దిల్లీ: చట్టసభల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు కల్పించాలని వివిధ పార్టీల ఎంపీలు డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో దిల్లీలోని ఏపీ భవన్ అంబేడ్కర్ ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన సదస్సులో వక్తలు మాట్లాడారు. భాజపా ఎంపీలు ఆర్.కృష్ణయ్య, పాకా సత్యనారాయణ, తెదేపా ఎంపీలు కేశినేని శివనాథ్, బీద మస్తాన్‌రావు, అంబికా లక్ష్మీనారాయణ, దగ్గుమళ్ల ప్రసాదరావు, బస్తిపాటి నాగరాజు, భారాస ఎంపీలు కేఆర్ సురేశ్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్, మాజీ ఎంపీ బాల్క సుమన్ పాల్గొని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. విద్య, ఉద్యోగ రిజర్వేషన్లలో బీసీలపై ఉన్న క్రీమీలేయర్‌ను తొలగించాలని, ఉన్నత న్యాయస్థానాల న్యాయమూర్తుల పోస్టుల్లో, ప్రైవేటు ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టంలాగే బీసీలకూ చట్టం తేవాలని కోరారు. బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాంగ సవరణ చేయాలన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సెమినార్‌లో పాల్గొన్న ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బస్తిపాటి నాగరాజు, దగ్గుమళ్ల ప్రసాదరావు, ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్‌రావు, పాకా సత్యనారాయణ తదితరులు

అహ్మదాబాద్ ఐఐటీఎంలో సీటు వచ్చినా.. ఇంజినీరింగ్‌లో చేరలేకపోయిన విద్యార్థిని

● ప్రభుత్వం కల్పించుకోవాలని వినతి

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జేఈఈ మెయిన్స్‌లో సాధించిన 369వ ర్యాంక్ ఆధారంగా అహ్మదాబాద్ ఐఐటీఎం (ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్)లో వచ్చిన ఇంజినీరింగ్ సీటును.. సాంకేతిక కారణాలతో ఓ విద్యార్థిని కోల్పోయింది. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన పఠాన్ జరీనాబేగం.. విభిన్న ప్రతిభావంతురాలు. ఇంటర్‌లో 5 సబ్జెక్టులున్నప్పటికీ, విభిన్న ప్రతిభావంతురాలు కావడంతో ఒక సబ్జెక్టుకు పరీక్ష రాయాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం ఇచ్చిన వెసులుబాటును వినియోగించుకుంది. సంస్కృతం మినహా గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఆంగ్లం సబ్జెక్టులకు పరీక్షలు రాసింది. ఇంటర్ బోర్డు ఆమెకు ఎంపీసీలో 4 సబ్జెక్టులతో కూడిన మెమోను అందజేసింది. అయితే ఐఐటీఎంలలో చేరాలంటే.. 4 సబ్జెక్టుల ఇంటర్ మార్కుల జాబితాను అనుమతించడం లేదు. ఈ నిబంధనను ఈ ఏడాదే చేర్చారు. ఈ విషయం జరీనాకు తెలియలేదు. పైగా తాడేపల్లిగూడెంలో జరిగిన జోసా ధ్రువపత్రాల పరిశీలనలోనూ అధికారులు గుర్తించి, ఆమె మెమోపై అభ్యంతరం చెప్పలేదు. మొదటి విడత కౌన్సెలింగ్‌లోనే ఆమెకు అహ్మదాబాద్ ఐఐటీఎంలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌లో సీటు ఖరారైంది. అయితే దగ్గర్లోని ఏదైనా నిట్ (ఎన్‌ఐటీ)లో సీటు వస్తుందన్న ఆశతో జరీనా.. ఆ సీటును హోల్డ్‌లో పెట్టారు. ఫ్లోటింగ్‌లో ఉంచి తర్వాతి రౌండ్‌కు దరఖాస్తు చేశారు. ఆరో రౌండ్ వరకూ సీటు రాలేదు. అనుమానంతో జోసాకు మెయిల్ చేసింది. ఇంటర్‌లో 5 సబ్జెక్టులతో కూడిన మెమో అవసరమని తెలుసుకొని, ఇంటర్ బోర్డు ద్వారా కొత్త సర్టిఫికెట్ తీసుకొని కౌన్సెలింగ్‌కు మళ్లీ దరఖాస్తు చేశారు. అప్పటికే 'ఇనెలిజిబుల్' అని రావడంతో.. జరీనాబేగం దిక్కుతోచని స్థితిలో ఉంది. ఎవరిని సంప్రదించాలో తెలియని పరిస్థితి. రాష్ట్ర విద్యాశాఖ కల్పించుకొని తనకు సీటు వచ్చేలా చూడాలని కోరుతోంది.